సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 247

గురువారం 28-11-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



**ఉర్విల్ మెరుపుల్**

ముస్తాక్ అలీ టోర్నీలో 28 బంతుల్లోనే సెంచరీ చేసిన గుజరాత్ క్రికెటర్ - 12లో



**వెండి మిలమిల..**

ఒకే రోజు రూ.5,200 జంప్.. కేజీ ధర రూ.95,800కు అప్ -13లో



**మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవిస్?**

'మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరు?' అంశానికి నేటితో తెరపడనుంది. సీఎంగా దేవేంద్ర ఫడ్నవిస్ పేరు దాదాపు ఖాయమైంది.

వివరాలు 6లో ▸



**నేడు హేమంత్ ప్రమాణం**

జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

వివరాలు 6లో ▸



**వారికి సోషల్ మీడియా నిషేధం**

16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వాడితే 3.3 కోట్ల డాలర్ల దాకా జరిమానా విధించేలా ఆస్ట్రేలియాలో చట్టం చేశారు.

వివరాలు 6లో ▸



**'వక్ఫ్' భేటీ నుంచి వాకౌట్**

వక్ఫ్ (సవరణ) బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన జేపీసీ భేటీ నుంచి బుధవారం విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### ఫార్మా సిటీలో ప్రమాదం



అనకాపల్లి జిల్లా పరవాడలోని జేఎస్ ఫార్మా సిటీలో ఉన్న ఠాగూర్ లేబొరేటరీ యూనిట్-3లో మంగళవారం రాత్రి విష వాయువు లీకైంది. దీంతో ఒకరు మృతి చెందగా.. 8 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వివరాలు 10లో ▸

### పని ఒత్తిడి, జీతాలందక.. గుండెపోటుతో వీఆర్వో మృతి



ఒకవైపు జీతాలందక ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు టార్గెట్ల పేరుతో తీవ్ర పని ఒత్తిడితో తూర్పుగోదావరి జిల్లా నరేంద్రపురం వీఆర్వో పి.గనిరాజు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ మంత్రికి వీఆర్వోల సంఘం లేఖ రాసింది.

వివరాలు 10లో ▸

# ప్రశ్నిస్తే.. పీడీ చట్టం!

## నల్ల చట్టంతో చంద్రబాబు సర్కారు అణచివేత కుట్రలు

## సోషల్ మీడియా పోస్టులనూ సైబర్ నేరాలుగా నమోదు చేసే పన్నాగం

'సైబర్ నేరాలు' పదాన్ని చట్టంలో స్పష్టంగా నిర్వచించకుండా కుతంత్రం

'పీడీ' చట్టానికి సవరణ పేరుతో కూటమి ప్రభుత్వం పన్నాగం 3లో



- కేంద్ర ఐటీ చట్టం పరిధిలోని అంశాలు సైబర్ నేరాలుగా ముద్ర.. సైబర్ నేరాలను ఏకంగా పీడీ చట్టం పరిధిలోకి తెస్తూ సవరణలు
- నోటీసు ఇవ్వకుండానే అక్రమ అరెస్టులకు బాబు సర్కారు ఎత్తుగడ
- ఏడాది పాటు అక్రమ నిర్బంధానికి పథకం
- బడ్జెట్ సమావేశాల చివరి రోజు అదనపు అజెండాగా మండలిలో బిల్లు పెట్టి ఆమోదం
- విస్తృత చర్చకు అవకాశం లేకుండా సర్కారు కుటిల వ్యూహం.. ప్రభుత్వ వైఫల్యాలపై నిగ్గదీస్తే అక్రమ కేసులే లక్ష్యం
- రౌడీలు, స్మగ్లర్ల మీద పెట్టినట్లుగా సోషల్ మీడియా పోస్టులపై పీడీ చట్టం ఏమిటి?
- ఆ ఆంక్షలు, కేసులు న్యాయస్థానాల్లో నిలబడవంటున్న రాజ్యాంగ నిపుణులు
- ఎక్కడికక్కడ కోర్టులను ఆశ్రయించనున్న బాధితులు, ప్రజాస్వామ్యవాదులు

### సెక్షన్లు మార్చి.. చట్టాన్ని ఏమార్చి..

రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం బరితెగింపు

విపక్ష నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం వేధింపులు

సంబంధం లేని చట్టాలు, సెక్షన్ల ప్రయోగం.. చివరకు మహిళ అయిన సుధారాణిపైనా పోక్సో కేసు

సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నందుకు ఆమెపై వేధింపులు

ఇది అత్యంత దారుణ చర్య అంటున్న న్యాయనిపుణులు 3లో

### తప్పుడు కేసులకు భయపడం

- న్యాయ పోరాటం చేస్తా.. పరువు నష్టం కేసు, రిట్, ప్రైవేటు కేసు వేస్తున్నా
- తప్పు చేసిన వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం: చెవిరెడ్డి

3లో

### నా భర్తకు ప్రాణహాని

- అదే పనిగా తప్పుడు కేసులు.. ములాఖత్ ద్వారా నా భర్తను కలవనీయడంలేదు
- సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్ భార్య సుజన ఆవేదన

# 'సోలార్' లంచాలు.. ఊహాగానాలే

**ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ**

సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం భారత్‌లో అధికారులకు, నేతలకు లంచాలిచ్చినట్లు అమెరికా న్యాయశాఖ అభియోగాల్లో ఎక్కడా నిర్దిష్టంగా పేర్కొనలేదు

లంచం ఇవ్వటానికి ప్రయత్నించారనిగానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారమూ లేదు.. రెండు కీలక నేరారోపణల్లో అసలు అదానీల పేర్లే లేవు

నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయ ఆధారాలేవీ లేవు

సాక్షి, అమరావతి: ''అదానీ'' వ్యవహారంపై మీడియాలో వెలువడుతున్న ఊహాజనిత కథనాలు 'అదుగో పులి అంటే.. ఇదుగో తోక!' అన్నట్లుగా ఉన్నాయనే అభిప్రాయం న్యాయవర్గాల్లో వ్యక్తమవుతోంది. విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి అదానీ గ్రూపు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నిందంటూ యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద అమెరికా న్యాయశాఖ (డీఓజే) నమోదు చేసిన కేసులో నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవని ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ స్పష్టం చేశారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులకు, నేతలకు లంచాలిచ్చినట్లు డీఓజే


ముకుల్ రోహత్గీ


మహేశ్ జఠ్మలానీ

తన అభియోగాల్లో ఎక్కడా నిర్దిష్టంగా పేర్కొనలేదని వెల్లడించారు. కేవలం కుట్ర జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారేగానీ

మిగతా 2వ పేజీలో ▸

**ఇవేం నేరారోపణలు?** 2లో **ఒక్క ఆధారం చూపలేదు**



### నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పాత్రికేయ సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ సమావేశం జరగనుంది.

# నిజం చెబితే ఒట్టు!

**ఎప్పటికప్పుడు నిందలు, అబద్ధాలు, దుష్ప్రచారాలు, టాపిక్ డైవర్షన్‌లు**

**ఎల్లో మీడియా తప్పుడు రాతలు.. చంద్రబాబు మాటలు**

- రాష్ట్ర అప్పులపై అడ్డగోలుగా అబద్ధాలు
- అప్పులు రూ.6.46 లక్షల కోట్లేనని అసెంబ్లీ సాక్షిగా వెల్లడి.. సభలో పెట్టిన కాగ్ నివేదికలోనూ అదే ఉంది
- ఆ మరుసటి రోజే రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు, రూ.11 లక్షల కోట్లు, రూ.14 లక్షల కోట్లని అబద్ధాలు
- వారు బడ్జెట్‌లో చెప్పింది తప్పు అయితే సభలో ఎలా పెట్టారు?
- తిరుమల లడ్డూపైనా దుష్ప్రచారం
- ఆ నెయ్యి వాడనే లేదని టీటీడీ ఈవో స్వయంగా చెప్పినా అవే అబద్ధాలు
- విజయవాడ వరదల విషయంలోనూ విషం చిమ్మారు.. అసలు నగరంలోకి వరదను మళ్లించి.. ఇళ్లను ముంచిందే వాళ్లు
- ఎన్నికలకు ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నానా యాగీ

2లో



- అది మంచిది కాకపోతే రీ సర్వేను ఎందుకు కొనసాగిస్తామంటున్నారు?
- సౌర విద్యుత్ కొనుగోలుపై వారం రోజులుగా దుర్మార్గంగా 'ఈనాడు' నిందలు
- సెకీ ఒప్పందంపై విష ప్రచారం
- అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలు ఉండవన్న కేంద్ర విద్యుత్ శాఖ, సెకీ
- 'సెకీ', రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ మధ్య ఒప్పందంలోనూ స్పష్టత.. కళ్లెదుటే వాస్తవాలున్నా నిత్యం అబద్ధాలు











# మారిటైమ్ హబ్‌గా ఏపీ



- మారిటైమ్ పాలసీ-2024 లక్ష్యం.. తీర ప్రాంతం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- మారిటైమ్ పాలసీపై అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- వివరాలు 14లో



# పోలవరం ఇక బ్యారేజ్!

- 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వ.. తేల్చి చెప్పిన కేంద్రం..
- అటు కేంద్రం.. ఇటు రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాల నిర్వాకం బట్టబయలు
- రాజ్యసభలో కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి స్పష్టీకరణ
- 45.72 మీటర్ల ఎత్తులో నీటి నిల్వకు నిధుల కోసం ఫిబ్రవరి 27న పీఐబీ ప్రతిపాదన
- తొలి దశలో 41.15 మీటర్లలో నీటి నిల్వకు నిధులు విడుదల చేయాలని సిఫార్సు
- పీఐబీ ప్రతిపాదనపై కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపకుండా అప్పట్లో చంద్రబాబు మోకాలడ్డు
- ఆగస్టు 28న గత ప్రతిపాదనకు భిన్నంగా కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన.. అభ్యంతరం చెప్పని టీడీపీ కేంద్ర మంత్రి రామ్మోహన్

5లో



# దూసుకొస్తున్న 'ఫెంగల్'

**తుపానుగా బలపడిన తీవ్ర వాయుగుండం**

- 30న తమిళనాడు, శ్రీలంక మధ్యలో తీరం దాటే అవకాశం
- నెల్లూరు, తిరుపతి జిల్లాలకు భారీ వర్ష సూచన
- కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు
- డిసెంబర్ 3 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్న వాతావరణ శాఖ
- వివిధ పోర్టుల్లో ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ

5లో




# 78 కోట్ల పాన్ కార్డులు

ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పాన్, టాన్ సంబంధిత సేవలను సులభతరం, వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1435 కోట్లతో పాన్ 2.0 ప్రాజెక్టును ప్రకటించింది. ఇకమీదట పాన్ కార్డులు క్యూఆర్ కోడ్‌తో రానున్నాయి. 2020–21 నాటికి దేశంలోని పాన్ కార్డుల సంఖ్య 55.36 కోట్లు కాగా... 2023–24 నాటికి ఆ సంఖ్య 74.67 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం దేశంలో ఉన్న పాన్ కార్డుల సంఖ్య 78 కోట్లు.



ఇప్పటివరకు మంజూరు చేసిన పాన్ కార్డుల్లో 97.97 శాతం వ్యక్తులకు ఇచ్చినవే. పాన్ కార్డుల్లో ఎవరెవరికి ఎంతెంత శాతం మంజూరు అయ్యాయంటే..

■ విభాగం ■ శాతం

| విభాగం | శాతం |
|---|---|
| వ్యక్తులు | 97.97 |
| సంస్థ (ఫర్మ్) | 0.83 |
| కంపెనీలు | 0.35 |
| సంఘాలు | 0.33 |
| హిందూ అవిభాజ్య కుటుంబం | 0.32 |
| ట్రస్టులు | 0.17 |
| ప్రభుత్వం | 0.02 |

ఆధారం: ఐటీ విభాగం, కాగ్

## క్లుప్తంగా...

### మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించండి

**పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ పిలుపు**

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని సూచించింది. ఈ కార్యక్రమాలను జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని సూచిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

### కేంద్ర నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏపీలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పర్యాటక రంగానికి ఊతమిస్తూ కేంద్ర ప్రభుత్వ సాస్కి(స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్)2024–25 తొలి విడత రూ.113.75 కోట్లు(66శాతం) విడుదల చేసిందని పేర్కొన్నారు. వీటితో అఖండ గోదావరి, గండికోట ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

### సచివాలయాల శాఖ యాప్‌లో వలంటీర్ల హాజరు ఆప్షన్ తొలగింపు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు సంబంధించిన మొబైల్ యాప్‌లో వలంటీర్లు హాజరు వేసుకునే ఆప్షన్‌ను ప్రభుత్వం తొలగించింది. ఇప్పటి దాకా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మొబైల్ యాప్‌లో వలంటీర్ల హాజరు వేసుకునే వెసులుబాటు యధావిధిగా కొనసాగింది. అయితే, ఈ నెల 20న మంత్రి బాల వీరాంజనేయస్వామి శాసనమండలిలో రాష్ట్రంలో వలంటీర్లు ఉనికిలోనే లేరని ప్రకటించాక అధికారులు యాప్ నుంచి వలంటీర్ల హాజరు వేసుకునే ఆప్షన్‌ను పూర్తిగా తొలగించినట్టు వలంటీర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు.

### ఆర్థిక ప్రాంతంగా విశాఖపట్నం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో వృద్ధి కేంద్రాల ప్రోగ్రామ్ కింద విశాఖపట్నం ఆర్థిక ప్రాంతంగా ఎంపికైందని కేంద్ర ప్రణాళిక శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. ఈ మేరకు ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానమిచ్చారు.

### రాష్ట్ర సహకారం అవసరం

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్**

సాక్షి, న్యూఢిల్లీ: వెంకటాచలం రైల్వే బ్రిడ్జి పనులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని, సహకారం అందిస్తే వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. వెంకటాచలం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఎప్పటిలోగా పూర్తి చేస్తారంటూ ఎంపీ గురుమూర్తి బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

# నిజం చెబితే ఒట్టు!

## ఎల్లో మీడియా తప్పుడు రాతలు.. చంద్రబాబు మాటలు

- ఎప్పటికప్పుడు నిందలు, అబద్ధాలు, దుష్ప్రచారాలు, టాపిక్ డైవర్షన్‌లు
- రాష్ట్ర అప్పులపై కూడా అడ్డగోలుగా అబద్ధాలు
- అప్పులు రూ.6.46 లక్షల కోట్లేనని అసెంబ్లీ సాక్షిగా వెల్లడి
- సభలో పెట్టిన కాగ్ నివేదికలోనూ అదే ఉంది
- ఆ మరుసటి రోజే రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు, రూ.11 లక్షల కోట్లు, రూ.14 లక్షల కోట్లని అబద్ధాలు
- వారు బడ్జెట్‌లో చెప్పింది తప్పు అయితే సభలో ఎలా పెట్టారు?
- తిరుమల లడ్డూ విషయంలో కూడా ఇలాగే దుష్ప్రచారం
- ఆ నెయ్యి వాడనే లేదని టీటీడీ ఈవో స్వయంగా చెప్పినా అవే అబద్ధాలు
- విజయవాడ వరదల విషయంలోనూ విషం చిమ్మారు
- అసలు నగరంలోకి వరదను మళ్లించి.. ఇళ్లను ముంచిందే వాళ్లు
- ఎన్నికలకు ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నానా యాగీ
- ఆ యాక్ట్ మంచిది కాకపోతే ఇప్పుడు అదే రీతిలో రీసర్వే కొనసాగిస్తాం అని ఎందుకు చెబుతున్నారు?
- సౌర విద్యుత్ కొనుగోలుపై వారం రోజులుగా 'ఈనాడు' నిందలు
- సెకీ ఒప్పందంపై విష ప్రచారం
- అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలు ఉండవన్న కేంద్ర విద్యుత్ శాఖ, సెకీ
- 'సెకీ', రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ మధ్య ఒప్పందంలోనూ స్పష్టత
- కళ్లెదుట ఇన్ని వాస్తవాలున్నా నిత్యం అబద్ధాలు వండివారుస్తున్న వైనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సౌర విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి కక్షపూరితంగా వ్యవహరిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ఇందులోకి లాగి.. చంద్రబాబు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారం అబద్ధమని తేలిపోయింది. ఈనాడు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా వండి వారుస్తున్న తప్పుడు కథనాలు దురుద్దేశ పూరితమని స్పష్టమైంది. జరగనిది జరిగినట్లు.. లేనిది ఉన్నట్లు అందంగా అసత్యాలను అచ్చేస్తున్నారని తేటతెల్లమైంది. విద్యుత్ కొనుగోలు విషయంలో ఈనాడు దుష్ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. కళ్ల ముందు స్పష్టంగా సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ కనిపిస్తున్నా.. అన్నింటినీ వదిలేసి కేవలం దుర్బుద్ధితో అప్పటికప్పుడు అబద్ధాన్ని సృష్టించడం.. దానిపై విష ప్రచారం చేయడం అనే విద్యను ఈనాడు నిర్లజ్జగా ప్రదర్శిస్తోంది. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కూడా ఇలాగే విషం చిమ్ముతోంది. రాష్ట్ర అప్పులపై కూడా అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అప్పులు రూ.6.46 లక్షల కోట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబే అసెంబ్లీ సాక్షిగా స్వయంగా ఒప్పుకున్నారు. సభలో పెట్టిన కాగ్ నివేదికలోనూ అదే ఉంది. మళ్లీ బయటకు వచ్చి వారు రాష్ట్ర అప్పు రూ.10 లక్షల కోట్లు, రూ.11 లక్షల కోట్లు, రూ.14 లక్షల కోట్లు అని మాట్లాడుతున్నారు. ఈనాడు నిస్సిగ్గుగా అలాగే తప్పుడు కథనాలు వండివారుస్తోంది. వారు బడ్జెట్‌లో చెప్పింది తప్పు అయితే సభలో ఎలా పెట్టారు? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పరు. తిరుమల లడ్డూ విషయంలో కూడా ఇలాగే దుష్ప్రచారం చేశారు. అసలు ఆ నెయ్యిని వాడనే లేదని, ఆ ట్యాంకర్లను తిరుమలకు అనుమతించనే లేదని సాక్షాత్తు టీటీడీ ఈవోనే చెప్పారు. తిరుపతి నుంచే వెనక్కు పంపామని మీడియా సమక్షంలో స్పష్టం చేశారు. అయినా కల్తీ నెయ్యి వాడారంటూ అబద్ధాలు చెబుతూ విషం చిమ్మారు. తిరుమలలో ప్రసాదాల తయారీకి సంబంధించి దశాబ్దాలుగా స్పష్టమైన ప్రొసీజర్ ఉన్నప్పటికీ, క్రమం తప్పకుండా వాటిని పాటిస్తున్నప్పటికీ దుర్మార్గంగా అబద్ధాలు చెప్పారు. మొన్న విజయవాడ వరదల విషయంలోనూ అదే పాట పాడారు. అసలు నగరంలోకి వరదను మళ్లించిందే వారు కదా! ఎన్నికలకు ముందు ఇదే ఈనాడు, ఇదే దుష్టచతుష్టయం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చేసిన యాగీ, దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. ఇంతా చేసి ఇప్పుడు రీసర్వేను కొనసాగిస్తామని చెబుతున్నారంటే అర్థమేంటి? ఆ యాక్ట్ మంచిదనే కదా! ఇదేంటని అడిగితే వెంటనే మాట మార్చేస్తారు. లేదా టాపిక్ డైవర్ట్ చేస్తారు. చౌకగా సౌర విద్యుత్ కొనుగోలు విషయంలోనూ ఇదే ఈనాడు, ఇదే చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ కింద రాష్ట్రానికి మంజూరైన ప్రాజెక్ట్ ఇది. ఈ ప్రాజెక్ట్‌కు ఇన్సెంటివ్ ఉంది. లేఖలో కూడా ఆ విషయం స్పష్టంగా ఉంది. అయినా కూడా పచ్చిగా అబద్ధాలు చెబుతున్నారు.

**కళ్లెదుటే ఎన్నో సాక్ష్యాలు**

సౌర విద్యుత్ కొనుగోలుకు తమతో ఒప్పందం చేసుకుంటే కేంద్ర విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రోత్సాహకంగా అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీ(ఐఎస్‌టీఎస్)ల నుంచి మినహాయింపు వస్తుందని సెకీ చెప్పినా ఎల్లో మీడియాకు కనపడదు. సెకీతో కుదుర్చుకునే పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలకు అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలు ఉండవని కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశాల్చినా వారికి పట్టదు. సెకీ ఒప్పందాలకు పాతికేళ్ల పాటు విద్యుత్ ప్రసార చార్జీలు ఉండవని కేంద్రం విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) స్పష్టం చేసినా వారి చెవికెక్కదు. చివరికి సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మధ్య జరిగిన విద్యుత్ సరఫరా ఒప్పందంలోనూ ఐఎస్‌టీఎస్ చార్జీలు వంద శాతం మాఫీ అని స్పష్టంగా ఉన్నా పట్టించుకోరు. కేవలం గత ప్రభుత్వంపై బురద జల్లాలి.. జగన్‌పై నిందలు వేయాలి.. ఒప్పందంపై విషం గక్కాలి.. ఇదే అజెండాగా కొద్ది రోజులుగా టీడీపీ, దాని అనుబంధ మీడియా తప్పుడు ప్రచారం చేస్తూనే ఉంది. అర్థం లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కానీ వందసార్లు వారంతా వాదించినంత మాత్రాన అబద్ధం నిజమైపోదు. 'సెకీ' ఒప్పందం నేపథ్యంలో నమోదైన ఏ వాస్తవం కూడా మారిపోదు.

**తీరు మార్చుకోని ఎల్లో మీడియా**

సెకీ ఒప్పందానికి ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవంటూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం, సీఈఆర్‌సీ, సెకీతో జరిగిన ఒప్పందంలోనూ ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ టీడీపీ, దాని అనుబంధ మీడియా అసత్యాలను ప్రచారం చేస్తూనే ఉన్నాయి. ఐఎస్‌టీఎస్ ఛార్జీల భారాన్ని రాష్ట్రం భరించాల్సి వస్తుందంటూ మళ్లీ అదే అబద్ధాన్ని పదే పదే వండి వారుస్తున్నాయి.

### సీఈఆర్‌సీ కూడా చెప్పింది


2023 ఫిబ్రవరి 7న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్(సీఈఆర్‌సీ) ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. అంతర్ రాష్ట్ర ప్రసార ఛార్జీలు, నష్టాల భాగస్వామ్యం (మొదటి సవరణ) నిబంధనలు 2023 ప్రకారం.. ఉత్పాదక ఉత్పత్తి కేంద్రాల నుంచి వచ్చే విద్యుత్‌కు ఎక్స్‌ప్రెస్ నిబంధనలను అందులో రూపొందించింది. వాటి ప్రకారం సీఓడీతో సంబంధం లేకుండా రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్పీఓ) ఉన్న సంస్థలకు కొంత కాలం పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల మినహాయింపు లభిస్తుంది. అది సీఓడీ తేదీ నుంచి 25 సంవత్సరాల పాటు వస్తుందని సీఈఆర్‌సీ స్పష్టం చేసింది.

(d) Generation from Solar PV generating station under SECI manufacturing linked capacity scheme (RFS No. SECI/C&P/RfS/2GW Manufacturing/P-3/R1/062019 dated 25.06.2019) for sale to entities having RPO irrespective of date of COD of such generating station shall be considered for waiver of transmission charges for a period of 25 years from date of COD.

ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు వస్తుందంటూ సీఈఆర్‌సీ 2023 ఫిబ్రవరి 7న జారీ చేసిన నోటిఫికేషన్

### సెకీ ఒప్పందంలోనూ అదే..


ఐఎస్‌టీఎస్ చార్జీల ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం ముందే గుర్తించింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెకీ.. రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ మధ్య జరిగిన విద్యుత్ సరఫరా ఒప్పందం (పవర్ సేల్ అగ్రిమెంట్)లోనూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రోత్సాహంగా ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తుందనే అంశాన్ని భాగం చేసింది.




C. SECI has submitted a proposal to Government of Andhra Pradesh vide its letter SECI/PT/Manufacturing/Solar/2021 dated 15-9-2021 wherein it has inter-alia stated that the manufacturing linked PSAs have special incentive from Government of India wherein Govt of India has granted ISTS charges waiver and thus no such charges would be applicable on GoAP alongside other features. This agreement being based on waiver of ISTS charges, this letter (Annexure-I) shall become integral part of this Agreement (Buyer-Buying Entity PSA).

సెకీతో జరిగిన విద్యుత్ సరఫరా ఒప్పందంలోనూ ఐఎస్‌టీఎస్ చార్జీలు మాఫీ అవుతాయని పేర్కొన్న భాగం

### ప్రతిపాదన లేఖలోనే స్పష్టత






ISTS Waiver: As a special incentive, Government of India has granted ISTS charges waiver to solar projects set up under Solar Manufacturing tender for entire 25 years of PPA life, irrespective of their commissioning date, thus no such charges would be applicable on GoAP.

స్పెషల్ ఇన్సెంటివ్ కింద ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని, పూర్తిగా మినహాయింపు లభిస్తుందని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి 2021 సెప్టెంబర్ 15న 'సెకీ' రాసిన లేఖ

'సెకీ'తో ఒప్పందం కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లపై ఆర్థిక భారం పడుతుందంటూ మరోసారి 'ఈనాడు' పచ్చి అబద్ధాన్ని బుధవారం అచ్చేసింది. ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని ఇప్పటికే అనేకసార్లు నిజాలు వెల్లడించినప్పటికీ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. యూనిట్ రూ.2.49 చొప్పున చవక ధరకే సౌర విద్యుత్‌ను అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి 2021 సెప్టెంబర్ 15న సెకీ రాసిన లేఖ ద్వారా ప్రతిపాదన చేసింది. ప్రాజెక్టు వాణిజ్య కార్యకలాపాలు(కమర్షియల్ ఆపరేషన్ డేట్)తో సంబంధం లేకుండా ప్రత్యేక ప్రోత్సాహకంగా ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి కేంద్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని ఆ లేఖలో సెకీ స్పష్టంగా పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అలాంటి ఛార్జీలు వర్తించవని లేఖలో వివరంగా చెప్పింది.

### కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్లలో స్పష్టం



3.3 ISTS charges shall be waived for Solar PV power plants commissioned under SECI Tender for manufacturing linked capacity scheme (RFS No SECI/C&P/RfS/2GW Manufacturing/P-3/R1/062019 dated 25.06.2019) for sale to entities having RPO, irrespective of whether this power is within RPO or not.

2021 నవంబర్ 30న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్

2021 నవంబర్ 30 నాటి విద్యుత్ మంత్రిత్వ శాఖ 23వ ఆదేశాల్లోని క్లాజ్ 3.3 ప్రకారం.. మాన్యుఫ్యాక్చరింగ్ లింక్డ్ కెపాసిటీ స్కీమ్‌లో భాగంగా సెకీ టెండర్ ద్వారా స్థాపించే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ఐఎస్‌టీఎస్ చార్జీలు మాఫీ అవుతాయి. అంతేకాదు సీఓడీతో సంబంధం లేకుండా రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్పీఓ) ఉన్న సంస్థలకు ఈ ప్రయోజనం అందుతుందని కేంద్రం స్పష్టం చేసింది.



No. 23/12/2016-R&R
Government of India
Ministry of Power

Shram Shakti Bhawan, Rafi Marg, New Delhi

ORDER

Subject: Waiver of Inter-State Transmission charges and losses on transmission of electricity generated from solar and wind sources of energy.

2021 జనవరి 15న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అంతకు ముందే అంటే 2021 జనవరి 15న జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. సెకీ టెండర్ కిందకు వచ్చే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ఐఎస్‌టీఎస్ మాఫీ వర్తిస్తుందని అందులోనూ తెలిపింది.

# ఇవేం నేరారోపణలు?

## ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ



- కీలకమైన రెండు నేరారోపణల్లో అసలు అదానీల పేర్లే లేవు
- 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు
- న్యాయానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణల్లోనూ వారి పేర్లు లేవు

సాక్షి, అమరావతి: సౌర విద్యుత్ ప్రాజెక్టుల సంబంధించి అదానీ గ్రూపు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నిందంటూ యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీఓజే) కేసు నమోదు చేయడాన్ని ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తప్పుబట్టారు. 'డీఓజే' చేసిన నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలు ఏవీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)ను ఉల్లంఘించారనే విషయంలో అదానీలపై ఎలాంటి నేరారోపణలు లేవన్నారు. అలాగే న్యాయాన్ని అడ్డుకున్నారన్న నేరారోపణలో కూడా అదానీల పేర్లు గానీ వారి అధికారుల పేర్లు గానీ లేవని వెల్లడించారు. ఈ రెండు కీలకమైన నేరారోపణల్లో అదానీల పేర్లు లేవన్న సంగతిని అందరూ.. ముఖ్యంగా మీడియా గుర్తించాలని సూచించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏం చెప్పారంటే...

➢ యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ మోపిన నేరారోపణ పత్రాన్ని నేను చదివా. ఆయా వ్యక్తుల నిర్దిష్ట చర్యలపై అభియోగాలు మోపుతూ మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటిది ఇది. నా లెక్క ప్రకారం మొత్తం ఐదు నేరారోపణలున్నాయి. ఇందులో మొదటి, ఐదో నేరారోపణలు మిగిలిన వాటికన్నా చాలా ముఖ్యమైనవి. అయితే ఒకటో నేరారోపణలోగానీ ఐదో నేరారోపణలోగానీ అదానీ, ఆయన మేనల్లుడు పేర్లు లేనే లేవు. ఆ నేరారోపణలు మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటివి. అది లంచం కావచ్చు.. దొంగతనం కావచ్చు.. హత్య కావొచ్చు. మొదటి నేరారోపణలో ఇద్దరు అదానీల పేర్లు లేవు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద ఈ నేరారోపణలు చేశారు. ఎఫ్‌సీపీఏ అనేది మన దేశంలో అవినీతి నిరోధక చట్టం లాంటిది. మొదటి నేరారోపణ ఏమిటంటే.. ఎఫ్‌సీపీఏని ఉల్లంఘించేందుకు కుట్ర పన్నారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు ఉన్నాయి. రెండు, మూడు, నాలుగో ఆరోపణలు సెక్యూరిటీలు, బాండ్లకు సంబంధించినవి. ఈ నేరారోపణల్లో అదానీలు, వారి అధికారుల పేర్లున్నాయి. ఐదవదైన చివరి నేరారోపణ చాలా ముఖ్యమైనది. ఈ నేరారోపణ న్యాయానికి ఆటంకం కలిగించారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు కూడా లేవు. అసలు ఎవరు ఎవరికి లంచం ఇచ్చారు..? ఎంత లంచం ఇచ్చారు..? ఎలా ఇచ్చారు... లాంటి వివరాల్లేవ్..!

➢ ఓ చార్జిషీట్‌లో ఫలానా వ్యక్తులు ఫలానా పనులు చేశారు.. ఫలానా వ్యక్తులు ఫలానా వారికి లంచం ఇచ్చారు లాంటి వివరాలేవీ లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. అదానీలు సౌర విద్యుత్ ప్రాజెక్టుల నిమిత్తం భారతదేశ వ్యక్తులకు, సంస్థలకు లంచం ఇవ్వజూపారన్నది ప్రధాన నేరారోపణ. అయితే ఆ నేరారోపణల్లో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారని ఉందే కానీ.. ఎవరికి లంచం ఇచ్చారు? ఎలా లంచం ఇచ్చారు? ఇందులో అదానీ గ్రూపు అధికారుల ప్రత్యక్ష ప్రమేయం ఉందా? ఎంత లంచం ఇచ్చారు? ఏ కాంట్రాక్ట్ కోసం లంచం ఇచ్చారు? అధికారులు ఏ గ్రూపునకు చెందిన వారు తదితర వివరాలేవీ కనీస స్థాయిలో కూడా ఆధారాలు లేవు. ఇందుకు సంబంధించి ఒక్కరి పేరు కూడా ఆ నేరారోపణల్లో లేదు. ఇలాంటి నేరారోపణలపై ఎవరైనా ఎలా స్పందిస్తారు? ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదు. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ. కానీ ఇందుకు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంలో వారు (అదానీలు) అమెరికాలోని న్యాయవాదుల సలహాలు తీసుకుంటారని భావిస్తున్నా. లంచం ఇవ్వాలని చూశారన్న ఆరోపణ మినహా అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవు. అందువల్ల ఆ నేరారోపణలన్నీ కూడా ఊహాజనితమైనవే. మరోసారి చెబుతున్నా.. 1, 5వ నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు.

# 'సోలార్' లంచాలు.. ఊహాగానాలే

▶ మొదటి పేజీ తరువాయి

దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదని.. లోతుగా పరిశీలిస్తే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని స్పష్టమవుతోందన్నారు. ఇక ఈ కేసులో అత్యంత కీలకమైన 1, 5వ నేరారోపణల్లో అదానీ గానీ ఆయన మేనల్లుడు పేర్లు గానీ లేనే లేవని చెప్పారు. 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లోగానీ.. న్యాయానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణల్లోగానీ అదానీల పేర్లు లేవనే విషయాన్ని వారు తెరపైకి తెచ్చారు. కీలకమైన ఈ రెండు నేరారోపణల్లో అదానీల పేర్లు లేవనే విషయాన్ని ప్రధానంగా మీడియా సంస్థలు గుర్తించాలని సూచిస్తున్నారు. అసలు లంచం ఇవ్వటానికి ప్రయత్నించారనిగానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారం కూడా లేదని పేర్కొంటున్నారు. ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదని.. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ అని.. అయితే అందుకు ఎలాంటి ఆధారాలు లేవనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అమెరికా 'డీఓజే' నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవని ఈ కేసులో న్యాయపరమైన అంశాలను విశ్లేషించిన న్యాయ కోవిదులు చెబుతున్నారు.

# ఒక్క ఆధారం చూపలేదు

## సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జత్మలానీ

**సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే అభియోగాల్లో ఎక్కడా స్పష్టంగా లేదు**

- ఏ చట్టాలను ఉల్లంఘించారో ఒక్క అభియోగంలో కూడా లేదు
- కేవలం కుట్ర జరిగి ఉంటుందన్నారేగానీ ఎలాంటి ఆధారం చూపలేదు
- లోతుగా పరిశీలిస్తే ఇవన్నీ అమెరికా న్యాయశాఖ ఊహాగానాలే



సాక్షి, అమరావతి: 'అదానీ గ్రూప్‌పై అమెరికా న్యాయ శాఖ (డీఓజే) చేసిన ఆరోపణలు, మోపిన అభియోగాలు కేవలం ఊహాగానాలు. పూర్తిగా నిరాధారం. పైగా వాటిని కూడా పూర్తిగా వక్రీకరించి మరీ భారత ప్రజల ముందు పెట్టారు. అదికూడా సరిగ్గా పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొదలయ్యే ముందే వాటిని బయట పెట్టడం వెనక భారీ దురుద్దేశాలు దాగున్నాయి. ఇది భారత్‌ను ఆర్థికంగా అస్థిరపరిచేందుకు, దేశ కార్పొరేట్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేందుకు చేసిన ప్రయత్నమే' అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జత్మలానీ పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులకు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే తన అభియోగాల్లో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదని జత్మలానీ గుర్తు చేశారు. తాను కేవలం ఒక జాతీయవాదిగా వ్యక్తిగత హోదాలో మాత్రమే దీనిపై స్పందిస్తున్నట్టు చెప్పారు. అంతేగానీ అదానీలకు గానీ, వారి గ్రూప్‌నకు గానీ మద్దతుగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. అమెరికాలో జో బైడెన్ సారథ్యంలోని డెమొక్రటిక్ ప్రభుత్వానికి చెందిన అధికార లాబీలు ఏడాదిన్నరగా మోదీ సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా పని చేస్తున్నాయన్నారు. 'అదానీ' వివాదంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

**విశ్వసనీయత లేదని స్వయంగా ట్రంప్ చెప్పారు..**


'అది పూర్తిగా అమెరికాలో అదానీ గ్రీన్ కంపెనీ జారీ చేసిన బాండ్లకు సంబంధించిన అంశం. ఇన్వెస్టర్లకు సమాచారమే ఇవ్వకుండా బాండ్లు జారీ చేశారని, భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఆశ చూపిన విషయాన్ని దాచి అమెరికాలో పెట్టుబడుల సేకరణకు ప్రయత్నం చేశారని అభియోగాలు మోపారు. కానీ అందుకు ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు. పైగా ఈ ఉదంతానికి సంబంధించి భారత్‌లో ఏ చట్టాలను ఉల్లంఘించారో కనీసం ఒక్క అభియోగంలో కూడా పేర్కొనలేదు. కనీసం ఉల్లంఘించినట్టు కూడా చెప్పలేదు. భారత్‌లో అధికారులకు గానీ, ప్రజాప్రతినిధులకు గానీ అదానీ గ్రూప్ లంచమిచ్చినట్టు ఎక్కడా నిర్దిష్టంగా చెప్పలేదు కూడా. 'లంచాలిచ్చారు, లేదా ఇస్తామని వాగ్దానం చేశారు' అంటూ చాలా పదాల కూర్పులో చాలా తెలివిగా వ్యవహరించారు. కేవలం కుట్ర జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారేగానీ దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదు. పైగా ఆ కుట్రను అమలు చేశారని కూడా ఎక్కడా చెప్పలేదు. లోతుగా చూస్తే ఇవన్నీ కేవలం అమెరికా న్యాయ శాఖ ఊహాగానాలేనని అడుగడుగునా స్పష్టమవుతూనే ఉంది' అని జత్మలానీ స్పష్టం చేశారు. అమెరికాలో న్యాయ శాఖ అనేదే ఒక పెద్ద జోక్ అని, దానికి విశ్వసనీయతే లేదని ఆ దేశానికి కాబోయే అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంపే బాహాటంగా చెప్పారని గుర్తు చేశారు.

- అదానీ ఎపిసోడ్ మొత్తాన్నీ భారత్‌పై బైడెన్ సర్కారు పన్నాగంలో భాగంగా జత్మలానీ అభివర్ణించారు. 'అదానీలపై ఆరోపణలు తెరపైకి వచ్చినప్పుడల్లా ఆ గ్రూపు ఆర్థికంగా భారీగా నష్టపోతూ వస్తోంది. ఈసారి ఏకంగా 2.4 బిలియన్ డాలర్లు నష్టపోయింది. హిండెన్‌బర్గ్ నివేదికైనా, డీఓజే అభియోగాలైనా పార్లమెంటు సమావేశాలకు సరిగ్గా రెండు రోజుల ముందు బయటికొచ్చాయి. ఇందులోకి కేంద్ర ప్రభుత్వాన్ని కూడా లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఏ సాక్ష్యం లేకుండా కేవలం ఓ అభియోగ పత్రంపై ఆధారపడి నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ లాంటి పెద్ద పార్టీకి తగని పని' అని జత్మలానీ పేర్కొన్నారు. విశ్వసనీయమైన సాక్ష్యాలంటూ ఉంటే కాంగ్రెస్ ముందుగా వాటిని ప్రజల ముందు పెట్టాలని జత్మలానీ డిమాండ్ చేశారు.



## మహిళల్లో ధూమపానం 8.9%

15 ఏళ్లకు పైబడిన వారిలో పొగతాగే పురుషుల దేశ సగటు 38 శాతం కాగా, మహిళల్లో 8.9 శాతం. మిజోరం, త్రిపురలలో 50 శాతానికిపైగా మహిళలు పొగ తాగుతున్నారు. పొగతాగే మహిళలు, పురుషులు అత్యధికంగా ఉన్న పెద్ద రాష్ట్రం ఒడిశా. ఆంధ్రప్రదేశ్‌లో మహిళల శాతం 3.9 కాగా, తెలంగాణలో 5.6.



| మహిళలు | రాష్ట్రం | పురుషులు |
|---|---|---|
| 26.1 | ఒడిశా | 51.7 |
| 17.3 | ఛత్తీస్‌గఢ్ | 43.1 |
| 11 | మహారాష్ట్ర | 33.8 |
| 10.8 | బెంగాల్ | 48.1 |
| 10.3 | మధ్యప్రదేశ్ | 46.4 |
| 8.7 | గుజరాత్ | 41.2 |
| 8.6 | కర్ణాటక | 27.3 |
| 8.4 | జార్ఖండ్ | 47.4 |
| 8.5 | ఉత్తరప్రదేశ్ | 44 |
| 6.9 | రాజస్థాన్ | 41.9 |

### భార్గవ్ ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి వైఎస్సార్ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు భార్గవ్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. సహ నిందితుల వాంగ్మూలం ఆధారంగా భార్గవ్‌ను నిందితుడిగా చేర్చారని, ఇలా చేయడం చట్టప్రకారం చెల్లదని, ఇది చట్ట ప్రకారం అనుమతించదగ్గ సాక్ష్యం కాదన్నారు. ఎప్పుడో జరిగిన నేరాలకు ఇప్పుడు కేసుల నమోదు చెల్లదని, ఒకే నేరంపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడమూ చెల్లదన్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. కోర్టు సమయం ముగియడంతో న్యాయమూర్తి విచారణను 29కి వాయిదా వేశారు. సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో పోలీసులు ఇటీవల నమోదు చేసిన కేసులను సవాలు చేస్తూ భార్గవ్ తాజాగా దాఖలు చేసిన రెండు వ్యాజ్యాలకు సంబంధించి పూర్తివివరాలు సమర్పించాలని జస్టిస్ కృపాసాగర్ పోలీసులను ఆదేశించారు.

### 'మొండితోక బ్రదర్స్' కేసుల వివరాలు సమర్పించండి

సాక్షి, అమరావతి: ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నందిగామ వద్ద ఆయన వాహనంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నేతలు మొండితోక జగన్‌మోహన్‌రావు, అరుణ్ కుమార్, చిరుమామిళ్ల శ్రీనివాసరావులపై నమోదు చేసిన కేసులకు సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ రాధాకృష్ణకృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### విజయ్‌పాల్‌కు రిమాండ్

ఒంగోలు టౌన్/నగరంపాలెం: డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టడీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐడీ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ విజయ్‌పాల్‌కు గుంటూరు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి స్పందన బుధవారం 14 రోజుల రిమాండ్ విధించారు. ఒంగోలు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట విచారణకు హాజరైన విజయ్‌పాల్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేయడం తెలిసిందే. బుధవారం జీజీహెచ్ వైద్యుల బృందాన్ని తాలూకా పోలీసుస్టేషన్‌కు పిలిపించి వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయన్ని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించటంతో గుంటూరు జిల్లా కారాగారానికి తరలించారు.

### సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై 7 కేసులు

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు మలక అమరనాథ్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించినందుకు ఇప్పటికే ఏకంగా ఏడు కేసులు నమోదు చేసింది. ఈ నెల 2వ తేదీ కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నెల 4న అరెస్ట్ చేసి, 5న స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. 6వ తేదీన సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని స్టేషన్‌కు పిలిపించి.. నాలుగురోజులు వివిధ పోలీస్ స్టేషన్లకు తిప్పారు. అతడిపై కృష్ణాజిల్లా అవనిగడ్డ, కర్నూలు జిల్లా ఉలిందకొండ, గుంటూరు జిల్లా పెదనందిపాడు, బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్, పల్నాడు జిల్లా నకిరికల్లు, విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. రోజూ పోలీసులు వచ్చి తమ కుమారుడు లొంగిపోవాలని బెదిరిస్తున్నారని అమర్‌నాథ్‌రెడ్డి తండ్రి, పక్షవాతంతో బాధపడుతున్న గంగిరెడ్డి ఆవేదనతో చెప్పారు.

# ప్రశ్నిస్తే.. పీడీ చట్టం!

## నల్ల చట్టంతో చంద్రబాబు సర్కారు అణచివేత కుట్రలు

## ప్రభుత్వ వైఫల్యాలపై నిగ్గదీస్తే అక్రమ కేసులే లక్ష్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న చంద్రబాబు సర్కారు మరింత బరితెగించింది! యావత్ భారతం 'రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ' వేడుకలను జరుపుకొంటున్న తరుణంలో.. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కులపై ఉక్కుపాదం మోపే కుట్రలకు కూటమి ప్రభుత్వం తెర తీసింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు 'నల్ల చట్టాన్ని' తీసుకువచ్చింది. 'పీడీ' (ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్) చట్టానికి సవరణ ముసుగులో పచ్చ పన్నాగాన్ని పన్నింది. రాజ్యాంగ స్ఫూర్తిని, భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. సైబర్ నేరాలను పీడీ చట్టం పరిధిలోకి తెస్తున్నట్లు చట్ట సవరణ చేసినట్టు డ్రామా ఆడిన చంద్రబాబు ప్రభుత్వం అసలు కుతంత్రం వేరే ఉంది! అసలు సైబర్ నేరాలు అంటే ఏమిటో నిర్వచించకపోవడం ప్రభుత్వ కుతంత్రానికి నిదర్శనం. కేంద్ర ఐటీ చట్టంలోని అంశాలను సైబర్ నేరాలు అంటూ గంపగుత్తగా అధికారిక ముద్ర వేసేసింది. తద్వారా సోషల్ మీడియా పోస్టులను కూడా సైబర్ నేరాలుగా జమ కట్టేసేందుకు తెగించింది. ఆ నెపంతో సోషల్ మీడియా పోస్టులపై ఏకంగా పీడీ చట్టం కింద అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లలో మగ్గేలా చేసేందుకు పథకం వేసింది. ఈ దుర్మార్గంపై ఎక్కడికక్కడ బాధితులు, ప్రజాస్వామ్యవాదులు, పౌరహక్కుల సంఘం నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించనున్నారు.

### ప్రశ్నించే గొంతుల అణచివేతకు కుట్ర...

#### పీడీ చట్టానికి సవరణ పేరుతో పన్నాగం

తీవ్రమైన నేరాలను కట్టడి చేసేందుకు 1986లో తీసుకువచ్చిన పీడీ చట్టానికి సవరణ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం కుతంత్రానికి తెరతీసింది. పీడీ చట్టం పరిధిని విస్తృతం చేస్తున్న నెపంతో కథ నడిపించింది. పీడీ చట్టం ప్రకారం ఆరు కేటగిరీల నేరాలపై కేసులు నమోదు చేసేందుకు అవకాశం ఉంది. నాటుసారా, అక్రమ మద్యం తయారీ / సరఫరా / రవాణాదారులు, దొంగతనాలకు పాల్పడే బందిపోటు ముఠాలు, మాదక ద్రవ్యాల తయారీ / సరఫరా / విక్రయదారులు, మానవ అక్రమ రవాణాదారులు, గూండాలు, భూ కబ్జాలకు పాల్పడేవారిపై పీడీ చట్టం ప్రయోగించవచ్చు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల్లో పీడీ చట్టాన్ని సవరించింది. భూ కబ్జాలకు పాల్పడేవారు అనే అంశాన్ని విస్తృతం చేస్తూ దాని పరిధిలోకి మరో 15 అంశాలను చేర్చింది. వాటిలో 'సైబర్ నేరాలు' చేర్చింది. సైబర్ నేరాలకు పాల్పడేవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించేందుకు అవకాశం కల్పించింది.

### కేంద్ర ఐటీ చట్టం పరిధిలోని కేసులన్నీ సైబర్ నేరాలట!

#### కూటమి సర్కారు కుట్ర

చంద్రబాబు ప్రభుత్వం పీడీ చట్టానికి సవరణ చేస్తూ సైబర్ నేరాలకు తనదైన భాష్యం చెప్పడం విడ్డూరంగా ఉంది. 'కేంద్ర ఐటీ చట్టం 2000' పరిధిలోకి వచ్చే నేరాలన్నీ సైబర్ నేరాలే అని గంపగుత్తగా పేర్కొనడం ప్రభుత్వ కుతంత్రానికి నిదర్శనం. 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'లో పొందుపరిచిన నేరాలకు కేంద్ర ప్రభుత్వం పీడీ చట్టం లాంటి తీవ్రమైన చట్టాన్ని ప్రయోగించడం లేదు. ఐటీ చట్టం ప్రకారమే కేసులు నమోదు చేస్తోంది. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఐటీ చట్టం పరిధిలోని అంశాలను సైబర్ నేరాలుగా పేర్కొంటూ పీడీ చట్టాన్ని ప్రయోగించేందుకు సిద్ధపడింది.



ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో సోషల్ మీడియా అనేది ప్రధాన మాధ్యమంగా మారింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు సామాన్యులు సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకుంటున్నారు. చంద్రబాబు సర్కారు వైఫల్యాలు, ఎన్నికల హామీలను అమలు చేయకపోవటాన్ని సోషల్‌మీడియా వేదికగా యాక్టివిస్టులు, ప్రజాస్వామ్యవాదులు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రభుత్వం వారిని అక్రమ కేసులతో వేధిస్తోంది. తాజాగా ఆ కుట్రలకు మరింత పదును పెట్టేందుకే పీడీ చట్టానికి సవరణ పేరుతో కుట్ర పన్నింది. సోషల్ మీడియా పోస్టులపై అభ్యంతరం ఉంటే ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు ప్రస్తుతం అవకాశం ఉంది. ఆ చట్టం ప్రకారం సోషల్ మీడియా పోస్టులు పెట్టినవారికి '41 ఏ' కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుని పంపించి వేయాలి. ఏకపక్షంగా అరెస్ట్ చేసేందుకు అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేస్తే న్యాయస్థానాలు సమ్మతించవు. రిమాండ్‌ను తిరస్కరిస్తాయి. దీంతో చంద్రబాబు ప్రభుత్వం కుట్రలకు పదును పెట్టింది. ఐటీ చట్టం పరిధిలోకి వచ్చే అంశాలను సైబర్ నేరాలుగా పేర్కొంటూ వాటిని ఏకంగా పీడీ చట్టం పరిధిలోకి తెచ్చింది. తద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై పీడీ చట్టం కింద అక్రమ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమైంది. సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఒకటికి మించి కేసులు నమోదు చేసి... దాన్ని సాకుగా చూపించి వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఆ కుట్రలో భాగంగానే నెల రోజులుగా ఒక్కో సోషల్ మీడియా కార్యకర్తపై పలు జిల్లాల్లో అక్రమ కేసులను నమోదు చేస్తోంది. వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించేందుకు పూర్తిస్థాయి కుట్రలకు బరి తెగించింది.

**ఒకటికి మించి అక్రమ కేసులు.. వేధింపుల పన్నాగం**

### ఏడాదిపాటు అక్రమ నిర్బంధానికే...!

పీడీ చట్టం ప్రకారం కేసు నమోదైన వారిని గరిష్టంగా ఏడాది పాటు జైలులో ఉంచవచ్చు. ఎర్రచందనం స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా, అక్రమ మద్యం దందా లాంటి తీవ్రమైన నేరాలకు తరచూ పాల్పడేవారిపై కఠిన చర్యలకు పీడీ చట్టాన్ని రూపొందించారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం తమ వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ మీడియా కార్యకర్తలను వేధించేందుకు, రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు పీడీ చట్టాన్ని సవరించింది. పీడీ చట్టం కింద నమోదు చేసిన కేసులను రాష్ట్ర స్థాయి సలహా కమిటీ సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటుంది. కమిటీకి చైర్మన్‌తోపాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. వారిని రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తుందన్నది గమనార్హం.

### సోషల్ మీడియాపై పీడీ చట్టం రాజ్యాంగ విరుద్ధం



సోషల్ మీడియాపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలన్న ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నించడానికి – దూషించడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకపోవడం ప్రభుత్వ పెద్దల వైఫల్యం. రౌడీలు, స్మగ్లర్ల మీద పెట్టినట్లుగా సోషల్ మీడియా పోస్టులపై పీడీ చట్టం ఏమిటి? రాష్ట్రంలో కొన్ని టీవీ చానళ్లు రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి నిస్సిగ్గుగా మద్దతు ఇస్తున్నాయి. న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసులపై డిబేట్లు నిర్వహిస్తూ ఏకపక్షంగా తీర్పులు చెబుతున్నాయి. స్వీయ నియంత్రణ పాటించాలని మీడియా సంస్థలను సుప్రీంకోర్టు అనేకసార్లు హెచ్చరించింది. కొన్ని టీవీ చానళ్లు రాజకీయ పార్టీలతో కలసి ప్రజలను బెదిరించేందుకు యత్నిస్తున్నాయి. సోషల్ మీడియాపై ఆంక్షలు, కేసులు న్యాయస్థానాల్లో నిలవవు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్యానిదే అంతిమ విజయం.

– మామిడి సుదర్శన్, 'సెంటర్ ఫర్ పొలిటికల్ రీసెర్చ్ – స్ట్రాటజీ (సీపీఆర్ఎస్) వ్యవస్థాపకుడు

#### బిల్లు ఆమోదంలోనూ కనికట్టు...

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ఉద్దేశించిన పీడీ చట్ట సవరణ బిల్లును టీడీపీ ప్రభుత్వం ఆమోదించుకున్న తీరు తీవ్ర విస్మయం కలిగిస్తోంది. శాసనసభలో ఈ నెల 21న ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించుకుంది. ఆ తరువాత బడ్జెట్ సమావేశాల చివరి రోజు అంటే ఈ నెల 22న శాసన మండలిలో అదనపు అజెండాగా ఈ బిల్లును చేర్చింది. ప్రధాన అజెండాలో దీన్ని పేర్కొనకపోవడం గమనార్హం. తద్వారా ఆ బిల్లుపై విస్తృత చర్చకు అవకాశం లేకుండా ప్రభుత్వం ఎత్తుగడ వేసినట్టు స్పష్టమవుతోంది.

#### సైబర్ నేరాలను నిర్వచించని కూటమి ప్రభుత్వం

నిజమైన సైబర్ నేరాలకు పాల్పడేవారిపై పీడీ చట్టం ప్రయోగిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఎందుకంటే సైబర్ నేరాలు ఏమిటన్నది కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా నిర్వచిస్తూ పేర్కొంది. అందుకోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ప్రత్యేకంగా ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ '1930' అందుబాటులోకి తెచ్చింది. ఆ పోర్టల్ పరిధిలోకి వచ్చే అంశాలను అంటే బ్యాంకుల మోసాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు మొదలైన నేరాలను ఏపీ ప్రభుత్వం పీడీ చట్టం పరిధిలోకి తీసుకువస్తే ఎవరూ అభ్యంతరం పెట్టరు. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశం సైబర్ నేరాలను అరికట్టడం కాదు. ఆ ముసుగులో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం! ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేవారిని అక్రమ కేసులతో వేధించడం. అందుకోసమే పీడీ చట్టానికి సవరణ చేస్తూ సైబర్ నేరాలను అనే అంశాన్ని చేర్చింది. కానీ అసలు సైబర్ నేరాలు అంటే ఏమిటో నిర్వచించకపోవడం ప్రభుత్వ కుట్రకు బట్టబయలు చేస్తోంది.

#### భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం..

చంద్రబాబు సర్కారు అరాచక చర్యలు రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం దేశ పౌరులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంది. అయితే సోషల్ మీడియా పోస్టులను పీడీ చట్టం పరిధిలోకి తేవడం ద్వారా కూటమి సర్కారు ఆ హక్కును కాల రాస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ మీడియా యాక్టివిస్టులపై పీడీ చట్టాన్ని ప్రయోగించేందుకు కుట్ర పన్నిందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ బిల్లును ప్రజాస్వామ్యవాదులు సమష్టిగా వ్యతిరేకించాలని, న్యాయ పోరాటం చేయాలని సూచిస్తున్నారు.

# తప్పుడు కేసులకు భయపడేది లేదు

- న్యాయ పోరాటం చేస్తా.. పరువు నష్టం కేసు, రిట్, ప్రైవేటు కేసు వేస్తున్నా
- తప్పు చేసిన అందరినీ న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతాం
- బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లాను
- బాలిక తండ్రిని భయపెట్టి మాపై కేసులు పెట్టించారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: తిరుపతి పోలీసులు తనపై పెట్టిన తప్పుడు కేసులపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రకటించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఐటీ యాక్ట్‌లతో 11 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని తెలిపారు. తిరుపతి ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు ఉద్దేశపూర్వకంగా తనపై పెట్టిన తప్పుడు కేసులను కోర్టులో సవాల్ చేస్తానని, బాధ్యులైన పోలీసు అధికారులపై పరువు నష్టం దావా వేస్తానని వెల్లడించారు. ఈనాడు, ఆంధ్రప్రభ పత్రికలతోపాటు పలు ప్రసార మాధ్యమాల్లో బాలికపై అత్యాచారం అంటూ రాశారని, వాటిపై కేసు పెట్టకుండా ఏమీ మాట్లాడని తనపై కేసు పెట్టారని, దీనిపై కోర్టులో రిట్, ప్రైవేటు కంప్లైంట్ వేస్తున్నట్లు చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గం ఎల్లమందలో బాలికపై జరిగిన దాడి ఘటనపై తాను మీడియాతో గానీ, పబ్లిక్‌గా కానీ మాట్లాడలేదని చెప్పారు. అయినా ఘటన జరిగిన తర్వాత బాలిక తండ్రి చుట్టూ 22 రోజులు పోలీసులను పెట్టి, అయన్ని భయపెట్టి, బలవంతంగా స్టేట్‌మెంట్ తీసుకుని బాలిక పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించానంటూ తనపై తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. ఇలాంటి కేసులకు భయపడబోనని, ముందస్తు బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేయబోనని తెలిపారు. తన జీవితమే పోరాటాలమయమని స్పష్టం చేశారు. 2011 నుంచి 19 మధ్య 88 కేసులు పెట్టారని, తమిళనాడు, కడప సెంట్రల్ జైళ్లలో కొట్టారని, అన్నింటినీ ఎదుర్కొన్నాను తప్ప పారిపోలేదని చెప్పారు.

**బాలిక తండ్రి సమాచారం మేరకు పరామర్శకు వెళ్లాను**

దాడి జరిగినట్లు బాలిక తండ్రి ఫోన్ చేసి చెప్పారని, ఆ వెంటనే తలకోన ఆస్పత్రికి వెళ్లానని చెప్పారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని పోలీసులకు, వైద్యులకు సూచించానన్నారు. ఆ సమయంలో బాలిక తండ్రి చాలా ఆవేశంతో ఉన్నారని, పరువు పోయినా పరవాలేదని, కానీ తన బిడ్డను హింసించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన అక్కడే మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారని తెలిపారు. (ప్రజలు తెలుసుకునేందుకు ఆ వీడియోలను కూడా చెవిరెడ్డి ప్రదర్శించారు). తరువాత మెరుగైన వైద్యం కోసం బాలికను తిరుపతి ఆసుపత్రికి తరలించామన్నారు. బాలిక తండ్రిని తమ పార్టీ నేత నాగార్జునరెడ్డే ఆయన కారులో తీసుకువచ్చారని చెప్పారు. బాలికను ఆస్పత్రిలో చేర్చినప్పుడు ఇచ్చిన రిపోర్ట్‌లో, ఆమె తండ్రి రిపోర్ట్‌లో, తిరుపతి ఎస్పీ స్టేట్‌మెంట్‌లో ఎక్కడైనా తమ పార్టీ వారి పేర్లు ఉన్నాయా అని చెవిరెడ్డి నిలదీశారు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తి నుంచి తీసుకున్న రిపోర్ట్‌లోనూ ఎవరి పేర్లూ లేవన్నారు.

**పోలీసులపైనే పోక్సో కేసు పెట్టాలి**

బాలికపై దాడి ఘటన జరిగినప్పుడు ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో పోస్టులతో ఆ కుటుంబాన్ని రోడ్డుపైకి లాగిన పోలీసులపైనే నిజానికి పోక్సో కేసులు పెట్టాలన్నారు. ఆ బాలికతో పీలేరు, రొంపిచర్ల, తిరుపతి అంటూ.. కనీసం ఎక్కడికి తీసుకెళ్తున్నారో కూడా తెలియకుండా వందలాది పోలీసులతో రాద్ధాంతం చేశారన్నారు. తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, ఏఎస్పీ రవి మనోహరాచారి కూటమి ప్రభుత్వం కళ్లలో సంతోషం చూడాలని తపిస్తున్నారని అన్నారు.

#### చట్టం ముందు దోషులుగా నిలబెడతాను

న్యాయశాస్త్రం చదువుకున్న తాను ఈ కేసులు పెట్టిన వారిని న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతానని, పరువు నష్టం దావా వేస్తానని చెప్పారు. గతంలో ఏఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తమ పార్టీ నేత కరుణాకర్‌రెడ్డిని తప్పుడు కేసులతో వేధిస్తే ప్రైవేటు కేసు వేశామన్నారు. దాన్ని ఆయన కోర్టులో ఎదుర్కోలేక వైఎస్సార్‌ని కలిసి మొరపెట్టుకోవడంతో కరుణాకర్‌రెడ్డి దయతలచి ఆ కేసు ఉపసంహరించుకున్నారని చెప్పారు. ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న కూడా ఇలా దొరికితే జగన్ చెబితే కేసు విరమించుకొన్నామన్నారు. ఎవరి ఒత్తిడితోనో చట్టాలు, న్యాయానికి విరుద్ధంగా వ్యవహరించే అధికారులు చివరికి న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడాల్సిందేనని, రిటైరయినా వారిని కేసులు వదిలిపెట్టవని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# నా భర్తకు ప్రాణహాని

- అదే పనిగా తప్పుడు కేసులు పెడుతున్నారు
- ములాఖత్ ద్వారా కూడా నా భర్తను కలవనీయడంలేదు
- రోజుకు 600 కి.మీ. తిప్పుతున్నారు
- రవికిరణ్ హార్ట్ పేషెంట్, డయాబెటిస్ కూడా ఉంది
- నాపట్ల దువ్వాడ సీఐ, రాజమండ్రి సీఐ దురుసుగా ప్రవర్తించారు
- నా భర్తకు ఏమైనా జరిగితే సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యత వహించాలి
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్ భార్య సుజన ఆవేదన



సాక్షి, విశాఖపట్నం: పోలీసుల నుంచి తన భర్తకు ప్రాణహాని ఉందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్ భార్య సుజన ఆవేదన వ్యక్తంచేశారు. ఆగస్టు 30 నుంచి ఇప్పటివరకు తన భర్తపై కూటమి ప్రభుత్వం 20 కేసులకు పైగా పెట్టించి వేధింపులకు గురిచేస్తోందన్నారు. తన భర్త రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసినా కూడా ఇంటికొచ్చి గొడవలు చేసి, ఇంటికి నోటీసులు అంటించి వెళ్తున్నారని తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీ అడుగుతున్నా ఇవ్వడంలేదన్నారు. 'నా భర్త ఆరోగ్యం నాకు ముఖ్యం. ఆయనకు ఏమైనా జరిగితే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇద్దరూ బాధ్యత వహించాల్సి ఉంటుంద'ని హెచ్చరించారు. విశాఖ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సుజన మీడియా సమక్షంలో కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రవికిరణ్‌పై అక్రమ కేసులు బనాయించి పోలీసులు రాష్ట్రమంతా తిప్పుతున్నారన్నారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

**రోజూ దాదాపు 600 కి.మీ..**

గతంలో ఒకసారి యాక్సిడెంట్ జరిగితే, కాలులో రాడ్ వేశారు. దాంతో ఆయన సరిగ్గా నడవలేక పోతున్నారు. మొన్న ఒక సీఐ ఆయన్ను తోసేశారు. దీంతో ఆయన కాలు బెణికి మరింత గాయమైంది. చీముపట్టి నడవలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఆయన్ని ములాఖత్ ద్వారా కూడా కలవకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. అలాగే, నా భర్తకు సుగర్, గుండె సంబంధిత సమస్య ఉంది. రోజుకు 500–600 కిలోమీటర్లు తిప్పుతూ వేధిస్తున్నారు. నా భర్త మొబైల్స్, లాప్‌టాప్‌ను పోలీసులే తీసుకుని, సోషల్ మీడియాలో ఆయన పేరిట వారే పోస్టులు పెడుతున్నారు. అంతేకాక.. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన నాపట్ల దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, రాజమండ్రి సీఐ బాజీలాల్ దురుసుగా ప్రవర్తించారు.

**బ్రిటిష్ పాలన గుర్తుకొస్తోంది: వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు**

అనంతరం.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు శశికళ, నక్కల లక్ష్మి, అక్కరమాని రోహిణి మాట్లాడుతూ.. దాదాపు మూడునెలలుగా రవికిరణ్‌ను పోలీసుల వేధిస్తున్న తీరు చూస్తుంటే, రాష్ట్రంలో అసలు రాజ్యాంగం ఉందా? అన్న సందేహం కలుగుతోందన్నారు. ఇది అచ్చం బ్రిటిష్ పాలనను గుర్తుచేస్తోందన్నారు. కేసుల వివరాలు కూడా చెప్పకపోవడం హక్కుల ఉల్లంఘనేనన్నారు.

# సెక్షన్లు మార్చి.. చట్టాన్ని ఏమార్చి..

## రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం బరితెగింపు

- విపక్ష నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం వేధింపులు
- సంబంధం లేని చట్టాలు, సెక్షన్ల ప్రయోగం
- సోషల్ మీడియా పోస్టులపై ఇతర చట్టాల కింద అక్రమ కేసులు
- చివరకు మహిళ అయిన సుధారాణిపైనా పోక్సో కేసు
- సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నందుకు ఆమెపై వేధింపులు
- ఇది అత్యంత దారుణ చర్య అంటున్న న్యాయనిపుణులు
- రాష్ట్రంలో అనేక మందిపై సంబంధం లేని సెక్షన్ల ప్రయోగం
- వ్యవస్థీకృత నేరాలు, పోక్సో, ఎస్సీ–ఎస్టీ చట్టం కింద తప్పుడు కేసులు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులతో వేధింపుల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాలరాస్తూ చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోంది. ఇందుకోసం సెక్షన్లు మార్చేస్తోంది. చట్టాల్ని ఏమారుస్తోంది. సోషల్ మీడియా పోస్టులపై కేసులు అందుకు ఉద్దేశించిన ఐటీ చట్టం ప్రకారం కాకుండా సంబంధంలేని ఇతర చట్టాల కింద పెడుతుండటం ప్రభుత్వ కక్ష సాధింపునకు నిదర్శనం. చివరకు సుధారాణి అనే సోషల్ మీడియా యాక్టివిస్టుపైనా పోక్సో కేసు పెట్టడం ప్రభుత్వ దుర్నీతికి పరాకాష్ట. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఓ మహిళ మీద పోక్సో కేసు పెట్టడమే అత్యంత దారుణమని న్యాయ నిపుణులు అంటున్నారు. ఇది రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని, ఇదే కొనసాగితే ఎవరూ మనుగడ సాగించలేని దుస్థితి వస్తుందని చెబుతున్నారు. బాధిత బాలికకు అండగా నిలిచినందుకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ శాసన సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోక్సో కేసు పెట్టడం ప్రభుత్వ మరో బరితెగింపునకు నిదర్శనం. ఇలా నిత్యం రాష్ట్రంలో అనేక మందిపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం దమనకాండకు పాల్పడుతోంది.

**ఐటీ చట్టం స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ అక్రమ కేసుల పరంపర**

వ్యక్తిగతంగా లేదా మీడియా ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారా అభిప్రాయాలు వ్యక్తం చేయడం భావ ప్రకటన హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. సోషల్ మీడియా పోస్టులపై అభ్యంతరం ఉంటే కేంద్ర ఐటీ చట్టం కింద మాత్రమే కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. కానీ కక్ష సాధింపే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పును నిర్భీతిగా ఉల్లంఘిస్తూ అక్రమ కేసులు నమోదు చేస్తోంది. ప్రతిపక్ష నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై ఐటీ చట్టం కింద కాకుండా ఇతర చట్టాల కింద కూడా కేసులు పెడుతూ పౌర హక్కులను ఉల్లంఘిస్తోంది. బీఎన్ఎస్ సెక్షన్ 111, పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం.. ఇలా వివిధ చట్టాల కింద కుట్రపూరితంగా కేసులు పెడుతోంది.

### అందుకు కొన్ని ఉదాహరణలు..

- ఇప్పటివరకు 30 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై ఐటీ చట్టంతోపాటు బీఎన్ఎస్ సెక్షన్ 111 కింద అక్రమ కేసులు నమోదు చేశారు. ఆ సెక్షన్ వ్యవస్థీకృత నేరాల కట్టడికి ఉద్దేశించింది. అంటే ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసేందుకు ఉద్దేశించినది. కానీ, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 111 కింద టీడీపీ ప్రభుత్వం కేసులు పెట్టడం తెగింపు ధోరణే.
- 9 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై ఐటీ చట్టంతోపాటు ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కూడా అక్రమ కేసులు నమోదు చేశారు. అసలు ప్రభుత్వ వైఫల్యాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నించడం ఎస్సీ, ఎస్టీ వేధింపు ఎలా అవుతుందోనని పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- మరో విడ్డూరం ఏమిటంటే.. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించే వారిపై పోక్సో చట్టం కింద కేసులు పెట్టడం. గుంటూరు జిల్లాకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త, మహిళ సుధారాణిపైనా పోక్సో చట్టం కింద కేసు పెట్టారు. కొద్దిరోజుల క్రితం సుధారాణి దంపతులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. దీనిపై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. పోలీస్ స్టేషన్లలో సీసీ టీవీ ఫుటేజీలను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించడంతో గుంటూరు, ప్రకాశం జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు షాక్ తగిలింది. దాంతో ఆమెపై ఏకంగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, వేధింపులకు గురి చేస్తున్నారు.
- చంద్రగిరి నియోజకవర్గంలో ఓ బాలికపై ఇద్దరు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆమె కుటుంబం తల్లడిల్లింది. సమాచారం తెలిసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే ఆయన చేసిన నేరమన్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆయనపై ఏకంగా పోక్సో కేసు పెట్టింది.





ఎప్పుడైనా జరిగే అవకాశం ఉన్నది ఈ రోజే జరగొచ్చు.

– సెనెకా



సాక్షి

గురువారం, 28 నవంబర్ 2024

# దారుణ విద్వేష క్రీడ!

అయిదు నెలలుగా బంగ్లాదేశ్‌లో అల్పసంఖ్యాకులపై అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ ఆ దేశంలో మైనారిటీలు ఎదుర్కొంటున్న పెను సవాళ్ళకు తాజా ఉదాహరణ. మైనారిటీల హక్కుల కోసం బలంగా గళం విప్పే దాస్ బంగ్లాదేశీ జాతీయ పతాకాన్ని అవమానించారంటూ రాజద్రోహ నేరం మోపడం విడ్డూరం. ఆయనను మంగళవారం అరెస్ట్ చేసి, బెయిలివ్వకుండా, పది రోజుల కస్టడీకి పంపడంతో నిరసనలు చెలరేగాయి. సందట్లో సడేమియాగా దుష్టశక్తులు అల్లర్లు రేపి, పొరపాటున ఓ ముస్లిమ్ లాయర్ మరణానికి కారణమై, ఆ పాపం మైనారిటీల నెత్తిన వేయడంతో ఢాకా మరోసారి భగ్గుమంది. ఆలయాలపై దాడులు, ప్రాణనష్టంతో... మైనారిటీలనూ, భావప్రకటనాస్వేచ్ఛనూ కాపాడాలంటూ బంగ్లాను భారత్ అభ్యర్థించాల్సొచ్చింది.

ఇస్లామ్ అధికారిక మతమైనా, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా, సమానత్వానికి రాజ్యాంగ బద్ధులమని చెప్పుకొనే బంగ్లా ఆ మాటకు తగ్గట్టు వ్యవహరించడం మానేసి, చాలాకాలమైంది. అందుకు తగ్గట్టే తాజాగా 'ఇస్కాన్'ను ర్యాడికల్, మత ఛాందసవాద సంస్థ అని బంగ్లా అటార్నీ జనరల్ బుధవారం అభివర్ణించడం ఆందోళనకరం. 'ఇస్కాన్'ను నిషేధించాలని బంగ్లా యోచిస్తున్నట్టు వార్త. ఆధ్యాత్మిక చైతన్యం, పీడిత జన సముద్ధరణ కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాల్లో పనిచేస్తున్న ఒక సంస్థపై అలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవడం అక్షరాలా బుద్ధిహీనతే. దేశంలోని విభిన్న వర్గాల మధ్య సౌహార్దం పెంపొందించి, బాధితులకు న్యాయం చేసి, మానవ హక్కుల్ని కాపాడాల్సిన ప్రభుత్వం ఏ శక్తుల ప్రోద్బలంతో ఇలా మాట్లాడుతోందన్నది ఆశ్చర్యకరం.

జూలై నాటి ప్రజా ఉద్యమంతో ఢాకాలో ప్రభుత్వ మార్పు జరిగిపోయింది కానీ, అల్పసంఖ్యాక వర్గాలపై సాగుతున్న దాడులు మాత్రం అప్పటి నుంచి ఆగడం లేదు. మైనారిటీలను పూర్తిగా తరిమేసి, బంగ్లాను హిందూ రహిత దేశంగా మార్చాలనే పన్నాగం దీనికి వెనక ఉందని స్థానిక స్వతంత్ర విశ్లేషకుల మాట. ఈ అల్లర్లు, అల్పసంఖ్యాక హిందువులపై దాడుల వెనుక మత ఛాందస జమాతే ఇస్లామీ ఉందనేది స్పష్టం. హసీనా సర్కారు కాలంలో నిషేధానికి గురైన ఈ ర్యాడికల్ గ్రూపు, అలాగే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)లు యూనస్ యంత్రాంగంలో భాగమే. అసలు ఈ ప్రయత్నమంతా ఇస్లామిక్ షరియత్‌ను ప్రవేశపెట్టి, బంగ్లాదేశ్‌ను ప్రజాస్వామ్య ఎన్నికలు, పార్లమెంట్‌తో పని లేని దేశంగా మార్చాలనే వ్యూహంలో భాగమని ఒక వాదన వినిపిస్తోంది. అదే గనక నిజమైతే, అత్యంత ప్రమాదకర పరిణామం. పౌరసమాజం, రాజకీయ నేతలు, ప్రజలు కలసికట్టుగా అలాంటి వ్యూహాలను భగ్నం చేసి, కష్టించి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి.

అసలు అఫ్ఘన్ లాగానే బంగ్లాను తమ ప్రయోగశాలగా చేసుకోవాలని పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్నట్టుంది. అప్పుడిక బంగ్లా మరో తీవ్రవాద కేంద్రంగా మారే ప్రమాదముంది. అది భారత్‌కే కాదు... యావత్ ప్రపంచానికి నష్టం. నిజానికి, ఆసియా – పసిఫిక్ కూటమిలో బంగ్లాను భాగం చేసుకొని, లబ్ధి పొందాలని అమెరికా భావించింది. నిరుటి హసీనా సర్కార్ నో చెప్పడంతో అది కుదరలేదు. మొన్నటి అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలిచి ఉంటే ఏమో కానీ, ట్రంప్ గెలవడంతో బంగ్లా మధ్యంతర సర్కార్ సారథి – ట్రంప్ ద్వేషి ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ట్రంప్ పగ్గాలు చేపట్టాక బంగ్లాపై కఠినవైఖరి అవలంబిస్తారని యూనస్‌కు తెలుసు. అందుకే, ఆలోగా మైనారిటీలపై అల్లర్లను ఆఖరి అస్త్రంగా చేసుకున్నారట.

బంగ్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి, స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణకు అయిదు దశాబ్దాల పైచిలుకు క్రితం భారత్ అండగా నిలిచింది. కానీ, ఇప్పుడు అదే గడ్డపై భారత వ్యతిరేకత, మైనారిటీలపై ద్వేషాలను స్వార్థపరులు పెంచిపోషించడం విషాదం. దాదాపు 14 ఏళ్ళ పైగా షేక్ హసీనా ఏలుబడిలో నియంత పోకడల వల్ల మానవ హక్కుల ఉల్లంఘన, అణచివేత సాగిందని ఆరోపణలొస్తే, కొత్త హయాం కూడా తక్కువేమీ తినలేదు. విజృంభిస్తున్న విద్వేషం, విధ్వంసం ఢాకాలో పత్రికా స్వాతంత్ర్యానికి సైతం ముప్పుగా మారాయి. 'ప్రథమ్ ఆలో', 'ది డైలీ స్టార్' లాంటి స్వతంత్ర పత్రికా రచనకు పేరుపడ్డ పత్రికలపై దాడులు అందుకు ఓ మచ్చుతునక. బాధితులకు సత్వర న్యాయం కోసం ప్రత్యేక ట్రిబ్యునళ్ళ ఏర్పాటు సహా మైనారిటీల కనీసపాటి ఆకాంక్షల్ని నెరవేర్చడానికి బంగ్లా సర్కార్‌కు ఉన్న కష్టమేమిటి?

హసీనా సర్కార్‌ను గద్దె దింపినప్పటి నుంచి ఇప్పటికి బంగ్లాలో మైనారిటీలపై 2 వేలకు పైగా దాడులు జరిగాయి. హిందూ, బౌద్ధ, క్రైస్తవ సోదరులపై జరుగుతున్న ఈ దౌర్జన్యకాండను మతపరంగా కాక మానవ హక్కుల పరంగా చూడాలి. అప్పుడే సమస్య తీవ్రత అర్థమవుతుంది. 1930లో బంగ్లాలో 30 శాతం పైగా ఉన్న హిందువులు ఇప్పుడు కేవలం 8 శాతం చిల్లరకు పడిపోయారన్న నిష్ఠుర సత్యం అక్కడ జరుగుతున్నదేమిటో ఎరుకపరుస్తుంది. విద్యుత్ సహా, బియ్యం, పత్తి, చమురు లాంటి అనేక సరుకుల విషయంలోనూ మనపై భారీగా ఆధారపడ్డ బంగ్లా సర్కార్‌పై ఇకనైనా భారత్ కఠినవైఖరిని అవలంబించాలి. పొరుగు దేశంలో బతుకు భయంలో ఉన్న హిందువులను కాపాడేందుకు క్రియాశీలంగా వ్యవహరించాలి. కేవలం మాటలకు పరిమితం కాకుండా, దౌత్య, వాణిజ్య రంగాల్లో చేయగలిగినదంతా చేయాలి. పేరుకు మాత్రం లౌకికవాదం ముసుగు వేసుకొని, మైనారిటీలకు వ్యతిరేకంగా, తెర వెనుక శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మిగిలిన అసమర్థ యూనస్ సర్కార్‌పై అంతర్జాతీయంగానూ ఒత్తిడి తేవాలి. అప్పుడే ఫలితం ఉంటుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.త్రయోదశి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** చిత్త ఉ.7.53 వరకు తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.2.05 నుండి 3.49 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.47 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.14 వరకు, **అమృతఘడియలు:** రా.12.35 నుండి 2.23 వరకు.

**సూర్యోదయం :** 6.16
**సూర్యాస్తమయం:** 5.20
**రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు

# స్త్రీ సాధికారతపై ఇంకా గొడ్డలి వేటా?

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

**దేశంలో, రాష్ట్రాలలో, గ్రామాలలో, స్త్రీ వ్యక్తిత్వం మీద, వారి సాధికారత మీద, వారి జీవన వ్యవస్థల మీద నిరంతర దాడులు జరుగుతూనే ఉన్నాయి. పురుష ప్రపంచం, పితృస్వామిక పాలక వర్గం స్త్రీని కోలుకోలేని దెబ్బతీస్తోంది. ముఖ్యంగా మతోన్మాద భావజాలం, మూఢాచారాల కఠినత్వం భారత దేశంలో స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నాయి. ఇప్పటికీ స్త్రీకి విద్యా నిరాకరణ జరుగుతోంది. ఇంకా బాల్య వివాహాలతో తల్లిదండ్రులు బాలికల విద్యను హైస్కూల్ స్థాయిలోనే నిలువరిస్తున్నారు. ఇది భారత రాజ్యాంగం స్త్రీలకు కల్పించిన హక్కులను ఉల్లంఘించడమే! స్త్రీల ఆస్తి హక్కుని దెబ్బతీయటం వల్ల వారి వ్యక్తిత్వం మీద దాడి సులభమవుతోంది. స్త్రీ తన సాధికారత కోసం చేస్తున్న పోరాటంలో లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి నడవాలి.**

సొంత తల్లిదండ్రులే బాలుడిని ఒక రకంగా, బాలికను ఒక రకంగా చూసే పరిస్థితులు ఇంకా కొనసాగడం సిగ్గుచేటు. కొన్ని సామాజిక కులాలైతే మూడు దశాబ్దాల పాటు ఆడ శిశువు భ్రూణ హత్యలకు పాల్పడ్డాయి. బాలికలను చదివించకుండా ఎదుగుతున్న మెదళ్లపై ఉక్కుపాదం మోపాయి.



అక్షరాస్యతలో నుండి నిజమైన విద్యావంతులు ఆవిర్భవిస్తారు. విద్యావంతుల నుండి మేధావులుగా అభివృద్ధి చెందడానికి ఎక్కువ అవకాశం ఉంది. స్త్రీలకు తమ శరీరాన్ని గురించిన అవగాహన, ఆరోగ్యం, తినవలసిన ఆహార పదార్థాలు, ఏ పదార్థం ఏ శక్తినిస్తుంది మొదలైన అంశాలు అక్షరాస్యత వల్ల తెలుస్తాయి. చేతివృత్తులు, వ్యాపార రంగాల్లో కూడా స్త్రీ వృద్ధి చెందడానికి అక్షరాస్యత ఉపయుక్తం అయ్యింది.

### స్త్రీ ఉద్యోగంలోకి ప్రవేశిస్తేనే!

స్త్రీల ఆరోగ్యం సమాజ మూఢాచారాల వలన కుంటుబడి మరణాల రేటు పెరిగింది. అయితే కేరళ, మిజోరం వంటి రాష్ట్రాల్లో స్త్రీలు విద్య, వైద్య రంగాల్లోకి చొరవగా అడుగుపెట్టిన తరువాత ఆ సమాజాల్లో పెద్ద మార్పులు వచ్చాయి. ఉపాధ్యాయులైన స్త్రీలు సమాజంతో అవినాభావ సంబంధాలు కలిగి ఉండటంతో వాళ్ళ ఆలోచన వల్ల సామాజిక స్ఫూర్తి, చైతన్యం పెరిగాయి. భర్తల వేధింపుల్ని, మానసిక హింసని మొదటిగా అడ్డుకుంది డాక్టర్లు, టీచర్లుగా ఉద్యోగాల్లో ప్రవేశించిన మహిళలే.

అయితే, స్త్రీల ఆస్తి హక్కుని దెబ్బతీయటం వల్ల వారి వ్యక్తిత్వం మీద దాడి సులభమవుతోంది. ఎన్ని చట్టాలు వచ్చినా వారి ఆస్తి హక్కుకు కుటుంబ సభ్యులు, పాలకులు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. ఆడపిల్లకి ఆస్తి హక్కు కల్పించడంలో హిందూ వారసత్వ (సవరణ) చట్టం–2005 ఒక మైలురాయి వంటిదని చెప్పవచ్చు. వందల సంవత్సరాలుగా సాంప్రదాయ వాదులు, సంఘసంస్కర్తల మధ్య జరిగిన సంఘర్షణల అనంతరం ఆడపిల్లలకు ఆస్తిహక్కులు దక్కాయి. విభిన్న మతాలు, సంస్కృతులున్న మన దేశంలో ఈ ఆస్తి హక్కులన్నవి కుల, మత, ప్రాంతీయ ప్రాతిపదికపై వేరువేరుగా ఉన్నాయి. అదేకాక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి కూడా ఆస్తికి సంబంధించి చట్టాలు చేసే అధికారాలు ఉండటం వల్ల అటువంటి తేడాలు ఉన్నాయి.

### హక్కులు ఉన్నప్పటికీ...

'చట్టం దృష్టిలో అందరూ సమానులే' అన్న ప్రాథమిక రాజ్యాంగ న్యాయసూత్రానికి విరుద్ధంగా ఆడపిల్ల ఏ హక్కులు లేకుండా పరాధీనగా బతుకుతోంది. ఈ వివక్షను 2005 సవరణ చట్టం పూర్తిగా తొలగించిందని చెప్పవచ్చు. 1956 నాటి హిందూ వారసత్వ చట్టం ఒక సమగ్రమైన, సమాన వారసత్వపు హక్కులు కల్పించిన మొదటి చట్టం. 2005 హిందూ వారసత్వ (సవరణ) చట్టం, 1956 చట్టంలోని కొన్ని లొసుగులని తొలగించింది. స్త్రీ సర్వతోముఖాభివృద్ధికి, సాధికారతకు సంపూర్ణ ఆస్తిహక్కు కలిగి ఉండాలని గుర్తించి, సవరణలు చేసిన సంస్కరణ చట్టం అని దీన్ని చెప్పవచ్చు. 2005 హిందూ వారసత్వ (సవరణ) చట్టం, కేంద్ర ప్రభుత్వం చేత మొత్తం దేశానికంతటికీ వర్తించేలా చేయబడిన చట్టం.

దీని ప్రకారం, మగవారితో సమానంగా ఆడవాళ్లకు పుట్టుకతోనే 'కోపార్సినరీ' హక్కు ఉంటుంది. ఏ విధంగా కుమారునికి హక్కులు వస్తాయో, అదే విధంగా ఆడపిల్లలకి కూడ హక్కులు వస్తాయని విస్పష్టంగా పేర్కొంది. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని చెప్పింది. అలాగే వ్యవసాయ భూములలో కూడా హక్కులు యిచ్చింది. ఈ చట్ట ప్రకారం ఏ హక్కులు ఆడపిల్లకి వచ్చాయో, ఆ హక్కులు ఆమెకి సంపూర్ణమనీ, వీలునామా ద్వారా తన ఆస్తిని వేరొకరికి ఇవ్వడానికి, లేక అమ్ముకోవడానికి గానీ ఆమెకి పూర్తి హక్కులు ఉన్నాయని ఉద్ఘాటించింది.

1985లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.రామారావు ప్రభుత్వంలో వచ్చిన హిందూ వారసత్వ చట్టం అవివాహిత కుమార్తెలకు, కుమారులతో సమానంగా పూర్వీకుల ఆస్తిలో హక్కు కల్పించింది. ఆ చట్టం వచ్చేనాటికి వివాహమైన వారికి హక్కు ఇవ్వలేదు. 1985 తర్వాత వివాహం అయిన కూతుళ్ళకు కూడా ఆస్తి హక్కు ఇచ్చారు.

ఇంతకు ముందు ఒక్క స్త్రీధనం మీద అంటే వివాహ సమయంలో పుట్టింటి, అత్తింటి వారు బహుమతిగా ఇచ్చే వస్తువులు, కొద్దిపాటి ఆస్తుల మీద మట్టుకే హక్కు కలిగిన ఆడపిల్ల, ఈనాడు అటు పూర్వీకుల ఆస్తిలో సోదరులతో సమానమైన 'కోపార్సినరీ' హక్కు, ఇటు తండ్రి వాటాలో లేక స్వార్జితంలో (వీలునామా లేని ఎడల) సమాన వాటా పొందే హక్కు పొందింది. ఈ ఆస్తిహక్కు ఆడపిల్ల సర్వతోముఖాభివృద్ధికి, సాధికారతకి తోడ్పడుతుంది. అయితే, ఆర్థికంగా ఆడపిల్లకు ఆస్తి ఇవ్వకూడదనే ఉద్దేశం అన్ని వైపులా కనిపిస్తుంది. ఇక వారికోసం, వారు వాదించుకునే చట్టాలు తేవడం కోసం ఏ పార్టీ మహిళలకు సముచితమైన సీట్లు ఇవ్వడం లేదు. అందుకే అసెంబ్లీలు, పార్లమెంటు మహిళలు తక్కువగా వుండి వెలవెలబోతున్నాయి.

### అంతటా నిరాశే...

ఇకపోతే ఇటీవల తెలంగాణ గురుకుల పాఠశాలల్లో బాలికల అస్వస్థత చూస్తే, నన్నయ విశ్వవిద్యాలయంలో ఆడపిల్లల అన్నంలో పురుగుల విషయం చూస్తే దేశంలో అన్ని బాలికల హాస్టళ్లలో అశుభ్రమైన, అరుచికరమైన, పౌష్టికాహార రహితమైన వాతావరణం కనబడుతోందనిపిస్తోంది. పాలక వర్గాల పితృస్వామిక పరిపాలనను విద్యార్థినుల అవస్థలు కళ్ళకు కట్టినట్టు చూపుతున్నాయి.

ఇక బాలికల మీద, యువతుల మీద నిరంతరం జరుగుతున్న అత్యాచారాలకు అంతం లేదు. పురుషులు, యువకులు, మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కామ వ్యామోహితులవుతున్నారు. ఉచ్చనీచాలు తెలియకుండా కళ్ళు కనిపించని స్థితిలో వయస్సు భేదము లేకుండా మీదికి ఉరుకుతున్నారు. ఇటీవల బాపట్ల జిల్లాలో జరిగిన, ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న అనేక ఘటనలు గుండెల్ని పిండుతున్నాయి. స్త్రీకి రక్షణ, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోంది. రాత్రిపూట తాగి ఆ తిక్కతో ఇతర దేశాలకు భర్తలు వెళ్ళి భార్యలు ఒంటరిగా ఉన్న ఇళ్ళ మీద పడి తలుపులు పగులగొట్టి అత్యాచారాలు చేస్తున్నా, వస్తువులు తీసుకెళుతున్నా ప్రభుత్వాలు చూసి చూడనట్లుగా ఉంటున్నాయి.

ఆరు సంవత్సరముల వయసు పూర్తి అగు వరకు బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు, విద్యా వసతులు కల్పించటానికి ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగంలోని 45వ అధికరణ చెబుతోంది. 14 ఏళ్ల వయసు వచ్చువరకు బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్య నేర్పాలన్న సూత్రం గతంలో ఈ అధికరణంలో ఉన్నది. అయితే ఆ ఆదేశిక సూత్రం ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చబడింది. అయితే కేవలం పదాల గారడీ తప్ప పరిస్థితిలో మార్పు లేదు. ఈ అధికరణను రోజూ పాలక వర్గాలు చదువుకోవాలి. ఇక, మత్తు పానీయాలను నిషేధించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అధికరణం 47 చెబుతోంది. ప్రజలను ఆరోగ్య వంతులను చేయటం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచటం ప్రభుత్వ బాధ్యత.

అయినా పితృస్వామ్య పాలక వర్గం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. తమ అభ్యున్నతి కోసం, ఆర్థిక పరిరక్షణ కోసం, రాజ్యాధికారం కోసం స్త్రీలు చేస్తున్న పోరాటంలో లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి నడవాలి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### తెరిపి!



బీరూట్ (లెబనాన్) నుండి శుభోదయం. ఎడతెగని ఇజ్రాయెలీ డ్రోన్ల శబ్దం ఇక్కడ ఆగిపోయింది. పక్షుల కిలకిలారావాలను ఇక మేము వినొచ్చు.

– నాదా హోమ్సి, జర్నలిస్ట్

### ఒక వ్యామోహం



'ఒక దేశం – ఒక ప్రతొక్కటీ' అనే ఈ వ్యామోహం ఈ దేశం నిర్మితమైన బహుళత్వ విలువలకు పూర్తి వ్యతిరేకం. కానీ బీజేపీ నుండి అంతకంటే ఏమి ఆశించగలం?

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

### ఇజ్రాయెల్ ఉచ్చు



నెతన్యాహూ ఉచ్చు చాలామందికి అర్థం కాలేదనుకుంటాను. ఇప్పటికే నాశనమైన లెబనాన్ దక్షిణ ప్రాంతం నుండి వైదొలగడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. ఫ్రాన్స్ మద్దతు ఉన్న లెబనీస్ సైన్యం గనక హిజ్బుల్లా చొరబాట్లను ఇప్పుడు ఆపడంలో విఫలమైతే, కనీసం ట్రంప్ ముందు ఇజ్రాయెల్ శాంతికి ప్రయత్నించినట్టుగా కనబడుతుంది; మెక్రాన్, లెబనీస్ అధికారులు దాన్ని నిరాశపరిచినట్టు అవుతుంది.

– నెర్వాణా మహమూద్, వ్యాఖ్యాత

### భారత ఖండం



భౌగోళికంగా యూరప్ అనే ఖండం లేదు. ఇది శాస్త్రీయంగా కన్నా, కేవలం వ్యావహారికంలోనే ఖండం అవుతోంది. కానీ భారత దేశం భిన్నమైన టెక్టోనిక్ ప్లేట్‌లో భాగం. శాస్త్రీయంగా చెప్పాలంటే, యూరప్ కంటే భారతదేశం సరైన ఖండం అవుతుంది.

– అభిజిత్ అయ్యర్ మిత్ర, వ్యాఖ్యాత

### సంక్షోభంలో పాక్



కనీసం పర్వేజ్ ముషారఫ్ (2007–08) పతనం తర్వాత, ఇంకా చెప్పాలంటే జుల్ఫికర్ భుట్టో కాలం (1976–77) తర్వాత, అంతటి అత్యంత తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని పాకిస్తాన్ ఎదుర్కొంటోంది. ఇప్పటికే చాలామంది చనిపోయారు. క్షేత్ర స్థాయి నివేదికలు ఇంకా (రానున్న) దారుణాలను సూచిస్తున్నాయి.

– క్రిస్టఫర్ క్లారీ, రచయిత

### అందరి బాధ్యత



శాంతి ప్రేమికుడైన చిన్మయ్ కృష్ణ దాస్ (హిందూ సాధువు)ను బంగ్లాదేశ్‌లో అన్యాయంగా అరెస్టు చేశారు. ఈ అన్యాయాన్ని నిరసించడం కేవలం హిందూ సమాజపు బాధ్యత మాత్రమే కాదు – ఇది ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులు, ఆస్తికులు, నాస్తికులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి బాధ్యత.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### ఇది చాలదా?



భారత్ ప్రతి సంవత్సరం 2 బిలియన్ డాలర్ల ముడి పత్తిని బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తుంది. అక్కడి మొత్తం వస్త్ర పరిశ్రమ భారత్ నుండి దిగుమతి చేసుకున్న ముడి పత్తిపై ఆధారపడి ఉంది. అదనంగా మరో 1 బిలియన్ డాలర్ల శుద్ధి చేసిన పెట్రోలియం పంపుతున్నాం. అక్కడి హిందువుల మీద హింస జరగకుండా ఈ పరపతి సరిపోదా?

– జాకా జాకబ్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

## సాంఘిక విప్లవ జ్యోతి

భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయన మహారాష్ట్ర పుణేలో 1827 ఏప్రిల్ 11న అట్టడుగు వర్గంలో జన్మించే నాటికి మను ధర్మం నాలుగు పాదాలా నడుస్తోంది. కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న అస్పృశ్యుల లాగే, సమాజంలో పురుషులకు సమానంగా ఏమాత్రం అవకాశాలు పంచుకునే పరిస్థితి స్త్రీలకు లేదు. ముఖ్యంగా బాలికలు పాఠశాలకు వెళ్లి చదువుకోవడం తప్పుగా భావించేవారు. అటువంటి పరిస్థితులను మార్చాలని పూలే నడుం బిగించారు.

మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించడాన్ని నాటి మనువాద సమాజం జీర్ణించుకోలేకపోయింది. పూలే తండ్రికి ఊళ్లోని వారందరూ ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో... సొంత తండ్రి అప్పటికే పెళ్లయిన పూలేను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. స్త్రీ విద్యను ముందు తన ఇంటి నుంచే ప్రారంభించారు పూలే. నిరక్షరాస్యురాలైన తన భార్య సావిత్రీ బాయికి తానే చదువు నేర్పి ఆమెను ఒక ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు.



జ్యోతిరావు పూలే

మతం ద్వారా తాము ఎంత మోసానికి గురౌతున్నారో బడుగు వర్గాలకు తెలియ చెప్పటానికి 'తృతీయరత్న' వంటి నాటకాలూ, పెక్కు కవితలూ రాశారు. ఆయన రాసిన 'గులాంగిరి' వంటి గ్రంథాలు సమకాలీన సమాజపు పోకడలకు అద్దం పట్టాయి. ఎందరికో దిశా నిర్దేశం చేశాయి. వితంతువులకు, అనాథ మహిళలు, శిశువులకు శరణాలయాలు స్థాపించారు పూలే దంపతులు. బడుగువర్గాల విజ్ఞాన వికాసాల కోసం 'సత్య శోధక్ సమాజ్' వంటి సంస్థలు స్థాపించారు. కార్మిక ఉద్యమ పితామహుడయిన 'లోఖండే' ఆయనకు ప్రధాన అనుచరుడు. కార్మికులకే కాక కర్షకుల ఉన్నతికి కూడా ఎన్నో రచనలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని వారి సమస్యల వైపునకు మళ్లించడంలో పూలే విజయం సాధించారు. పూలేను బాబా సాహెబ్ అంబేడ్కర్ ఒక ఆదర్శమూర్తిగా, గురువుగా పేర్కొని గౌరవించేవారు. నేటి యువత, విద్యార్థులు పూలే జీవిత చరిత్రను తెలుసుకోవాలి.

– స్టాలిన్, కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఎస్.ఎఫ్.ఐ. అధ్యక్షుడు

(నేడు జ్యోతిబా పూలే వర్ధంతి)

# నీటిలో తేలియాడే రాజధానా?

వెనుకబడిన ప్రాంతాల ఆకాంక్షలు నెరవేరినప్పుడే సమగ్ర అభివృద్ధి జరిగి నట్లు. అలా కాకుంటే ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగిపోతాయి. అంటే పేదరికం, నిరుద్యోగం ప్రబలడం, పెత్తందారులు, బలవంతులు పేట్రేగిపోవడంజరుగుతుంది. దాని ఫలితంగా తీవ్రవాదం వైపు పీడితులు ఆకర్షితులు అవుతారు.

అత్యంత వెనుకబడిన 1.59 కోట్ల జనాభా కలిగిన రాయలసీమకు హైకోర్టు బెంచ్ ఇచ్చి సమానాభివృద్ధి సాధించామని శాసనసభలో చెప్పడం సరికాదు. విభజన చట్టంలో పొందుపరచిన ఎయిమ్స్, రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ, హార్టికల్చర్ హబ్, హైకోర్టు, లా యూనివర్సిటీ, లా అకాడమీ, కియా లాంటి పరిశ్రమల ఏర్పాటుతో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడం వల్లనే రాయలసీమ అభివృద్ధి చెందుతుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం తదితర చర్యల ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికీ కృషి చేయాలి.

అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఉమ్మడి సంపదను అన్ని ప్రాంతాలవారికీ సమానంగా పంచడం. అది భిక్ష కాదు. అభివృద్ధి ఫలాలు పొందడం ప్రతి పౌరుని హక్కు. ఇప్పటికే ఏడాదికి మూడు పంటలు పండుతూ అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన అమరావతి నిర్మాణానికి ఐదేళ్లలో 50 వేల కోట్లు ఖర్చు పెట్ట పూనుకోవడం ఏ పాటి వికేంద్రీకరణో, ఎటువంటి న్యాయమో పాలకులే చెప్పాలి.

అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని మేధావులు చెప్పినా వినకుండా ఒక వర్గం, కేవలం 29 గ్రామాల ప్రాంత ప్రయోజనాల కోసమే లక్ష కోట్లు ఖర్చు పెడతామని టీడీపీ ప్రభుత్వం అనడం సమంజసమేనా? 2014 నుండి 2019 వరకు 5,000 కోట్లు తాత్కాలిక నిర్మాణాల కోసం చేసిన ఖర్చు నీటిపాలు అయ్యింది. నేడు మరలా రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ల నుంచి 15 వేల కోట్లు, హడ్కో నుంచి 12 వేల



కోట్లు, ఇతర సంస్థల నుండి రుణాలు, బాండ్ల ద్వారా 23 వేల కోట్లు... మొత్తం 50 వేల కోట్లు అప్పులు చేసి, ఐదేళ్లలో ఖర్చు పెట్టాలని ప్రభుత్వం పూనుకుంది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు అనగా ఐదు నెలల కాలంలోనే మూడు వేల కోట్లు ఖర్చు పెట్టడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం ష్యూరిటీతో ఏడీబీ ద్వారా తీసుకుంటున్న 15 వేల కోట్ల రూపాయలలో కేవలం అమరావతి రక్షణ చర్యలకే... అంటే కొండవీటి వాగు, బుడమేరు వంక నీటి మళ్లింపు కాలువలు; కృష్ణా నది కరకట్ట, వివిధ రిజర్వాయర్ల నిర్మాణం, డైవర్షన్, డ్రైనేజీ కెనాల్స్, లిఫ్ట్ స్కీములకే రూ. 8000 కోట్లు ఖర్చు చేయాలని... అప్పు ఇచ్చే ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు నిర్మాణ ప్రాంతాన్ని పడవలలో ప్రయాణం చేసి తనిఖీ చేసిన తర్వాత నిర్ణయించడాన్ని బట్టి అది 'నేల మీద నిర్మించే రాజధాని కాదు, నీటి మీద నిర్మించే తేలియాడే (ఫ్లోటింగ్) రాజధాని' అని అర్థమయిపోతుంది. రాష్ట్రంలో సువిశాలమైన భూములు ఉండి కూడా తేలియాడే రాజధాని నగరాన్ని నిర్మించడం వెర్రితనం.

కాబట్టి టెక్నాలజీకి మేమే ఆదిగురువులమని చెప్పుకునే కూటమి నాయకులు శాస్త్రీయ పద్ధతులలో ఆలోచన చేసి అమరావతిలో శాసనసభ, సచివాలయం నిర్మాణాలకు పరిమితమైతే కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా అవుతుంది. రాష్ట్రంలో ఉండే విశాఖపట్నం, తిరుపతి, కర్నూల్, అనంతపురం, విజయవాడ, గుంటూరు లాంటి నగరాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్ది, ఆదాయ వనరులుగా మార్చుకోవాలి. అప్పుడే సంపద సృష్టికి వీలుంటుంది. లేకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న 2047 విజన్ సాకారం కాక పోగా, రాష్ట్రం అప్పులపాలై తాకట్టు పెట్టే పరిస్థితులు తప్పవు, తస్మాత్ జాగ్రత్త!

– కె.వి. రమణ । అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు

# జన్మను సార్థకం చేసుకోవాలి

దేవుని సులభంగా అర్థం చేసుకోవచ్చు కాని మనిషి అంతరంగాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. భగవంతుడు నిర్మల, నిష్కపట, పరిపూర్ణానందుడు. ఇందుకు భిన్నంగా మానవుడు సాధారణంగా అత్యంత క్లిష్టంగా.... స్వార్థం, ఈర్ష్యాద్వేషాలతో నిండి ఉంటాడు. మానవ జన్మ ఉన్నత లక్ష్యసాధనకే... అంటే భగవంతునిలో ఐక్యం చెందటానికే వచ్చింది. కాని, అయ్యో! మానవుడు తన జన్మకు కారణం ఏమిటో (మానవ జన్మ ఎందుకు వచ్చినదో) మరచిపోయి కామ, కర్మ, అవిద్య అనే చక్రంలో చిక్కుకున్నాడు. స్వార్థబుద్ధిని పోనీయక, సొంతలాభం కోసం ఇతరులకు నష్టం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అలాంటివారికి ఎన్నటికీ విమోచనం ఉండదు. మన పురాణాలు, శాస్త్రాల్లో వివరించినట్లుగా, ఏ మానవుడు స్వార్థ పరిధులను దాటి ఇతరుల గూర్చి ఆలోచించడో, అటువంటి వ్యక్తికి మోక్షం లభించే అవకాశమే లేదు. కాబట్టి ఇకనైనా మనం ఆత్మ వివేక మార్గంలో నడచి, భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చిన ఈ జన్మను సార్థకం చేసుకోవాలి!

ఇతరుల దోషాలనూ, తన చుట్టూ గల వాతావరణంలోని లోపాలనూ ఎంచటం మనిషికి గల సాధారణ లక్షణం. ఈ విధంగా తప్పులను ఎంచటం వలన ఏ ప్రయోజనమూ లేదు. వాస్తవంగా ఈ లక్షణం మనిషి మానసిక ప్రశాంతతను భంగపరుస్తుంది. ఫలితంగా సమతాస్థితిని పొందలేడు. అన్ని విషయాలూ మానసిక పరిస్థితి పైనే ఆధారపడి ఉంటాయి. మన మనస్సు నిజాయితీగా, నిర్మలంగా ఉంటే ప్రతి ఒక్కటీ నిజాయితీతోనూ, నిర్మలంగానూ ఉన్నట్లు కనబడుతుంది. ఇందుకు భిన్నంగా, మన మనస్సు కల్మషంతో నిండితే, బాహ్య ప్రపంచం అసహ్యాన్నీ, కలవరపాటునూ కలిగిస్తుంది.

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించదలచిన భక్తుడు చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి. ఆ విధంగా ఉన్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక జీవితం సాధ్యమవుతుంది.


మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899




## రైతులకోసం డిజిటల్ మార్కెట్

దేశంలోని వ్యవసాయ ఉత్పత్తుల ఆన్‌లైన్ డిజిటల్ హోల్‌సేస్ ప్లాట్‌ఫాం... ఎల్రక్టానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఇ-నామ్). ఆయా రాష్ట్రాల్లోని మార్కెట్లను (మండీ) ఇ-నామ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులకు ఆన్‌లైన్ ట్రేడింగ్ సులభతరమైంది. 2016లో ఈ వ్యవస్థ ప్రారంభమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,400కుపైగా మార్కెట్లు ఉన్నాయి. 2020–21లో 31,366 కోట్ల టర్నోవర్ ఉంటే... 2023–24లో అది రూ.78,424 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్–అక్టోబరు మధ్యకాలంలో రూ.39,127 కోట్ల అమ్మకాలు జరిగాయి. వివిధ రాష్ట్రాల్లో ఇ-నామ్‌కు అనుసంధానమైన మార్కెట్ల సంఖ్య...




ఆధారం : కేంద్ర వ్యవసాయ శాఖ

## క్లుప్తంగా...

### టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఇంజినీర్ల కమిటీ

సాక్షి, అమరావతి: పట్టణ పేదలకు నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల పురోగతిపై అధ్యయనం చేసి, చేపట్టాల్సిన చర్యలపై సూచనలిచ్చేందుకు ప్రభుత్వ చీఫ్ ఇంజినీర్లతో సాంకేతిక కమిటీని నియమించింది. ఈ మేరకు బుధవారం మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ చైర్మన్‌గానూ, ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీర్ కన్వీనర్‌గానూ, ఏపీసీఆర్డీఏ గ్రూప్ డైరెక్టర్, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్ (భవనాలు), ఏపీయూఎఫ్ఐడీసీ చీఫ్ ఇంజినీర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి ఒక ప్రతినిధి మొత్తం ఆరుగురు ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు.

### సీఆర్డీఏ పనులపై టెక్నికల్ కమిటీ సూచనలకు ఆమోదం

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలో నిలిచిపోయిన అమరావతి కేపిటల్ సిటీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీ నివేదికపై ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు బుధవారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో గతంలో నిలిచిపోయిన పనులు కొనసాగించాలా.. లేక ఏమైనా మార్పులు చేయాలా అనే అంశాలను పరిశీలించాల్సిందిగా వివిధ ప్రభుత్వ శాఖల చీఫ్ ఇంజినీర్లతో కమిటీని నియమించింది. ఈ కమిటీ సెప్టెంబర్ 17న నివేదిక సమర్పించింది.

### సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలి

**అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం**



సాక్షి, అమరావతి : వచ్చే నెల 8న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావులతో కలిసి సీఈలు, ఎస్‌ఈలతో ఆయన సమీక్ష నిర్వహించారు.

### మత్తు చిత్తుకు 'ఈగల్'

**హోమ్ మంత్రి అనిత**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసే యాంటి నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌కు ఈగల్ అనే పేరును ఖరారు చేసినట్లు హోమ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972ను ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలోనే ఆవిష్కరిస్తారన్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం నిర్వహించిన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గంజాయి సాగు, సరఫరాపై ఉక్కుపాదం మోపేందుకు ప్రతి జిల్లాలో నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

# పోలవరం ఇక బ్యారేజ్!

## 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వ.. తేల్చి చెప్పిన కేంద్రం

### అటు కేంద్రం.. ఇటు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాల నిర్వాకం బట్టబయలు

**అనుకున్నంతా అయ్యింది.. ఏది జరగకూడదని ఇన్నాళ్లూ అనుకున్నామో అదే జరిగింది.. పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిస్తున్నారంటే.. అబ్బే కాదు కాదని బుకాయించిన చంద్రబాబు సర్కారు ఇప్పుడు ఏం సమాధానం చెబుతుంది? ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగిందని స్పష్టమవుతోంది. నాడు-నేడు చంద్రబాబు తీరే ఈ ప్రాజెక్టుకు శాపంగా పరిణమించిందని తేటతెల్లమవుతోంది. భారీ బహుళార్థ సాధక ప్రాజెక్టు కాస్తా బ్యారేజ్‌గా మారిపోనుందన్న నిజాన్ని నీటి పారుదల రంగ నిపుణులు, రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.**



సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ 41.15 మీటర్ల ఎత్తుకే పరిమితమని కేంద్రం తేల్చి చెప్పింది. ఆ మేరకు నీరు నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు ఆమోదం తెలిపామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు మేరకు పోలవరం ప్రాజెక్టును గరిష్ట నీటి మట్టం 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్నామని.. ఎత్తును తగ్గించలేదని చెప్పారు. కానీ.. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తద్వారా అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు పోలవరం రిజర్వాయర్‌ను బ్యారేజ్‌గా మార్చేశాయని నీటి పారుదల రంగ నిపుణులు, అధికార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీని వల్ల పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల పథకాల కింద నీళ్లందిస్తున్న 1.53 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడానికి మాత్రమే పోలవరం బహుళార్థ సాధక జాతీయ ప్రాజెక్టు అక్కరకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ఆయకట్టుకు కూడా గోదావరికి వరద వచ్చే రోజుల్లో మాత్రమే నీళ్లందించడానికి సాధ్యమవుతుందని చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు కింద మిగతా 5.67 ఎకరాలతోపాటు కృష్ణా డెల్టాలో 13.06 లక్షలు, గోదావరి డెల్టాలో 10.50 లక్షల ఎకరాల స్థిరీకరణ.. 540 గ్రామాల్లోని 28.50 లక్షల మందికి తాగునీళ్లు అందించడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. విశాఖ పట్నం పారిశ్రామిక, తాగునీటి అవసరాలకు 23.44 టీఎంసీలు అందించడం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద 8 లక్షల ఎకరాలకు నీళ్లందించడం అసాధ్యమని తేల్చి చెబుతున్నారు. ఇక ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మిస్తున్న 960 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి వీలుండదని.. గోదావరి సిగలో కలికితురాయిగా వెలుగులీనాల్సిన ఆ కేంద్రం ఒట్టి దిష్టిబొమ్మగా మారుతుందని విద్యుత్ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నోరు మెదపని టీడీపీ కేంద్ర మంత్రి

పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయడానికి నిధులు మంజూరు చేయాలని.. తొలి దశలో కనీస నీటి మట్టం 41.15 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయడానికి నిధులు విడుదల చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 27న పీఐబీ (పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు) కేంద్రానికి ప్రతిపాదించింది. 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే 1.53 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీళ్లందించవచ్చని, 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తేనే ప్రాజెక్టు కింద 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతో పాటు గోదావరి, కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించడం, విశాఖకు నీటి సరఫరా చేయొచ్చని ఆ ప్రతిపాదనలో పీఐబీ స్పష్టం చేసింది. అయితే అప్పటికే ఎన్‌డీఏలో చేరిన చంద్రబాబు.. ఆ ప్రతిపాదనపై ఆమోద ముద్ర వేస్తే వైఎస్సార్‌సీపీకి ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ పెద్దల చెవిలో వేశారు. దాంతో అప్పట్లో పీఐబీ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది. కానీ.. ఆగస్టు 28న పీఐబీ ప్రతిపాదించిన దానికి భిన్నంగా.. 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వను పరిమితం చేస్తూ పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందుకు కేంద్ర ఆర్థిక శాఖ పంపింది. ఈ ప్రతిపాదనపై ఆ సమావేశంలో ఉన్న టీడీపీకి చెందిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అభ్యంతరం చెప్పలేదు. అంటే.. అటు కేంద్రంతోపాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేయడానికి అంగీకరించాయన్నది స్పష్టమవుతోంది.

### నాడూ.. నేడూ పోలవరానికి 'చంద్ర' ద్రోహం

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును అప్పట్లో ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో నిర్మాణ బాధ్యతలను తీసుకున్నారు. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారం తాగునీటి విభాగం, జల విద్యుత్ విభాగానికి అయ్యే వ్యయం కాకుండా కేవలం నీటి పారుదల విభాగానికి అయ్యే వ్యయం రూ.20,398.61 కోట్లు ఇస్తే చాలని చెప్పారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం సంగతి గాలికొదిలేశారు. కమీషన్లు వచ్చే మట్టి పనులనే 2016–19 మధ్య చేపట్టి, ఆ ప్రాజెక్టులో విధ్వంసం సృష్టించారు. తద్వారా డయా ఫ్రం వాల్ దెబ్బ తిన డానికి, ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం కోతకు గురవ్వడానికి వరద మళ్లింపు పనులు పూర్తి చేయక పోవడమేనని అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఇటీవల తేల్చి చెప్పింది. అప్పట్లో విధ్వంసం సృష్టించి.. ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి.. పోలవరానికి ద్రోహం చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు కూడా అదే బాటలో పయనిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### జీవనాడిగా మార్చిన వైఎస్ జగన్

- రాష్ట్రంలో 2019 మే 30న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ గాడిలో పెట్టారు. జీవచ్ఛవాన్ని జీవనాడిగా మార్చారు. రెండేళ్లు కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ 48 గేట్లతో సహా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్, ఎగువ కాఫర్ డ్యాంను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించారు.
- చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్ల కోతకు గురైన దిగువ కాఫర్ డ్యాంను సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) మార్గదర్శకాల మేరకు పూర్తి చేశారు. కుడి, ఎడమ కాలువలను అనుసంధానం చేసే సొరంగాలు, ప్రధాన డ్యాం గ్యాప్-3లో కాంక్రీట్ డ్యాం, గ్యాప్-1లో డయాఫ్రం వాల్ వేశారు. గ్యాప్-2లో దెబ్బ తిన్న డయాఫ్రం వాల్ భవితవ్యం తేల్చితే ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తామని కేంద్రాన్ని కోరుతూ వచ్చారు.
- ప్రాజెక్టుకు తాజా ధరల మేరకు నిధులు ఇచ్చి సత్వరమే పూర్తి చేయడానికి సహకరించాలని ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక, జల్ శక్తి శాఖ మంత్రులకు విజ్ఞప్తులు చేస్తూ వచ్చారు. తాగు నీటి విభాగం, నీటి పారుదల విభాగం వేర్వేరు కాదని.. రెండు ఒకటేనని, అందుకయ్యే వ్యయాన్ని కూడా ఇవ్వాలని కోరారు. ఇందుకు ప్రధాని మోదీ అంగీకరించారు. రెండు దశల్లో ప్రాజెక్టును పూర్తి చేద్దామని.. తొలి దశలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.12,911 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తూ గతేదాది జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నోట్ జారీ చేశారు.

### రెండు దశల్లో పోలవరం.. ప్రతిపాదించింది కేంద్రమే

- నీటి పారుదల, తాగు నీటి విభాగాలు వేర్వేరు కాదని, రెండూ ఒకటేనని, తాగునీటి విభాగానికి అయ్యే రూ.4,068 కోట్లను ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ.. ఆ ప్రతిపాదనను కేంద్ర జల్ శక్తి శాఖకు పంపారు. ఈ అంశంపై 2021 జూలై 29న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదనతో సీడబ్ల్యూసీ నాటి చైర్మన్ హెచ్‌కే హల్దర్ ఏకీభవించారు.
- ఆ సమావేశంలో 1986 మార్చి 13న సీడబ్ల్యూసీ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు.. ప్రాజెక్టు పూర్తయిన తొలి ఏడాది కనీస నీటి మట్టం స్థాయిలో నీటిని నిల్వ చేయాలని.. ఆ తర్వాత దశల వారీగా ప్రాజెక్టులో గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయాలని హల్దర్ సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా పోలవరంలో 35.44, 35.50, 41.15, 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఏం ప్రయోజనాలు కలుగుతాయో తెలపాలంటూ పీపీఏ సీఈఓకు కేంద్ర జల్ శక్తి శాఖ అప్పటి సీనియర్ జాయింట్ కమిషనర్ అనూప్ కుమార్ శ్రీవాత్సవ 2021 అక్టోబర్ 27న లేఖ రాశారు. ఇదే లేఖను ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిన పీపీఏ.. ఆ వివరాలు ఇవ్వాలని కోరింది.
- 35.44, 35.50 మీటర్లలో నీటిని నిల్వ చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని.. కనీస నీటి మట్టం 41.15 మీటర్లలో నిల్వ చేస్తే పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల కింద ఉన్న 1.53 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చని.. 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తేనే ప్రాజెక్టు కింద 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతోపాటు గోదావరి, కృష్ణా డెల్టాల ఆయకట్టును స్థిరీకరించడం, 28.50 లక్షల మందికి తాగు నీరు, విశాఖకు 23.44 టీఎంసీలు సరఫరా చేయవచ్చునని వివరించారు.
- ఇదే వివరాలను కేంద్ర జల్ శక్తి కార్యదర్శికి వివరిస్తూ 2021 నవంబర్ 20న పీపీఏ అప్పటి సభ్య కార్యదర్శి ఎంకే శ్రీనివాస్ లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగానే పోలవరాన్ని రెండు దశల్లో.. తొలి దశలో 41.15 మీటర్లలో 115.44 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా, రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తులో 194.6 టీఎంసీలను నిల్వ చేసేలా పనులు చేపట్టడానికి నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది.
- పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయాలంటే భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.23,622.35 కోట్లు అవసరం. పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేయడం ద్వారా ఆ నిధులు మిగుల్చుకోవచ్చన్నది కేంద్రం ఆలోచన. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు ప్రభావం ఉంటుందంటూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీంతో ఆ సమస్య నుంచి తప్పించుకోవచ్చనే కేంద్రం ఇలా చేసిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సెకీతో ఒప్పందాల్లో ఎలాంటి అవినీతి లేదు

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి**



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెకీ తో వైఎస్ జగన్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఎలాంటి అవినీతి లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇదే సెకీతో గత చంద్రబాబు ప్రభుత్వమే అధిక ధరకు విద్యుత్ ఒప్పందాలు చేసుకుందని, దానివల్ల రాష్ట్ర ప్రజలపై భారీగా భారం పడిందని చెప్పారు. శివశంకర్‌రెడ్డి బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 2016లో చంద్రబాబు ప్రభుత్వం యూనిట్ రూ.4.50కి కొనేలా సెకీతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. దీంతో సహా యూనిట్ విద్యుత్ రూ.4.99 నుంచి రూ.5.99 వరకు కొనేలా మొత్తం 36 ఒప్పందాలు చేసుకున్నారని చెప్పారు. వాటివల్ల ప్రజలపై దాదాపు రూ.1.13 లక్షల కోట్ల భారం పడిందని వివరించారు. ప్రజా శ్రేయస్సును కాంక్షించిన వైఎస్ జగన్ ప్రభుత్వం యూనిట్ విద్యుత్ రూ.2.49కే కొనేలా 2021లో సెకీతోనే ఒప్పందం చేసుకుందని చెప్పారు. పూర్తి పారదర్శకంగా, ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు కూడా లేకుండా ఒప్పందాన్ని చేసుకుందని తెలిపారు. దీనివల్ల ఏటా రూ.3,700 కోట్లు చొప్పున 25 ఏళ్లలో దాదాపు లక్ష కోట్లు ఆదా అవుతాయని తెలిపారు. ఎక్కువ రేటుకు కొన్న చంద్రబాబే తక్కువ రేటుకు విద్యుత్ కొన్న వైఎస్ జగన్‌పై బురద చల్లే ప్రయత్నం చేయడం నీచ రాజకీయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆదానీ కంపెనీతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతోనే ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. తాజాగా రాయలసీమలోని థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఫ్లై యాష్ ద్వారా డబ్బు దండుకోవడానికి కూటమి ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు రోడ్డున పడి కొట్టుకుంటున్నారని చెప్పారు.

## కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు

- రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయం
- అంచనా వ్యయం రూ.కోటి కంటే ఎక్కువ ఉంటే 10 శాతం అడ్వాన్స్
- మొబిలైజేషన్ అడ్వాన్స్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 2014–19 తరహాలోనే మళ్లీ దోపిడీకి తెర తీశారంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: ఏ పనికైనా అంచనా వ్యయం రూ.కోటి కంటే ఎక్కువ ఉంటే సంబంధిత కాంట్రాక్టర్‌కు 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్స్ చెల్లించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ను రద్దు చేస్తూ 2019 డిసెంబర్ 17న జారీ చేసిన ఉత్తర్వుల(జీవో 83)ను రద్దు చేసింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు (జీవో 57) జారీ చేశారు. 2014–19 తరహాలోనే అయిన వారికి, అధిక ధరలకు పనులను కట్టబెట్టి మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను ముట్టజెప్పి.. వాటిని కమీషన్లుగా వసూలు చేసుకుని ఖజానాను దోచేసేందుకు ప్రభుత్వ పెద్దలు మళ్లీ తెర తీశారని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం టెండర్ వ్యవస్థను నీరుగార్చి.. ముందే ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు అంచనా వ్యయం కంటే అధిక ధరలకు పనులు కట్టబెట్టేవారు. వారికి మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ముట్టజెప్పి.. వాటినే కమీషన్లుగా వసూలు చేసుకుందని ఇంజినీరింగ్ నిపుణులు అప్పట్లో ఆరోపించారు. అంచనా విలువ కంటే అధిక ధరలకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.20 వేల కోట్లకుపైగా భారం పడిందని అప్పట్లో లెక్కలు వేశారు. ఈ నేపథ్యంలో 2019 మే 30న అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టెండర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసింది. రూ.వంద కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అంచనా వ్యయం ఉన్న పనుల టెండర్ షెడ్యూల్‌ను జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపి ఆమోదం తీసుకున్న తర్వాతే టెండర్లు పిలవాలని ఉత్తర్వులు జారీ చేసింది. రూ.కోటి అంతకంటే ఎక్కువ అంచనా వ్యయం ఉన్న పనులకు రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్లు పిలవాలని నిర్దేశించింది. కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇవ్వాలన్న నిబంధనను రద్దు చేసింది. 2019 ఆగస్టు నుంచి 2024 ఫిబ్రవరి వరకూ నిర్వహించిన టెండర్లలో అంచనా వ్యయం కంటే తక్కువ ధరకే పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. రివర్స్ టెండరింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.7,500 కోట్లకుపైగా ఆదా అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ విధానాన్ని ఇప్పటికే రద్దు చేసింది. తాజాగా కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చేందుకు ఆమోదం తెలపడం గమనార్హం.

## దూసుకొస్తున్న 'ఫెంగల్'

### తుపానుగా బలపడిన తీవ్ర వాయుగుండం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం :ఫెంగల్ తుపాను దూసుకొస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ఉత్తర వాయవ్య దిశగా గంటకు 12 కి.మీ వేగంతో కదులుతూ ట్రింకోమలీకి తూర్పుగా 110 కిలోమీటర్లు, నాగపట్నానికి ఆగ్నేయంగా 350 కి.మీ., పుదుచ్చేరికి ఆగ్నేయంగా 450 కి.మీ., చెన్నైకి ఆగ్నేయంగా 500 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమైందని వాతావరణ శాఖ, విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపాయి. ఇది బుధవారం సా.5.30కు తుపానుగా బలపడింది. అనంతరం.. శ్రీలంక తీరాన్ని దాటి తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశముంది. 30న దక్షిణ తమిళనాడు, శ్రీలంక మధ్యలో తీరం దాటే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారనున్నట్లు వెల్లడించాయి. దీని ప్రభావం ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోనూ, రాయలసీమలోని తిరుపతి జిల్లాలోనూ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అలాగే, కోస్తాంధ్రలో అక్కడక్కడ గురు, శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు విస్తారంగా పడతాయన్నారు. ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని.. అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. మత్స్యకారులెవరూ డిసెంబరు 3 వరకూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. ఇక తుపాను కారణంగా విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక.. కాకినాడ, గంగవరం పోర్టుల్లో సిగ్నల్-4తో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మరోవైపు.. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 9491077356 (చిత్తూరు).. నెల్లూరు ప్రజలు 0861–2331261 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలి. అధికారులకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు రద్దుచేశారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి..

ఫెంగల్ తుపాను దూసుకొస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. భారీ వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంట పొలాల్లో నిలిచే అదనపు నీరు వీలైనంత త్వరగా బయటకుపోయేలా రైతులు ఏర్పాట్లుచేసుకోవాలి. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలి.

– రోణంకి కూర్మనాథ్, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ

## చంద్రబాబుపై కేసుల్లో కౌంటర్ వేయండి

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

సాక్షి, అమరావతి: చంద్రబాబు సీఎంగా ఉన్న 2014–19 మధ్య కాలంలో జరిగిన కుంభకోణాలపై నమోదైన కేసులకు సంబంధించిన కేసు డైరీ (సీడీ)లను, చార్జిషీట్లను హైకోర్టు ముందుంచేలా సీఐడీ అధికారులను ఆదేశించాలని కోరుతూ సీనియర్ పాత్రికేయుడు కొట్టి బాలగంగాధర్‌తిలక్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ అనుబంధ పిటిషన్‌లో కూడా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే చంద్రబాబు తదితరులపై దాఖలైన కేసులన్నింటిలో దర్యాప్తు బాధ్యతలను సీబీఐ, ఈడీలకు అప్పగించాలంటూ దాఖలు చేసిన ప్రధాన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత గడువునిచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రత్యేక హోదా హామీ మౌఖికమే

**హైకోర్టుకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం**

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదానిచ్చే విషయంలో ఎలాంటి రాతపూర్వక హామీ ఇవ్వలేదని కేంద్రం హైకోర్టుకు బుధవారం నివేదించింది. దీంతో హైకోర్టు సైతం ప్రత్యేక హోదా వ్యవహారంలో తామెలా జోక్యం చేసుకుంటామని ప్రశ్నించింది. ప్రత్యేక హోదా అంశం పూర్తిగా ప్రభుత్వాల పరిధిలోని వ్యవహారమని తేల్చి చెప్పింది. పాలనాపరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో ప్రభుత్వాలకు సంబంధించిన పని అని, అందులో తాము జోక్యం చేసుకుని అలా చేయండి.. ఇలా చేయండని చెప్పలేమంది. అసలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఎవరు నష్టపోతారు, ఎలా నష్టపోతారో తమకు సవివరంగా తెలియచేయాలని పిటిషనర్ కేఏ పాల్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

# అక్కడ ఏడాదికి 21 గంటలే

అనగనగా అదో గ్రహం. నెప్ట్యూన్ సైజులో ఉంటుంది. దానిపై ఒక ఏడాదిలో కేవలం 21 గంటలే ఉంటాయి! అది మాతృ నక్షత్రానికి అతి సమీపంగా ఉండటమే ఇందుకు కారణమట. దాంతో నక్షత్రం చుట్టూ ఆ గ్రహం పరిభ్రమణం కేవలం 21 గంటల్లో పూర్తయిపోతోందని సైంటిస్టులు కనిపెట్టారు. టీఓఐ–3261గా పిలిచే ఈ గ్రహం, దాని తాలూకు నక్షత్రమండలం వయసు 650 కోట్ల ఏళ్లని అంచనా. తొలుత బృహస్పతి పరిమాణంలో ఉన్న ఈ గ్రహం నిరంతరం ద్రవ్యరాశిని కోల్పోతూ చిన్నదవుతోందని సైంటిస్టులు చెబుతున్నారు. దాని మాతృనక్షత్రపు ఆకర్షణ శక్తే ఇందుకు ప్రధాన కారణమని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పరిమాణంలో నెప్ట్యూన్‌కు సమానంగా ఉన్నా ద్రవ్యరాశి మాత్రం దానితో పోలిస్తే రెట్టింపుగా ఉందట! టీఓఐ–3261 ఉనికి గ్రహాల ఆవిర్భావానికి సంబంధించిన ప్రస్తుత సిద్ధాంతాలన్నింటినీ సవాలు చేస్తుండటం విశేషం. ఎందుకంటే మాతృ నక్షత్రానికి అంత దగ్గరగా ఉండే గ్రహాలపై దట్టమైన వాయువులతో కూడిన వాతావరణం నిలిచి ఉండటం దాదాపుగా అసాధ్యమన్నది శాస్త్ర ప్రపంచంలో ఇప్పటిదాకా ఉన్న భావన. దాంతో గ్రహాల పుట్టుకకు సంబంధించి మనకు తెలియని కొత్త కోణాలకు టీఓఐ–3261 దారి చూపుతుందని భావిస్తున్నారు. అందుకే దానిపై వాతావరణాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాలూకు పరారుణ కాంతి టెక్నాలజీ సాయంతో లోతుగా పరిశోధించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త ఎమ్మా నబ్బీ ఆధ్వర్యంలోని సైంటిస్టుల బృందం అధ్యయనంలో వెల్లడైన ఈ విశేషాలను ఆస్ట్రానామికల్ జర్నల్‌లో ప్రచురించారు. - సాక్షి, నేషనల్ డెస్క్





## వెలుగు స్తంభాలు

నేల నుంచి నింగికి వేసిన కాంతి నిచ్చెనల్లా ఉన్నాయి కదూ! పశ్చిమ కెనడాలో మైనస్ 30 డిగ్రీల చలితో వణికిపోతున్న ఆల్బర్టా ప్రాంతంలో దర్శనమిస్తున్న ఈ నిట్టనిలువు వెలుతురు స్తంభాల సోయగాలు చూపరుల మనసు దోస్తున్నాయి. ఇవి ఏర్పడాలంటే పర్యావరణపరంగా పలు అంశాలు కలిసి రావాల్సి ఉంటుంది. -10 నుంచి -40 డిగ్రీల మధ్యలో వాతావరణం అతి శీతలంగా, హెచ్చు తేమతో, గాలన్నదే వీయకుండా స్తబ్ధుగా ఉండాలి. అలాంటి వాతావరణంలో 0.02 మి.మీ. మందంతో కూడిన బుల్లి మంచు రేణువులు నిట్టనిలువుగా కాకుండా నేలకు కాస్త సమాంతరంగా కిందకు పడుతూ ఉండాలి. వాటి గుండా కాంతి నిర్దిష్ట కోణాల్లో ప్రసరిస్తే ఆ మంచు రేణువులు లక్షలాది బుల్లి అద్దాలుగా మారతాయి. వాటిపై పడుతూ కాంతి ఊహాతీతమైన తీరులో పరావర్తనం చెందుతుంది. ఫలితంగా ఇలాంటి నిలువు వెలుగులు సాక్షాత్కరిస్తాయి. ఆ కాంతికి మూలం వీధి దీపాలు మొదలుకుని చంద్ర కిరణాల దాకా ఏదైనా కావచ్చు. కెనడాతో పాటు అలస్కా, రష్యా తదితర చోట్ల అతి శీతల ప్రాంతాల్లో ఇవి తరచూ ఏర్పడుతుంటాయి. ఇవి నిజానికి కేవలం ఓ దృశ్య భ్రాంతి మాత్రమేనని సైంటిస్టులు అంటారు. వాళ్లేం చెప్పినా స్థానికులు వీటిని మానవాతీత శక్తి తాలూకు విన్యాసాలుగా నమ్ముతుంటారు. ఎగిరే పళ్లేల్లాగే ఇవి కూడా గ్రహాంతరవాసుల వాహనాలని భావిస్తారు.
- సాక్షి, నేషనల్ డెస్క్

16 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా నిషేధం బిల్లుకు

# ఆస్ట్రేలియా ఆమోదం



మెల్‌బోర్న్: 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధించే బిల్లును ఆస్ట్రేలియా ప్రతినిధుల సభ బుధవారం ఆమోదించింది. దీనికి ప్రకారం టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, రెడిట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక వేదికల్లో వారికి ఖాతాలు ఉండకూడదు. దీన్ని అతిక్రమిస్తే ఏకంగా 3.3 కోట్ల డాలర్ల దాకా జరిమానా విధిస్తారు! ప్రధాన పార్టీలన్నీ బిల్లుకు మద్దతిచ్చాయి. దానికి అనుకూలంగా 102, వ్యతిరేకంగా 13 ఓట్లొచ్చాయి. బిల్లు ఈ వారంలో చట్టంగా మార నుంది. వయోపరిమితుల అమలుకు సామాజిక మాధ్యమాలకు ప్రభుత్వం ఏడాది గడువిచ్చింది. ఆ తర్వాత నుంచి జరిమానాలు విధిస్తారు.

**అమలు ఎలా?**

ఈ చట్టాన్ని ఎలా అమలు చేస్తారన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఎందుకంటే వయో నిర్ధారణ కోసం సామాజిక మాధ్యమాలు వినియోగదారుల నుంచి ప్రభుత్వ గుర్తింపు పత్రాలను డిమాండ్ చేయలేవు. డిజిటల్ ఐడెంటిఫికేషన్ యాక్సెస్ ఇచ్చే అవకాశం లేదు. కనుక చట్టం అమలు అనుమానమేనని విపక్ష సభ్యుడు డాన్ తెహాన్ అభిప్రాయపడ్డారు. అమలు చేయగలిగితే మాత్రం ప్రజల జీవితాల్లో మార్పు ఖాయమన్నారు. ఈ బిల్లుపై స్వతంత్ర సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు ప్రజలకు అనిపించేలా చేయడమే దీని లక్ష్యం తప్ప సోషల్ మీడియాను సురక్షితంగా మార్చేందుకు ఇది దోహదపడబోదని కొన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ''లోతైన పరిశీలన లేకుండా పార్లమెంటు ఆమోదం పొందిన ఈ బిల్లు పెద్దగా పనికొచ్చేది కాదు. పిల్లలకు ఏది మంచిదో నిర్ణయించే తల్లిదండ్రుల అధికారాన్ని హరించేలా ఉంది'' అని కూడా విమర్శలున్నాయి. ఈ నిషేధం పిల్లలను ఏకాకులను చేస్తుందని, సోషల్ మీడియా తాలూకు సానుకూల అంశాలను వారికి దూరం చేస్తుందని పరిశీలకు లు అంటున్నారు. వారిని డార్క్‌వెబ్ వైపు నడిపినా ఆశ్చర్యం లేదని హెచ్చరిస్తున్నారు.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవిస్?

**పట్టు సడలించి డిప్యూటీ సీఎం పదవికి పరిమితం కానున్న ఏక్‌నాథ్ షిండే ● షిండేతో పాటు మరో డిప్యూటీగా అజిత్ పవార్ !**



- ప్రధాని మోదీ, అమిత్ షాల నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్న షిండే
- తుది అంకానికి చేరిన 'మహా' హైడ్రామా
- కేబినెట్ కూర్పుపై నేడు ఢిల్లీలో అమిత్ షాతో షిండే, ఫడ్నవిస్, అజిత్ భేటీ

ముంబై/థానే: ఎవరికీ మెజారిటీరాని, హంగ్ సందర్భాల్లో కనిపించేంత ఉత్కంఠను కొనసాగించిన 'మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరు?' అంశానికి నేటితో తెరపడనుంది. గతంలో ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా సేవలందిస్తున్న మహారాష్ట్ర బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడం దాదాపు ఖాయమైంది. మహాయుతి కూటమిని శాసనసభ ఎన్నికల పర్వంలో విజయతీరాలకు చేర్చినందుకు మళ్లీ తననే సీఎంగా చేయాలని పట్టుబట్టిన శివసేన చీఫ్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కాస్తం త మెత్తబడ్డారు. దీంతో ఫడ్నవిస్ పట్టాభిషేకానికి అవరోధాలు దాదాపు తొలగిపోయాయి. నేడు ఢిల్లీలో బీజేపీ అగ్రనేత అమిత్ షాతో ఏక్‌నాథ్ షిండే భేటీ తర్వాత కేబినెట్ కూర్పుపై తుది నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ మళ్లీ తనకే సీఎం పదవి ఇవ్వాలని పట్టుబట్టిన షిండే బుధవారం పట్టు సడలించారు. నూతన సీఎం ఎంపికపై ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేత అమిత్‌షాల నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని బుధవారం షిండే చేసిన వ్యాఖ్యలు దీనికి బలం చేకూర్చాయి. దీంతో ఫడ్నవిస్ సారథ్యంలో బీజేపీ సర్కార్ కొలువుతీరడం దాదాపు ఖాయమైంది. ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ చీఫ్ అజిత్‌పవార్‌లు ఉప ముఖ్యమంత్రి పదవులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 30 లేదా డిసెంబర్ ఒకటో తేదీన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం ఉండొచ్చని అజిత్ పవార్ బుధవారం చెప్పారు.



**మా వైపు స్పీడ్ బ్రేక్ లేదన్న షిండే**

ఘన విజయం తర్వాత ఐదు రోజులకు తొలిసారిగా బుధవారం థానేలోని స్వగృహంలో 60 ఏళ్ల షిండే మీడియా సమావేశంలో మాట్లాడారు. ''కొత్త సీఎం విషయంలో మోదీ, అమిత్ షాల నిర్ణయంతో ఏకీభవిస్తా. ఈ ఎంపిక ప్రక్రియలో నేను అవరోధంగా ఉండబోను. బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నాకు, శివసేనకు సమ్మతమే అని నిన్ననే వాళ్లతో ఫోన్ సంభాషణల్లో స్పష్టం చేశా. రెండోదఫా అవకాశం దక్కదని తెల్సి నిరాశచెందానన్న వార్తల్లో నిజం లేదు. వాస్తవానికి సీఎంగా నా ప్రభుత్వానికి బీజేపీ మద్దతు పలికిందన్న విషయం మర్చిపోవద్దు. కొత్త సీఎం వ్యవహారంలో శివసేన నేతల్లో ఎలాంటి కోపతాపాలు, అసహనం లేవు. గురువారం ఢిల్లీలో అమిత్ షాను నేను, ఫడ్నవిస్, అజిత్‌పవార్ కలవబోతున్నాం. ఆ సమావేశంలో కీలక నిర్ణయాలు ఖరారవుతాయి'' అని అన్నారు. ''కొత్త ప్రభుత్వం కొలువుతీరే అంశం గురువారంతో తేలిపోనుంది'' అని షిండే అన్నారు. నవంబర్ 30 లేదా డిసెంబర్ ఒకటో తేదీన సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ చెప్పారు.

**2, 3 గంటలే నిద్రపోయా**

''మహాయుతికి ఘన విజయం అందించిన మహారాష్ట్ర ఓటర్లకు కృతజ్ఞతలు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం విస్తృతంగా తిరిగా. ఎన్నికల ప్రచారం వేళ రోజుకు కేవలం 2,3 గంటలే నిద్రపోయా. ప్రజల కోసం నేరుగా పనిచేయడంలో నేను ఇప్పటికీ కార్యకర్తనే. నా దృష్టిలో సీఎం అంటే కామన్‌మ్యాన్. నేనేమీ అసంతృప్తిలో లేను. మేం పోరాటం చేశాం. ఇక్కడ ఏడ్వాల్సిన అవసరం లేదు. పాపులర్ అవ్వాలని సీఎంగా చేయలేదు. ప్రజల సంక్షేమం కోసమే పదవిలో కొనసాగా'' అని షిండే వ్యాఖ్యానించారు. బీజేపీ అగ్రనాయకత్వం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని షిండే ప్రకటించడం ఆనందంగా ఉందని బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే చెప్పారు. ''విపక్షాల పుకార్లను పటాపంచలు చేస్తూ షిండే చక్కటి నిర్ణయం తీసుకున్నారు. ఆయనను చూసి గర్వపడుతున్నా. సీఎంగా ఆయన అద్భుతంగా పాలించారు'' అని బవాంకులే పొగిడారు. షిండే మహాయుతి ప్రభుత్వానికి కన్వీనర్‌గా ఉంటారని వార్తలొచ్చాయి. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీలో తాజా ఎన్నికల్లో మహాయుతి కూటమి 230 సీట్లను కైవసం చేసుకుని ఘన విజయం సాధించడం తెల్సిందే. బీజేపీ 132, శివసేన(షిండే) 57, ఎన్సీపీ(అజిత్‌పవార్) 41 చోట్ల గెలిచాయి.

## అమెరికా ఎన్ఐహెచ్ డైరెక్టర్‌గా జయ్ భట్టాచార్య



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త జయ్ భట్టాచార్య అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అమెరికాలో అత్యున్నత వైద్య పరిశోధన సంస్థ ఇది. అలాగే ఇతర ప్రయోగశాలకు నిధులను కూడా దీని ద్వారానే కేటాయిస్తారు. ట్రంప్ 2.0లో పాలనాపరమైన పోస్టుల్లో నియమితులైన తొలి భారతీయ సంతతి వ్యక్తిగా భట్టాచార్యను పేర్కొనవచ్చు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయడానికి ఎలాన్ మస్క్‌తో పాటు ట్రంప్.. మరో భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామిని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే మస్క్, రామస్వామివి గౌరవప్రదమైన హోదాలు. వీటికి సెనేట్ ఆమోదముద్ర అవసరం లేదు. 'రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్‌తో కలిసి పనిచేస్తూ భట్టాచార్య మార్గదర్శనం చేస్తారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చడానికి ఆయన కృషి చేస్తారు' అని ట్రంప్ ప్రకటించారు.

# ఇస్కాన్‌పై నిషేధం దిశగా..

- బంగ్లాదేశ్ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్
- చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ తర్వాత కీలక పరిణామాలు

ధాకా/కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) మాజీ సభ్యుడు, సమ్మిళిత సనాతని జాగరణ్ జోత్ సంఘం సాధువు చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారిని బంగ్లాదేశ్‌లో అరెస్ట్ చేసిన వేళ అక్కడ మరో కీలక పరిణామం సంభవించింది. ఇస్కాన్‌ను బంగ్లాదేశ్‌లో నిషేధించాలంటూ అక్కడి హైకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించగా ఇస్కాన్ మతసంబంధ సంస్థేనని బంగ్లాదేశ్ ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ మొహమ్మద్ అసదుజ్జమాల్ కోర్టుకు తెలిపారు. కృష్ణదాస్ అరెస్ట్, ఇస్కాన్, హిందూ ఆలయాలకు వ్యతిరేకంగా అతివాద ముస్లిం సంఘాల సభ్యుల ఆందోళనలు, మైనారిటీలపై దాడుల నడుమ ప్రభుత్వం తన స్పందన తెలియజేయడం గమనార్హం.

**ఘర్షణ ఘటనలో 30 మంది అరెస్ట్**

కృష్ణదాస్ అరెస్ట్‌ను నిరసిస్తూ మైనారిటీ హిందువులు, కృష్ణదాస్ మద్దతుదారులు వేర్వేరు చోట్ల చేపట్టిన ర్యాలీలను బంగ్లాదేశ్ పోలీసులు అడ్డుకోవడంతో చిట్టోగ్రామ్‌లో జరిగిన ఘర్షణ ఘటనలో 30 మందిని అరెస్ట్‌చేశారు. మంగళవారం జరిగిన ఈ ఘర్షణల్లో తీవ్రంగా గాయపడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సైఫుల్ ఇస్లామ్ మరణించిన విషయం తెల్సిందే. అయితే కృష్ణదాస్‌ను అన్యాయంగా అరెస్ట్ చేశారని, వెంటనే విడుదలచేయాలని బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ డిమాండ్‌చేసింది.

**ఐరాస జోక్యం చేసుకోవాలి**

17 కోట్ల బంగ్లాదేశ్ జనాభాలో హిందువులు కేవలం 8 శాతం మంది ఉన్నారు. ఆగస్ట్ ఐదున షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయాక 50కిపైగా జిల్లాల్లో మైనారిటీలపై 200కుపైగా దాడుల ఘటనలు జరిగాయి. తాజాగా కృష్ణదాస్ అరెస్ట్ తర్వాత మళ్లీ మైనారిటీలపై దాడులు పెరగడంతో ఈ అంశంలో ఐక్యరాజ్యసమితి జోక్యంచేసుకోవాలని భారత కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కోరారు. ''అతివాదుల కనుసన్నల్లో ఆపద్ధర్మ ప్రభుత్వం నడుస్తోంది. మానవత్వానికి మచ్చతెచ్చే రీతిలో హిందువులపై దాడులు చేస్తున్నారు. ఈ అంశంలో ఐరాస కలుగజేసుకుని సమస్యకు పరిష్కారం కనుగొనాలి'' అని గిరిరాజ్ బుధవారం ఢిల్లీలో పార్లమెంట్ ప్రాంగణంలో అన్నారు. ఇస్కాన్, హిందువులపై దాడులు ఆగేలా బంగ్లాదేశ్‌పై భారత్ ఒత్తిడి పెంచాలని ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ భారత విదేశాంగ శాఖను కోరారు. హిందువుల పరిరక్షణ కోసం ప్రభుత్వమే పాటుపడాలని ఇస్కాన్ బంగ్లాదేశ్ ప్రధాన కార్యదర్శి చారుచంద్రదాస్ బ్రహ్మచారి వేడుకున్నారు. భారత్ పట్ల వ్యతిరేకత, హిందువులపై ముస్లిం అతివాదుల ఆగడాలు, ఉగ్రదాడులతో తమ దేశం వేగంగా అరాచకత్వం వైపు పయనిస్తోందని బంగ్లాదేశ్ మాజీ విదేశాంగ మంత్రి హసన్ మహ్మూద్ ఆందోళన వ్యక్తం చేశారు.

ISKCON

## వక్ఫ్ కమిటీ భేటీ నుంచి విపక్ష సభ్యుల వాకౌట్



న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) బిల్లును సమీక్షించేందుకు ఏర్పాటుచేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ భేటీ నుంచి బుధవారం విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. కమిటీ చైర్మన్, బీజేపీ సీనియర్ నేత జగదాంబికా పాల్ సహా బీజేపీ సభ్యులు కమిటీ సమావేశం విధివిధానాలను ఇష్టారీతిన మార్చేస్తున్నారని ఆరోపిస్తూ విపక్షసభ్యులు సమావేశం నుంచి అర్ధంతరంగా బయటకువచ్చారు. అయితే పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలివారంలోపు వక్ఫ్ కమిటీ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉన్నందున కమిటీ సమావేశాలను చైర్మన్ ముగించే వీలుంది. దీంతో సమగ్ర చర్చలు, ముసాయిదా నివేదిక కూర్పు కమిటీ గడువును పొడిగించాలని కోరాలని విపక్ష సభ్యులు నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒక గంట తర్వాత మళ్లీ విపక్ష సభ్యులు మీటింగ్‌కు వెళ్లారు. సంప్రదింపుల ప్రక్రియ పూర్తికాకుండానే నవంబర్ 29వ తేదీలోపు కమిటీ భేటీలకు ముగింపు పలకాలని చైర్మన్ ఆశపడుతున్నారని గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), ఎ.రాజా(డీఎంకే), సంజయ్ సింగ్(ఆప్), కళ్యాణ్ బెనర్జీ(టీఎంసీ) తొలుత ఆరోపించారు. విపక్షపార్టీల సభ్యులంతా కమిటీ గడువును పొడిగించాలని డిమాండ్‌చేస్తున్నారని, అయినాసరే చైర్మన్ రేపటికల్లా నివేదిక సమర్పణకు మొగ్గుచూపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సభ్యుల అభ్యంతరాల నేపథ్యంలో చైర్మన్ జగదాంబికాపాల్ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. పొడిగింపు కోరాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అయితే పొడిగింపుపై తుది నిర్ణయం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకోవాల్సి ఉంటుంది.

# మళ్లీ వాయిదాలే

**'అదానీ, మణిపూర్'పై రగడ ● ఉభయ సభలూ నేటికి వాయిదా**

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో విపక్షాల రగడ బుధవారమూ కొనసాగింది. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు, మణిపూర్, యూపీల్లో హింసపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి ఆందోళనలతో ఉభయసభలూ అట్టుడికాయి. ఎలాంటి చర్చ చేపట్టకుండానే గురువారానికి వాయిదా పడ్డాయి. బుధవారం ఉదయమే ఇండియా కూటమి నేతలు రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో భేటీ అయ్యారు. అదానీ అంశంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించేదాకా సభలను అడ్డుకోవాలని నిర్ణయించారు. లోక్‌సభ ప్రారంభం కాగానే అదానీ అంశంపై చర్చకు, సంయుక్త పార్లమెంట్ కమిటీతో విచారణకు కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. వాయిదా తీర్మానానికి నోటీసులిచ్చారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని స్పీకర్ కోరినా పట్టించుకోకుండా నిరసన కొనసాగించారు. దాంతో సభను 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైనా విపక్ష ఎంపీలు వెనక్కు తగ్గకపోవడంతో సభ గురువారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ అదే పరిస్థితి కనిపించింది. షెడ్యూల్‌ను పక్కన పెట్టి తమ డిమాండ్లపై చర్చించాలంటూ విపక్షాలిచ్చిన 18 నోటీసులను చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. అదానీ అంశంపై చర్చకు కాంగ్రెస్ సభ్యుడు రణ్‌దీప్ సూర్జేవాలా మాత్రమే పట్టుబట్టారు. విపక్షాల ఆందోళనలతో సభ 11.30 దాకా వాయిదా పడింది. తర్వాతా గందరగోళమే కొనసాగడంతో గురువారానికి వాయిదా పడింది.

**అదానీని అరెస్టు చేయాల్సిందే: రాహుల్**




''మామూలు వ్యక్తులను చోటామోటా అభియోగాలకే అరెస్టు చేస్తారు. కానీ అమెరికాలో వేల కోట్ల మేరకు అభియోగాలు నమోదైనా మోదీ సర్కారు కాపాడుతోంది. జైల్లో ఉండాల్సిన వ్యక్తికి అండగా నిలుస్తోంది'' అని విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. లోక్‌సభ వాయిదా పడ్డాక పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''అదానీ గ్రూపుపై వచ్చిన తాజా ఆరోపణల తీవ్రతను తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తన శక్తియుక్తులన్నింటినీ ఒక వ్యాపారిని కాపాడేందుకు వినియోగిస్తోంది'' అని ఎద్దేవా చేశారు.

## అమల్లోకి కాల్పుల విరమణ

జెరూసలేం: అనూహ్యంగా కుదిరిన ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా కాల్పుల విరమణ ఒప్పందం బుధవారం అమల్లోకి వచ్చింది. తాత్కాలిక కాల్పుల విరమణ 60 రోజులపాటు అమల్లో ఉంటుంది. దక్షిణ లెబనాన్ ప్రాంతాలను ఆక్రమించిన ఇజ్రాయెల్ సైన్యం ఈ కాలంలో అక్కడి నుంచి వెనక్కి మళ్లుతుంది. ఆయా ప్రాంతాలను లెబనాన్ సైతం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. ఒప్పందం ప్రకారం.. ఆక్రమణకాలంలో ఆయా ప్రాంతాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన హెజ్‌బొల్లా స్థావరాలను తిరిగి నిర్మించకూడదు. 14 నెలలకాలంగా సరిహద్దు వెంట యుద్ధం కారణంగా సురక్షిత ప్రాంతాలకు తరలిపోయిన ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల స్థానికులు మళ్లీ తమ స్వస్థలాలకు వచ్చి ధ్వంసమైన తమ ఇళ్లు, దుకాణాలను నిర్మించుకోవచ్చు. ''ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, లెబనాన్ ప్రధాని నజీబ్ మికాటీలతో మాట్లాడా. తాత్కాలిక కాల్పుల విరమణ శాశ్వతంగా ఉండిపోవాలని ఆశిస్తున్నా'' అని శ్వేతసౌధం నుంచి అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించారు. గాజా స్ట్రిప్‌లోని హమాస్‌కు హెజ్‌బొల్లా నుంచి లభిస్తున్న ఆయుధ, నైతిక మద్దతును అడ్డుకునేందుకే ఇజ్రాయెల్ ఈ కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిందని అంతర్జాతీయ మీడియా లో వార్తలొచ్చాయి. అయితే హెజ్‌బొల్లాతో పోరులో నిండుకున్న ఆయుధ సంపత్తిని తిరిగి సమకూర్చుకునేందుకు ఈ కాల్పుల విరమణ కాలాన్ని ఇజ్రాయెల్ వాడుకుంటోందని తెలుస్తోంది.

## సీఎంగా నేడు హేమంత్ ప్రమాణం

**హాజరుకానున్న పలువురు నేతలు**



రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ (49) గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాంచీలోని మొరాబాది మైదానంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరగనుంది. ఏర్పాట్లను సోరెన్ బుధవారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్‌కు చెందిన జార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) ఆధ్వర్యంలోని కూటమి ఘన విజయం సాధించింది. 81 మంది సభ్యులుండే అసెంబ్లీలో జేఎంఎం కూటమి 56, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 24 సీట్లు సాధించడం తెలిసిందే. ఈ ఎన్నికల్లో హేమంత్ సోరెన్‌తోపాటు భార్య కల్పన ఘన విజయం సాధించారు. ఆదివారం హేమంత్ సోరెన్ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, బెంగాల్ సీఎం మమత, మేఘాలయ సీఎం కొన్రాడ్ సంగ్మా, పంజాబ్ సీఎం మాన్, హిమాచల్ సీఎం సుఖ్వీందర్.. ఇంకా సీపీఎం జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య, ఆప్ నేత కేజ్రీవాల్, శివసేన (యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే,, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా కూటమి నేతలు హాజరవుతారని భావిస్తున్నారు.

**పూర్వీకుల గ్రామంలో హేమంత్ దంపతులు**

కాబోయే సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనతో కలిసి మంగళవారం బెంగాల్ సరిహద్దుల్లోని రామ్‌గఢ్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న తమ పూర్వీకుల గ్రామం నెమ్రాను సందర్శించారు. హేమంత్ తండ్రి జేఎంఎం వ్యవస్థాపకుడు శిబూ సోరెన్ ఈ గ్రామంలోనే జన్మించారు. శిబూ 15 ఏళ్లప్పుడు తండ్రి సోబరెన్‌ను స్థానిక వడ్డీ వ్యాపారులు చంపారు. తాత సోబరెన్ సోరెన్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని అక్కడికి వెళ్లిన హేమంత్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. గురువారం నుంచి మన ప్రభుత్వం పనిచేయనుందని వారికి చెప్పారు. ఎన్నికల్లో కష్టపడిన మీరంతా ప్రమాణ స్వీకారానికి రావాలని హేమంత్ వారిని ఆహ్వానించారు.

**సీఎంగా నాలుగోసారి..**

హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మొదటిసారి 2013 జులై నుంచి 2014 డిసెంబర్ వరకు పనిచేశారు. రెండోసారి 2019 డిసెంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ అరెస్ట్ నేపథ్యంలో 2024 జనవరిలో రాజీనామా చేశారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి 2024 జూన్లో సీఎంగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆపద్ధర్మ సీఎంగా కొనసాగుతున్నారు. గురువారం ఆయన నాలుగోసారి జార్ఖండ్ సీఎంగా ప్రమాణం చేయనున్నారు.

## ఈవీఎంలు ఉంటే ఏదైనా సాధ్యమే!

**మహాయుతి గెలుపుపై సామ్నా ● లక్కీ డ్రాలో గెలిచారని విమర్శ**

సామనా

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి బంపర్ లక్కీ డ్రాలో గెలిచిందని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పత్రిక సామ్నా విమర్శించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లు ఉంటే ఏదైనా సాధ్యమేనని పేర్కొంది. సామ్నా ఎడిటోరియల్‌లో ఈ మేరకు ధ్వజమెత్తింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇటీవల భారత్‌లో చాలావేగంగా ఓట్ల లెక్కింపు పూర్తయిందని, అమెరికాలో ఇది చాలా ఆలస్యమైందని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై సామ్నా స్పందిస్తూ భారత్‌లో ఈవీఎంల పనితీరుతో సామాన్యులూ నిర్ఘాంతపోయారని పేర్కొంది. అంతేకాకుండా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చని ఎలాన్ మస్క్ స్వయంగా కొన్ని నెలల కిందట చెప్పిన విషయాన్ని ప్రస్తావించింది. మొత్తం 288 సీట్లలో మహాయుతి బంపర్ లక్కీ డ్రాలో ఏకంగా 230 సీట్లను ఎలా నెగ్గగలిగింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే అవన్నీ ఈవీఎంల దగ్గరే ఆగిపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఏకంగా 95 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలున్నాయని పేర్కొంది. అలాగే బ్యాటరీలు పూర్తి చార్జింగ్‌తో ఉండటం ఈవీఎంలపై పలు అనుమానాలను రేకెత్తిస్తోందని తెలిపింది.

## ఆక్స్‌ఫర్డ్ చాన్స్‌లర్‌గా విలియమ్ హేగ్



లండన్: ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ పదవికి కన్జర్వేటివ్ పార్టీ మాజీ నేత విలియమ్ హేగ్ ఎన్నికయ్యారు. యూకేలోని అత్యంత గౌరవనీయ పదవుల్లో ఇదొకటి. దాదాపు 800 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ యూనివర్సిటీ ఆన్‌లైన్ ద్వారా జరిపిన ఓటింగ్‌లో హేగ్‌కు అత్యధిక ఓట్లు దక్కాయని వర్సిటీ బుధవారం తెలిపింది. 2003 నుంచి చాన్స్‌లర్‌గా కొనసాగుతున్న క్రిస్ పాటెన్ స్థానంలో వచ్చే ఏడాది ఆరంభంలో హేగ్ బాధ్యతలు స్వీకరించనున్నారని వివరించింది. పదేళ్ల పాటు ఆయనే పదవిలో కొనసాగుతారని పేర్కొంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం ׀ 28 ׀ నవంబర్ ׀ 2024






## నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్న దానానికి విజయవాడ రామచంద్రనగర్‌కు చెందిన కేశినేని ఈశ్వర్, శిల్ప కుటుంబ సభ్యులు బుధవారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.



## స్కానింగ్ సెంటర్ల తనిఖీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ డీఎం హెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం జిల్లాలో పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేటరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.




## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

లబ్బీపేట: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల ఎన్‌సీసీ కేడెట్లు బుధవారం విజయవాడ నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# ర్యాంపులపై ప్రజాగ్రహం

- ప్రమాదాలకు కారణంగా మారిన ఇసుక ర్యాంపులు
- భారీ వాహనాల రాకపోకలతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ర్యాంపుల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక రవాణా
- ఇసుక అక్రమ దందాలో టీడీపీ ప్రజాప్రతినిధుల హస్తం
- ఇసుక ర్యాంపులు వద్దంటూ ఆందోళన చేపట్టిన ప్రజలు



లారీని అడ్డుకొని ఆందోళన చేస్తున్న కాసరబాద గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జిల్లాలోని పలు ఇసుక ర్యాంపులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఈ ర్యాంపుల నుంచి నిత్యం భారీ లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న ఈ వాహనాల కారణంగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తమ ప్రాణాలు తీసే ర్యాంపులు వద్దంటూ చందర్లపాడు మండలం కాసరబాద గ్రామానికి చెందిన ప్రజలు మంగళవారం ధర్నా చేశారు. ఇసుక లారీలను అడ్డుకొన్నారు. ఈ ఇసుక ర్యాంపుతో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చిన్న పిల్లలు బడికి వెళ్లేందుకు, రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాల్లోకి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చెప్పిందొకటి.. చేసేదొకటి

కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి చేసేదొకటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సైతం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వారికే ఇసుక రీచ్ నుంచి లారీల్లో తరలిస్తాయని చెప్పారని, అయితే ఆ వేళలు అమలుకావడంలేదని ఆరోపించారు. రాత్రింబవళ్లు ఇష్టారాజ్యంగా భారీ వాహనాలతో ర్యాంపుల నుంచి ఇసుకను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చందర్లపాడు మండలం కాసరబాద గ్రామంలో గడ్డి తెచ్చుకొనేందుకు ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తున్న రైతు రామిరెడ్డిని ఇసుక లారీ ఢీకొట్టిందని, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతని కాలు తీసేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. అతని కుటుంబాన్ని ఇప్పుడు ఎవరు ఆదుకుంటారని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ఇసుక రవాణా చేసే వారు, వచ్చి సమాధానం చెప్పాలని ధర్నాలో నినదించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు, ధర్నా చేస్తున్న వారిని కేసులు పెడతామని బెదిరించడం ఏమిటని నిలదీస్తున్నారు. మూడు నెలల క్రితం చందర్లపాడు మండలంలో ఇసుక లారీ ఢీకొనటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నెల రోజుల క్రితం మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తంచేశారు.

### ఆందోళలు ఇలా..

ఇటీవల పెనుగ్రంచిప్రోలు–2 ఇసుక రీచ్‌లో ఇసుక తవ్వ వద్దంటూ శివాపురం, అనిగండ్లపాడు ప్రజలు రోడ్డెక్కారు. తిరువూరు నియోజకవర్గంలోని గానుగపాడులో ఇసుకను అక్రమంగా తవ్వి తెలంగాణకు తరలిస్తుండటంతో, ఏకంగా గ్రామస్తులే అడ్డుకొని ట్రాక్టర్లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గొయ్యి తీశారు. చల్లపల్లి మండలం ఆముదాలలంక గ్రామంలో ఇసుక వాహనాలు అతివేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతాయనే భావనతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద చెట్లు వేసి వాహనాలను అడ్డుకున్నారు. ఇసుక తరలిస్తున్న 30 ట్రాక్టర్లను అధికారులకు పట్టించారు. తమకు ఇబ్బందికరంగా మారిన ఇసుక రీచ్‌లు వద్దంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.

### పట్టించుకోని అధికారులు

చందర్లపాడు మండలంలోని ఇసుక నాణ్యంగా ఉండటంతో హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా సంబంధిత అధికారులు అక్రమ రవాణా వైపు చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా వెనుక టీడీపీ ప్రజాప్రతినిధుల హస్తం ఉండటమే ఇందుకు కారణమని ప్రజలు పేర్కొంటున్నారు. ఇసుక లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవద్దు అంటూ తమను పోలీసులు బెదిరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బాధితుల పక్షాన ఆందోళన చేసిన జనసేన నాయకుడు వడ్డెల్లి సుధాకర్‌ను పోలీసులు ఇష్టానుసారంగా మాట్లాడి, రౌడీషీట్ ఓపెన్ చేస్తామని గ్రామస్తుల ముందే బెదిరించడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. చిన్న రోడ్ల ద్వారానే భారీ లారీల్లో ఇసుక తరలిస్తున్నారని, ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకు కారణమైన ర్యాంపులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా తెలంగాణకు తరలి వెళ్తున ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### అధిక లోడుతో హైదరాబాద్‌కు..



కాసరబాద రీచ్‌లో లారీలో ఇసుక లోడు చేస్తున్న యంత్రం

ఇసుక రీచ్‌లో యంత్రాలతో ఇసుక తవ్వి భారీ లారీల్లో లోడు చేస్తున్నారు. పెద్ద పెద్ద టిప్పర్లలో పరిమితికి మించి ఇసుకను లోడు చేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా తెలంగాణలోని హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారు. 20 టన్నులకు బిల్లు తీసుకొని లారీల్లో 40 టన్నుల మేర తరలిస్తున్నారు. చందర్లపాడు మండలం ఉస్తేపల్లి ర్యాంపు నుంచి ఇసుక లారీలు కాసబాద గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. చందర్లపాడు మండలం కాసరబాదలో రీచ్ నిర్వాహకులు, అధికార పార్టీ నాయకులు రోజుకు 100కుపైగా పెద్ద పెద్ద లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. రీచ్ నుంచి నందిగామ వరకు రోడ్లు ఇరుకుగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్థానికులు ఇసుక లారీలు, టిప్పర్లను అడ్డగించి రోడ్డుపై బైఠాయిస్తున్నారు. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవటంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## న్యూస్‌రీల్

### దుర్గమ్మ సేవలో గోవిందానంద సరస్వతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కర్ణాటక పంపాక్షేత్ర సాధకుడు గోవిందానంద సరస్వతి స్వామీజీ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామీజీకి అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పండితులు వేద స్వస్తి పలకగా, ఆలయ ఈఓ కె.ఎస్. రామరావు, డీఈఓ రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామీజీ వివిధ గ్రంథాలపై ఉపన్యసించారు. ఆలయ ఈఓకు పలు సూచనలు చేశారు. అనంతరం మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు.

### దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.3.80 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. రూ.3,80,77,021 నగదుతో పాటు 559 గ్రాముల బంగారం, 7.020 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. 615 యూఎస్‌ఏ డాలర్లు, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 27 కత్తార్ రియాల్స్, 110 యూఏఈ దిర్హమ్స్, 33 మలేషియా రింగేట్లు, 30 ఇంగ్లాండ్ పౌండ్లు, 25 కెనడా డాలర్లు, పది సింగపూర్ డాలర్లు లభించాయి. కానుకల లెక్కింపును ఈఓ రామరావుతో పాటు డీఈఓ రత్నరాజు పర్యవేక్షించారు. దేవదాయ శాఖ అధికారులు, ఏఈఓలు, సూపరింటెండెంట్లతో పాటు ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

### ఉల్లాసంగా జిల్లా స్థాయి జాతీయ బాల్‌రంగ్ పోటీలు



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరులో ఉన్న ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయిలో జాతీయ బాల్‌రంగ్ ఫెస్టివల్ – 2024 పేరిట సంప్రదాయ జానపద పోటీలు బుధవారం ఉల్లాసంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. తప్పెట గుళ్లు, కర్రసాము, చెంచుల వేట, థింసా, జాలారి, బంజారా అంశాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు తలపడ్డారు. గుడివాడ ఆంధ్రా నలంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 'థింసా' నృత్యం ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి బాల్‌రంగ్ పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రోగ్రామ్ సమన్వయకర్తలుగా ఎస్.జయశ్రీ, టి.రాజ్యలక్ష్మి, న్యాయ నిర్ణేతలుగా జె.మోహినీకుమారి, డాక్టర్ పి.వినయకుమార్ వ్యవహరించారు.

### రూ.17.44 కోట్లతో డైట్ అభివృద్ధి పనులకు అంచనాలు

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరులో ఉన్న ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వానికి రూ.17.44కోట్లతో అంచనాలను పంపించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. తమ జిల్లా డైట్‌తో పాటు రాష్ట్రంలోని 13 ప్రభుత్వ జిల్లా డైట్‌లు కేంద్ర నిధులను కోరుతూ తమ అంచనాల ప్రతిపాదనలను పంపుతాయన్నారు. తమ డైట్‌కు మాత్రం కాంపౌండ్ వాల్, సెమినార్ హాల్, ల్యాబ్స్, కామన్ హాల్స్, టాయిలెట్స్ వంటి అభివృద్ధి పనులకు ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలను వేయించి ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని వివరించారు. తమ డైట్‌లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవన సముదాయాలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయన్నారు. మౌలిక వసతుల అవసరం ఉందని చెప్పారు. అందుకే తమ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## గ్రామీణ యువతను వ్యాపారస్తులను చేస్తాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



బాధ్యతలు స్వీకరిస్తున్న కేకే చౌదరి, చిత్రంలో మంత్రి సవిత

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఖాదీ గ్రామీణ బోర్డ్ ద్వారా ఎనిమిదో తరగతి నుంచి పీజీ వరకు విద్య అభ్యసించిన ఔత్సాహిక యువతతో యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డ్ చైర్మన్‌గా కస్తూరి కోటేశ్వరరావు చౌదరి (కేకే చౌదరి) ప్రమాణ స్వీకార కార్యక్రమం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగింది. మంత్రి సవిత ఆయనచేత ప్రమాణం చేయించారు. అనంతరం కేకే చౌదరి మాట్లాడుతూ ఖాదీ బోర్డ్ ద్వారా గ్రామీణ యువతలో చైతన్యం తీసుకువచ్చి ఇంటికొక ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దనరెడ్డి, సీడ్ యాప్ చైర్మన్ జి. దీపక్ రెడ్డి, ఏపీ సీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డి, ఖాదీ బోర్డ్ సీఈఓ రాఘవ నాయక్, డెప్యూటీ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పాపారావు బాధ్యతల స్వీకరణ..

గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చిలకలపూడి పాపారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జేఎండీ ఉమాదేవి ఆయనతోపాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, మోపిదేవి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఐకానిక్ పార్కు.. నిర్లక్ష్యం మార్కు

- వరదలకు దెబ్బతిన్న రివర్ ఫ్రంట్ పార్కు
- మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు
- పార్కును అందుబాటులోకి తీసుకురావాలంటున్న స్థానికులు



అందుబాటులోకి రాని రివర్ ఫ్రంట్ పార్కు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణానది తీరాన ఆహ్లాదకర వాతావరణంలో రిటైనింగ్ వాల్ వెంబడి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన రివర్ ఫ్రంట్ పార్క్ పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. మూడు నెలలుగా విజయవాడ నగర ప్రజలకు ఆహ్లాదం అందించలేకపోతోంది. రూ.12.3 కోట్లతో కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు 1.25 కిలో మీటర్ల పొడవున అన్ని హంగులతో రిటైనింగ్ వాల్ బ్యూటిఫికేషన్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పార్కును ప్రారంభించారు.

### వరద ప్రభావంతో స్వల్ప నష్టం

కృష్ణా నది చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబర్ ఒకటో తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద సముద్రంలోకి విడుదలైంది. అంత పెద్ద వరద వచ్చినా ప్రకాశం బ్యారేజికి దిగువన ఉన్న నదిని అనుకొని ఉన్న కాలనీల్లోని వేలాది మందికి వరద ముంపు నుంచి రిటైనింగ్ వాల్ రక్షణ కల్పించింది. రిటైనింగ్ వాల్‌పైగా పార్కులోకి నీరు ప్రవహించి, వాకింగ్ ట్రాక్‌తో పాటు, కొన్నిచోట్ల లాన్ దెబ్బంది. అప్పటి నుంచి ప్రజలు పార్కులోకి రాకుండా గేట్లు వేశారు. చిన్నపాటి మరమ్మతులు చేపట్టి పార్కును ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో మూడు నెలలుగా పార్కు ప్రజలకు ఆహ్లాదం అందించడంలేదు. విజయవాడ నగరానికే ఐకాన్‌గా నిలిచిన ఈ పార్కుపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని ప్రజలు పేర్కొంటున్నారు. పార్కును వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### నగరవాసులకు ఆహ్లాదం

నగరవాసులకు అభివృద్ధితోపాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు వీలుగా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీఎంసీ ప్రణాళికాబద్ధంగా పార్కును తీర్చిదిద్దింది. నదీతీరంలో సాయంత్ర వేళ నగర ప్రజలు తమ కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఈ రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును ఏర్పాటుచేశారు. ఈ రివర్ ఫ్రంట్ పార్క్‌లో ఒకేసారి 500 మంది వరకు వాకింగ్ చేసేలా ట్రాక్ నిర్మించారు. ఆహ్లాదం అందించేలా రకరకాల మొక్కలతో గ్రీనరీని తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌లు, రక్షణ గోడకు రైలింగ్, లైటింగ్, సిటింగ్ ఏరియా, ఓపెన్ జిమ్, ప్లే ఏరియాతో కూడిన ఈ పార్కు ప్రజల ఆదరణ పొందింది. నది వెంబడి గ్రీనరితో కృష్ణమ్మ అందాలు నగర వాసులకు కనువిందు చేశాయి.


### మిరిమిట్లుగొలిపే లైటింగ్..

మూడు మీటర్లతో పాత్‌వే, 3.5 మీ వెడల్పుతో వాకింగ్ ట్రాక్, దానిని ఆనుకుని పది మీటర్ల వెడల్పులో ఆహ్లాదకరంగా ఉండేలా పార్కు నిర్మించారు. పార్కులో ఓపెన్ జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ప్లే ఏరియా, గ్రూప్ సిట్టింగ్ ప్లేస్, షేడెడ్ సీటింగ్ ప్లేస్ నిర్మాణాలు చేశారు. పార్కు సందర్శించే వారి సౌకర్యం కోసం భారీసంఖ్యలో వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు. పార్కు ఎంట్రన్స్, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఆకర్షణీయమైన ట్రీ ఫౌంటెన్ స్టైల్ ఆర్చి, ఇంకా రాత్రివేళ్లలో కళ్లు మిరిమిట్లు గొలిపేలా ఆర్చికి, లోపల వాకింగ్, కాంతివంతమైన లైటింగ్ ఏర్పాటు చేశారు.



మూడు నెలలుగా తెరుచుకోని రివర్ ఫ్రంట్ పార్కు గేట్లు


#### మూడు నెలలుగా మూత



కరోనా తర్వాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. వ్యాయామం కోసం జిమ్‌కు వెళ్లాలంటే ఖర్చుతో కూడిన పని. గత ప్రభుత్వం కృష్ణానది ఒడ్డున ఆహ్లాదకర వాతావరణంలో రివర్ ఫ్రంట్ పార్కును ఏర్పాటు చేసి అందులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మించింది. అప్పటి నుంచి ఉదయం సాయంత్రం వేళల్లో పార్కుకు వెళ్లి వ్యాయామం చేసే వాళ్లం. అయితే మూడు నెలలుగా పార్కు మూసే ఉంటోంది. ఎప్పుడు తెరుస్తారో తెలియడం లేదు. త్వరగా పునః ప్రారంభించాలని కోరుతున్నా.

– భాను లక్ష్మీనారాయణ, కృష్ణలంక, విజయవాడ

#### త్వరగా అందుబాటులోకి తేవాలి



మూడు నెలల క్రితం వరకు రోజూ ఉదయం రిఫర్ ఫ్రంట్ పార్క్‌కు వెళ్లి వాకింగ్ చేశాను. ఎందుకో తెలియదు కానీ పార్కును మూసివేశారు. అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని అడిగితే వరదలకు వాకింగ్ ట్రాక్ దెబ్బతిందని, మరమ్మతులు చేస్తున్నారని చెబుతున్నారు. రెండు రోజులకు ఒకసారి పార్క్ దగ్గరకు వెళ్లి వస్తున్నా. దగ్గరలో ఉన్న పార్కును వదిలి దూరంగా వెళ్లి వాకింగ్ చేయాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు పార్కుపై దృష్టి పెట్టి త్వరగా మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్నా.

– కనిశెట్టి సుబ్బారావు, కృష్ణలంక, విజయవాడ

## జాతీయ స్థాయిలో కేడీసీసీబీకి ఉత్తమ అవార్డు



కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణా జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ స్థాయిలో కృష్ణా జిల్లా కేంద్ర బ్యాంకుకు ఉత్తమ అవార్డు లభించింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ (నాప్కాబ్) 60 వసంతాల ఉత్సవాల్లో భాగంగా ప్రతిభ కనబరిచిన, ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించిన, మంచి టర్నోవర్ సాధించిన సహకార కేంద్ర బ్యాంకులకు అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ సేవలతో పాటు రూ.11,300 కోట్లు టర్నోవర్ సాధించిన రెండో బ్యాంకుగా కేడీసీసీబీని గుర్తించి అవార్డు అందజేశారు. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్, కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ, బ్యాంక్ సీఈఓ ఎ.శ్యామ్‌మనోహర్‌కు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమం న్యూఢిల్లీలో మంగళవారం రాత్రి జరిగింది.

## రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతమే ఫైనల్



గండిగుంటలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ కార్యదర్శి వీరపాండ్యన్

రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్యదర్శి వీరపాండ్యన్

ఉయ్యూరు: రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతమే ఫైనల్ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ స్పష్టంచేశారు. ఉయ్యూరు మండలంలోని చిన ఓగిరాల, గండిగుంట గ్రామాల్లో వీరపాండ్యన్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియ, తేమశాతాన్ని పరిశీలించారు. రైతులు జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లలో ధాన్యంలో తేమశాతాన్ని తనిఖీ చేశారు. ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతుసేవా కేంద్రాల్లో తేమశాతానికి మిల్లర్ల తేమ శాతానికి వ్యత్యాసం ఉంటోందన్నారు. మిల్లర్ల తేమ శాతం ప్రకారమే ధర చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని తరలించేందుకు వాహనాల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రైతులు వద్ద ఉన్న ధాన్యం వెంటనే మిల్లులకు రవాణా అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. వీరపాండ్యన్ మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతమే తుది నిర్ణయం అని, మిల్లర్లు ఆ ప్రకారమే ధాన్యం సేకరించాలని ఆదేశించామన్నారు. జీపీఎస్‌తో సంబంధం లేకుండా రైతులు ధాన్యం వాహనాల్లో మిల్లర్లుకి తరలించొచ్చన్నారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనలతో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. ఒకే సారి ఎక్కువ పరిమాణంలో ధాన్యం మిల్లులకు రావటంతో కొంత సమస్య ఎదురైందన్నారు. జిల్లాలో ధాన్యాన్ని పక్క జిల్లాల్లోని మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీఓ హెలా షారోన్, డీఎస్ఓ పార్వతి, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ నిస్సిగ్రేస్ పాల్గొన్నారు.

## దీపం జ్యోతి పరబ్రహ్మ



విజయవాడ సత్యనారాయణపురం ఓంకార నాదంతో ప్రతిధ్వనించింది. దీప జ్యోతులతో వెలుగులీనింది. శత సహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో స్థానిక శిశు విద్యామందిర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు బుధవారం లక్ష దీపార్చనతో ముగిశాయి. దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి పరాత్పర మంత్ర జపం చేస్తూ దీపాలు వెలిగించారు.

– విజయవాడకల్చరల్

## క్లుప్తంగా

### ఆర్టీసీ ప్రయాణికులకు బంపరాఫర్

**బస్టాండ్(విజయవాడ పశ్చిమ):** విజయవాడ నుంచి విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు మధ్య నడిచే డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సులలో ప్రయాణికులకు రాయితీతో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏసుదానం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1నుంచి 31వ తేదీ వరకు విజయవాడ నుంచి బెంగళూర్‌కు వెళ్లే డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సుల్లో ఆదివారం మినహా మిగతా రోజుల్లో టికెట్ రేటుపై 20శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా బెంగళూరు నుంచి విజయవాడ వచ్చే ఈ బస్సుల్లో శుక్రవారం మినహా మిగిలిన రోజుల్లో ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. అదే విధంగా విజయవాడ–హైదరాబాద్, విజయవాడ–విశాఖపట్నం మధ్య నడిచే డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సు సర్వీసులలో 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 10 టన్నుల కూరగాయలు వితరణ



**లబ్బీపేట(విజయవాడతూర్పు):** తిరుమల శ్రీవారి సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు 10 టన్నుల కూరగాయలను అందజేశారు. నగరం నుంచి తిరుమలకు నిరంతరాయంగా కూరగాయలు అందించిన మండవ కుటుంబరావు స్ఫూర్తితో మరడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూరగాయలు అందజేశారు. కస్తూర్బిభాయిపేటలో తిరుమలకు కూరగాయలతో బయలుదేరిన లారీని శీలంశెట్టి బాలాజీ, సాయిప్రపూర్ణ, చింతల రవికుమార్, పద్మలు బుధవారం ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. తమ్మిన శివకుమార్, కుసుమ, శీలంశెట్టి కార్తీక్, రాగచంద్రిక, కేవీ నరసయ్య, సమత తదితరులు పాల్గొన్నారు.

### తల్లి మందలించిందని బాలుడు ఆత్మహత్య

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** తల్లి మందలించిందని మనస్తాపంతో బాలుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం ఎస్ఎన్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. రేవులమడుగు బుజ్జి కుమారుడు, కుమార్తెతో కలసి పూర్ణానందంపేట, మహ్మద్ బేగ్‌వీధిలో నివాసముంటున్నారు. కుమారుడు రాజ్‌కుమార్(16) స్థానికంగా ఉండే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా స్కూల్‌కు సరిగా వెళ్లకపోవడంతో ఈ నెల 26న తల్లి మందలించింది. అనంతరం ఆమె పక్కింటికి వెళ్లగా కొంత సేపటి తరువాత బుజ్జికి బావ వరస అయ్యే వెంకన్న ఆమె వద్దకు వెళ్లి రాజ్‌కుమార్ కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి తాగినట్లు తెలపడంతో ఆమె వెంటనే ఇంటికి చేరుకుని, కొడుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం బాలుడు మృతిచెందాడు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు అక్కడకు చేరుకుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### సామరస్యం.. భక్తితత్వం

విజయవాడ 60వ డివిజన్ వాంబేకాలనీలోని ఆస్థాన ఎ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా వారి ఆశ్రమంలో మతసామరస్యం వెల్లివిరిసింది. అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు బుధవారం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ముస్లింలు అయ్యప్ప స్వామి దీక్షాపరులకు భోజనాలు వడ్డించి ఐకమత్యాన్ని చాటారు. ఖాజా బాబా ఆశ్రమం వ్యవస్థాపక ధర్మకర్త పఠాన్ బాజ్జి ఉమర్ ఖాన్, బిల్డర్ షేక్ జిలాని, నబీ, ఎండీ ఇస్మాయిల్, ఎజాజ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

– అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)



### లేకుంటే కొర్రీ.. ఉండదు వర్రీ

కల్లాలు, రోడ్లపై ఉన్న ధాన్యాన్ని అధికారులు లారీల్లో ఎక్కించి మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో దావులూరు సమీపంలోని బాలాజీ మిల్లుకు అధిక సంఖ్యలో ధాన్యం లోడు వాహనాలు చేరుకున్నాయి. మిల్లు ప్రాంగణం అంతా వాహనాలతో నిండిపోవటంతో ధాన్యం లోడు వాహనాలను విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి మార్జిన్‌లో పార్కింగ్ చేయిస్తున్నారు. మిల్లుకు వచ్చిన ధాన్యం నిల్వ ఉండకుండా, రైతులు నిరీక్షించే అవసరం లేకుండా ప్రక్రియ వేగంగా, ఎలాంటి కొర్రీలు లేకుండా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

– కంకిపాడు



### ప్రచారం.. ప్రయాస

మహిళలు పోస్టాఫీసులకు పోటెత్తుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఆధార్ అప్ డేట్ కోసం పరుగులు పెడుతున్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కోసం ఆధార్ కేవైసీతో పాటు, పోస్టాఫీసు ఖాతా(ఐపీపీబీ) తప్పనిసరన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతుండటంతో అన్ని చోట్ల హెడ్ పోస్టాఫీసులు కిక్కిరిసిపోతున్నాయి. విజయవాడలో కూడా ఇదే పరిస్థితి ఉంది. స్థానిక బకింగ్‌హాంపేటలోని పోస్టు ఆఫీస్ లోపల అకౌంట్లతో పాటు ఆధార్ అప్‌డేట్ల కోసం వచ్చిన జనాల రద్దీని చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

# ఎంత మంచి వాడివయ్యా!

**ఘంటసాల:** సామాన్య పౌరుడు నిజాయతీ చూపించాడు. రోడ్డుపై పడి ఉన్న బంగారాన్ని గమనించి సదరు నగలు ఎవరివో ఆరా తీసి అప్పగించాడు. ఈ సంఘటన బుధవారం ఘంటసాలలో జరిగింది. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన గంజి శాంతశ్రీ స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖలో గోల్డ్ లోను చెల్లించి రూ.90 వేల విలువైన 13 గ్రాముల బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బ్యాంక్ పాస్‌బుక్, నగలతో ఉన్న కవర్ పడిపోయింది. కవర్ పడిపోయిన సంగతి చూసుకోని శాంతశ్రీ ఇంటికి వెళ్లిన తర్వాత గమనించి తీవ్ర ఆందోళనకు గురైంది. కాగా రోడ్డుపై పడి ఉన్న కవరును మల్లాయి చిట్టూరు గ్రామానికి చెందిన చింతా సుబ్బారావు గమనించగా, బంగారం, ఎస్‌బీఐ పాస్ బుక్ కనిపించాయి. దీంతో సుబ్బారావు బ్యాంకు వెళ్లి బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమార్‌కు అప్పగించాడు. వాటిని పరిశీలించిన బ్యాంకు మేనేజర్ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి శాంతశ్రీకి సమాచారం అందించారు. ఆందోళన చెందుతూ రోడ్డుపై వెతుక్కుంటూ వస్తున్న శాంతశ్రీ బ్యాంకు వారి నుంచి వచ్చిన సమాచారంతో ఊపిరి పీల్చుకుంది. బ్యాంకుకు వచ్చిన శాంతశ్రీకి బీఎం సునీల్ కుమార్ సిబ్బంది సమక్షంలో బంగారం అప్పగించారు. రోడ్డుపై దొరికిన బంగారం నిజాయతీగా తెచ్చి అప్పగించిన సుబ్బారావును బ్యాంకు అధికారులు అభినందించి బహుమతి అందించారు. దొరికిన బంగారం తమకు అప్పగించిన సుబ్బారావుకు శాంతశ్రీ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శాంతశ్రీకి బంగారం అప్పగించిన సుబ్బారావును అభినందిస్తున్న బ్యాంకు బీఎం సునీల్ కుమార్



బాధితురాలి భర్త ఆరేపల్లి వెంకటేశ్వర్లుకు నగలు అందజేస్తున్న కండక్టర్ శ్రీదేవి

**ఆర్టీసీ మహిళా కండక్టర్ నిజాయతీ**

**జగ్గయ్యపేట అర్బన్:** ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న సుమారు 25 వేల విలువైన బంగారు చెవి దిద్దులు, జుకాలను బస్సులో వెతికి తిరిగి వాటిని ప్రయాణికురాలికి అందజేసిన కండక్టర్ శ్రీదేవిని పలువురు అభినందిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంతానికి చెందిన ఆరేపల్లి నాగమణి ఈనెల 26వ తేదీ రాత్రి 7.30కు విజయవాడలో ఉన్న బిడ్డ వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. ప్రయాణం మధ్యలో బిడ్డకు చెందిన నగలు చెవి దిద్దులు, జుకాలు ఆమె వద్ద నుంచి జారి సీటు కింద పడిపోయాయి. ఈ విషయం గమనించని ఆమె విజయవాడలోని భవానీపురం స్టేజి వద్ద దిగి బిడ్డ ఇంటికి వెళ్లి చూసుకుంది. బ్యాగులో ఉన్న నగలు కనిపించకపోవడంతో బస్సులోనే పడిపోయి ఉంటాయని భావించి విజయవాడ బస్టాండ్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె టికెట్‌ను బట్టి ఆ బస్సు కండక్టర్ వి.శ్రీదేవి అని తెలుసుకొని ఆమెకు చెప్పారు. అప్పటికే బస్సులో ప్రయాణికులు ఎక్కడంతో 3వ సీటు కింద చూడగా ఆభరణాలు ఉన్నాయి. దీంతో కండక్టర్ శ్రీదేవి అధికారుల సమక్షంలో బాధితురాలి భర్త ఆరేపల్లి వెంకటేశ్వర్లుకు వాటిని అందజేశారు.

## ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించొచ్చు

**దివ్యాంగుల స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్**

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ డివిజన్‌లోని రైల్వే మినీ స్టేడియంలో దివ్యాంగుల స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. బ్లైండ్ క్రికెట్, వీల్ చైర్ రేసింగ్, అథ్లెటిక్స్, త్రో బాల్, షాట్‌పుట్ తదితర పోటీలలో విజయవాడ డివిజన్‌కు చెందిన 55 మంది దివ్యాంగ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగుల్లోని ఆత్మస్థైర్యం, విశ్వాసం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. డివిజన్‌లో 320 మంది దివ్యాంగ ఉద్యోగులు సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ, రైల్వే అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారని కొనియాడారు. వైకల్యం కేవలం శరీరానికి మాత్రమేనని, ధృడమైన మనస్తత్వంతో కలలను సులువుగా సాధించుకోవచ్చన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని బ్లైండ్ క్రికెట్ ఆడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

### డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** బస్టాండ్ పరిసరాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక కారును, 4.3 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన పులిచెర్ల శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన నందికోలా కిశోర్ ఇద్దరూ స్నేహితులు. శ్రీనివాసరెడ్డి సత్యనారాయణపురం సంగీత కళాశాల సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటుండగా.. కిశోర్ తన గ్రామంలో వ్యవసాయం పనులు చేస్తుంటాడు. వీరిద్దరికి డ్రగ్స్ అలవాటు ఉంది. బుధవారం వీరిద్దరూ విజయవాడ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు ముందస్తు సమాచారంతో వీరిని అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా వారి వద్ద 4.3 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ దొరికాయి. డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని వారి కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** మన ఆరోగ్యవంతమైన జీవనానికి స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యావరణానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల కార్యకలాపాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. జిల్లాలో ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షలు, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ, పంట రుణాలు, పంటల బీమా తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పత్తి వంటి పంటల్లో అంతర పంటలతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆర్ఎస్‌కే – ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీఎంఐపీ పీడీ పీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

# తిరువూరు రైతు బజారులో ఆకస్మిక తనిఖీలు

**తిరువూరు:** జాయింట్ కలెక్టర్ నిధి మీనా బుధవారం తిరువూరు రైతుబజారును ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో అధిక ధరలకు కూరగాయలు, సరుకులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో వినియోగదారులను జేసీ విచారించారు. స్టాల్స్ వద్ద ధరల పట్టిక సక్రమంగా నిర్వహించట్లేదని, ప్రభుత్వం సబ్సిడీపై అందించే టమాటా, నూనె విక్రయాలకు సంబంధించిన స్టాకు రిజిస్టర్లు లేవని గుర్తించారు. ఎస్టేట్ అధికారి అందుబాటులో లేకపోవడంతో జేసీ అడిగిన ప్రశ్నలకు స్టాల్స్ నిర్వాహకులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. రైతు బజారులో అస్తవ్యస్త పరిస్థితులను గమనించలేకపోవడంపై పౌరసరఫరాల డీటీ శ్వేతపై జేసీ అసహనం వ్యక్తం చేశారు. రైతు బజారును స్థానిక అధికారులు తరచూ తనిఖీలు చేయకపోవడంతో వినియోగదారులకు నష్టం జరుగుతోందన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి, నగరపంచాయతీ కమిషనర్ లోవరాజు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సతీష్, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలుపై సమీక్ష..**

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరిస్తున్న విధానాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా తిరువూరులో సమీక్షించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో డివిజన్ స్థాయిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు మద్దతు ధర లభించే విధంగా అధికారులు కృషి చేయాలని జేసీ సూచించారు. తిరువూరు మండలంలోని వావిలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి రైతులతో మాట్లాడారు.



తిరువూరు రైతుబజారులో సరుకులు తనిఖీ చేస్తున్న జేసీ నిధి మీనా

# వైభవంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

**గుడివాడ టౌన్:** గుడివాడ పట్టణంలోని ఏలూరు రోడ్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ 38వ శాఖ ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తీన్మార్ డప్పులు, యాంకర్ల కోలాహలం, సినీ నటుల సందడి మధ్య ప్రజాప్రతినిధులు షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ సీఎంఆర్ షాపింగ్ మాల్ పట్టణంలో ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు మొదటి కొనుగోలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన సినీ కథానాయికలు సంయుక్త మీనన్, నయన సారికలు పట్టణంలో సందడి చేశారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రజాప్రతినిధులు

# రుణ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి

**పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ప్రాథమిక సంఘ సభ్యులు జిల్లా యూనియన్‌లో సభ్యత్వం తీసుకుని తద్వారా రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, యూనియన్ ఫంక్షనల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.హనుమంతరావు సూచించారు. ముత్యాలంపాడులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ది కృష్ణాజిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం చైర్మన్ దుద్దుకూరి వెంకట కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లా యూనియన్‌లో 125 ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు ఉన్నాయన్నారు. అందులో 33 ప్రాథమిక సంఘాలకు గానూ 153 మందికి ఎన్‌సీడీసీ పథకం ద్వారా 20 శాతం రాయితీతో రుణం ఇచ్చామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం రాయితీతో ఇచ్చే రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చైర్మన్ దుద్దుకూరి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ మన జిల్లా యూనియన్ ద్వారా గొర్రెల పెంపకందారులకు 20 శాతం రాయితీతో రుణాలు ఇచ్చి వారి ఎదుగుదల, అభివృద్ధికి తోడ్పడినందుకు ఫంక్షనల్ రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశాన్ని కార్యనిర్వహణ అధికారి డాక్టర్ జి.ఉమ పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు


సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ శ్రీనివాస టిస్టైల్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

■ ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా Degree, P.G, M.B.A, M.C.A, Authorised Study & Exam Center. డైరెక్ట్ 10th ఒకే సం॥లో ఇంటర్. భవ్య అకాడమీ (Since: 2001) ✆ 97053 35678

**REAL ESTATE**

**FLAT FOR SALE**

■ 2 BHK Flat No. 104 in Kanakadurga Appartments, Chandrababu Naidu Colony, Benz Circle, Vijayawada. ✆ 94949 49559, 94909 64625, 7780 228 600

**TO-LET**

■ రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్‌పార్క్ దగ్గర 60 అడుగులు రోడ్డుకు చేర్చి 425 గజముల స్థలం అద్దెకు ఇవ్వబడును. హాస్పిటల్స్, షోరూమ్స్ అనుకూలం. సెల్ : 98492 42401

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**SERVICES**

■ USA Australia Visit Visa to work converted available Chefs Nanny Hotel Servers available urgently 9640244456

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

**BANQUET HALL**

■ Hotel Kosala (with FOOD or HALL only Packages) – Banquet Hall offering customizable event space for weddings, engagement, corporate meetings, memorable gatherings of various sizes. Five Halls available from 20 to 500 gathering with food or hall only packages available contact : ✆ 88855 32655 / 88855 32877

**WANTED**

■ Multipurpose Health Asst. / PRO - (M)-1, Qul: 10th/Inter / Degree (F) Nurse-1. Qul: ANM/GNM-Fresher, Sal.: Negotiable. SLN Hospitals, VJA ✆ 9666947666, 0866-2470032

■ విజయవాడ గంగూరు వద్ద గల ఇంటర్నేషనల్ స్కూల్‌కు 5 సం॥ అనుభవం, 10th చదివి, 45 సం. లోపు అర్హత గల మేల్ సెక్యూరిటీ గార్డు కావలెను ✆ 78938 84421 Call Time 8 AM to 7 PM

■ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్ VRS స్టేట్ & సెంట్రల్ ఎంప్లాయీస్, గృహిణిలు, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 40 to 68, Q: 10th + జీ: 12-15 వేలు ✆ 63041 81391

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ VJA ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 888 632 4444

■ ప్రముఖ MNC కంపెనీకి VRS రిటైర్డ్, ప్రైవేట్, గవర్నమెంట్ ఎంప్లాయీస్, లెక్చరర్స్, టీచర్స్, మార్కెటింగ్, గృహిణులు, ఆడిటర్స్ కావలెను. వ: 35-65 సం॥లు ✆ 91210 11579

■ బుక్‌వర్క్స్ నందు పని చేయుటకు DTP ఆపరేటర్స్ (జీతం 25,000/- నుండి 30,000/- వరకు) & లేడి టెలికాలర్స్ జీతం: 10,000/- నుండి 15,000/- వరకు) కావలెను. ✆ 95504 83720

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. డైలీ పేమెంట్స్ డైలీ 4000/-. వివరాలకు వాట్సప్/కాల్ : 98856 82589

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:81218 18692

■ రియల్‌ఎస్టేట్Co.HYD,కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. జీ/కమీషన్ + 2 వీలర్+రూం+ఫ్రీ. Age: 32,నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. Ph: 7416396781

■ మచిలీపట్నం లోకల్‌లో మాబ్రాంచ్ నందు పని చేయడానికి ఫైబ్ డెలివరీ బాయ్స్ కావలెను. బైక్, స్మార్ట్‌ఫోన్+DL మస్ట్‌గా ఉండాలి. నెల సంపాదన: 20,000–30,000. 8686242288,9059910338

■ కష్టమైన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15-40 వేలు. ఫ్రీ రూం+ భోజనం. HYD. 9182260297

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073

7995092112 9010201611 9505507329 9010577706 9010210382 రూ.600/- రూ.150/-


### ఆన్‌లైన్లో మందులు ఆర్డర్ చేస్తే.. రూ.71వేలు స్వాహా

**పెనమలూరు:** ఆన్‌లైన్‌లో మందులు బుక్ చేసిన వ్యక్తి వద్ద నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 71,506 సొమ్ము స్వాహా చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు కామయ్యతోపునకు చెందిన అట్లూరి వినయ్‌కుమార్ ఆన్‌లైన్‌లో కొన్ని మందులను కొద్ది రోజుల క్రితం ఆర్డర్ చేశాడు. అయితే మందులు పంపాలని చెప్పిన చిరునామాకు మందులు పంపటం కుదరదని వేరే చిరునామా ఇవ్వాలని వినయ్ కుమార్‌కు మెయిల్‌తో పాటు ఫోన్‌కు ఎస్ఎంఎస్ కూడా వచ్చింది. దీంతో లింక్ కూడా వచ్చింది. వినయ్‌కుమార్ లింక్ క్లిక్ చేయగా ప్రభుత్వ లోగోలు కనపడ్డాయి. రూ. 25 పంపాలని ఉంది. అది నమ్మిన వినయ్‌కుమార్ తన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో రూ. 25 పంపాలని ప్రయత్నించగా ఓటీపీ వచ్చింది. ఓటీపీ వివరాలు ఇచ్చిన తరువాత అతని బ్యాంకు ఖాతా నుంచి రూ 71,506 సొమ్ము విత్‌డ్రా అయింది. జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

**పెనమలూరు:** పోరంకి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ఇంటిలిజెన్స్ (ఓస్ఈబీ) కార్యాలయంలో పెందుర్తి సత్యానగర్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ కె.సూర్యప్రసాద్(52) పని చేస్తున్నాడు. అతను బైక్‌పై వస్తూ పోరంకి వద్ద కుక్కలు అడ్డుగా రావటంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. రోడ్డు పక్కనే డ్రెయినేజీ నిర్మాణం రాళ్లు ఉండటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న సహ కానిస్టేబుల్ కంట్రోల్ రూమ్‌లో డ్యూటీలో ఉన్న పరవాడ బాబాజి ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన సూర్యప్రసాద్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రసాద్ చనిపోయినట్లు తెలిపారు.



సూర్యప్రసాద్ మృతదేహం

### టీ తాగుదామని వచ్చి.. అనంతలోకాలకు..

**డివైడర్‌ను బైక్ ఢీ కొట్టడంతో యువకుడు మృతి**

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** రోజూ మాదిరిగా టీ తాగేందుకని మిత్ర బృందంతో కలిసి బయటకు వచ్చిన ఓ యువకుడిని రోడ్డు మధ్యలోని ఓ గొయ్యి బలితీసుకుంది. మరో యువకుడిని తీవ్ర గాయాల పాల్జేసింది. ఈ ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వైవీ రావు ఎస్టేట్ ఇన్నర్‌రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ సుభాన్, కొండ్ర ఆకాష్‌కుమార్ దినేష్(20) స్నేహితులు. సుభాన్ నోవోటెల్ హోటల్ సమీపంలోని ఓ కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతుండగా, దినేష్ పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఫొటోగ్రఫీ నేర్చుకుంటున్నాడు. బుధవారం ఉదయం సుభాన్, దినేష్‌లతో పాటు మరో ముగ్గురు స్నేహితులు కలిసి వైవీ రావు ఎస్టేట్ సమీపంలో టీ తాగేందుకు బైకులపై వచ్చారు. దినేష్ బైక్ నడుపుతుండగా, సుభాన్ వెనుక కూర్చున్నాడు. బైక్ పైపుల రోడ్డు వైపు నుంచి వైవీ రావు ఎస్టేట్ వైపు వచ్చే క్రమంలో విక్రమ్ పబ్లిషర్స్ వద్దకు వచ్చే సరికి రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యిలో పడింది. బైక్ అదుపు తప్పడంతో దినేష్ రోడ్డు మధ్యన ఉన్న డివైడర్‌కు తగిలి, మొక్కలపై పడ్డాడు. దీంతో తల, నుదురు భాగం పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సుభాన్‌కు ఎడమ చేతికి, శరీరంపై గాయాలయ్యాయి. అప్పటి వరకు తమతో నవ్వుతూ ప్రయాణం కొనసాగించిన స్నేహితుడు ఒక్కసారిగా మృత్యు ఒడిలోకి చేరుకోవడంతో మరో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు స్నేహితులు షాక్‌కు గురయ్యారు. వెంటనే దినేష్ తండ్రి ఏడుకొండలకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుభాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడంతో పాటు పోస్టుమార్టం నిమిత్తం దినేష్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ఉరేసుకుని ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**పెనమలూరు:** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణా జిల్లా యనమలకుదురులో బుధవారం చోటు చేసుకుంది. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరి 9వ బెటాలియన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా మల్లం చిరంజీవి(40) పని చేస్తున్నాడు. ఈయన గత కొద్ది సంవత్సరాలుగా ఇంటిలిజెన్స్‌లో కారు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. యనమలకుదురు ఇంద్రకీలాద్రి నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో భార్య గాయిత్రి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో నివసిస్తున్నాడు. కాగా చిరంజీవికి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తరచూ ఇంట్లో బాధ పడేవాడు. పిల్లలను చదివించలేకపోతున్నానని ఆవేదన చెందేవాడు. కాగా మంగళవారం రాత్రి భార్య గాయిత్రితో గొడవపడటంతో ఆమె పిల్లలతో బంధువుల ఇంటికి వెళ్లింది. చిరంజీవి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అయితే అతను బుధవారం డ్యూటీకి రాకపోవటంతో సహ ఉద్యోగి ఒకరు ఇంటికి వచ్చి చూడగా చిరంజీవి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. దీంతో పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి ఎస్ఐ ఫిరోజ్ చేరుకొని కేసు నమోదు చేశారు.

# రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ రద్దీకి కళ్లెం

- వారధి సర్కిల్‌లో నిత్యకృత్యంగా మారిన ట్రాఫిక్ రద్దీ
- ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు చేపట్టిన అధికారులు
- బౌద్ధ ధర్మచక్రం ముందు శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణలో భాగంగా ధర్మచక్రం వద్ద జరుగుతున్న పనులు

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** నగరంలోని కనక దుర్గ వారధి సర్కిల్‌లో బౌద్ధ ధర్మచక్రం వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. పలు శాఖల అధికారుల సమన్వయంతో బౌద్ధ ధర్మచక్రం పార్కు ప్రధాన ద్వారం తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారధి సర్కిల్‌లో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణ లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. నగరం మధ్యలో వారధి సర్కిల్ మీదుగా చెన్నై–కోల్‌కతా, హైదరాబాద్–మచిలీపట్నం జాతీయ రహదారులు వెళ్తుండడంతో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. వారధి సర్కిల్‌లోని బౌద్ధ ధర్మచక్రం పార్కు ముందు రోడ్డు ఇరుకుగా ఉండటంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పోలీస్ అవుట్ పోస్టు నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ, ట్రావెల్స్ బస్సులు గుంటూరు వైపు నుంచి వచ్చి వారధి వద్ద కృష్ణలంక వైపు ఉన్న బస్టాప్‌లో ప్రయాణికులను దింపుతారు. అక్కడ నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లేందుకు బస్సులు పార్కు ముందు నుంచి కుడి వైపు తిరుగుతాయి. అదేవిధంగా బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనాలు కృష్ణలంకలోకి ప్రవేశించేందుకు పార్కు ముందు నుంచి యూ టర్న్ తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో పార్కు ముందు రోడ్డు ఇరుకుగా ఉండటం, ఒకేసారి వాహనాలు మలుపు తిరిగే క్రమంలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు మూడు రోజుల క్రితం జాతీయ రహదారి, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్ మూడు శాఖల అధికారులు సమన్వయంతో వారధి సర్కిల్ ప్రాంతాన్ని పరిశీలించారు. ధర్మచక్రం ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని కొంత తగ్గించి రోడ్డు విస్తరణ చేపడితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిర్ణయించి ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. పార్కు ముందు ఉన్న గేట్‌ను తొలగించి కొంచెం వెనుకకు జరిపి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. గత మూడు రోజులుగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అధికారులు పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రోడ్డు మీద నిలిపిన ఆటోలు

### అడ్డ దిడ్డంగా ఆటోల నిలుపుదలతో సమస్య

వారధి సర్కిల్‌లో ఆటో స్టాండ్‌లు ఎక్కువగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. అసలే రోడ్డు ఇరుకుగా ఉండటం, ఆపై ఆటో స్టాండ్‌లో ఆటోలు నిలుపుతుండడంతో రోడ్డు కుచించుకుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. ప్రయాణికుల కోసం రోడ్డు పైనే ఆటోలను పార్కింగ్ చేసి ఉంచడం వలన గుంటూరు వైపు నుంచి వచ్చే బస్సులను రోడ్డు మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బస్సుల నుంచి దిగే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేక రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ నిలిచిపోతోంది. బౌద్ధ ధర్మచక్రం వద్ద రోడ్డు విస్తరణ పనులు చేయడంతో పాటు ఆటోల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## దుర్గమ్మ సేవలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుధవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన శంకర్‌రావుకు అధికారులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. శంకరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, ఖడ్గమాల వస్త్రాలను అందజేశారు.

## సహస్ర లింగార్చనలో విశేషాలంకరణ

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామివారి సన్నిధిలో బుధవారం సహస్ర లింగార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ వేదిక వద్ద ఆలయ అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి పంచహారతుల సేవ, అనంతరం ఆకాశ దీపం, శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు.

## క్లుప్తంగా

### రెండోరోజూ కొనసాగిన ఆక్రమణల తొలగింపు



**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోని కేదారేశ్వరరావు పేటలోని ఫ్రూట్ మార్కెట్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే క్రమంలో వీఎంసీ–పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ బుధవారం కొనసాగింది. డీసీపీ చంద్రబోస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో రోడ్డును ఆక్రమించి మెట్లు నిర్మించటం, డ్రైనేజీలను మూసేసేలా నిర్మించిన కల్వర్టులు నిర్మించి సిల్టు తొలగింపునకు అవరోధంగా ఉన్న కట్టడాలను, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వాటిని తొలగించామని ఆయన తెలిపారు.

### మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**పటమట(విజయవాడతూర్పు):** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, నగర పంచాయతీల్లో ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరఫున మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి కన్నబాబుకు వినతిపత్రం అందించినట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు తెలిపారు. సీడీఎంఏ కార్యాలయంలో బుధవారం కన్నబాబును కలిసి తమ సమస్యలను వివరించామన్నారు. ప్రధానంగా మున్సిపాలిటీల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే కార్మికులు చనిపోతే వారికి చెల్లించే నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు ప్రభుత్వం ఉన్న బకాయిలను వెంటనే అందించాలని ఆ వినతి పత్రంలో కోరినట్టు చెప్పారు.

### ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదం



**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఈసెట్–2025 ఆఫ్‌లైన్ విద్యార్థులకు సాయి మేధా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. వారికి బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టాలెంట్‌టెస్ట్‌లు దోహదపడతాయన్నారు. పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు టాలెంట్ టెస్ట్‌ల నిర్వహణ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సాయిమేధ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు ఇలాంటి పరీక్షలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



**లబ్బీపేట(విజయవాడతూర్పు):** సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. వ్యక్తిగత బ్యాంకు, ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు. కృష్ణాజిల్లా లారీఓనర్స్ అసోసియేషన్ సైబర్ నేరాలపై ముద్రించిన బ్రోచర్స్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. బెంజిసర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో రవికుమార్‌తో పాటు, సైబర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మూర్తి పాల్గొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

### అలరించిన వీణాగాన కచేరి

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం వీణాగాన కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన అచలా శంకర్‌నాథ్ పలు కీర్తనలకు వీణపై చక్కగా పలికించగా, మృదంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్ ఆచార్య చక్కటి సహకారం అందించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నిర్వహించిన కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమం అనంతరం వీణ కచేరి నిర్వహించిన బృందానికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం శాఖాధిపతులతో కౌన్సిల్ అజెండాపై ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలో ఉన్న ప్రతి ప్రతిపాదనను శాఖాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలకు అధికారులందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు సత్యనారాయణ, సత్య కుమారి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త వాహనాల నుంచి రోడ్లపై పడుతున్న వ్యర్థాలు



ఆటోనగర్ గేట్ సమీపంలో ట్రాక్టర్‌లో తీసుకెళుతుండగా కింద పడిన చెత్తాచెదారాలు

**ఆటోనగర్(విజయవాడతూర్పు):** నగర పాలక సంస్థ శానిటేషన్ అధికారులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. నగరంలో గుండా డంపింగ్ యార్డ్‌కు చెత్తను తరలించే విషయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే వాహనాల నుంచి వ్యర్థాలు కిందపడుతున్నాయి. రోడ్డు మీద పడిన చెత్తా చెదారాలను తీయడంలేదు. ట్రాక్టర్.. టాటా ఏసీ వాహనాలు వెళుతుండగా రహదారి మీద వెళ్లేవారి మీద కూడా వ్యర్థాలు పడుతున్నాయి. వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు తప్పనిసరిగా చుట్టూ పట్టను కట్టి తీసుకెళ్లాలి. అలా కాకుండా ఏమీ కట్టకుండా తీసుకువెళ్లడం వలన వ్యర్థాలు వాహనాల పై నుంచి రోడ్ల పైన పడటమే కాకుండా అడపాదడపా వెనుకగా, పక్కగా వెళుతున్న ప్రయాణికుల పైన కూడా పడుతున్నాయి. బుధవారం బందరు రోడ్డు నుంచి ఆటోనగర్ గేట్ మీదుగా వంద అడుగుల రోడ్డు లోకి వెళుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్‌లో నుంచి వ్యర్థాలు కింద పడ్డాయి. అదే సమయంలో అక్కడ ఉన్న వారు తప్పుకున్నారు. లేకపోతే జనం మీద పడిఉండేవి. వాహనాల్లో చెత్తను తీసుకెళ్లేటప్పుడు కనీస జాగ్రత్తలు చేపట్టాలని, కింద వ్యర్థాలు పడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వాంబే కాలనీకి చెందిన ఓలేటి విఘ్నేష్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఎస్.కన్వెన్షన్‌లో తన స్నేహితుడి రిసెప్షన్‌కు ఈనెల 19వ తేదీ రాత్రి బైక్‌పై వెళ్లాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ విఘ్నేష్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విఘ్నేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్నేహితులు అతనిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం విఘ్నేష్ మృతి చెందాడు. విఘ్నేష్ తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

## మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం





**లబ్బీపేట(విజయవాడతూర్పు):** మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయంటూ ఎన్‌సీసీ 17 ఆంధ్రా బెటాలియన్ కేడెట్స్ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నలంద డిగ్రీ కళాశాలతో పాటు, వివిధ కళాశాలలకు చెందిన 200 మంది ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వింగ్‌లకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ర్యాలీని సుబేదార్ సురేష్‌చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వలన ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. వాటి వాడకాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కె.సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి కలెక్టరేట్ గౌరవం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమన్వయ, మెజిస్టీరియల్, ఎలక్షన్స్, ల్యాండ్ తదితర సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు సూచనలు, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టరేట్‌కు వెళితే తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలన్నారు. ఆ మేరకు సిబ్బంది పనిచేయాలన్నారు. పని ఎంత చిన్నదైనా, పెద్దదైనా సమాన ప్రాధాన్యమిచ్చి సత్వరం పూర్తిచేయాలన్నారు. విధి నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం అనేది ఉండకూడదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థ పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలి



ప్రజారోగ్య విభాగం అధికారులను సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగరంలో ప్రతినిత్యం సమర్థమైన పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సత్యనారాయణపురం, సింగ్ నగర్, ఎక్సెల్ ప్లాంట్, బీసెంట్ రోడ్, పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) వాహనాల డ్రైవర్లు సమ్మె చేస్తున్నందున ఇంటింటి చెత్త సేకరణలో, సేకరించిన చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, వ్యర్థాల తరలింపునకు ట్రాక్టర్ల సంఖ్యను మరింత పెంచి సమర్థమైన పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఇన్‌చార్జి ఏసుపాదం పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు

సాక్షి స్పందన

**బస్టాండ్(విజయవాడ పశ్చిమ):** పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై 'సాక్షి' దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డా..నెహ్రూ బస్‌స్టేషన్' కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజూ ఇద్దరు ట్రాఫిక్ సూపర్ వైజర్లు, ఇద్దరు ఆర్టీసీ కానిస్టేబుళ్లు అవుట్ పోస్టు పోలీస్ సిబ్బందితో కలిసి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ్‌లో ప్రతి రెండు గంటలకు ఒకసారి తిరిగి అపరిచితులు (ప్రయాణికులను మినహాయించి) కనిపిస్తే వారి వద్దనుంచి వివరాలు తీసుకుని అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించటంతో పాటు అనుమానిత వ్యక్తులను కృష్ణలంక పోలీస్ సిబ్బందితో విచారించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై ఎటువంటి దాడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రయాణికులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## సద్గురువులకు స్వర నీరాజనం



గాత్ర కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్

**విజయవాడ కల్చరల్:** శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రం విద్యాభారతి శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న 31 వ వార్షిక సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో అంతర్జాతీయ కర్నాటక సంగీత విద్వాంసులు, సంగీత ప్రయోక్త విఘ్నేష్ ఈశ్వర్ నిర్వహించిన కచేరీ మధురంగా సాగింది. త్యాగరాజ స్వామి కృతి జగదానందకారక కీర్తనతో ప్రారంభించి, వందే వాసుదేవంతో పాటు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై కేవీ కృష్ణ, మృదంగంపై కె.సద్గురు చరణ్, ఘటంపై ఎం.చంద్రకాంత్ సహకరించారు. శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ సంగీత సభ ద్వారా 31 సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కచేరీ నిర్వహిస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్ సంగీత విశేషాలను వివరించారు. సభా కార్యక్రమంలో సంగీత రంగానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు అందజేస్తునట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సభ్యులు గాయత్రీ గౌరీనాథ్, బి.హరిప్రసాద్ పాల్గొన్నారు. సంగీత విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నేటి కార్యక్రమాలు: సాయంత్రం 6.30 గంటలకు హేరంబ్, హేమంత్ వేణునాదన. ప్రవేశం ఉచితం.

## ● హమ్మయ్య... గుంతలు సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్



నాడు : నైస్ బార్ జంక్షన్‌లో గతుకులమయంగా ఉన్న రోడ్డు



నేడు : మరమ్మతులు చేసిన తర్వాత...

మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై పడిన గుంతలను కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది మరమ్మతులు చేశారు. స్థానికంగా ఉన్న రహదారులపై గుంతలు పడి రాకపోకలు సాగించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్న విషయాన్ని వివరిస్తూ ఈ నెల 10వ తేదీన 'సాక్షి' దినపత్రికలో "రోడ్లపై గుంతలను పూడ్చండి సారూ" శీర్షికన కథనం ప్రచురితమైంది. నైస్ బార్ జంక్షన్, సురక్ష ఆసుపత్రి రోడ్డు, మధుచౌక్‌లోని రోడ్లపై ఉన్న గుంతలకు కార్పొరేషన్ సిబ్బంది ప్యాచ్‌వర్క్ చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి, కార్పొరేషన్ అధికారులకు స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)



నాడు : సురక్ష ఆసుపత్రి రోడ్డులో ధ్వంసమైన రోడ్డు



నేడు : మరమ్మతులు చేసిన తర్వాత...

## దర్శకేంద్రుడు రాఘవేంద్రుడు



**విజయవాడకల్చరల్:** తెలుగు సినీ దర్శకులలో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు అని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన సినీ చిత్రగీతాలు, గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ రాఘవేంద్రరావు 75 చిత్రాలకు దర్శకత్వం వహించి, అనేకమంది నటీనటులను తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. వివిధ రంగాల ప్రతినిధులు వడ్డాది కామేశ్వరి, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ, కె.డేవిడ్‌రాజు, డి.వీరబద్రరావు, కొప్పుల ఆనంద్, చావా నరసింహారావు, ప్రసూనా రామన్ తదితరులు రాఘవేంద్రరావు జీవిత విశేషాలను వివరించారు. అనంతరం రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను గాయనీ గాయకులు సుశీల్‌కుమార్, పి.శ్రీనివాసరావు, అయ్యప్పన్, కిరణ్, స్వాతి మీరాకుమార్, బెల్లంకొండ భారతి, ఉమామహేశ్వరి ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

### బాల్య వివాహాల నిరోధం అందరి బాధ్యత



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి అన్నారు. గాంధీనగర్‌లోని శారద కళాశాలలో బుధవారం బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్యంలో వివాహాలు చేయడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. విద్యార్థినులు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, లేదా 1098 నంబర్లకు ఫోన్ చేస్తే బాల్య వివాహాలను అడ్డుకుంటారన్నారు. పేదరికం వల్లనో, ఇతర కారణాల చేతనో బాల్య వివాహాలు చేసే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రోజేష్ కుమార్, అర్థ శాస్త్ర అధ్యాపకురాలు రత్నకుమారి పాల్గొన్నారు.







## వైభవంగా లక్ష కుంకుమార్చన



తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం లక్ష కుంకుమార్చన సేవ వైభవంగా జరిగింది. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారిని ఆశీనులను చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మీ అష్టోత్తరం, లక్ష్మీ సహస్ర నామాలను వల్లిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చన చేశారు. ఈ సేవలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు. – చంద్రగిరి

## మద్యం దుకాణం మాకొద్దు



ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలంలోని కొత్తూరు చెక్ పోస్ట్ సెంటర్ సమీపంలో వైన్‌షాపులు నిర్వహించడంపై బుధవారం కొత్తూరి గ్రామస్తులు ధ్వజమెత్తారు. జనావాసాలు, ఆలయాలు, విద్యాసంస్థల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. మద్యం దుకాణం మాకొద్దంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ అశోక్ అక్కడకు వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడి షాపు తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. – కామవరపుకోట

## విమానాశ్రయంలో విదేశీ బల్లుల పట్టివేత





అక్రమంగా రవాణా చేస్తున్న ప్రమాదకరమైన, అరుదైన విదేశీ బల్లుల్ని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం పట్టుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, కస్టమ్స్, అటవీ శాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్‌లో ఇవి పట్టుబడ్డాయి. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అరుదైన బల్లులు అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎయిర్‌పోర్టులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మూడు బ్లాక్డ్ బ్లూ టంగ్డ్ బల్లులు, 3 వెస్టన్ బ్లూ టంగ్డ్ బల్లుల్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ బల్లులను ఎవరు, ఎవరికి పంపిస్తున్నారనే కోణాల్లో అధికారులు విచారణ చేపట్టారు. పెంపుడు జంతువులుగా పెంచుకోడానికా లేక ఈ అక్రమ తరలింపు వెనుక ఇంకా ఏమైనా ఇతర కారణాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని డీఆర్ఐ అధికారులు తెలిపారు. – సాక్షి, విశాఖపట్నం

# హిజ్రానేత దారుణహత్య

- కత్తులతో నరికి చంపిన దుండగులు
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘటన



మృతురాలు హాసిని

కొడవలూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం జరిగింది. కొడవలూరు మండలం టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి హిజ్రానేతను కత్తులతో నరికి హత్యచేశారు. టీపీ గూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని (33) పదమూడేళ్ల వయస్సులోనే ఇంటినుంచి వెళ్లిపోయి హిజ్రాగా మారారు. ఆర్థికంగా బాగా బలపడడంతోపాటు కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని హిజ్రాలకు నేతగా ఎదిగారు. కొన్నేళ్ల కిందట తిరుపతిలోని మంగళం ప్రాంతానికి నివాసం మార్చారు. హాసిని ఎదుగుదలను ఓర్వలేని మరోవర్గం కక్ష పెంచుకుంది. హాసిని తల్లి విజయమ్మ స్వగ్రామమైన విడవలూరు మండలం పార్లపల్లిలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ఆరునెలల కిందట ఆర్థిక సహకారం అందించారు. ఈ ఆలయ ప్రారంభ కార్యక్రమాలు సోమవారం మొదలయ్యాయి. మంగళవారం జరిగే అభిషేకాలు, పూజలకు సుమారు 20 మంది హిజ్రాలతో హాసిని తిరుపతి నుంచి వచ్చారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి కారులో వెళుతుండగా టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద రెండుకార్లలో వచ్చిన దుండగులు అటకాయించి హాసిని మెడపై కత్తులతో నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన హాసినిని.. వెనుక ఆటోలో వస్తున్న సహచర హిజ్రాలు నెల్లూరులోని అపోలో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్ఐ సీహెచ్.కోటిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు.. గుండెపోటుతో వీఆర్వో మృతి

- అక్టోబర్‌లో జీతం ఇంకా ఇవ్వలేదు
- రెవెన్యూ మంత్రికి వీఆర్వోల సంఘం లేఖ



గనిరాజు (ఫైల్)

రాజానగరం: తీవ్ర పని ఒత్తిడి, జీతాలందక ఆర్థిక ఇబ్బందులు ఒక వీఆర్వో ప్రాణాలు తీసుకున్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో), వీఆర్వోల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి పెనుమాక గనిరాజు (47) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి వరకు పని చేసిన ఆయనకు గుండెనొప్పి రావడంతో వెంటనే రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు. కడియం మండలం జేగురుపాడుకు చెందిన గనిరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పని ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఉక్కిరిబిక్కిరి చేయడంతో గనిరాజు గుండెపోటుకు గురై మృతిచెందారని మండల వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జాన్, ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ మంత్రికి లేఖ రాశారు. అధికారులు అనేక పనులు పురమాయిస్తున్నారని తెలిపారు. దీనికితోడు టార్గెట్లు పూర్తిచేసే వరకు జీతాలు కూడా నిలిపేయడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని పేర్కొన్నారు. ఇంతవరకు అక్టోబర్ నెల జీతాలు రాలేదని తెలిపారు. దీంతో కుమార్తెల ఫీజు, ఇంటి అద్దె సకాలంలో చెల్లించలేక ఆవేదనతో ఉన్న గనిరాజు.. నీటిపన్నుల కలెక్షన్ డేటాను త్వరగా ఎంట్రీ చేయాలని అధికారులు ఫోన్‌లో ఆదేశించడంతో మంగళవారం అర్ధరాత్రి వరకు అదేపనిలో నిమగ్నమై గుండెపోటుకు గురయ్యారని వారు పేర్కొన్నారు.

## నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు

చంద్రగిరి: సీఎం చంద్రబాబు బుధవారం రాత్రి తిరుపతి జిల్లాలోని తన స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు ఈనెల 16న అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం కర్మక్రియలు నిర్వహించనున్న నేపథ్యంలో సీఎం అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో పాటు ఆయన తనయుడు లోకేశ్, కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 7.25 గంటలకు నారావారిపల్లెకు చేరుకున్నారు.

# బూడిదపై చల్లారని రగడ

## తాడిపత్రి నుంచి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీలు

- ఆర్టీపీపీ 600 మెగావాట్ల యూనిట్ వద్దే అడ్డుకున్న పోలీసులు
- బకాయిలిచ్చి, రవాణాలో 50 శాతం వాటా ఇవ్వాలంటున్న ఎమ్మెల్యే ఆది వర్గీయులు
- భారీగా మోహరించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు..144 సెక్షన్ విధింపు



ఆర్టీపీపీలో జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీలను నిలిపేసిన పోలీసులు

ఎర్రగుంట్ల/కొండాపురం: వైఎస్సార్ జిల్లాలోని డాక్టర్ ఎం వీఆర్ఆర్ ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న బూడిద (ఫ్లైయాష్) కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయుల మధ్య రాజుకున్న రగడ చల్లారలేదు. ఆర్టీపీపీలో బుధవారం పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలుచేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యామిని తెలిపారు. మరోవైపు.. తాడిపత్రి నుంచి బూడిద కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన ఆరు లారీలు వచ్చాయి. పోలీసులు వీటిని ఆర్టీపీపీ 600 మెగావాట్ల యూనిట్ వద్దే నిలిపేశారు. డ్రైవర్లను దించి లోడింగ్‌కు అనుమతిలేదని వారికి పోలీసులు తెలిపారు.

### సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఉత్కంఠ..

మరోవైపు.. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొండాపురం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి మండలంలోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆర్టీపీపీకి వస్తారేమోనని సాయంత్రం వరకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. అయితే ఆయన రాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

### బకాయిలిచ్చి 50 శాతం వాటా కల్పించాలి..

ఆర్టీపీపీలో ఉన్న యాష్ పాండ్ నుంచి వస్తున్న బూడిద సరఫరాకు సంబంధించి తమకు రావాల్సిన బకాయిలను చెల్లించి, సరఫరాలో 50 శాతం వాటా కల్పించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరుడు సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. యాష్‌పాండ్‌లోని బూడిదను తాడిపత్రిలోని ఎల్ అండ్ టీ ఫ్యాక్టరీకి నేరుగా సరఫరా చేసేవాళ్లమన్నారు. అప్పుడు ఫ్యాక్టరీ వారు సకాలంలో బిల్లులు ఇచ్చేవారన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆ ఫ్యాక్టరీతో ఒప్పందం చేసుకోవడంతో ఆయనకు బూడిదను సరఫరా చేశామన్నారు. అయితే, ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదన్నారు. సుమారు రూ.80 లక్షలు బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని.. అలాగే సరఫరాలో 50 శాతం వాటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తమ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి తెలియజేశామన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీలకు లోడింగ్ చేయబోమని ఆయన తెగేసి చెప్పారు.

# ఫార్మా సిటీలో ప్రమాదం

- తాగూర్ లేబొరేటరీలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీక్
- ఒకరి మృతి, 8 మందికి తీవ్ర అస్వస్థత



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో షేక్ ఆయేషా, ఇతర అధికారులు

పరవాడ/తుమ్మపాల : జేఎస్ ఫార్మా సిటీలోని తాగూర్ లేబొరేటరీ యూనిట్–3లో మంగళవారం రాత్రి హైడ్రోక్లోరిక్ (హెచ్‌సీఎల్) యాసిడ్ లీకైన ఘటనలో 9 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఒడిశాకు చెందిన అభిజిత్ దాస్ (23) మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ల్యాబ్‌లోని రియాక్టర్–కమ్–రిసీవర్ ట్యాంక్ (జీఎల్ఆర్–325) నుండి లిక్విడ్ రూపంలో ఉన్న 400 లీటర్ల హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీక్ అయింది. ఆ సమయంలో ప్రొడక్షన్ బ్లాక్‌లో రియాక్టర్ వద్ద 11 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారు ఆ విష వాయువును పీల్చడంతో వెంటనే స్పృహ తప్పారు. యాజమాన్యం వారికి సపర్యలు జరిపి, బుధవారం ఉదయం 6 గంటలకు వడ్లపూడిలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ అభిజిత్ దాస్ అనే కార్మికుడు మృతి చెందాడు. మిగిలిన వారిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో సీహెచ్ వీరశేఖర్, చిన్నికృష్ణల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వీరబాబు, రాజారావు, పాపారావు, అనిల్‌కుమార్, విజయ భాస్కర్, శరత్‌కుమార్‌లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.ఎస్.నారాయణ, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటనా స్థలిని సందర్శించి, ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, ప్రమాద ఘటనను యాజమాన్యం గోప్యంగా ఉంచడాన్ని సీఐటీయూ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తప్పుపట్టారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇదిలా ఉండగా ప్రమాద ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాద కారణాన్ని తెలుసుకునేందుకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను ఆదేశించామన్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధితుల నుండి ఫిర్యాదు అందినట్లు వెల్లడించారు. కాగా, ప్రమాదంలో గాయపడి, షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను వైఎస్సార్‌సీపీ విశాఖజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు.

### బాధితులకు మెరుగైన వైద్యం అందించండి: సీఎం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా పరవాడలోని తాగూర్ లేబొరేటరీ యూనిట్‌లో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురైన సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయం లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా వారికి సాయం అందించాలని సూచించారు. బాధితులకు అందుతున్న సాయంపై జిల్లా యంత్రాంగం, సంబంధిత మంత్రులు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: వైఎస్ జగన్

అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలో తాగూర్ లేబొరేటరీ యూనిట్‌లో విషవాయువు లీకై ఒక కార్మికుడు మృతి చెందగా, 8 మంది తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంతో పాటు మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అప్పల బాధతో రైతు ఆత్మహత్య



కుళ్లాయప్ప (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: పంటలు సరిగా పండక, అప్పులు తీర్చే మార్గం కానరాక శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల గ్రామంలో బుధవారం రైతు బిల్లే కుళ్లాయప్ప(49) ప్రాణాలు తీసుకున్నాడు. పొలంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు వెళ్లే టవర్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. కుళ్లాయప్ప, అతడి భార్య బిల్లే మణి పేర్లమీద తొమ్మిదెకరాల పొలం ఉంది. కొన్నేళ్లుగా అందులో అరటి, టమాట సాగుచేస్తున్నారు. వరుస నష్టాలు చవిచూస్తున్నారు. ఒక్కసారైనా పంట పండకపోతుందా అన్న ఆశతో అప్పులు చేసి మరీ సాగుచేశారు. కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. మొత్తం రూ.9 లక్షలకు చేరిన అప్పుల్ని ఎలా తీర్చాలో దిక్కుతోచలేదు. ఇంట్లో అప్పుల గురించి ప్రస్తావిస్తూ ఆవేదన చెందేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి సమీపంలోని తన తోటలోకి వెళ్లి కరెంటు టవర్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల రైతులు కుటుంబసభ్యులకు తెలిపారు. అందరూ వెళ్లి పరిశీలించేసరికే కుళ్లాయప్ప మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# కదిలిన అధికార గణం

- జిల్లాలో సివిల్ సప్లయిస్ కార్యదర్శి, కలెక్టర్ పర్యటన
- ఎట్టకేలకు ముమ్మరంగా సాగుతున్న ధాన్యం సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



గండిగుంటలో సర్వీసు రోడ్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీరపాండ్యన్

కంకిపాడు: ఎట్టకేలకు అధికారగణం కదిలింది. ధాన్యం సేకరణలో జరుగుతున్న లోటుపాట్లను సరిచేసేలా చర్యలకు ఉపక్రమించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం సేకరణలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం సేకరణ ప్రహసనంగా సాగుతున్న తీరు, రైతుల అవస్థలపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనాలతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఫలితంగా నిన్నటి వరకూ కల్లాల్లోనే ఉన్న ధాన్యం రాశులు ఇప్పుడు మిల్లులకు తరలుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా జిల్లా వ్యాప్తంగా 1.64 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. పది రోజులకుపైగా జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే గోనె సంచులు అందక, రవాణా వాహనాలను సమకూర్చటంలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడే ధాన్యం రాశులు ఉండిపోయి, మరో వైపు తుపాను భయంతో ఆందోళనకు గురయ్యారు. రైతుల ఇబ్బందులపై 'సాక్షి'లో వచ్చిన కథనాలతో సివిల్ సప్లయిస్ అధికారులు స్పందించారు. ఆ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఉయ్యూరు మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. రవాణా శాఖ, రెవెన్యూ అధికారులు ప్రైవేటు వాహనాలను సమకూర్చి గ్రామాలకు పంపుతున్నారు. ఆయా వాహనాల్లో బస్తాలకెత్తిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లులకు తరలిస్తున్నారు. అనంతరం ఉయ్యూరు ఆర్‌డీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై వీరపాండ్యన్ సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలూ తీసుకుంటున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమ శాతమే తుది నిర్ణయం అని, మిల్లర్లు ఆ ప్రకారమే ధాన్యం సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

### సివిల్ సప్లయిస్ డీఎంగా పద్మాదేవి

ధాన్యం సేకరణలో నెలకొన్న ఇబ్బందులు, రైతులకు కలిగిన అసౌకర్యంపై సివిల్ సప్లయిస్ అధికారులు శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలో ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా ఉండటాన్ని గుర్తించారు. సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి డీఎం బాధ్యతల నుంచి డి.సృజనను తప్పించారు. ఈ మేరకు ఆ శాఖ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ మంగళవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. ఎస్‌పీఎస్ నెల్లూరులో డెప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ పద్మాదేవికి కృష్ణా జిల్లా సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి డీఎంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మనజీర్ జిలానీ సమూన్ ఉత్తర్వులిచ్చారు.

## 'పద్మావతి' బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### టీటీడీ ఈవో శ్యామలరావు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను గురువారం నుంచి డిసెంబరు 6 వరకు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈవో శ్యామల రావు తెలిపారు. తిరుచానూరులో అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఈవో అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీటీడీలోని అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ పరిసరాలలో చలువపందిళ్లు, రంగోలీలు, క్యూలు, బారికేడ్లు, అమ్మవారి ఆలయం, మాడ వీధుల్లో శోభాయమానంగా విద్యుత్ అలంకరణలు చేపట్టామన్నారు. తిరుచానూరు పరిసర ప్రాంతాలతో పాటు, పద్మ పుష్కరిణికి నాలుగు వైపులా 20 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. పంచమి తీర్థం సందర్భంగా మెరుగైన సౌకర్యాలు కల్పించామని ఈవో తెలిపారు. డిసెంబరు 5 సాయంత్రం నుంచి భక్తులు వేచి ఉండేందుకు తిరుచానూరు పరిసర ప్రాంతాల్లో నాలుగు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు రోజుకు 10 వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.



అంకురార్పణ ఘట్టాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు

### బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి శుభసూచికంగా బుధవారం రాత్రి ఆలయంలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ**

టెండరు ప్రకటన (పత్రికా ప్రకటన-09/24-25)

సం/- చీఫ్ ఇంజినీర్, మాస్టర్ ప్లాన్ జోన్, TGSPDCL, మింట్ కాంపౌండ్, హైదరాబాద్

DIPR RO No. 7091-PP/CL/Advt/1/2024-25, Dt : 26.11.2024

**HINDUPUR MUNICIPALITY**

NOTICE INVITED for Expression Of Interest

E.O.I No: 1/HDP/ Special Grant/2024-25, Dt: 27-11-2024

Expression of Interest (E.O.I) is invited by the undersigned from the Registered Consultancies having Registration in Govt. of A.P. and experience in similar nature of work for Preparation of Detailed Project Report for Providing Infrastructure Facilities such as internal roads, Drains, Dividers and central lighting in Hindupur Municipality under Government Funds duly conducting Detailed Investigation, Preparation of designs, Estimates etc., complete as per department directions.

1. Last date for Receipt of application along with Schedule cost of Rs. 2000/- - 16-12-24 upto 2.00 PM
2. Date of issue of Schedule - 29-11-2024
3. Last date for receipt of schedule (EOI) Along with EMD of Rs: 50,000/- - 16-12-24 upto 2.00 PM
4. Opening date - 17-12-24 upto 4.00 PM

For further details contact Cell No. 9849906635

Sd/- Commissioner, Hindupur Municipality

SAI

రిక్రూట్‌మెంట్ సెల్

హెడ్ ఆఫీస్, గేట్-10, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ -110003.

F.No.: 01-04001(02)/5/2023-HO - Personnel Division తేది: 18-11-2024

కాంట్రాక్ట్ ప్రాతిపదికపై చీఫ్ ఉద్యోగం కొరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దరఖాస్తులు కోరుతోంది.

యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), గరిష్టంగా 4 సంవత్సరాలు కాలవ్యవధి కొరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికపై చీఫ్ ఒక ఉద్యోగానికి నియామకం కోసం అర్హతగల, యోగ్యతగల మరియు ప్రేరణగల భారత పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. ఉద్యోగ వివరాలు మరియు ఇతర వివరాలు SAI వెబ్‌సైట్ అనగా http://sportsauthorityofindia.nic.inలో లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుట కొరకు షెడ్యూలు దిగువ ఇవ్వబడినది:

(i) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది: 20-11-2024 (ఉ.10.00 గం.)
(ii) ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 05-12-2024 (సా.05.00 గం.)

డిప్యూటీ డైరెక్టర్
రిక్రూట్‌మెంట్ సెల్
SAI హెడ్ ఆఫీస్

CBC - 47103/12/0014/2425

National Institute of Fashion Technology
Ministry of Textiles, Govt. of India

NIFT Admissions 2025

FREE COUNSELING
By NIFT Professors

Venue
P B SIDHARTHA COLLEGE OF ARTS & SCIENCE
Siddhartha Nagar, Vijayawada-10
on
29-11-2024
10.30 am to 12.30 pm

NTA Helpdesk No. 9310075593, 9310076577, 9310078175
Monday to Friday only 10:00 AM to 5:00 PM, 011- 69227700, 011- 40759000,
Email ID: nift@nta.ac.in, www.nift.ac.in

**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలకు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ-టెండరు ప్రకటన నం. 25-2024 తేది : 27.11.2024

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ కోఆర్డినేషన్/ గుంతకల్ వారు ఇ-టెండర్లు కోరుచున్నారు. ముగింపు తేది & సమయం : 24.12.2024న 15.00 గంటలకు

1. టెండరు నం.: Engg-GTL-Co-Ord-1735. పని వివరణ : గుంతకల్ డివిజన్ : గుంతకల్-పొటెన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్, క్వాలిటీ ఇన్ రైల్వే హైస్కూల్ (EM)తో రైల్వే పాఠశాల పునరుద్ధరణ. ప్రకటిత విలువ: రూ. 1,56,74,237.00, బయానా: రూ. 2,28,400.00.

2. టెండరు నం.: Engg-GTL-West-1736. పని వివరణ : గుంతకల్ డివిజన్ : CRS/TPTY స్పెసిఫికేషన్ నం. COFMOW/CNC/PWL/2020 ప్రకారం CNC పోర్టల్ వీల్ లేత్‌కు సంబంధించి 16x15 మీటర్ల సైజు కొత్త షెడ్ నిర్మాణం. ప్రకటిత విలువ: రూ. 56,43,289.31, బయానా: రూ. 1,12,900.00.

3. టెండరు నం.: Engg-GTL-North-1737. పని వివరణ : గుంతకల్ డివిజన్ : GY-WD సెక్షన్‌లో కి.మీ. 466/1-5 వద్ద ప్రస్తుతం గల Br.No.902A(RUB)LC190 వద్ద డ్రైనేజ్ అరేంజ్‌మెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి ప్రకటిత విలువ : రూ. 1,61,42,375.40, బయానా: రూ. 2,30,700.00

4. టెండరు నం.: Engg-GTL-South-1738. పని వివరణ : గుంతకల్ డివిజన్ : RU-KDP & GDR-TPTY సెక్షన్ : 20 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (ఫేజ్-I) కొరకు బెజినాల్ 2000తో కోట్ చేసిన హైటెన్సైల్ స్టీల్‌వైర్‌తో ఫిక్స్‌డ్ నాట్ ఫెన్సింగ్ ఉపయోగిస్తూ 130 Kmph మరియు అపై కొరకు ట్రాక్ పొడవునా సేఫ్టీ ఫెన్సింగ్/సరిహద్దు గోడ. ప్రకటిత విలువ : రూ. 5,08,41,717.96, బయానా: రూ. 4,04,200.00

5. టెండరు నం.: Engg-GTL-South-1739. పని వివరణ : గుంతకల్ డివిజన్ : DEN/South/GTL అధికార పరిధిలో LC రోడ్ సర్ఫేస్‌లు, గేట్ లాడ్జ్‌లు, టాయిలెట్స్, బ్యారికేడింగ్ హైట్‌గేజ్‌లు మరియు ఇండికేటర్ బోర్డులు మొ॥వాటికి అభివృద్ధి ప్రకటిత విలువ : రూ. 2,45,67,342.4 బయానా: రూ. 2,72,800.00

6. టెండరు నం.: Engg-GTL-South-1740. పని వివరణ : గుంతకల్ డివిజన్ : SW-I: ADEN/RJP అధికార పరిధిలో KOU, RJP మరియు NRE స్టేషన్ల వద్ద స్టాఫ్ క్వార్టర్లు మరియు సర్వీస్ భవనాలకు మరమ్మతులు. SW-II: ADEN/RJP సబ్ డివిజన్ పరిధిలో MRM, BLPE, SF, OBVP, PMT, HAQ, NRE, VNM స్టేషన్ల వద్ద సర్వీస్ భవనాలకు నీటి సరఫరా ఏర్పాట్లకు మరమ్మతులు. SW-III: ADEN/RJP సబ్ డివిజన్‌లోని SSE/ P.Way/KOU & NRE సెక్షన్లలోని కట్టింగ్స్‌లో ట్రాక్ విజిబిలిటీ మెరుగుపరిచేందుకు రాళ్ళు మరియు మట్టికుప్పల తొలగింపు, UP & DN మెయిన్‌లైన్స్ మధ్య టో వాల్, కట్టింగ్స్‌లో సైడ్ డ్రెయిన్స్ ప్రతిపాదిత నిర్మాణం. ప్రకటిత విలువ : రూ. 3,11,04,888.72 బయానా: రూ. 3,05,500.00

ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/పనులు/ గుంతకల్

టెండరు ప్రకటన నం.17- Mech-HSK-CRS-TPT-24-25, తేది: 26-11-2024

దిగువ పనికొరకు భారత రాష్ట్రపతి తరఫున చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్‌షాప్, తిరుపతి, దక్షిణ మధ్య రైల్వే వారు ప్రముఖ కాంట్రాక్టర్ల నుండి IREPS ద్వారా ఓపెన్ టెండరు కోరుచున్నారు.

1. టెండరు నం. 19-Mech-HSK-CRS-TPT-24-25, తేది: 26-11-2024 పని వివరణ: CRS/TPTY లో హౌస్‌కీపింగ్ కార్యకలాపాలు. అంచనా విలువ: రూ. 4,27,52,333.06 (నాలుగు కోట్ల ఇరవై ఏడు లక్షల యాభై రెండు వేల మూడు వందల ముప్పై మూడు రూపాయల ఆరుపైసలు మాత్రమే) బిడ్ సెక్యూరిటీ: రూ. 3,63,800/- (మూడు లక్షల అరవైమూడు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) టెండరు ఫారం ధర: రూ. 10000/- పూర్తిచేయు కాలము: సర్వీస్ ప్రారంభ తేదీ నుండి 600 పని రోజులు

1. వివరణ: టెండరు బాక్స్ మూసివేత సమయం: 11.00 గంటలు, తేది: 18-12-2024.

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CRS, తిరుపతి

నోటీస్: 01 2024 (చిన్నరావూరు వద్ద హాల్ట్ ఏజెంట్ నియామకం)

ప్రారంభంలో ఐదు సంవత్సరాల కాలానికి కమీషన్ ప్రాతిపదికన గుంటూరు డివిజన్‌లో చిన్నరావూరు హాల్ట్ స్టేషన్ వద్ద హాల్ట్ ఏజెంట్ ఎంపిక కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. తదుపరి అనగా అర్హత ప్రమాణాలు, పని స్వభావం, చెల్లించబడే కమీషన్, జతచేయవలసిన డాక్యుమెంట్లు కొరకు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in దర్శించండి లేదా Sr.DCM కార్యాలయాన్ని పనివేళలలో సంప్రదించండి. దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 20-12-2024, 15.00 గంటల వరకు.

దరఖాస్తులను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, 2వ అంతస్తు, రైల్ వికాస్ భవన్, దక్షిణ మధ్య రైల్వే, పట్టాభిపురం, గుంటూరు -522006కు పంపవలెను.

డివిజనల్ కమర్షియల్ మేనేజర్/కో-ఆర్డ్/ గుంటూరు.

A1509

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in






ఇటీవల ఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్న తెలుగు మహిళలు.

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్... ప్రఖ్యాత సంగీత విద్వాంసులు.
నాదం ఆయన షెహనాయ్‌లో ప్రణవనాదంగా భాసిల్లింది.
ఆయన ఉఛ్వాసనిశ్వాసలు నాదంతోనే... నాదస్వరంతోనే.
ఆ నాదం స్మృతిగా మిగలరాదు... శ్రుతిగా కొనసాగాలి.
కళాసాధనకు అంకితమైన కళాకారులే ఆయన వారసులు.
బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్న మన మహిళలు వీళ్లు.

# వాహ్... ఉస్తాద్‌లు

## సరిగమల సాగరంలో నేనో బిందువుని

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ గారి షెహనాయ్ వాద్యం అంటే నాకెంతో ఇష్టం. ఇప్పటికి వందల సార్లు కాదు వేలసార్లు విని ఉంటాను. రాత్రి నిద్ర పోయే ముందు కూడా బిస్మిల్లా ఖాన్ సంగీత కార్యక్రమం వింటూ నిద్రపోతాను. మహా సముద్రం అంతటి సంగీతప్రపంచంలో ఆయన ఒక సముద్రం అయితే నేను ఒక నీటిబిందువుని. ఇలాంటి గొప్ప వారు నాలాంటి ఎందరో సింగర్స్‌కు స్ఫూర్తినిస్తుంటారు. సంగీతమే శ్వాసగా జీవించిన బిస్మిల్లా ఖాన్ పేరు మీద పురస్కారం అందుకోవడం అంటే సంతోషశిఖరాన్ని అధిరోహించినట్లే భావిస్తున్నాను.

నాకు ఈ ఏడాది ఎన్నో మధురానుభూతులనిచ్చింది. కన్నడ పాటకు బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్‌గా సైమా అవార్డు, కర్నాటక 'విశ్వమన్య' పురస్కారం, తెలుగులో బలగం సినిమా పాటకు ఐఫా అవార్డు అందుకున్నాను. ఇంకా గొప్ప సంతృప్తి ఏమిటంటే... నేపథ్యగాయని పద్మభూషణ్ ఉషాఉతుప్, పద్మభూషణ్ సుధా రఘునాథన్ వంటి మహోన్నత గాయనీమణులతో కలిసి వేదిక పంచుకోవడం. బాలికల సంరక్షణ కోసం స్వచ్ఛందంగా నిర్వహించిన సంగీతకార్యక్రమంలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతి చాలా గొప్పది. ఇప్పుడు ఈ జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం ఊహించనిది. ఈ ఏడాది నాకు ప్రత్యేకం అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదనుకుంటా.

**– సత్యవతి ముదావత్ (మంగ్లీ),** సినీ నేపథ్య గాయని



## లక్ష్యం మారింది

చిత్తూరులో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన రెడ్డి లక్ష్మి ఐఏఎస్ లక్ష్యంతో గ్రాడ్యుయేషన్‌కి ఢిల్లీకి వెళ్లారు. ఆమె మీద కళా తపస్వి విశ్వనాథ్ సినిమాల ప్రభావం కూడా ఎక్కువే. డిగ్రీ చదువుతూ కూచిపూడి నాట్యంలో శిక్షణ మొదలుపెట్టారు. ఆ ఆసక్తి ఆమెను ఏకంగా ఢిల్లీలో డాన్స్ అకాడమీ స్థాపించేవరకు తీసుకెళ్లింది.

కళ కోసం జీవితాన్ని అంకితం చేసిన వారికి ఇలాంటి పురస్కారాలు భుజం తట్టి ఇచ్చే ప్రోత్సాహం వంటివన్నారు లక్ష్మి. పన్నెండేళ్లుగా ఢిల్లీలో 'నృత్యవాహిని – అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్'ను నిర్వహిస్తున్నారామె. ఢిల్లీ వంటి నగరంలో నాట్యప్రదర్శన పట్ల ఆసక్తితో సుశిక్షితులై సాధన చేసినప్పటికీ చాలా మందికి ప్రదర్శనకు సరైన అవకాశం దొరకదు. అలాంటి వారికి నాట్య ప్రదర్శనకు అనువైన ఈవెంట్స్ ద్వారా వేదికలు ఏర్పాటు చేస్తున్నారు లక్ష్మి. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు తీసుకోవడం వల్ల ఆమె సేవ ఎల్లలు దాటింది. ఆన్‌లైన్‌లో వివిధ దేశాల నుంచి విదేశీయులతోపాటు ఎన్నారైలు కూడా ఆమె దగ్గర నాట్యంలో మెళకువలు నేర్చుకున్నారు. ఢిల్లీలో రెగ్యులర్‌గా నిర్వహించే క్లాసుల్లో తెలుగు వాళ్లతోపాటు వివిధ భాషల వాళ్లున్నారు. బిస్మిల్లా ఖాన్ యువపురస్కారం అందుకున్న సందర్భంగా ఆమె తన గురువు గారి మార్గదర్శనాన్ని గుర్తు చేసుకున్నారు.

''ఈ రోజు ఈ పురస్కారం అందుకున్నానంటే మా గురువు గారు పద్మశ్రీ గురు జయరామారావుగారి సూచనను పాటించడం వల్లనే. ఆయన పితాపురంలో పుట్టారు. కూచిపూడికి వెళ్లి నాట్యం నేర్చుకున్నారు. కాకతాళీయంగా ఢిల్లీకి వచ్చారు. ఢిల్లీలో డాన్స్ అకాడమీ అవసరం చాలా ఉంది. మన కళారీతులను విశ్వవ్యాప్తం చేయడానికి నీ వంతు ప్రయత్నం చెయ్యి... అని నాకొక డైరెక్షన్ ఇచ్చారు. వారి సహకారంతోనే ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్‌లో డాన్స్ టీచర్‌గా ఉద్యోగం చేశాను. ఎనిమిదేళ్లపాటు ఢిల్లీలోని ఓ ఎమ్ఎన్‌సీలో ఉద్యోగం చేసినప్పటికీ నాట్యం కోసం పని చేస్తున్నప్పుడు కలిగిన సంతోషం ఉండేది కాదు. నాట్యంలో నా కళాతృష్ణను తీర్చుకోవడానికే పూర్తి సమయం కేటాయించాలనుకున్నాను. ఆ తర్వాత భరతనాట్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. ఇప్పుడు కూచిపూడి నాట్యంలో పీజీ చేస్తున్నాను. ఇతర నాట్యరీతుల్లోనూ ప్రవేశాన్ని సాధించాను. నాట్యంలో పీహెచ్‌డీ చేయడం నా ప్రస్తుత లక్ష్యం'' అన్నారు రెడ్డి లక్ష్మి.



## నా పాట నాకు నచ్చాలి!

''ఇది నా తొలి జాతీయ పురస్కారం. తప్పకుండా నా జీవితంలో మధురమైన ఘట్టమే. చెన్నైలో నా గానం విన్న ప్రముఖులు గోల్డెన్ వాయిస్ అని ప్రశంసించినప్పుడు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలిగింది. ఆ తర్వాత ఇప్పుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకోవడం కూడా...'' అన్నారు కర్ణాటక సంగీతకారిణి శ్వేతాప్రసాద్.

''మా ఇల్లు ఒక సంగీతం విశ్వవిద్యాలయం వంటిది. నానమ్మ గాయని, తాతయ్య (రక్తకన్నీరు నాగభూషణం) రంగస్థల ప్రదర్శనల్లో నానమ్మ పాల్గొనేది. అమ్మ వీణలో సిద్ధహస్తురాలు. మరో తాతయ్య (అమ్మ వాళ్ల నాన్న) మోహన్‌రావు. ఆయన హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభ స్థాపించడం, నిర్వహించడంలో కీలకంగా పనిచేశారు. అలాంటి ఇంట్లో పుట్టడం ఒక వరం. మూడేళ్ల వయసు నుంచి సరిగమలు కూడా నాతోపాటు పెరిగాయి. శోభానాయుడు, అలేఖ్య పుంజల వంటి ప్రముఖ నాట్యకారుల కార్యక్రమాలకు గానమిచ్చాను. నాకు సంగీతమే జీవితం. మరొకటి తెలియదు. నా భర్త నట్టువాంగం కళాకారులు. మేమిద్దరం ముప్పైకి పైగా దేశాల్లో ప్రదర్శనలిచ్చాం. మా తాతగారిలాగే ఎప్పటికప్పుడు నన్ను నేను మెరుగుపరుచుకుంటూ ఉండడమే నా విజయరహస్యం.

### రక్తకన్నీరు స్ఫూర్తితో...

నాగభూషణం తాతయ్య రక్తకన్నీరు నాటకాన్ని ఎనిమిది వేల సార్లు ప్రదర్శించారు. ప్రతి ప్రదర్శన దేనికది భిన్నంగా ఉండేలా చూసుకునేవారు. నిన్నటి కంటే నేడు మరికొంత భిన్నంగా, రేపు మరింత వైవిధ్యంగా ఉండేలా చూసేవారు. అలాగే ఒక ప్రదర్శనకంటే మరో ప్రదర్శన ఇంకా మెరుగ్గా ఉండేటట్లు నాకు నేను మెరుగులు దిద్దుకుంటాను. గాయకులు కానీ చిత్రకారులు కానీ గురువు దగ్గర నేర్చుకున్న విద్య దగ్గరే ఆగిపోకూడదు. సాధన ద్వారా తనవంతుగా మరికొన్ని మెళకువలను అద్దగలగాలి. మన నైపుణ్యం మీద మనకు నమ్మకం ఉండాలి. అప్పుడు తప్పనిసరిగా ఫలితం సంతోషకరంగా ఉంటుంది. నా మట్టుకు నేను 'నన్ను నేను మెప్పించుకోవాలి' అనే కొలమానం పెట్టుకుని పాడుతాను. నా పాట నాకే నచ్చకపోతే మరొకరికి ఎలా నచ్చుతుంది? అనేదే నా ప్రశ్న. నా లక్ష్యం భవనాలు, కోట్ల రూపాయలు సంపాదించడం కాదు. సంగీతం నా ప్యాషన్. శుద్ధ సంగీతాన్ని పాడుతాను. సంగీతంతోనే జీవిస్తాను'' అంటూ సంగీతం పట్ల తన ఇష్టాన్ని వ్యక్తం చేశారు శ్వేతాప్రసాద్.

**– వాకా మంజులా రెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● మన(సు)లో మాట

# తల వెంట్రుకలను లాగేసుకుంటోంది..!

మా అమ్మాయి వయసు 18 సంవత్సరాలు. బీటెక్ చదువుతోంది. ఈ మధ్య తల వెంట్రుకలను గట్టిగా పట్టి ఒక్కొక్కటీ లాగేసుకుంటోంది. మాట్లాడుతూనో.. చదువుకుంటూనో... ఇలా వెంట్రుకలు లాగేస్తోంది. దీనివల్ల తలలో చాలా భాగం బట్టతలలా మారి చూడటానికి అసహ్యంగా కనిపిస్తోంది. గట్టిగా మందలిస్తే, అప్పుడు మానేస్తుంది కానీ మళ్లీ మామూలే! మాకు విసుగొచ్చి ఒక దెబ్బ వేస్తే ఏడుస్తోంది. తాను కావాలని అలా చేయడం లేదనీ, తనకు తెలియకుండానే అలా లాగేస్తున్నానని చెబుతోంది. కాలేజీకి వెళ్లే అమ్మాయి ఇలా చేస్తుంటే నలుగురూ ఏమనుకుంటారో అని భయంగా ఉంది. ఇది ఇలాగే కొనసాగితే తనకసలు పెళ్లవుతుందో లేదోనని ఆందోళనగా ఉంది.ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– రాజేశ్వరి, ఆదిలాబాద్



మీరు చెప్పిన వివరాలను బట్టి మీ అమ్మాయి ట్రైకోటిల్లో మేనియా అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు అర్థమవుతోంది. అయితే మీరు కంగారు పడవలసిన అవసరం లేదు. ఇది యువతలో వచ్చే ఒక అరుదైన మానసిక రుగ్మత. తలవెంట్రుకలే కాకుండా, కొందరు కనుబొమలు, కంటిరెప్పల వెంట్రుకలను కూడా ఇలాగే లాగేసుకుంటూ ఉంటారు. కొన్ని సందర్భాలలో అయితే ఇలా లాగేసిన వెంట్రుకలను మింగడం కూడా జరుగుతుంది. కొందరు పిల్లల్లో సడన్‌గా వచ్చే కడుపునొప్పికి కారణం ఈ వెంట్రుకలన్నీ కడుపులో అడ్డుపడడమే! ఆందోళన, టెన్షన్‌కు లోనయిన వారిలోనూ, బుద్ధిమాంద్యమున్న వారిలోనూ ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. కంపల్సివ్ పుల్లింగ్ అంటే వెంట్రుకలు లాగేయడం అన్నది మళ్లీ మళ్లీ చేయాలనే ఒక మానసిక వైపరీత్యం వల్ల కూడా ఇలా జరుగుతుంది. దీనిని ఎంత అదుపు చేసుకుందామనుకున్నా వారికి సాధ్యం కాదు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు ఆధునిక మానసిక వైద్యశాస్త్రంలో అద్భుతమైన ఔషధాలతో పాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అనే ప్రత్యేక మానసిక చికిత్స కూడా ఉంది. చాలామందికి ఇది మానసిక సమస్య అని తెలియక చర్మవ్యాధి డాక్టర్లను సంప్రదిస్తుంటారు. మీరు ఆలస్యం చేయకుండా మీకు దగ్గరలోని మానసిక వైద్యుని సంప్రదిస్తే మీ అమ్మాయిని ఈ సమస్య నుంచి బయటకు తీసుకురావచ్చు.



**డా. ఇండ్ల విశాల్ రెడ్డి**, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

# నాన్న పెళ్లి సూట్‌లో...



అబ్బాయిలు నాన్న షర్ట్ వేసుకుని 'లేని మీసాలను' మెలి తిప్పటం, అమ్మాయిలు అమ్మ చీర కట్టుకుని 'మోయలేని పెద్దరికాన్ని' అభినయించటం... ప్రతి ఇంట్లోనూ ఉండేదే. ఎదుగుతున్న పిల్లలకు అవి సరదాలు. పెద్దలకు తమ టీనేజ్‌ని గుర్తుకు తెచ్చే మురిపాలు.

పెద్దయ్యాక బాయ్స్ నాన్న ప్యాంటూ షర్టు వేసుకోవటం కనిపించదు కానీ, గర్ల్స్ అమ్మ చీరను కట్టుకుని ఏ ఫంక్షన్‌లోనో బంధు మిత్రులకు సాక్షాత్కరిస్తుంటారు. వధువులు కూడా కొందరు అపురూపంగా దాచి ఉంచిన అమ్మ పెళ్లి నాటి చీరను ధరించి, పీటల మీద కూర్చుంటారు. అదొక సెంటిమెంట్ కూతుళ్లకు.

కానీ నివేషి కాస్త డిఫరెంట్‌గా ఉంది! బహుశా.. నాన్నంటే అఫెక్షన్, అమ్మంటే క్రమశిక్షణ్‌లా ఉంది ఈ అమ్మాయికి. తనేం చేసిందో చూడండి! పెళ్లినాటి నాన్న సూట్‌ను బయటికి తీయించి, చిన్న చిన్న మార్పులు చేసి తను తొడుక్కుంది. భారీ బ్రౌన్ టూపీస్ పెళ్లి సూట్‌లో ఉన్న నాన్న ఫొటోను, ఆ సూట్‌ను వేసుకున్న తన ఫొటోను కలిపి ఆ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టింది. ''అమ్మాయిలు తమ తల్లి పెళ్లి చీరను కట్టుకుంటారు. నేను మా నాన్న పెళ్లి సూట్‌ను వేసుకున్నాను'' అని ఆ క్లిప్‌కు క్యాప్షన్ పెట్టింది. ఇకనేం, లైకుల మీద లైకులు. నివేషి డిజిటల్ క్రియేటర్. తండ్రి సూట్‌ను తనకు సరిపడేలా మార్చటంలోని ఆమె సృజనాత్మక నైపుణ్యాన్ని చూసి, ''మీ కోసమే మీ నాన్న తన పెళ్లి సూట్‌ను ఎంపిక చేసుకున్నట్లున్నారు..'' అని ఒక నెటిజెన్ ప్రశంసించారు. మరొకరు.. ''మీరు మీ నాన్నను గర్వపడేలా చేశారు'' అని కామెంట్ పెట్టారు. చలువ కళ్లద్దాలు ధరించి, సూటులో రెండు చేతులు పెట్టుకుని ఠీవిగా నడిచి వెళుతున్న నివేషి రెట్రో స్టెయిల్ ఎవర్నీ చూపు తిప్పుకోనివ్వటం లేదు!



● పల్లెల్లో ఉషోదయం

# కోడ్ కూసే... టాలెంట్ నిద్రలేసే...

రోజూ తండ్రితో పాటు పొలం పనులకు వెళ్లే అమ్మాయిలు, తల్లితో పాటు ఇంటి పనులకే పరిమితమైన అమ్మాయిలు, తోచక కుట్లు, అల్లికలతో కాలం వెళ్లదీస్తున్న పల్లెటూరి అమ్మాయిలు... ఐటీ సెక్టార్‌లో పని చేయడం సాధ్యమా? 'అక్షరాలా సాధ్యమే' అని నిరూపిస్తోంది స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్. రెండు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తోన్న 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్' బిహార్‌లోని ఎంతోమంది గ్రామీణ యువతులకు ఉచితంగా కోడింగ్ నేర్పిస్తోంది. వారు ఐటీ రంగంలో ఉద్యోగాలు చేసేలా చేస్తోంది...



● కోడింగ్ సాధనలో ఒకరికొకరు సహాయంగా...



● గతంలో ల్యాప్‌టాప్‌తో పరిచయం లేని అమ్మాయిలు, వాటి ద్వారా కోడింగ్ సాధన చేస్తున్నారు.



● కోడింగ్ ఇప్పుడు కష్టం కాదు... ఇష్టమైన ఆట



● తల్లిదండ్రులు గర్వించేలా కవిత...

బిహార్‌లోని ఠాకుర్‌గంజ్ గ్రామానికి చెందిన రవీనా మెహ్తో ఒకప్పుడు వంటల్లో, ఇంటిపనుల్లో తల్లికి సహాయపడుతూ ఉండేది. ప్రస్తుతం రవీనా బెంగళూరులోని ఒక పెద్ద కంపెనీలో పనిచేయనుంది. బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో ప్రారంభించిన 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్'లో కోడింగ్ నేర్చుకోవడానికి... ఉన్న ఊరు వదిలి కిషన్‌గంజ్‌కు వచ్చిన 67 మంది యువతులలో రవీనా ఒకరు. 21 నెలల పాటు సాగే ఈ కోర్సులో అరారియా నుంచి గయ వరకు బిహార్ నలుమూలల నుంచి అమ్మాయిలు చేరారు.

తరగతులలో ప్రతి ఒక్కరూ తమ ల్యాప్‌టాప్‌లలో పైథాన్, జావాలతో తలపడుతుంటారు. ఇంగ్లీష్‌లో మాట్లాడడానికి ప్రయత్నిస్తుంటారు. 'ఇక్కడికి రావడానికి ముందు ల్యాప్‌టాప్ కూడా వాడని వారు వీరిలో ఉన్నారు. జీరో నుంచి శిక్షణ ప్రారంభించాం. తక్కువ టైమ్‌లోనే చాలా చక్కగా నేర్చుకుంటున్నారు' అంటుంది ట్రైనర్‌లలో ఒకరైన ప్రియాంక దంగ్వాల్.

గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన మహిళలు మన దేశంలోని ఐటీ పరిశ్రమలలో ప్రవేశించడానికి మార్గం సుగమం చేయడానికి నవగురుకుల్, ప్రాజెక్ట్ పొటెన్షియల్ అనే రెండు స్వచ్ఛంద సంస్థలు 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్'ను ప్రారంభించాయి.

కానీ ఖర్చు లేకుండా సంస్థలో ఉచితంగా కోర్సు నేర్చుకోవడానికి అవకాశం వచ్చినా రవీనాలాంటి వాళ్లకు ఇంటి పెద్దల నుంచి అనుమతి అంత తేలికగా దొరకలేదు. 'తల్లిదండ్రుల నుంచి అనుమతి కోసం దాదాపు యుద్ధంలాంటిది చేశాను. మొదట అమ్మను, ఆ తరువాత అమ్మమ్మను చివరకు ఇరుగు పొరుగు వారిని కూడా ఒప్పించాల్సి వచ్చింది. నా జీవితాన్ని మార్చే అవకాశం కోసం పోరాడాను' అంటుంది రవీనా.

'బిహార్‌లో కేవలం 9.4 శాతం మంది మహిళలు మాత్రమే శ్రామిక శక్తి(వర్క్ ఫోర్స్)లో ఉన్నారు. మన దేశంలోని ఏ రాష్ట్రంలో లేనంత తక్కువ రేటు ఇది. గ్రామీణ మహిళలకు ఉన్నతోద్యోగాలు చేయడానికి సహాయ సహకారాలు అందించడం, శ్రామిక శక్తిలో వారి ప్రాతినిధ్యాన్ని పెంచడం మా ప్రధాన లక్ష్యం' అంటున్నాడు 'ప్రాజెక్ట్ పొటెన్షియల్' వ్యవస్థాపకుడు జుబిన్ శర్మ.

కిషన్‌గంజ్‌లో 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్' నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికింది. రాయ్‌పూర్, దంతెవాడ, ధర్మశాలలో ఇలాంటి మరో ఎనిమిది కేంద్రాలు ఉన్నాయి. 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్' ద్వారా కూలి పనులు చేసుకునే శ్రామికుల అమ్మాయిలు, ఇంటి పనులకే పరిమితమైన అమ్మాయిలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా మారి నెలకు పాతిక వేలకు పైగా సంపాదిస్తున్నారు.

'స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు మహిళల సంపాదన సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా పితృస్వామిక భావజాలాన్ని దూరం పెట్టడంలో సహాయపడతాయి. మహిళలలో ఆశయాల అంకురార్పణకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి దోహద పడతాయి. కార్పొరేట్ ఇండియా తమ సీఎస్ఆర్ యాక్టివిటీస్ కింద ఇలాంటి కార్యక్రమాలు పెంచితే, మహిళా సాధికారతలో తమ వంతు పాత్ర పోషించడానికి వీలవుతుంది' అంటుంది 'గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్' ప్రొఫెసర్ విద్యా మహాంబరే.

## మొదట్లో కష్టం... ఇప్పుడు ఎంతో ఇష్టం

విద్యార్థులకు 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్' ద్వారా ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నారు. వసతి, భోజనం ఏర్పాటు చేస్తున్నారు. 'మొదట్లో కోడింగ్ నేర్చుకోవడం కష్టంగా ఉండేది. ఇప్పుడు మాత్రం చాలా ఇష్టంగా ఉంది. ఇప్పుడు కోడ్‌లతో గేమింగ్‌ను కూడా క్రియేట్ చేస్తున్నాం' అంటారు విద్యార్థులు. కోడింగ్ నేర్పించడం మాత్రమే కాదు విద్యార్థులు ఇంగ్లీష్ బాగా మాట్లాడేలా 'స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్'లో శిక్షణ ఇస్తున్నారు.

## అనగనగా ఒకరోజు...

నేను ఐటీ రంగంలో కెరీర్ మొదలు పెట్టాలనుకున్నప్పుడు కిషన్‌గంజ్‌లో ఫ్రీ కోడింగ్ స్కూల్ లేదు. బెంగళూరులోని 'నవగురుకుల్'కు వెళ్లాలనుకున్నాను. అయితే మా పేరెంట్స్ బెంగళూరుకు వెళ్లడానికి ససేమిరా అన్నారు. అయినా సరే వారితో వాదన చేసి రైలు ఎక్కాను. మా కుటుంబం నుంచే కాదు మా ఊరు నుంచి కూడా ఎవరూ బెంగళూరుకు వెళ్లలేదు. నేను బెంగళూరుకు వచ్చిన రోజు భారీ వర్షం కురిసింది. నాకు కన్నడ రాదు. అప్పటికి ఇంగ్లీష్ అంతంత మాత్రమే వచ్చు. చాలా భయం వేసింది. ఇప్పుడు మాత్రం ఎలాంటి భయం లేదు. ఇప్పుడు ఫారిన్ క్లయింట్స్‌తో టకటకా ఇంగ్లీష్‌లో మాట్లాడగలుగుతున్నాను.

**- కవితా మెహ్తో**

● మూడేళ్ల క్రితం కోడింగ్ కోర్సు పూర్తి చేసిన కవిత ప్రస్తుతం కోల్‌కత్తాలోని ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తూ నెలకు రూ.50 వేలు సంపాదిస్తోంది.

సీజన్ బ్యూటిప్స్

# పెసర పిండితో మృదువుగా!



● టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.

● పెసరపిండిలో కొద్దిగా పెరుగు, కొబ్బరి నూనె కలిపి చేతులకు రాయాలి. సున్నితంగా రబ్ చేసి, పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పెసరపిండి, పెరుగు, కొబ్బరి నూనె చర్మాన్ని మరింత మృదువుగా మారుస్తాయి.

● టేబుల్ స్పూన్ పెసర్లు, ఐదు బాదంపప్పులు రాత్రి నీళ్లలో నానబెట్టాలి. ఉదయాన్నే వీటిని పేస్ట్ చేసి, ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం పొడిబారడం సమస్యే దరిచేరదు.

ఇంటిప్స్



● ఒవెన్‌లో పదార్థాల మరకలు పట్టేసి ఉంటే వాటిని తొలగించడానికి ఓ కప్పు నీరు చాలు. కప్పునిండా నీటిని పోసి ఒవెన్‌లో పెట్టి వేడి చేయాలి. నీరు మరిగి ఒవెన్ లోపలి వైపు మొత్తం ఆవిరి నిండిపోతుంది. అప్పుడు ఆఫ్ చేయాలి. వేడి తగ్గిన తరవాత ఒవెన్‌ని ఓపెన్ చేసి నీటి కప్పుని బయటకు తీసి, పొడి వస్త్రంతో ఒవెన్ లోపల తుడవాలి. పదార్థాల ముక్కలు మాడిపోయి పట్టేసినవన్నీ సులువుగా వదలిపోతాయి.

● కిచెన్‌లో స్టవ్ ఎదురుగా ఉండే టైల్స్‌కి జిడ్డు పట్టేస్తుంటుంది. ఆ జిడ్డు వదలాలంటే ఒక మగ్గు నీటిలో టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా కలిపి అందులో గరుకుగా ఉండే క్లీనింగ్ క్లాత్‌ని ముంచి తుడవాలి.

● కిటికీ అద్దాలు శుభ్రంగా మెరవాలంటే... పాత్రలు శుభ్రం చేసే సోప్ కలిపిన నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాత టిష్యూ పేపర్‌తో తుడిస్తే తళతళలాడుతాయి.



# సింధు శుభారంభం



లక్నో: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సింధు 21-17, 21-15తో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్‌ను ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్‌కే చెందిన వలిశెట్టి శ్రేయాన్సి, మాళవిక బన్సోడ్, రక్షిత శ్రీ, అనుపమ ఉపాధ్యాయ్, తస్నిమ్ మీర్, ఉన్నతి హుడా, దేవిక సిహాగ్, ఐరా శర్మ కూడా తొలి రౌండ్‌లో గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులు, టాప్ సీడ్ లక్ష్య సేన్... రెండో సీడ్ ప్రియాన్షు రజావత్ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 21-12, 21-12తో ఆదిల్ (మలేసియా)పై, ప్రియాన్షు 21-13, 21-12తో కార్తికేయ (భారత్)పై గెలిచారు. భారత్‌కే చెందిన మైస్నం మెరాబా, కిరణ్ జార్జి, ఆయుశ్ శెట్టి, రిత్విక్ కూడా తొలి రౌండ్‌లో తమ ప్రత్యర్థులపై విజయం సాధించి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

# మూడో గేమ్‌లో గుకేశ్ గెలుపు



సింగపూర్ సిటీ: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అద్భుతంగా పుంజుకున్నాడు. మూడో గేమ్‌లో తొలి విజయాన్ని అందుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో బుధవారం జరిగిన మూడో గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన 18 ఏళ్ల గుకేశ్ 37 ఎత్తుల్లో విజయం సాధించాడు. నిబంధనల ప్రకారం తొలి 40 ఎత్తులను 120 నిమిషాల్లో పూర్తి చేయాలి. అయితే డింగ్ లిరెన్ 37 ఎత్తులే వేయగలిగాడు. దాంతో సమయాభావం కారణంగా డింగ్ లిరెన్‌కు ఓటమి ఖరారైంది. 'తొలి విజయం దక్కినందుకు ఆనందంగా ఉంది. తొలి గేమ్‌లో కాస్త ఒత్తిడికి లోనయ్యా. రెండో గేమ్ నుంచి కోలుకున్నాను' అని గుకేశ్ వ్యాఖ్యానించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ఇద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లు జరగనున్నాయి. తొలి గేమ్‌లో డింగ్ లిరెన్ నెగ్గగా... రెండో గేమ్ 'డ్రా'గా ముగిసింది. మూడు గేమ్‌ల తర్వాత ఇద్దరూ 1.5-1.5 పాయింట్లతో సమంగా ఉన్నారు. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం నాలుగో గేమ్ జరుగుతుంది.

# ఉర్విల్ మెరుపుల్

- టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా రికార్డు
- 28 బంతుల్లోనే శతకం సాధించిన గుజరాత్ బ్యాటర్
- 35 బంతుల్లో 7 ఫోర్లు, 12 సిక్స్‌లతో 113 నాటౌట్



ఇండోర్: ఐపీఎల్ మెగా వేలంలో ఫ్రాంచైజీలు తనను విస్మరించినా... గుజరాత్ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ అదేమీ పట్టించుకోకుండా మైదానంలో తన పని తాను చేసుకుపోయాడు. దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా త్రిపుర జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఉర్విల్ పటేల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 28 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో ఉర్విల్ 100 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ క్రమంలో టి20 ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా, ఓవరాల్‌గా వేగవంతమైన శతకం సాధించిన రెండో ప్లేయర్‌గా అతను గుర్తింపు పొందాడు. టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారతీయ ప్లేయర్‌గా రిషభ్ పంత్ (32 బంతుల్లో; ఢిల్లీ తరఫున 2018లో హిమాచల్ ప్రదేశ్‌పై) పేరిట ఉన్న రికార్డును ఉర్విల్ బద్దలు కొట్టాడు. ఓవరాల్‌గా టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన రికార్డు ఎస్తోనియా ప్లేయర్ సాహిల్ చౌహాన్ పేరిట ఉంది. ఈ ఏడాది జూన్ 17న సైప్రస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సాహిల్ 27 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఉర్విల్ ఈ రికార్డును ఒక్క బంతి తేడాతో సమం చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు.

ఉర్విల్ మెరుపులతో త్రిపుర నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ జట్టు కేవలం 10.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్‌గా వచ్చిన ఉర్విల్ 35 బంతుల్లో 7 ఫోర్లు, 12 సిక్స్‌లతో 113 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆర్య దేశాయ్ (24 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి ఉర్విల్ తొలి వికెట్‌కు 8.5 ఓవర్లలో 150 పరుగులు జోడించాడు. ఆర్య అవుటయ్యాక వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ విశాల్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరగా... ఉమంగ్ కుమార్ (1 నాటౌట్)తో కలిసి ఉర్విల్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేసి గుజరాత్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. గత రెండు ఐపీఎల్ సీజన్‌లలో ఉర్విల్ గుజరాత్ టైటాన్స్ జట్టుతో ఉన్నాడు. అయితే ఉర్విల్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం ఇవ్వలేదు. ఈసారి అతడిని గుజరాత్ టైటాన్స్ జట్టు విడుదల చేసింది. దాంతో ఉర్విల్ మెగా వేలంలో కనీస ధర రూ. 30 లక్షలతో తన పేరు నమోదు చేయించుకున్నా ఏ ఫ్రాంచైజీ అతడిని తీసుకోకపోవడం గమనార్హం.

# మరోసారి నంబర్‌వన్‌గా బుమ్రా

**ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్**




దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అతను నంబర్‌వన్‌గా నిలిచాడు. పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో 8 వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించిన ప్రదర్శన బుమ్రాను మూడో స్థానం నుంచి మళ్లీ 'టాప్'నకు తీసుకెళ్లింది. 883 పాయింట్లతో అతను కెరీర్ అత్యుత్తమ రేటింగ్‌ను కూడా అందుకోవడం విశేషం. ఈ ఏడాది ఫిబ్రవరిలో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న బుమ్రా ఆ తర్వాత అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్ తర్వాత స్వల్ప కాలం పాటు మళ్లీ అగ్ర స్థానంలో నిలిచాడు. మరోవైపు భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లో అత్యుత్తమంగా రెండో స్థానంలో (825 పాయింట్లు) నిలిచాడు. ఇప్పటి వరకు జైస్వాల్ నాలుగో స్థానంలో ఉండగా పెర్త్ టెస్టులో అతని శతక ప్రదర్శనతో రెండు స్థానాలు ముందుకు దూసుకెళ్లాడు.

# దక్షిణాఫ్రికా 80/4

డర్బన్: సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడబడ్డారు. బుధవారం ప్రారంభమైన మొదటి టెస్టులో వర్షం కారణంగా కేవలం 20.4 ఓవర్ల ఆట సాధ్యమైంది. ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 80 పరుగులు చేసింది. డర్బన్‌లో ఆడిన గత మూడు టెస్టుల్లోనూ చక్కటి ప్రదర్శన కనబర్చిన శ్రీలంక... పచ్చిక పిచ్‌పై టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అందుకు తగ్గట్లే చక్కటి బౌలింగ్‌తో ఆతిథ్య జట్టును కట్టిపడేసింది. మార్క్‌రమ్ (9), జోర్జీ (4), స్టబ్స్ (16), బెడింగ్‌హామ్ (4) విఫలం కాగా... కెప్టెన్ తెంబా బవుమా (47 బంతుల్లో 28 బ్యాటింగ్; 5 ఫోర్లు), వికెట్ కీపర్ కైల్ వెరీనె (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో లహిరు కుమార రెండు వికెట్లు పడగొట్టాడు.

# బీజేపీలో చేరితే నిషేధం ఎత్తేస్తారేమో!

**భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా వ్యాఖ్య**



న్యూఢిల్లీ: డోపింగ్ పరీక్షకు హాజరు కానందున నాలుగేళ్ల నిషేధానికి గురైన భారత రెజ్లర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పూనియా ఈ పరిణామంపై స్పందించాడు. నిషేధం తనకేమీ ఆశ్చర్యం కలిగించలేదని, దీనిని ముందే ఊహించానని అతను వ్యాఖ్యానించాడు. తనపై నిషేధానికి పూర్తిగా రాజకీయపరమైన కారణాలు ఉన్నాయని అతను అభిప్రాయ పడ్డాడు. సెలక్షన్ ట్రయల్స్ సందర్భంగా శాంపిల్స్ ఇవ్వకుండా నిబంధనలు ఉల్లంఘించాడంటూ ఏప్రిల్‌లోనే జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బజరంగ్‌పై నిషేధం విధించగా... యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) కూడా దీనికి ఆమోదముద్ర వేసింది. 'గత ఏడాది కాలంగా ఈ అంశం సాగుతూనే ఉంది కాబట్టి నిషేధం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. నేను డోపింగ్ పరీక్షకు నిరాకరించలేదు. 'నాడా' ప్రతినిధులు గడువు ముగిసిన కిట్‌తో నా వద్దకు వచ్చారు. ఒక ఆటగాడితో మీరు ఎలా చేస్తారు. శాంపిల్ ఇచ్చిన తర్వాత మేం దీనిని గుర్తించి వీడియో తీసి మరీ ఫిర్యాదు చేసినా వారు తప్పు ఒప్పుకోలేదు. ఈ విషయాన్ని అప్పుడే నేను సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేశాను' అని బజరంగ్ వివరణ ఇచ్చాడు. సహచర రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్‌లతో కలిసి జాతీయ రెజ్లింగ్ సమాఖ్య నాటి అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా తాను చేసిన నిరసన కార్యక్రమాల వల్ల కూడా తనపై ఈ చర్య తీసుకున్నారని అతను ఆరోపించాడు. నిరసనల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన బజరంగ్ హరియాణా ఎన్నికల్లో ప్రచారం కూడా చేశాడు. 'వారికి వ్యతిరేకంగా వెళ్లానని నాపై ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రభుత్వం ఈ నిషేధం విధించింది. కేంద్ర సంస్థలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి కదా. నేను ఒకవేళ బీజేపీలో చేరితో ఈ నిషేధం ఎత్తివేస్తారేమో' అని 30 ఏళ్ల బజరంగ్ అన్నాడు.

# భారీ విజయంతో భారత్ బోణీ



మస్కట్ (ఒమన్): ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 11-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున అరిజీత్ సింగ్ హుండల్ (2వ, 24వ నిమిషాల్లో), గుర్జోత్ సింగ్ (18వ, 45వ నిమిషాల్లో), సౌరభ్ ఆనంద్ కుశ్వాహ (19వ, 52వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. దిల్‌రాజ్ సింగ్ (21వ నిమిషంలో), ముకేశ్ టొప్పో (59వ నిమిషంలో), శారదానంద్ తివారీ (10వ నిమిషంలో), రోహిత్ (29వ నిమిషంలో), అర్ష్‌దీప్ సింగ్ (8వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

## సినిమా



బాలాజీ, సూర్య

# సూర్య @ 45

హీరో సూర్య 45వ చిత్రం బుధవారం ఉదయం పొల్లాచ్చి సమీపంలోని ఆనైమలై ప్రాంతంలో గల ప్రసిద్ధి చెందిన మాసానీ అమ్మన్ ఆలయంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఇందులో నటి త్రిష హీరోయిన్‌గా నటించనున్నారు. నటుడు ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్. ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటుడు సూర్య, దర్శకుడు ఆర్‌జే బాలాజీల కుటుంబ సభ్యులు, నిర్మాత ఎస్ఆర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

– సాక్షి, తమిళ సినిమా



కీర్తీ సురేష్, ఆంటోనీ తట్టిల్

# పదిహేనేళ్ల ప్రేమ కొనసాగుతోంది

హీరోయిన్ కీర్తీ సురేష్ ప్రేమ, ఆమె వివాహం గురించిన వార్తలు ఇటీవల చాలానే వచ్చాయి. అయితే కీర్తీ సురేష్ మాత్రం ఈ విషయాలపై ఎక్కడా ప్రస్తావించలేదు. ఆమె తండ్రి జి. సురేష్‌కుమార్ తన కుమార్తె ఆంటోనీ తట్టిల్‌ని పెళ్లి చేసుకోనున్నట్లు ఇటీవల పేర్కొన్నారు. తాజాగా తన ప్రేమ గురించి కీర్తీ సురేష్ స్పందించారు. ఆంటోనీ తట్టిల్‌తో తాను పదిహేనేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు ఆమె ఓ పోస్ట్‌ను సోషల్ మీడియా మాధ్యమాల్లో షేర్ చేశారు. '15 ఇయర్స్ అండ్ కౌంటింగ్...' అనే క్యాప్షన్‌తో ఆంటోనీతో కలిసి ఉన్న ఫొటోను కీర్తి షేర్ చేశారు. ఇక ఆంటోనీ, కీర్తీ సురేష్‌ల వివాహం డిసెంబరులో జరుగుతుందని జి. సురేష్‌కుమార్ చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆంటోనీ ఫొటోలను కీర్తీ సురేష్ చేశారు. సో... కీర్తి కల్యాణం దగ్గర్లోనే ఉందని ఊహించవచ్చు. డిసెంబరు 11, 12 తేదీల్లో గోవాలో వివాహం జరగనుందన్న ప్రచారం జరుగుతోంది. ఇక కీర్తికి చిన్ననాటి స్నేహితుడైన ఆంటోనీ కేరళకు చెందిన వ్యాపారవేత్త అని సమాచారం.




వెంకటేశ్, ఐశ్వర్యా రాజేష్

వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్ లొకేషన్స్‌లో జరుగుతోంది. వెంకటేశ్, మీనాక్షీ చౌదరి కాంబినేషన్‌లో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని 'గోదారి గట్టు మీద రామచిలకవే... గోరింటాకెట్టుకున్న చందమామవే..!' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను డిసెంబరు 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను రిలీజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను రమణ గోగుల పాడారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

# గంధర్వ కోట రహస్యం



హన్సిక

హన్సిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శ్రీ గాంధారి'. ఆర్. కణ్ణన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ తమిళ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. వీకేఆర్ (విక్రమ్ కుమార్ రెజింతల) సమర్పణలో సరస్వతి డెవలపర్స్, లచ్చురం ప్రొడక్షన్స్‌పై రాజు నాయక్ డిసెంబరులో తెలుగులో విడుదల చేస్తున్నారు. "సస్పెన్స్, హారర్, థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో హిందూ ట్రస్ట్ కమిటీకి హెడ్ ఆఫీసర్‌గా పని చేసే యువతిగా హన్సిక నటించారు. 'గంధర్వ కోట' పురాతన స్మారకానికి సంబంధించిన పరిశోధన ప్రాజెక్ట్‌ను ఆమె చేపట్టడంతో అసలు కథ మొదలవుతుంది. ఒక రాజు నిర్మించిన శతాబ్దాల నాటి ఈ కోటలో ఎన్నో రహస్యాలుంటాయి. ఆ రహస్యాల్ని తను ఎలా బయట పెట్టింది? అనేది ఈ సినిమా కథ"అని మేకర్స్ తెలిపారు.




ప్రమోద్ సావంత్, ఆనంద బోస్‌తో 'మా కాళి' యూనిట్

# ఇఫీలో మా కాళి

రైమా సేన్, అభిషేక్ సింగ్ ప్రధాన పాత్రల్లో విజయ్ యెలకంటి దర్శకత్వం వహించిన చిత్రం 'మా కాళి'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన మల్టీ లింగ్వల్ మూవీ ఇది. హిందీలో నిర్మించిన ఈ చిత్రం బెంగాలీ, తెలుగులో 2025లో విడుదల కానుంది. కాగా ప్రస్తుతం గోవాలో జరుగుతున్న 55వ ఇఫీ(ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకల్లో 'మా కాళి' సినిమాని ప్రదర్శించారు. ఈ ప్రీమియర్ షోకి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్, గోవా రాష్ట్ర డీజీపీ అలోక్ కుమార్ హాజరయ్యారు. అనంతరం గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ– "'మా కాళి' చిత్రాన్ని భారతదేశ విభజన, డైరెక్ట్ యాక్షన్ డే నేపథ్యంలో తీశారు. 1947లో స్వాతంత్ర్యం పొందిన మన దేశం ఆ తర్వాత ఇండియా, పాకిస్థాన్‌గా మారింది. 1971 నాటికి పాకిస్థాన్, బంగ్లాదేశ్‌గా మారింది. ఒక దేశం మూడు ముక్కలైంది. అయినప్పటికీ భారత దేశం మాత్రమే ఇప్పటికీ రాజ్యాంగాన్ని నమ్ముతుంది. 'మా కాళి' వాస్తవ కథ ఆధారంగా రూపొందించబడింది. డైరెక్ట్ యాక్షన్ డే అనేది మన దేశ చరిత్రలో ఒక బ్లాక్ డే" అని తెలిపారు. "'మా కాళి'కి ప్రమోద్ సావంత్, ఆనంద బోస్ గార్ల నుంచి వచ్చిన ప్రశంసల్ని సత్కారంగా భావిస్తున్నాం" అన్నారు విజయ్ యెలకంటి, నిర్మాత వందనా ప్రసాద్.

# రాజస్థాన్‌లో రాయల్ వెడ్డింగ్

సిద్ధార్థ్, అదితీ రావు హైదరీల వివాహం ఈ ఏడాది సెప్టెంబరు 16న వనపర్తిలోని దేవాలయంలో జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా సిద్ధార్థ్, అదితి మళ్లీ వివాహం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని అలీలా ఫోర్ట్ బిషన్‌గఢ్‌లో సిద్ధార్థ్ –అదితిల వివాహం జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ ఫొటోలను సిద్ధార్థ్ ఇన్ స్టాలో షేర్ చేశారు. వనపర్తి సంస్థాన వారసుల్లో అదితీ రావ్ ఒకరు. వనపర్తిలోని శ్రీ రంగాపూర్ రంగనాథ స్వామి దేవాయలంతో అదితీ రావు కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. అందుకే సిద్ధార్థ్ – అదితీల వివాహం ముందు శ్రీ రంగాపూర్ రంగనాథ స్వామి గుడిలో జరిగినట్లు తెలుస్తోంది. తాజాగా రాజస్థాన్‌లో రాయల్ వెడ్డింగ్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది.



అదితీరావు హైదరీ, సిద్ధార్థ్

# క్రైమ్... థ్రిల్



వీఐపీ శ్రీ, అజయ్ ఘోష్

వీఐపీ శ్రీ హీరోగా, ప్రియా దేశపాగ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'వీకెండ్'. బి.రాము దర్శకత్వంలో ఖడ్గధార మూవీస్ బ్యానర్‌పై ఐడీ భారతి నిర్మిస్తున్న ఈ చిత్రం చీరాలలో ప్రారంభోత్సవం జరుపుకుంది. ఎన్ఆర్ఐ లీళ జయ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు అజయ్ ఘోష్ క్లాప్ కొట్టారు. "పక్కా కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'వీకెండ్'. చీరాలలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ సినిమా షూటింగ్‌ని ప్రారంభించాం. మొదటి షెడ్యూల్ చీరాలలోనే జరుగుతుంది" అని బి. రాము, ఐడీ భారతి చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: యూఎస్ విజయ్, సంగీతం: ఎస్. అర్జున్.

# ఆరిగపూడి విజయకుమార్ మృతి



ప్రముఖ సంఘ సేవకుడు, నటుడు, డా. ఆరిగపూడి విజయకుమార్ మంగళవారం రాత్రి గుండె పోటుతో అకాల మరణం చెందారు. కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారాయన. ఇటీవల ఆయన శ్రీమతి కృష్ణకుమారి మృతి చెందారు. ఆమె లేని లోటును ఆయన భరించలేకపోయారు. దాంతో పాటు అనారోగ్య సమస్యలు తోడవడంతో అకాల మరణం చెందారు. విజయకుమార్ సమర్పించి, ఓ కీలక పాత్ర చేసిన 'ఓ తండ్రి తీర్పు' సినిమా విడుదల కాకమునుపే తుదిశ్వాస విడిచారు.



నితిన్, శ్రీలీల

# ప్రేక్షకులను దోచుకుంటాడు - నితిన్

"నా కెరీర్‌లోనే 'రాబిన్ హుడ్' హయ్యస్ట్ బడ్జెట్ సినిమా. ఈ చిత్రం కోసం పెట్టిన డబ్బుని డిసెంబర్ 25న రెట్టింపుతో ప్రేక్షకుల నుంచి రాబిన్ హుడ్ దోచుకొని ప్రొడ్యూసర్స్‌కి ఇస్తాడని నమ్మకంగా చెబుతున్నాను" అని హీరో నితిన్ అన్నారు. 'భీష్మ' వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్ హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఫస్ట్ కనెక్ట్ ప్రెస్‌మీట్‌లో నితిన్ మాట్లాడుతూ– "'భీష్మ' మ్యాజిక్ 'రాబిన్ హుడ్'తో రిపీట్ అవుతుంది" అని చెప్పారు. శ్రీలీల మాట్లాడుతూ–"ఇప్పటివరకు నన్ను కమర్షియల్ హీరోయిన్‌గా, డ్యాన్సింగ్ స్పెషల్‌గా చూశారు. 'రాబిన్ హుడ్'లో నా పాత్ర, నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు" అని తెలిపారు. "ఇప్పటివరకు నా కెరీర్‌లో 'రాబిన్ హుడ్' ద బెస్ట్ వర్క్" అని వెంకీ కుడుముల పేర్కొన్నారు. "ఈ సినిమా ప్రేక్షకులందరికీ బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని వై. రవిశంకర్ తెలిపారు. పాటల రచయిత కేకే మాట్లాడారు.

# వివరణ ఇవ్వాలి

**నయనతార-విఘ్నేష్‌కి నోటీసు జారీ చేసిన హైకోర్టు**



నయనతార



ధనుష్

నటి నయనతార, ఆమె భర్త–దర్శకుడు విఘ్నేశ్ శివన్‌లకు చెన్నై హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ వివరాల్లోకి వెళితే... నయనతార జీవితంలోని ముఖ్య సంఘటనల ఆధారంగా 'నయనతార: బియాండ్ ద ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ రూపొందిన విషయం తెలిసిందే. నయనతార పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ డాక్యుమెంటరీ స్ట్రీమ్ అవుతోంది. కాగా ఈ డాక్యుమెంటరీలో విజయ్ సేతుపతి, నయనతార జంటగా వండర్ బార్ ఫిలిమ్స్ పతాకంపై విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ధనుష్ నిర్మించిన 'నానుమ్ రౌడీదాన్' చిత్రంలోని సన్నివేశాలను ఉపయోగించారు. అయితే ఇలా వినియోగించడానికి ధనుష్ అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ధనుష్‌ని విమర్శిస్తూ నయనతార ఒక లేఖను విడుదల చేశారు. అది సినీ వర్గాల్లో చర్చకి దారి తీసింది. ఇక తన అనుమతి లేకుండా 'నానుమ్ రౌడీదాన్'లోని క్లిప్పింగ్ వాడినందుకు నష్టపరిహారంగా రూ. 10 కోట్లు కోరుతూ నయనతారపై చెన్నై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా నయనతార, విఘ్నేష్ శివన్‌లకు నోటీసులు జారీ చేశారు. మరి... తదుపరి పరిణామాలేంటి? అనేది వేచి చూడాల్సిందే.

– సాక్షి, తమిళ సినిమా

సాక్షి
బిజినెస్
గురువారం
28-11-2024

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 230 | 80,234 |
| నిఫ్టీ ▲ | 80 | 24,275 |

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 18,981 | ▽ 195 |
| డోజోన్స్ | 44,809 | ▲ 51 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,275 | ▲ 16 |
| డాక్స్ | 19,262 | ▽ 34 |
| షాంఘై | 3,310 | ▲ 50 |
| నికాయ్ | 38,135 | ▽ 307 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 76,175 ▲ | 485 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 75,870 ▲ | 483 |
| వెండి (కిలో) | 88,430 ▽ | 33 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 84.00 | 85.02 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.28 | 107.90 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.30 | 89.89 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 54.72 | 56.12 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.65 | 55.87 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.56 | 65.24 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 21.62 | 23.18 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | 22.10 | 23.88 |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 10.77 | 12.60 |

# వెండి మిలమిల..

**ఒకేరోజు రూ.5,200 జంప్**
- కేజీ ధర రూ.95,800కు అప్
- రూ.650 ఎగసి రూ.78,800కు చేరిన బంగారం



**న్యూఢిల్లీ:** వెండి కేజీ ధర న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో ఒకేరోజు రూ.5,200 పెరిగి రూ.95,800కు చేరింది. వెండి ధర ఒకేరోజు ఈ స్థాయిలో ఎగియడం ఒక రికార్డు. తద్వారా ఈ మెటల్ ధర రెండు వారాల తర్వాత తిరిగి రూ.95,000పైకి చేరింది. కాగా, ఇంతక్రితం అక్టోబర్ 21న వెండి ధర ఒకేరోజు రూ.5,000 పెరగడం ఒక రికార్డు. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు, స్థానిక ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్ దీనికి కారణం.

**రెండు రోజుల తర్వాత పసిడి**

ఇక గడచిన రెండు రోజుల్లో రూ.2,250 పడిపోయిన బంగారం ధర బుధవారం తిరిగి పుంజుకుంది. 99.9 ప్యూరిటీ పసిడి ధర రూ.650 ఎగసి రూ.78,800కు చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. 99.5 శాతం స్వచ్ఛత ధర రూ.950 ఎగసి రూ.78,700కు ఎగసింది. డాలర్ విలువలో ఒడిదుడుకులు తాజా పసిడి పరుగుకు కారణం. అబాన్స్ హోల్డింగ్స్ సీఈఓ చింతన్ మెహతా పసిడి భవిష్యత్ ధరలపై మాట్లాడుతూ, బులియన్ ధరలకు మరింత దిశానిర్దేశం చేసే రష్యా-ఉక్రెయిన్ వివాదం, పరిణామాలను మార్కెట్లు నిశితంగా గమనిస్తాయని అన్నారు.

**ఫ్యూచర్స్‌లో పరుగు..**

అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో చురుగ్గా ట్రేడవుతున్న ఫిబ్రవరి ఫ్యూచర్స్ ఔన్స్ (31.1గ్రాములు) ధర ఒక దశలో 1% పెగా (32 డాలర్లు) పెరిగి 2,679 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక్కడ ఇటీవలే పసిడి 52 వారాల గరిష్ఠం 2,826 డాలర్లను తాకింది. ఆ తర్వాత లాభాల స్వీకరణ, ట్రంప్ గెలుపు, డాలర్ స్థిరత్వం వంటి పరిణామాలతో ఎల్లో మెటల్ కొంత వెనక్కు తగ్గింది. దేశీయ ఫ్యూచర్ మార్కెట్ ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల ధర దాదాపు రూ. 900 లాభంతో రూ. 76,870 వద్ద ట్రేడవుతోంది.

# అదానీపై లంచం ఆరోపణల్లేవు!

- సెక్యూరిటీస్ మోసం, కుట్ర అభియోగాలే...
- అదానీ గ్రీన్ ఎనర్జీ వివరణ




**న్యూఢిల్లీ:** గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీ, కంపెనీ బోర్డు సీనియర్ డైరెక్టర్ వినీత్‌జైన్‌పై అమెరికా న్యాయ శాఖ లంచం అభియోగాలు మోపలేదని అదానీ గ్రూప్ సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ స్పష్టం చేసింది. ''న్యూయార్క్ కోర్టులో గత వారం అమెరికా న్యాయ శాఖ (యూఎస్ డీఓజే) దాఖలు చేసిన అభియోగ పత్రంలో, యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ (ఎఫ్‌సీపీఏ/అవినీతి నిరోధక) చట్టం నిబంధనలను ఉల్లంఘించే కుట్రకు పాల్పడినట్టు వ్యవస్థాపక చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ లేదా వినీత్‌జైన్‌పై అభియోగాలు మోపలేదు''అని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) బుధవారం వివరణ ఇచ్చింది. సెక్యూరిటీస్ చట్టం కింద మోసం, కుట్ర, ఉద్దేశపూర్వక కుట్ర ఆరోపణలే మోపినట్టు తెలిపింది. ఈ అభియోగాలకు చట్టం పరిధిలో శిక్షలు లంచం కంటే చాలా తక్కువని పేర్కొంది. మరోవైపు సెక్యూరిటీల చట్టం నిబంధనలు ఉల్లంఘించారంటూ.. చట్ట ఉల్లంఘన దిశగా అదానీ గ్రీన్ ఎనర్జీకి సాయం అందించారంటూ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ మరో సివిల్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నట్టు ఏజీఈఎల్ వివరణ ఇచ్చింది. సెక్యూరిటీస్ చట్టం 1933, సెక్యూరిటీస్ చట్టం 1934లోని పలు సెక్షన్లను వీరు ఉల్లంఘించారని.. ఏజీఈఎల్ సైతం ఇవే చట్ట ఉల్లంఘనలకు పాల్పడేందుకు సాయం లేదా ప్రోత్సాహం అందించినట్టు సివిల్ కేసులో అభియోగాలు మోపినట్టు వెల్లడించింది. ఏజీఈఎల్ సోలార్ విద్యుత్ సరఫరా కాంట్రాక్టులను దక్కించుకునేందుకు వీలుగా భారత అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇచ్చారంటూ అదానీ తదితరులపై కొన్ని రోజుల క్రితం సంచలన ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ క్రమంలో అదానీ గ్రీన్ ఎనర్జీ ఇచ్చిన వివరణకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇవన్నీ నిరాధార ఆరోపణలు అని, ఈ విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అదానీ గ్రూప్ ఇప్పటికే వివరణ ఇచ్చింది.

### అదరగొట్టిన అదానీ షేర్లు...

అమెరికా లంచం ఆరోపణలపై అదానీ గ్రూప్ వివరణ ఇవ్వడంతో అదానీ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అదానీ టోటల్ గ్యాస్ 20%, అదానీ పవర్ 20%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10%, అదానీ గ్రీన్ ఎనర్జీ 10% లాభపడ్డాయి. ఈ షేర్లన్నీ ఇంట్రాడేలో అప్పర్‌సర్క్యూట్ తాకాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 12%, ఎన్‌డీటీవీ 9%, అదానీ విల్మార్ 8%, అదానీ పోర్ట్స్ 6%, సంఘీ ఇండస్ట్రీస్ 5%, అంబుజా సిమెంట్స్ 4.50%, ఏసీసీ 4% పెరిగాయి. పదకొండు కంపెనీల షేర్లూ రాణించడంతో ఒక్క రోజులో అదానీ గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.24 లక్షల కోట్లు పెరిగింది.

# సెన్సెక్స్ 230 ప్లస్

- 24,250 పాయింట్ల స్థాయిపైకి నిఫ్టీ
- అదానీ గ్రూప్, అధిక వెయిటేజీ షేర్లకు డిమాండ్

**ముంబై:** అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ర్యాలీతో పాటు అధిక వెయిటేజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం లాభపడ్డాయి. సెన్సెక్స్ 230 పాయింట్లు పెరిగి 80,234 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్లు 24,275 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి భారత ఈక్విటీలను కొనుగోలు చేస్తుండటం సానుకూలాంశంగా మారింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 507 పాయింట్లు ఎగసి 80,511 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 24,275 - 24,355 పరిధిలో ట్రేడైంది. బ్యాంకులు, ఆటో, యుటిలిటీ, పవర్, సర్వీసెస్, ఇండస్ట్రియల్, టెలికమ్యూనికేషన్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ షేర్లు లాభపడ్డాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు ఒకశాతం, అరశాతం లాభపడ్డాయి. రియల్టీ, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. టారిఫ్ పెంపు తప్పదంటూ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ముగిశాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాలతో ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు నష్టపోయి 84.44 స్థాయి వద్ద స్థిరపడింది.

- ప్రైవేటు రంగ బ్యాంకు దిగ్గజం అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒకటిన్నర శాతం పెరిగి రూ.1811 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2% బలపడి రూ.1817 జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేరు వాటాయే 167 పాయింట్లు కావడం విశేషం.
- గిగ్ వర్కర్లు, పట్టణ ప్రజలకు కోసం చౌక స్కూటర్లను ఆవిష్కరించడంతో ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేరు 20% ర్యాలీ చేసి రూ.88 వద్ద స్థిరపడింది.




### లిస్టింగ్‌లో ఎన్‌టీపీసీ గ్రీన్

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.108)తో పోలిస్తే 3% ప్రీమియంతో రూ.112 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 14% ఎగసి రూ.123 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 13% లాభంతో రూ.122 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.03 లక్షల కోట్లుగా నమోదైంది.

### టాప్ 20 ఆయుర్వేద కళాశాలల్లో పతంజలి కాలేజ్



**హరిద్వార్:** ఆయుర్వేద కళాశాలలకు సంబంధించి నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్‌ఎం) ఇటీవల విడుదల చేసిన ర్యాంకింగ్‌లలో పతంజలి ఆయుర్వేద కాలేజీకి టాప్ 20లో చోటు లభించింది. 'ఎ' గ్రేడ్ రేటింగ్ దక్కింది. దేశవ్యాప్తంగా 552 కాలేజీలుండగా, తమకు మెరుగైన ర్యాంకు దక్కడం గర్వకారణమని పతంజలి యోగ్‌పీఠ్ జనరల్ సెక్రటరీ ఆచార్య బాలకృష్ణ తెలిపారు. ఉత్తరాఖండ్‌లో మొత్తం 20 కాలేజీలు ఉండగా తమ కాలేజీకి మాత్రమే 'ఎ' గ్రేడ్ రేటింగ్ దక్కినట్లు చెప్పారు. బోధన నాణ్యత, లైబ్రరీ సదుపాయాలు, అధ్యాపక బృందం.. ఫిజీషియన్లు, వనరుల లభ్యత మొదలైన అంశాల ప్రాతిపదికన ఎన్‌సీఐఎస్‌ఎం ఈ ర్యాంకింగ్‌లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇన్ఫీ ఉద్యోగులకు 90% బోనస్ | ఐటీలో నియామకాల జోరు..

# హోండా ఈ-స్కూటర్లు వచ్చేశాయ్

- రెండు మోడళ్ల ఆవిష్కరణ
- జనవరి 1 నుంచి బుకింగ్స్
- ఫిబ్రవరి నుంచి డెలివరీలు



ఆవిష్కరణ కార్యక్రమంలో హోండా బైక్స్ సీఈవో సుసుము ఓటానీ (ఎడమ), వైస్ ప్రెసిడెంట్ యోగేశ్ మాథుర

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలోకి ఎట్టకేలకు హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా ఎంట్రీ ఇచ్చింది. యాక్టివా-ఈ, క్యూసీ1 మోడళ్లను కంపెనీ భారత మార్కెట్లో బుధవారం ఆవిష్కరించింది. 2025 జనవరి 1 నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. ఫిబ్రవరి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ధరలను కంపెనీ వెల్లడించలేదు. 12 అంగుళాల డైమండ్ కట్ అలాయ్ వీల్స్, ఫ్లాట్ ఫుట్‌బోర్డ్, ఎల్‌ఈడీ లైట్లతో ఇవి తయారయ్యాయి. 6 కిలోవాట్ గరిష్ఠ పవర్, 22 ఎన్ఎం టార్క్‌తో పర్మనెంట్ మ్యాగ్నెట్ సింక్రొనస్ ఎలక్ట్రిక్ మోటార్‌తో యాక్టివా-ఈ రూపుదిద్దుకుంది. బయటకు తీయడానికి వీలుండే 1.5 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల రెండు బ్యాటరీల ఏర్పాటు ఉంది. గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని 7.3 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ఠ వేగం గంటకు 80 కిలోమీటర్లు. ఒకసారి చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. హోండా స్వాపింగ్ కేంద్రాల్లో బ్యాటరీ మార్చుకోవచ్చు. 1.8 కిలోవాట్ గరిష్ఠ పవర్, 77 ఎన్ఎం టార్క్‌తో 1.5 కిలోవాట్ అవర్ సింగిల్ బ్యాటరీతో క్యూసీ1 మోడల్ తయారైంది. ఒకసారి చార్జింగ్‌తో 80 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ఠ వేగం గంటకు 50 కిలోమీటర్లు. రెండు మోడళ్లపైనా కంపెనీ మూడేళ్లు లేదా 50,000 కిలోమీటర్ల వారంటీని ఆఫర్ చేస్తోంది. సంస్థ ఇతర ప్రతినిధులతో కలిసి ఈ మోడళ్లను హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా ఎండీ, ప్రెసిడెంట్, సీఈవో సుసుము ఓటానీ ఆవిష్కరించారు.

---

# భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 187 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 187.
» **శిక్షణా కాలం:** ఒక సంవత్సరం.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు-150, డిప్లొమా/ టెక్నీషియన్ అప్రెంటిస్‌లు-37.
» **ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు:** ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, ఈఈఈ, ఈఐఈ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు జీఈఏలకు రూ.9000, టీఏ అభ్యర్థులకు రూ.8000.
» **ఎంపిక విధానం:** డిప్లొమా, బీఈ/బీటెక్ పరీక్షల్లో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం:** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన దరఖాస్తులకు చివరితేది:**01.12.2024
» **సర్టిఫికేట్‌ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 04.12.2024.
» **సర్టిఫికేట్‌ల పరిశీలన తేదీలు:** 09.12.2024, 10.12.2024, 11.12.2024.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

### డా.ఎన్టీఆర్ యూనివర్శిటీలో బీపీటీ కోర్సులో ప్రవేశాలు

విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** నాలుగున్నరేళ్లు, ఆరు నెలల ఇంటర్న్‌షిప్.
» **అర్హత:** ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు/సార్వత్రిక విద్యలో ఇంటర్ (ఫిజికల్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2024
» **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

### డా.ఎన్టీఆర్ యూనివర్శిటీలో బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, బీఎస్సీ న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ, బీఎస్సీ ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, బీఎస్సీ రీనల్ డయాలసిస్ టెక్నాలజీ, బీఎస్సీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, బీఎస్సీ కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ, బీఎస్సీ అనెస్తీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ టెక్నాలజీ, బీఎస్సీ ఇమేజింగ్ టెక్నాలజీ, బీఎస్సీ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ, బీఎస్సీ రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ ఫిజిషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, బీఎస్సీ మెడికల్ రికార్డ్స్ అసిస్టెంట్ టెక్నాలజీ, బీఎస్సీ ట్రాన్స్‌ఫ్యూజన్ టెక్నాలజీ, బీఎస్సీ రేడియోథెరపీ టెక్నాలజీ, బీఎస్సీ ఎకో-కార్డియోగ్రఫీ టెక్నాలజీ.
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు(రోటేటరీ ఇంటర్న్‌షిప్‌తో సహా).
» **అర్హత:** ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు/సార్వత్రిక విద్యలో ఇంటర్(ఫిజికల్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2024.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

## పరిశోధనలకు మార్గం

» యూజీసీ నెట్ డిసెంబర్ నోటిఫికేషన్ విడుదల
» 2025 జనవరి 1 నుంచి 19 వరకు పరీక్షలు
» జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే ఆకర్షణీయ ఫెలోషిప్

**పరిశోధనలు చేయాలన్నా..అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలన్నా.. అందుబాటులో ఉన్న మార్గం.. యూజీసీ-నెట్!! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో ప్రతిభ చూపితే.. పరిశోధనలకు అర్హత సాధించడమే కాకుండా.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ నియామకం పొందొచ్చు!! యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) ఏటా రెండుసార్లు నెట్ పరీక్షను నిర్వహిస్తుంది. యూజీసీ-నెట్ 2024 డిసెంబర్ సెషన్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..**



యూజీసీ-నెట్ 2024

పరిశోధనలు అనగానే సైన్స్, టెక్నాలజీ విభాగాల వారికే అవకాశాలు ఉంటాయని అందరూ భావిస్తారు. ఇందుకోసం నిర్వహించే సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ మాత్రమే గుర్తొస్తుంది. కానీ.. సైన్స్, టెక్నాలజీతోపాటు ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో సైతం పరిశోధనలకు మార్గం చూపుతుంది యూజీసీ నెట్. దీంతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ అవకాశాలు అందుకోవచ్చు.

### ఏటా రెండుసార్లు

యూజీసీ-నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్)ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. తాజాగా 2024, డిసెంబర్ సెషన్‌కు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. యూజీసీ-నెట్ 2024 డిసెంబర్ సెషన్‌లో కొత్తగా రెండు పేపర్లను చేర్చారు. ఇప్పటి వరకు 83 సబ్జెక్ట్‌లలో పరీక్షను నిర్వహించగా.. తాజా నోటిఫికేషన్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఆయుర్వేద బయాలజీ సబ్జెక్ట్‌లను చేర్చారు. దీంతో మొత్తం సబ్జెక్ట్‌ల సంఖ్య 85కు చేరింది.

### అర్హతలు

కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. పీహెచ్‌డీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే వారు కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణులవ్వాలి. చివరి సంవత్సరం/చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు అయిదు శాతం చొప్పున ఉత్తీర్ణత శాతంలో మినహాయింపు లభిస్తుంది.

### మూడు కేటగిరీలుగా పరీక్ష

- యూజీసీ నెట్ పరీక్షను మూడు కేటగిరీలుగా నిర్వహిస్తారు. అవి..
- **కేటగిరీ-1:** జేఆర్‌ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్), అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ.
- **కేటగిరీ-2:** అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశం కేటగిరీ.
- **కేటగిరీ-3:** కేవలం పీహెచ్‌డీలో ప్రవేశం కేటగిరీ.

### ప్రాథమ్యాలు ఇలా

- రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశం.. రెండూ కోరుకునే వారు రెండో కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలి.
- కేవలం పీహెచ్‌డీ ప్రవేశం కోసం మూడో కేటగిరీని ఎంచుకోవాలి.

### నెట్ స్కోర్, ఇంటర్వ్యూలకు వెయిటేజ

నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతో పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తారు. ఎంపిక ప్రక్రియలో నెట్ స్కోర్‌కు 70 శాతం, తదుపరి దశలో యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్ నిర్వహించే ఇంటర్వ్యూలో స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

### ఏడాది గుర్తింపు

ఆయా యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశం కోసం.. కేటగిరీ-2, కేటగిరీ-3లలో పరీక్షకు హాజరైన వారి నెట్ స్కోర్‌కు.. ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి ఏడాదిపాటు గుర్తింపు ఉంటుంది. ఆ సమయంలో ఎప్పుడైనా.. ఏ ఇన్‌స్టిట్యూట్‌కైనా పీహెచ్‌డీలో ప్రవేశానికి సదరు స్కోర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.

### 300 మార్కులకు పరీక్ష

- నెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహించనున్నారు.
- **పేపర్-1:** టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్. ఈ విభాగంలో 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్-1 మూడు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహిస్తారు.
- **పేపర్-2:** ఇది సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ సబ్జెక్ట్ నుంచి 100 ప్రశ్నలతో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇలా రెండు పేపర్లు కలిపి మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది.

### కనీస మార్కుల నిబంధన

యూజీసీ నెట్ కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తోంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి కనీసం 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు) జనరల్- ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, డిసెంబర్ 10
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, డిసెంబర్ 12, 13 తేదీల్లో
- **నెట్ తేదీలు:**2025, జనవరి 1 నుంచి 19 వరకు
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

### నెట్‌తో ప్రయోజనాలెన్నో

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం-నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం-యూజీసీ కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ఈ హోదాలో ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించే విధంగా నిర్ణయించింది.
- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు (జేఆర్‌ఎఫ్) ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పని చేయొచ్చు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేల చొప్పున జేఆర్‌ఎఫ్ లభిస్తుంది. జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్ల పాటు నెలకు రూ.42 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి సైంటిస్ట్‌లుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారికి గ్రేడ్ ఆధారంగా ప్రారంభంలోనే నెలకు రూ.80వేల వేతనం అందుతుంది.
- నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి జేఆర్‌ఎఫ్, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత లభిస్తుంది. ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ,ఆర్థిక గణాంక శాఖలు,సామాజిక,న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

### మంచి స్కోర్ సాధించాలంటే

ఒకవైపు రీసెర్చ్, మరో వైపు అసిస్టెంట్ ప్రొఫెసర్ వృత్తికి, అదే విధంగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి మార్గంగా నిలుస్తున్న యూజీసీ-నెట్‌లో బెస్ట్ స్కోర్ సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.

**పేపర్-1కు ఇలా**

మూడు కేటగిరీల అభ్యర్థులందరికీ ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్-1లో టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్- గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంపై అయిదు ప్రశ్నలు ఉంటాయి.

**పేపర్ 2(సబ్జెక్టు పేపర్)**

అభ్యర్థుల పీజీ స్పెషలైజేషన్ లేదా డొమైన్ సబ్జెక్ట్ ఆధారంగా పేపర్-2 ఉంటుంది. ఈ పేపర్‌లో రాణించేందుకు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అంశాలపై పట్టు సాధించాలి.

## క్లుప్తంగా...

### తెలకపల్లి రవి, కె.శ్రీనివాస్‌కు గజ్జల మల్లారెడ్డి పురస్కారం

యోగి వేమన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి





వైవీయూ: ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు తెలకపల్లి రవి, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్‌లకు గజ్జల మల్లారెడ్డి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించే ఓ కార్యక్రమంలో 2023 సంవత్సరానికి కె.శ్రీనివాస్‌కు, 2024 సంవత్సరానికి తెలకపల్లి రవికి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. వైవీయూలో బుధవారం నిర్వహించిన గజ్జల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కార ఎంపిక కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

### ధనుష్, ఐశ్వర్య విడాకులు



సాక్షి, చెన్నై: సినీ నటుడు ధనుష్, ఐశ్వర్య రజనీకాంత్‌కు చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టు బుధవారం విడాకులు మంజూరు చేసింది. వారికి విడాకులు మంజూరు చేస్తూ రాత్రి ఏడున్నర గంటల సమయంలో తీర్పు చెప్పింది. దర్శకుడు కస్తూరి రాజా కుమారుడు, నటుడు ధనుష్, దక్షిణ భారత చలన చిత్ర సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యది పెద్దలు కుదిర్చిన ప్రేమ వివాహం అన్నది తెలిసిందే. 2004లో వీరి వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. 18 ఏళ్ల సంసార జీవితం అనంతరం ధనుష్, ఐశ్వర్యల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు వారికి విడాకులు మంజూరు చేస్తూ తీర్పును ఆన్‌లైన్‌లో ప్రకటించింది.

### స్పెషల్ స్ట్రే వేకెన్సీ సీట్ల కేటాయింపు పెండింగ్



సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం స్పెషల్ స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 23, 25 తేదీల్లో చేపట్టిన కన్వీనర్, యాజమాన్య కోటా సీట్ల కేటాయింపును ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనంగా వైద్య కళాశాలలకు మంజూరైన సీట్లలో నీట్ అర్హత సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పించాలని కొందరు విద్యార్థులు హైకోర్టులో కేసులు వేశారు. కేసు విచారణ దశలో ఉన్నందున స్పెషల్ స్ట్రే వేకెన్సీ సీట్ల కేటాయింపును పెండింగ్‌లో పెట్టారు.

### తొలి దశ మెడికల్ పీజీ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి మెడికల్ పీజీ కోర్సుల్లో తొలి దశ నాన్ సర్వీస్ సీట్లను బుధవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం కేటాయించింది. సీట్లు పొందిన వైద్యులు వచ్చే నెల నాలుగో తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా కళాశాలలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు.

### 7న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 45,099 ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చేనెల 7న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లకు సమగ్ర శిక్ష రూ.9,06,40,600 నిధులను విడుదల చేసింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.1000 నుంచి రూ.14 వేల వరకు కేటాయిస్తున్నట్లు ఎస్పీడీ పేర్కొన్నారు.

### ఆన్‌లైన్‌లో దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ ఫలితాలు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను బుధవారం ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కార్యదర్శి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు.

### ఐఈఎస్‌లో నారాయణ విద్యార్థికి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) ఎగ్జామ్–2024లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి నారాయణ స్కూల్స్ పూర్వ విద్యార్థి రోహిత్ దొండ్గే సత్తాచాటాడు. అంకితభావం, నిరంతర సాధన, అసాధారణ ప్రతిభతో ఈ రికార్డును సొంతం చేసుకున్నాడని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. నారాయణ స్కూల్‌లోని బేసిక్ కాన్సెప్ట్స్‌పై వేసిన స్ట్రాంగ్ ఫౌండేషన్, నారాయణ ప్రోగ్రామ్స్, టీచింగ్ రోహిత్ విజయానికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొంది. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు రోహిత్ దొండ్గే, అతని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# కావాల్సినన్ని ‘సీట్లు’!

## దేశవ్యాప్తంగా బీటెక్ సీట్లు భారీగా పెంపు

- అందుబాటులోకి 14.90 లక్షల ఇంజనీరింగ్ సీట్లు
- దక్షిణాది రాష్ట్రాల నుంచే 40 శాతం
- 3.08 లక్షల సీట్లతో అగ్రస్థానంలో తమిళనాడు
- ఆ తర్వాతి స్థానాల్లో ఏపీ, తెలంగాణ



దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ సీట్లు భారీగా పెరిగాయి. 2024–25 విద్యా సంవత్సరంలో బీటెక్ సీట్ల సంఖ్య 14.90 లక్షలకు చేరింది. 2021–22లో దశాబ్దంలోనే కనిష్ట స్థాయికి(12.54 లక్షలకు) పడిపోయిన తర్వాత.. మళ్లీ ఇప్పుడు 18.84 శాతం మేర సీట్లు పెరగడం విశేషం. వాస్తవానికి 2014–15లో దాదాపు 17.05 లక్షల సీట్లు ఉండగా.. ఆ తర్వాత ఏటా తగ్గుదల నమోదయ్యింది. మళ్లీ తిరిగి 2022–23లో 2 శాతం, 2023–24లో 5 శాతం, ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా 10 శాతం(1.40 లక్షలు) మేర సీట్ల సంఖ్య పెరిగింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) గణాంకాల ప్రకారం దేశంలో 2,906 అనుమతి పొందిన యూనివర్సిటీలు, కాలేజీల్లో 14.90 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. కొత్తగా 1,256 కాలేజీల్లో ఇన్‌టేక్ పెంపునకు ఆమోదం పొందాయి. ఇంజనీరింగ్ సీట్లలో అత్యధికంగా 40 శాతం దక్షిణాదికి చెందిన మూడు రాష్ట్రాల్లోనే ఉండటం విశేషం. దేశంలోనే అత్యధికంగా తమిళనాడులో 3,08,686, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 1,83,532, తెలంగాణలో 1,45,557 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే తమిళనాడులో 32,856, ఏపీలో 23,518, తెలంగాణలో 20,213 సీట్లు పెరిగాయి. ఈ గణాంకాలు ఇంజనీరింగ్ విద్యలో దక్షిణాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

– సాక్షి, అమరావతి

### పరిమితి ఎత్తివేతతో పెరిగిన సీట్లు..

వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఇంజనీరింగ్–టెక్నాలజీ కోర్సులకు ఆమోదంతో పాటు 2023–24లో బీటెక్‌లో కొత్త సీట్లు ప్రవేశపెట్టడంపై పరిమితిని ఏఐసీటీఈ ఎత్తివేసింది. దీంతో సీట్ల సంఖ్య భారీగా పెరిగింది. ఇందులో సూపర్ న్యూమరీ కోటాలో సుమారు 50 వేల సీట్లు కొత్తగా చేరాయి. 400 నుంచి 500 విద్యా సంస్థలు వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోర్సులను ప్రారంభించాయి. 2014–15 నుంచి 2021–22 వరకు ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరికలు చాలా వరకు తగ్గాయి. ఫలితంగా అనేక కాలేజీలు మూతపడ్డాయి. 2016–17 విద్యా సంవత్సరంలో 15.56 లక్షల సీట్లు అందుబాటులో ఉండగా.. 51 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. అనంతరం మళ్లీ 2021–22లో 71 శాతానికి, 2022–23లో 81 శాతానికి సీట్ల భర్తీ పెరిగింది. దీంతో అడ్మిషన్లు ప్రోత్సాహకరంగా ఉండటంతో సీట్ల గరిష్ట పరిమితిని ఏఐసీటీఈ తొలగించింది. అవసరమైన మౌలిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు ఉంటే.. వాటిని పరిశీలించి కావాల్సినన్ని సీట్లకు ఏఐసీటీఈ అనుమతులిస్తోంది. ఒక విద్యా సంస్థ సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా 420 సీట్ల వరకు పెంచుకునే వెసులుబాటు తీసుకువచ్చింది.

**సంవత్సరాల వారీగా దేశంలో ఇంజనీరింగ్ సీట్ల వివరాలు**

| సంవత్సరం | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 | 2024-25 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| సీట్ల సంఖ్య (లక్షల్లో) | 17.05 | 16.30 | 15.56 | 14.75 | 14.04 | 13.28 | 12.86 | 12.54 | 12.74 | 13.50 | 14.90 |

# డీఎస్సీ సిలబస్‌తో డీలా!

## ఆన్‌లైన్ పరీక్షతో సమస్యలుంటాయని అభ్యర్థుల అభ్యంతరం

సాక్షి, అమరావతి: మెగా డీఎస్సీ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోంది. ఇదిగో డీఎస్సీ.. అదిగో డీఎస్సీ అంటూ ఆరు నెలలుగా ఊరిస్తున్న ప్రభుత్వం ఎట్టకేలకు బుధవారం డీఎస్సీ సిలబస్‌ను మాత్రమే విడుదల చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడో స్పష్టత ఇవ్వలేదు. ఇప్పుడు ఈ సిలబస్‌తో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పరీక్షకు ఎప్పుడూ లేని రీతిలో ఇంటర్మీడియెట్ వరకు సిలబస్‌ను ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ అభ్యర్థులు 3–10 తరగతుల సిలబస్‌ను మాత్రమే చదవాలని చెబుతూనే.. స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు ఇంటర్ సిలబస్‌ను ఇవ్వడం అభ్యర్థులను కలవరపెడుతోంది. 2018 డీఎస్సీలోనూ ఇలాగే చెప్పిందొకటి, పరీక్షకు ఇచ్చిన సిలబస్ మరొకటి కావడంతో నాడు చాలా మంది అభ్యర్థులు నష్టపోయారు. మరోసారి ఇప్పుడు కూడా ప్రభుత్వం ఇదే మాదిరిగా వ్యవహరిస్తుండటంతో మరోసారి నష్టపోక తప్పదని అభ్యర్థులు వాపోతున్నారు. 2014 డీఎస్సీలోనూ ఇదే విధానం అనుసరించడంతో అభ్యంతరాలు వ్యక్తమైనా నాటి టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్‌లో డీఎస్సీ ఫైల్‌పై సీఎం చంద్రబాబు సంతకం చేసినప్పుడే సిలబస్‌పై సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని పలువురు అభ్యర్థులు, విద్యారంగ నిపుణులు ప్రభుత్వాన్ని కోరారు. హైస్కూల్ బోధనకు ఇంటర్ సిలబస్ ఇవ్వడం సరికాదన్నారు. అలాగే పరీక్షల నిర్వహణపైనా విజ్ఞప్తులు చేశారు.

**బోధించే తరగతులకు మించి సిలబస్..**

టెట్ సిలబస్సే డీఎస్సీ పరీక్షలకు కూడా ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు సిలబస్ ఉంటుందని తాజాగా డీఎస్సీ సిలబస్‌లో ప్రకటించారు. కానీ, సిలబస్ వివరణలో మాత్రం ఇంటర్మీడియెట్ వరకు ప్రశ్నలు ఉంటాయని మెలిక పెట్టారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు బోధన చేస్తుండగా, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్నారు. బోధించే తరగతులకు అనుగుణంగా అంతవరకే గతంలో డీఎస్సీ సిలబస్ ఉండేది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు మూడో తరగతి నుంచి 8వ తరగతి వరకు, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 6 నుంచి 10వ తరగతి వరకు సిలబస్ మాత్రమే ఉండేది. దీన్ని ఆధారం చేసుకునే ప్రశ్నపత్రాలను రూపొందించేవారు. కానీ, 2014, 2018 డీఎస్సీల్లో మాత్రం సిలబస్‌ను అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అనూహ్యంగా పెంచేసింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు బోధించే తరగతులకు మించి సిలబస్ ఇవ్వడంపై డీఎస్సీ అభ్యర్థులు, విద్యా రంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.


**ఆన్‌లైన్ పరీక్షపైనా అభ్యంతరాలు..**

జూలైలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మాదిరిగానే డీఎస్సీని కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం అభ్యర్థులకు నష్టం చేస్తుందనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రెండు సెషన్లలో రోజుల తరబడి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తే నష్టం జరుగుతుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ.. జిల్లా స్థాయిలో టీచర్ పోస్టుల భర్తీకి చేపట్టే పరీక్ష కాబట్టి పరీక్షను కూడా ఉమ్మడి జిల్లాలవారీగా ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై గతంలో అభ్యర్థులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను అభ్యర్థించారు. నాడు సానుకూలంగా స్పందించిన మంత్రి ఇప్పుడు మాత్రం ఆన్‌లైన్‌లో అది కూడా టెట్ మాదిరిగా ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పది రోజులు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

### ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఊస్టింగేనా?

ఎస్‌జీటీ, టీజీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు పాఠశాల విద్యా శాఖ సిలబస్‌ను ప్రకటించింది. కానీ హైస్కూళ్లలో బోధించే స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సిలబస్‌ను ప్రకటించలేదు. అంటే ఈ విభాగంలో పోస్టులు లేవని ప్రభుత్వం చెబుతున్నట్టుగానే భావించాల్సి వస్తోంది. 2018 ఫిబ్రవరి స్పెషల్ డీఎస్సీలో ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో దాదాపు 852 పోస్టులను గుర్తించి సుమారు 602 పోస్టులు భర్తీ చేశారు. కానీ ఈసారి వారికి అవకాశం లేకపోవడంతో డిగ్రీతో పాటు బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) చేసిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. జాతీయ విద్యావిధానం –2020 నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలోనూ తప్పనిసరిగా ఒక స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉండాలి. కానీ ప్రభుత్వం మాత్రం ఇందుకు సుముఖంగా లేనట్టు తెలుస్తోంది.

### కార్పొరేట్ బాధ్యత పెరిగింది







రతన్ టాటా మరణం తరవాత దేశవ్యాప్తంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) గురించి చర్చ మొదలైంది. తన సంపాదనలో అత్యధిక భాగం సమాజానికే తిరిగిచ్చిన గొప్ప మానవతావాది రతన్. ఆయనలానే దేశంలోని కొన్ని పెద్ద కార్పొరేట్ కంపెనీలు దాతృత్వానికి పెద్ద మొత్తంలోనే వెచ్చిస్తున్నాయి. ఇలా 2022-23లో అత్యధికంగా రూ.803 కోట్లమొత్తం ఖర్చు చేసిన కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు. ఆ తరవాతి స్థానాల్లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (రూ.774 కోట్లు), రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.743 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంకు (రూ.477 కోట్లు) ఉన్నాయి. మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు సీఎస్ఆర్ కింద ఖర్చు చేసిన మొత్తం రూ.29,988 కోట్లు. ఈ వ్యయంలో అత్యధికంగా విద్యారంగానికి వెచ్చించడం విశేషం.

## ‘సుప్రీం’ తీర్పు అమలుకు ఏం చేస్తున్నారో చెప్పండి


**పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి: హైకోర్టు**



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో అగ్నిమాపక పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, అందువల్ల ఈ దిశగా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# మారిటైమ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- తీరప్రాంతం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి మారిటైమ్ హబ్‌గా తీర్చిదిద్దాలని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. సచివాలయంలో ఏపీ మారిటైమ్ పాలసీ–2024పై బుధవారం ఆయన సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ.. ఏపీని ‘వరల్డ్ క్లాస్ మారిటైమ్ స్టేట్‌గా, వినూత్న విధానాలతో తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, మౌలిక వసతుల కల్పన, సమర్థవంతమైన పాలన ద్వారా సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం’ రాష్ట్ర విజన్ అని చెప్పారు. హైకెపాసిటీ పోర్టుల అభివృద్ధిపై దృష్టిపెట్టడంతో పాటు పోర్టులను పరిశ్రమలు, పర్యాటకంతో అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే, రాష్ట్రంలోని పోర్టులను జాతీయ రహదారుల, పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం చేయాలన్నారు. మత్స్య సంపదను పెంచే విధంగా ఫిషింగ్ హార్బర్లను పీ4 విధానంలో అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఏపీలో మారిటైం యూనివర్సిటీ స్థాపించడానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి, పరిశోధన తదితర అంశాలలో తోడ్పాటు కోసం ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ, సెమ్స్, ఐఐటీలను భాగస్వాములుగా చేసుకోవాలని చెప్పారు.

**కార్గోలో 16 శాతం వృద్ధి..**

నాన్ మేజర్ పోర్టుల కేటగిరీలో ఎగ్జిమ్ కార్గో హ్యాండిల్‌లో ఏపీ 16 శాతం వృద్ధితో దేశంలో రెండో ర్యాంకు సాధించిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో గత ఆర్థిక సంవత్సరానికిగాను 32 శాతం వృద్ధితో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని వివరించారు.

**ఇసుక తవ్వకాల చార్జీలే వసూలు చేయండి..**

మరోవైపు.. రాష్ట్రంలో ఇసుక కార్యకలాపాలు, ప్రస్తుత లభ్యత, ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా.. పరిమితులకు లోబడే ఇసుక తవ్వకాలు జరపాలని, వినియోగదారుల నుంచి తవ్వకాల ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని, ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు సీసీటీవీలతో కూడిన చెక్‌పోస్టులు, సిబ్బందిని నియమించాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## బంగ్లాదేశ్‌లో దాడులు జరిగితే స్పందనేది?

**పాలస్తీనాలో జరిగితే హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మాట్లాడతారు**



సాక్షి, న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుంటే దేశం స్పందించకపోవడం తనకెంతో ఆవేదన కలిగిస్తోందని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. దేశంలో ఎక్కడెక్కడో జరిగే ఘటనలపై స్పందించే మన దేశం.. పక్క దేశంలో హిందువులపై దాడులు జరుగుతుంటే స్పందించకపోవడమేంటని ప్రశ్నించారు. ఎక్కడో పాలస్తీనాలో జరిగిన అల్లర్లు, దాడులపై హైదరాబాద్ ఓల్డ్ సిటీ లేచి మాట్లాడిందని వ్యాఖ్యానించారు. హస్తిన పర్యటనలో భాగంగా బుధవారం పార్లమెంట్ భవనంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరిలతో కలసి ప్రధాని మోదీతో పవన్ భేటీ అయ్యారు.

**లోతుగా అధ్యయనం చేసి మాట్లాడాలి**

అదానీ విషయంపై సీఎం అధ్యక్షతన కేబినెట్‌లో కూర్చుని అందరం చర్చించాల్సి ఉందని, ఇది చాలా సెన్సిటివ్ ఇష్యూ కాబట్టి ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై ఆలోచిస్తామని మీడియా అడిగిన ప్రశ్నకు పవన్ బదులిచ్చారు.

### నిరుద్యోగులకు ఉపయోగపడేలా నైపుణ్య గణన



సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా నైపుణ్య గణన ఉండాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. స్కిల్ సెన్సస్, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖపై ఉండవల్లిలోని తన నివాసంలో లోకేశ్ బుధవారం సమీక్షించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి, నిర్మాణరంగ కార్మికులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, జర్మనీలో నర్సింగ్ స్టాఫ్‌కు డిమాండ్ ఉన్నందున ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని, అమరావతిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ జి.గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లు జి. అనిల్ కుమార్, కె. రఘు, అసిస్టెంట్ మేనేజర్ మోహన్ ఇమ్మని హాజరయ్యారు.

### వైద్య కళాశాలల్లో ఖాళీలు భర్తీ చేయండి



సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య విద్యార్థుల హాజరు శాతంపై ప్రిన్సిపల్స్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంత్రి బుధవారం ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రిన్సిపల్స్‌తో వెలగపూడి ఏపీ సచివాలయం నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

## బీ–ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: ఏపీఈఏపీసెట్–2024లో భాగంగా ఎంపీసీ, బైపీసీ విభాగాల్లోని బీ ఫార్మసీ సీట్ల భర్తీకి ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపీసీ విద్యార్థులు ఈనెల 29 నుంచి 30 వరకు, బైపీసీ విద్యార్థులు 30 నుంచి వచ్చేనెల 5 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు. అవే తేదీల్లో ఆఫ్‌లైన్/ ఆన్‌లైన్ సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు ప్రవేశాలు ప్రారంభమవుతాయి. డిసెంబర్ 4న ఎంపీసీ, 11న బైపీసీ అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుంది.

**షెడ్యూల్ ఇదీ..**

| ఎప్పుడు ఏది? | ఎంపీసీ | బైపీసీ |
|---|---|---|
| ఫీజు చెల్లింపు తేదీలు | ఈనెల 29 నుంచి 30 | 30 నుంచి వచ్చేనెల 5 వరకు |
| సర్టిఫికెట్ల పరిశీలన | ఈనెల 29 నుంచి వచ్చేనెల 1 వరకు | వచ్చేనెల 2 నుంచి 6 వరకు |
| ఆప్షన్స్ నమోదు | 29 నుంచి 1 వరకు | 3 నుంచి 7 వరకు |
| ఆప్షన్స్ మార్పు తేదీ | 2 | 8 |
| సీట్ల కేటాయింపు | 4 | 11 |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 4-6 | 11-14 |
| తరగతులు ప్రారంభం | 5 నుంచి | 12 నుంచి |

## ‘టీచర్ల సెలవులపై ఆంక్షలు ఎత్తివేయాలి’

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవులపై ఆంక్షలు విధించడం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేసింది. పాఠశాల లేదా మండలంలోని స్టాఫ్‌లో గరిష్టంగా 7 నుంచి 10 శాతం మాత్రమే సెలవులు వాడుకోవాలని షరతులు విధించడం దారుణమని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. వెంటనే సెలవులపై ఆంక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**డీఎస్సీలో ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఇవ్వాలి**

డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విడుదల చేసిన డీఎస్సీ సిలబస్‌లో ఎస్జీటీ, టీజీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు మాత్రమే సిలబస్ ప్రకటించారని.. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సిలబస్ ప్రకటించలేదన్నారు. ప్రత్యేక అవసరాల విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రతి పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## సప్తవర్ణాల తూనీగ




సప్తవర్ణాలతో కనువిందు చేస్తూ రివ్వున ఎగిరి వచ్చి చిటారుకొమ్మన వాలిన ఆ తూనీగ చూపరులను కనువిందు చేసింది. చిత్తూరు జిల్లా నగరి డిగ్రీకళాశాల మైదానం ఆనుకొని ఉన్న పొలాల్లో సీతాకోక చిలుకను పోలిన ఈ తూనీగ విహరించింది. - నగరి

## విహంగామా!




విదేశీ విహంగాల కిలకిల రావాలు, చిలిపి చేష్టలు పక్షి ప్రేమికులను కట్టిపడేశాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బుధవారం తిరుపతి జిల్లా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అక్కడ విడిది చేసే విదేశీ శీతాకాలపు విహంగాలను తిలకించి ఉప్పొంగిపోయారు. - దొరవారిసత్రం

## సంక్రాంతి సమరానికి సై




సంక్రాంతి సమరానికి కోడి పుంజులు సై అంటున్నాయి. పందెపు పుంజుల విక్రయాలు జోరందుకున్నాయి. పామర్రు-దిగమర్రు జాతీయ రహదారి సమీప కైకలూరు టౌన్‌హాల్‌లో నెల్లూరు రైతులు వివిధ జాతుల పందెపు కోడి పుంజలను విక్రయాలకు ఉంచారు. కోడిపందేల నిర్వాహకులు పెద్ద ఎత్తున వచ్చి నచ్చిన పుంజు కొనుగోలు చేశారు. - కైకలూరు

## క్లుప్తంగా...

### రాజాం-పాలకొండ రైల్వే లైను అనుసంధానం చేయండి

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేసిన ఎంపీ అప్పలనాయుడు**

సాక్షి, న్యూఢిల్లీ: రాజాం, పాలకొండ, సీతంపేటల, కోతూరు, హద్దు బంగి, పార్లాకిమిడి ప్రాంతాల మధ్య రైల్వే లైనును అనుసంధానం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను విజయనగరం ఎంపీ అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా బుధవారం కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాజెక్టుపై డీపీఆర్ తయారీకి వెంటనే అనుమతలు ఇవ్వాలని కోరారు. ఒడిశాతో అనుసంధానించుకునేలా రైల్వే మార్గం ఏర్పాటు చేయడమన్నది ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ముఖ్యమని కేంద్ర మంత్రికి తెలిపారు.

### ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు చెల్లించాలి

**సర్వసభ్య సమావేశంలో అపెక్మా తీర్మానం**

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు సకాలంలో ఫీజులు విడుదల చేయాలని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపెక్మా) బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. కళాశాలల నిర్వహణ విద్యార్థులు చెల్లించే ఫీజులపైనే ఆధారపడుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. తమ ఆర్థిక ఇబ్బందులను తొలగించినప్పుడే నూతన ఐటీ విధానం ప్రకారం యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించడానికి వీలుంటుందని స్పష్టం చేసింది. నిర్వహణ భారం లేనప్పుడే ప్రైవేటు యాజమాన్యాలు సాంకేతిక విద్యను అందిస్తూ విద్యార్థులను పరిశ్రమలకు అనుగుణంగా తయారు చేయడానికి వీలుంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు కళాశాలలకు సకాలంలో ఫీజులు చెల్లించాలని విజయవాడలో జరిగిన అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో తీర్మానించింది.

### గిరిజనేతరులకు మద్యం దుకాణాలు ఎలా కేటాయిస్తారు?

**రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో మద్యం దుకాణాలను గిరిజనేతరులకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు మద్యం దుకాణాలను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి గ్రామ సభ నిర్వహించకుండా గిరిజన ప్రాంతాల్లో మద్యం దుకాణాలను గిరిజనేతరులకు కేటాయించడం చట్ట విరుద్ధమంటూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టీ.వెంకటశివరామ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది.

### 'మైనారిటీ'లకు డీఎస్సీ ఉచిత కోచింగ్

సాక్షి, అమరావతి: త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-2024 పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. ముస్లింలు, క్రైస్తవులు (బీసీ-సీ), సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు తదితర మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఉచిత కోచింగ్ ప్రోగ్రామ్‌ను అందించేందుకు అర్హులైన సంస్థలు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం చేసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఆసక్తిగల సంస్థలు, అభ్యర్థులు వెబ్‌సైట్: టీటీటీ.ఎపిఎంఎఫ్‌సి.ఎపి.జిఓవి.ఇన్ పోర్టల్ ద్వారా లేదా డైరెక్టర్ కార్యాలయం, మైనారిటీల విద్యా అభివద్ధి కేంద్రం, స్వాతి థియేటర్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ-520012 అనే చిరునామాకు చేరేలా డిసెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఉప్పెనలా ఊబకాయం




సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన 3వ తరగతి విద్యార్థి 46 కిలోల బరువు ఉన్నాడు. జంక్‌ఫుడ్ అతిగా తినడంతోనే బరువెక్కినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మిగతా విద్యార్థులతో సమానంగా క్రీడల్లో పాల్గొనలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊబకాయం కారణంగా చలాకీతనం కోల్పోయాడని అంటున్నారు.

రెండు వారాల క్రితం తొమ్మిదో తరగతి చదివే ఓ విద్యార్థి బస్సులో ప్రయాణిస్తూ.. పుట్టపర్తి దాటిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు సాయం చేసి.. సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. షుగర్ లెవెల్స్ పడిపోయినట్లు నిర్ధారించారు. ఊబకాయమే సమస్యకు కారణమని వైద్యులు తేల్చారు.

**పెరుగుతున్న అనారోగ్య సమస్యలు / లోపిస్తున్న మానసిక ఎదుగుదల / బాల్యంలోనే బీపీ, షుగర్ ముప్పు / విద్యలోనూ రాణించలేక ఇబ్బందులు**

**బొద్దుగా ఉంటే ముద్దుగా ఉన్నారంటారు. కానీ అధిక భారం అలాగే కొనసాగితే వారికి వారే భారం కావడం ఖాయం. అంతేకాదు పలు అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదమూ ఉంది. జీవనశైలిలో మార్పుల కారణంగా భవిష్యత్తులో ఊబకాయుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.**

సాక్షి, పుట్టపర్తి: ఊబకాయం.. ప్రతి వందలో 20 మందిని తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సమస్య. శారీరక వ్యాయామం తగ్గటం, ఆహార నియమాలు పాటించకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి విధానంతో ఇప్పుడు చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఊబకాయులుగా మారుస్తోంది. బాల్యంలోనే ఊబకాయం వస్తే చలాకీతనం కోల్పోతారు. చిన్న వయసులోనే అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. శారీరకంగా అనేక ఇబ్బందులు పడుతారు. వయసుకు తగిన బరువు ఉంటే చాలని.. అధిక బరువు అనర్థాలకు దారి తీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### ఊబకాయుల్లో సమస్యలు ఇవే..

- ఊబకాయం ఉన్న పిల్లలు సహచరుల నుంచి తరచూ అవహేళనకు గురవుతారు. ఫలితంగా మానసికంగా డిప్రెషన్‌కు లోనయ్యే ప్రమాదం ఉంది.
- ఊబకాయం ఉన్న పిల్లలు చలాకీతనం కోల్పోవడం కారణంగా క్రీడల్లో రాణించలేరు. కనీసం అవకాశాలు రావడం కూడా కష్టమే.
- అందరితో పాటు వ్యాయామం చేయాలనుకున్నప్పటికీ.. కాసేపటికే అలసిపోతారు. శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతారు.
- మానసిక ఒత్తిడి కారణంగా చదువులో వెనుకబడే అవకాశం ఉంది. విద్యలో ఉన్నత స్థానాలకు వెళ్లడం కష్టమే.
- టీనేజీలోకి వచ్చేసరికి మరింత డిప్రెషన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా అందరిలో కలవకుండా ఒక్కరే ఉండేందుకు ఇష్టపడతారు.
- ప్రీ డయాబెటిస్, హైపర్‌టెన్షన్ చిన్న వయసులోనే దరి చేరుతాయి. ఫలితంగా జీవితాంతం వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సిన పరిస్థితి.
- ఊబకాయం కారణంగా స్కిన్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ కూడా సోకే ప్రమాదం ఉంది.

### ఊబకాయం ఇలా..



- జంక్‌ఫుడ్, బయట ఆహారం ఎక్కువగా తీసుకోవడం, పిజ్జా, బర్గర్, నూడిల్స్ తినడం కారణంగా ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంది.
- జంక్‌ఫుడ్ టేస్ట్ డిఫరెంట్‌గా ఉండటంతో ఎక్కువ మోతాదులో తీసుకుని బరువు పెరుగుతారని వైద్యులు చెబుతున్నారు.
- కదలిక లేని జీవన విధానంతో బరువు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. బిజీ షెడ్యూల్‌లో చాలామంది నడవడం తగ్గించి వాహనాలను వినియోగిస్తున్నారు.
- టీవీ, సెల్‌ఫోన్ చూస్తూ.. మోతాదుకు మించి భోజనం తినేస్తున్నారు. ఫలితంగా మనిషి సాధారణం కంటే బరువు పెరిగే అవకాశం ఉంది.
- తల్లిదండ్రులు ఊబకాయులైనా పిల్లలకు వచ్చే అవకాశం ఉంటుందని పలు అధ్యయనాలు తేల్చాయి. జన్యుపరమైన కారణాల రీత్యా కూడా ఊబకాయం రావచ్చని అంటున్నారు.

### ఇలా చేస్తే మేలు....

- జంక్‌ఫుడ్‌ను వీలైనంత వరకు తగ్గించాలి
- టీవీ, సెల్‌ఫోన్ చూసే సమయం తగ్గించాలి
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- తల్లిదండ్రులు శ్రద్ధతో పిల్లలతో వాయింగ్ చేయించాలి
- ఊబకాయం ఉన్న పిల్లలను రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించాలి

### వ్యాయామం తప్పనిసరి

ఊబకాయం ఉన్న వారిలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉండవు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ కారణంగా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వారంలో రెండు, మూడుసార్లు జంక్‌ఫుడ్ తింటే ఊబకాయం వచ్చే అవకాశం ఉంది. బయటి ఆహారం తినడమూ కారణంగా చెప్పవచ్చు. పిల్లల బరువు పెరుగుతున్నట్లు గుర్తిస్తే తల్లిదండ్రులు వారిని క్రమం తప్పకుండా వాకింగ్‌కు తీసుకెళ్లాలి. జంక్ ఫుడ్ బదులు ఆరోగ్యకర ఆహారం తీసుకునేలా చేయాలి. – డాక్టర్ ప్రతాప్, హిందూపురం

### జీవనశైలి మార్పులతో..

జంక్ ఫుడ్ బదులు ప్రత్యామ్నాయం ఆలోచించాలి. నిత్యం వ్యాయామం చేయలేని వారు ఇతర మార్గాల్లో శారీరక బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అవతలి వ్యక్తి అవహేళన చేసినప్పుడు డిప్రెషన్‌కు లోను కాకూడదు. పిల్లల బరువు తగ్గే విషయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. జీవన శైలిలో మార్పులతో ఊబకాయం నుంచి బయట పడవచ్చు. – డాక్టర్ రాజశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

## పడిలేచిన జొన్న పంట


వారం రోజుల క్రితం నేలవాలిన జొన్నపంట


ప్రస్తుతం యథావిధిగా వచ్చిన పంట

కొలిమిగుండ్ల: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సాగులో ఉన్న పంటలు నేలకొరగడం, దెబ్బతినడం చూస్తుంటాం. అయితే ఎలాంటి గాలి, వాన లేక పోయినా నేలకొరిగిన పంట వారం రోజుల వ్యవధిలో తిరిగి యథాస్థానానికి చేరుకోవడంతో ఇది ఎలా సాధ్యమని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులకే అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన రైతు మోహన్‌రెడ్డి ఎకరా విస్తీర్ణంలో రాయచూరు జొన్న సాగు చేశాడు. సరిగ్గా వారం రోజుల క్రితం ఉన్నట్లుండి గాలి, వాన లేకపోయినా వాటంతటా పంట అంతా నేలకొరిగింది. హఠాత్తు పరిణామంతో రైతు విషయాన్ని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాడు. వాళ్లు పంటను పరిశీలించి ఏమి చేయడానికి వీలు లేదు, పంట రికవరీ అయ్యే అవకాశం లేదని తేల్చేశారు. చేసేది లేక రైతు మొదట పంటను దున్నేయాలని భావించాడు. మళ్లీ ఆలోచించి పశువులకు మేత కోసం ఉపయోగపడుతుందని ఆలోచించి గ్రామంలోని మరొక రైతుకు సూచించడంతో నాలుగైదు రోజుల్లో కోసుకుంటానని చెప్పాడు. అయితే మంగళ, బుధవారం రెండు రోజుల్లోనే ఎవరూ ఊహించని విధంగా పడిపోయిన జొన్న పంట యథాస్థానంలో నిలబడింది. సాధారణంగా వాణిజ్య పంటలు నేలకొరిగాక తిరిగి లేవడం వ్యవసాయ చరిత్రలో అద్భుతమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

## వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్లు, సభ్యులకు ఊరట

సాక్షి, అమరావతి: సింగిల్ జడ్జి తీర్పు వల్ల పదవులు కోల్పోయిన వివిధ జిల్లాల వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్లు, సభ్యులకు హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. వీరి నియామకాన్ని రద్దు చేస్తూ, వీరి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించాలంటూ పౌర సరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను పక్కన పెట్టింది. పదవులు కోల్పోయిన వారిని గతంలో మాదిరిగానే ఆ జిల్లాల ఫోరంలకు ప్రెసిడెంట్లుగా, సభ్యులుగా కొనసాగించాలని ఆదేశాలిచ్చింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ జిల్లాల ఫోరం ప్రెసిడెంట్లు, సభ్యుల నియామకాలకు సంబంధించిన రికార్డులను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్లు, సభ్యుల ఎంపిక పూర్తిగా సెలక్షన్ కమిటీ పరిధిలోనిదేనని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

## పిల్లలు బడికి రాకపోతే వ్యవస్థ ఏమవుతుంది?

- ప్రభుత్వ స్కూళ్లలో బెస్ట్ టీచర్లున్నా ఫలితాల్లో ఎందుకు బెస్ట్ ఉండడం లేదు?
- పిల్లలు ప్రభుత్వ బడులకు ఎందుకు రావడం లేదో ఆలోచించండి
- విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్



మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్

అనంతపురం ఎడ్యుకేషన్: 'డబ్బాల్లా రేకుల షెడ్లలో నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లకు వేలాది రూపాయల ఫీజులు కట్టి పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. బెస్ట్ టీచర్లు, బెస్ట్ స్టూడెంట్స్, బెస్ట్ సౌకర్యాలు ఉన్నాయి. మరి ఫలితాల్లో బెస్ట్ ఎందుకు ఉండడం లేద'ని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ ప్రశ్నించారు. బుధవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం రూరల్ పరిధిలోని సీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఎంఈవోలు, హెచ్ఎంలకు జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వ లోపాలతోనే పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నది వివిధ సర్వేల్లో తేలిందన్నారు. దీంతో శిక్షణ అనేది దేశ వ్యాప్తంగా తప్పనిసరి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉందన్నారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం దాదాపు 45 యాప్‌లు ఉన్నాయని, అన్నీ కలిపి ఒకట్రెండ్ యాప్‌లు చేసేలా చూస్తున్నామని చెప్పారు. ఈ రెండు యాప్‌లలోనే అన్ని అంశాలూ ఉంటాయన్నారు.

**క్లాస్‌కు కాకుండా పిల్లలకు పాఠాలు చెప్పాలి**

టీచర్లు క్లాస్‌కు పాఠాలు చెబితే ఉపయోగం ఉండదని, పిల్లలకు చెప్పాలని సూచించారు. 8వ తరగతి పిల్లాడు 3వ తరగతి గణితాలు చేయకపోవడం బాధాకరమన్నారు. 40-50 ఏళ్ల నాటి ప్రభుత్వ బడులు పూర్తిగా మారిపోయాయని, రానున్న డీఎస్సీతో టీచర్ల కొరత ఉండదని, ఇక కావాల్సిందంతా క్వాలిటీ విద్య అని అన్నారు. ఎమర్జెన్సీగా శస్త్రచికిత్స చేయకపోతే విద్యా వ్యవస్థకు గడ్డు పరిస్థితులు వస్తాయన్నారు. సొంత పిల్లల్లా చూసుకున్నప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అకడమిక్ ప్రోగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ అయినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఫలితాలు ఉండాలన్నారు. 'ప్రత్యేక పిల్లలు' చదువుకునే భవిత కేంద్రాలపైనా దృష్టి పెడతామన్నారు.

## ఆధ్యాత్మిక సమాచారం



### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,525 మంది స్వామివారిని దర్శించుకోగా 19,880 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

### వేడుకగా శ్రీకపిలేశ్వరస్వామి రుద్రహోమం

తిరుపతి కల్చరల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శ్రీకపిలేశ్వరాలయంలో చేపడుతున్న నెల రోజుల హోమ మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకపిలేశ్వరస్వామి వారి రుద్రహోమం వేడుకగా చేపట్టారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం పూజ, జపం, హోమం, రుద్రత్రిశతి, బిల్వార్చన, నివేదన, విశేష దీపారాధన చేశారు.


### రత్నగిరికి పోటెత్తిన భక్తులు..

అన్నవరం: కార్తిక బహుళ ద్వాదశి, బుధవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం భక్తజనసందోహంతో నిండిపోయింది. సుమారు 50 వేల మంది సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు నాలుగు వేలు నిర్వహించారు. సత్యదేవుని దర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని ఊహించిన అధికారులు స్వామివారి ఆలయాన్ని బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు తెరిచి పూజలు చేశారు.

### మద్దిలో లక్ష చామంతుల పూజ

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి లక్ష చామంతి పూలతో లక్షార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.


## విద్యా సమాచారం




### ఘనంగా 'ధర్మనిధి' సదస్సు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సును బుధవారం సావేరీ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ మహిళల వేదన, బాధలు, తమను తాము ఆవిష్కరించుకునే తీరును స్త్రీల జీవితచరిత్రలు తెలియజేస్తాయన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంతో తన అనుబంధం, వర్సిటీ స్థాపనలో తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు అనుభవాలను పంచుకున్నారు. స్త్రీ విద్య ఉపయోగాలను విశదీకరించారు.

### జర్మన్ భాషపై ఉచిత శిక్షణ



తిరుపతి తుడా : నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ, జీఎన్ఎమ్ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ప్రారంభమైంది. బుధవారం స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆర్వీ కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ కేర్‌లో అనుభవం కలిగిన వారికి జర్మనీలోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పించడం శుభపరిణామన్నారు. ఈ క్రమంలోనే స్కిల్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ జర్మన్ లాంగ్వేజ్ కార్యక్రమం కింద 6 నెలలపాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని వివరించారు. డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ వనజాక్షి, జర్మన్ ప్రతినిధులు మిస్ సచికోయిసోట్, మనోహర్ పాల్గొన్నారు.

### 30న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు


తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30, 1వ తేదీల్లో ఉదయం 8 గంటలకు గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, మందడ గ్రామంలోని గుడ్ రోల్ పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) సయ్యద్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత సైకిల్, సామగ్రితో హాజరవ్వాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు డిసెంబరు 7నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం, పూరీలో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) నిర్వహించే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డీఎస్ఏ సైక్లింగ్ కోచ్ వి.కనకరావును 98493 79932, డీఎస్ఏ అథ్లెటిక్ కోచ్ ఎస్.శివారెడ్డిని 97080 92077ను సంప్రదించాలని డీఎస్‌డీఓ కోరారు.

# 'ప్లాన్' ప్రకారం నిర్లక్ష్యం

## పట్టణాలు, నగరాల అభివృద్ధికి పడని అడుగులు.. తెరపైకి రోజుకో కొత్త పథకం..

- ఆచరణకు నోచని 'అర్బన్ తెలంగాణ'మార్గదర్శకాలు
- కొత్త మున్సిపాలిటీలు, పట్టణాలకూ ఖరారు కాని 'మాస్టర్‌ప్లాన్‌'లు
- గత ప్రభుత్వ హయాంలోనే సిద్ధం చేసిన అధికారులు
- పెండింగ్‌లో 46 మున్సిపాలిటీలు, 21 పట్టణాల మాస్టర్‌ప్లాన్‌లు
- ఏళ్లు గడుస్తున్నా ఆమోదానికి నోచని వైనం
- సిద్ధం కాని గ్రేటర్ వరంగల్ - 2041 డీపీఆర్

వరంగల్ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం (డీటీసీపీ) ఆధ్వర్యంలో కొత్త, పాత పురపాలక సంఘాలకు కొత్త బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)ల అమలు పథకం అటకెక్కింది. గత ప్రభుత్వ హయాంలో నగరాలు, పట్టణాల స్థితిగతులు అధ్యయనం చేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్న డీటీసీపీ ఆదేశాల మేరకు.. మున్సిపాలిటీలలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అన్నీ సిద్ధం చేసినా ఆమోదానికి నోచుకోలేదు. - సాక్షి ప్రతినిధి, వరంగల్



### మాస్టర్‌ప్లాన్ అమలైతే ప్రయోజనాలివీ..

మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందితే అందులో దాదాపు 40 విభాగాలు ఉంటాయి. వాణిజ్య, నివాసాలకు ప్రత్యేకంగా జోన్లు కేటాయిస్తారు. చెరువులు, కుంటలు, తాగునీటి పైపులైన్లు, మురుగు, వర్షపు నీటి కాలువలు, రహదారుల వెడల్పు వంటి వాటిని ప్రత్యేకంగా కేటగిరీలుగా విభజిస్తారు. కొత్త ఇళ్లు, వాణిజ్య భవనాల నిర్మాణ అనుమతులు మాస్టర్‌ప్లాన్ ప్రకారమే ఇస్తారు. రహదారుల వెడల్పు ఎంత ఉండాలనేది ఖరారు చేస్తారు. మార్కెట్లు, పాఠశాలలు, కార్యాలయాలు ఎక్కడ ఉండాలో నిర్ణయిస్తారు. ఒకసారి ఆమోదించాక 20 – 40 ఏళ్ల పాటు పట్టణ ప్రణాళిక కార్యాచరణ మొత్తం దానికి అనుగుణంగానే సాగుతుంది. జీఐఎస్ ద్వారా ఇళ్లకు అనుమతులు, రహదారుల వెడల్పు వంటి సమాచారం ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. ఆస్తిపన్ను, వాణిజ్య లైసెన్సు జారీ, పచ్చదనం, మౌలిక సదుపాయాలకు ఇదే ఆధారం.

### 2022లో ప్రణాళికలు సిద్ధమైనా..

2022లో పురపాలకశాఖ ఆదేశాల మేరకు ఆ ఏడాది జూన్ నెలాఖరు వరకు ప్రణాళికలు సిద్ధమైతే.. 2023 నుంచి పలు మున్సిపాలిటీలు, పట్టణాల మాస్టర్‌ప్లాన్‌కు మోక్షం కలుగుతుందని భావించినా కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'అర్బన్ తెలంగాణ.. అభివృద్ధి నమూనా'పేరిట 'మాస్టర్‌ప్లాన్–2050'తయారు చేయాలని నిర్ణయించి ఆదేశించినా ఇంకా పట్టాలు ఎక్కడం లేదు.

- జనగామ పురపాలిక 1953లో ఏర్పడింది. 1987లో దీని పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలుకు అడుగులు పడగా, 1990లో అమల్లోకి వచ్చింది. డీటీసీపీ ఆదేశాలతో 2015లో కౌన్సిల్ తీర్మానం, ప్రభుత్వ ఆదేశాలతో 2017లో రివైజ్డ్ మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని కోరుతూ వినతి పంపించారు. సుమారు మూడున్నర దశాబ్దాలు గడుస్తున్నా, మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో కొత్త మాస్టర్‌ప్లాన్ ఆవశ్యంగా మారింది.
- ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ మూలన పడింది. ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏయూడీఏ)ని తెరపైకి తెచ్చినా.. భవిష్యత్ అభివృద్ధి, ప్రయోజనాలకు కీలకమైన మాస్టర్‌ప్లాన్ అమలుకు నోచడం లేదు. పూర్వ జిల్లాలోని కొత్త మున్సిపాలిటీల్లో మాస్టర్‌ప్లాన్ అమలుకు.. లక్సెట్టిపేట్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్‌పై కసరత్తు జరిగినా పూర్తి దశకు చేరలేదు.

### వరంగల్ ఆర్‌డీడీ పరిధిలో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో మొత్తం 46 మున్సిపాలిటీలు, 21 పట్టణాలకు 2023లో కొత్త మాస్టర్‌ప్లాన్ల రూపకల్పన జరిగింది. ఇందులో 17 పట్టణాలకు మాస్టర్‌ప్లాన్‌ను రివిజన్ చేశారు. ఎలాంటి ప్లాన్ లేని 21 పట్టణాలకు కొత్తగా ప్లాన్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్ – 2041 ఇటీవలే ప్రభుత్వ ఆమోదానికి నోచుకుంది. కానీ పూర్తి స్థాయిలో డీపీఆర్ కాలేదు. కాగా మందమర్రి, మంచిర్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, వేములవాడ, వైరా, కొత్తపల్లి మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్లు 2012, 2013, 2019లలో ఆమోదం పొందాయి. వైరా ఖమ్మం (సుడా)లో, కొత్తపల్లి కరీంనగర్ (సుడా)లో కలిశాయి. ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్ (సుడా), ఖమ్మం (సుడా) 2018 నుంచి కేంద్ర అమృత్ పథకంలో ఉన్నాయి. రామగుండం అమృత్ స్కీం మాస్టర్‌ప్లాన్ రివిజన్ కూడా జరిగింది. జనగామ, జగిత్యాల, సిరిసిల్ల, కాగజ్‌నగర్, నిర్మల్, భైంసా, పాల్వంచ, కొత్తగూడెంలలో పాత మాస్టర్‌ప్లాన్‌ను రివిజన్ చేశారు. ఎలాంటి ప్లాన్ లేని సత్తుపల్లి, మణుగూరు, నర్సంపేట, పరకాల, హుజూరాబాద్, ఇల్లందు, బెల్లంపల్లి జమ్మికుంట, వర్ధన్నపేట, తొర్రూర్, మరిపెడ, డోర్నకల్, మంథని, సుల్తానాబాద్, చెన్నూర్, లక్సెట్టిపేట్, క్యాతనపెల్లి, చొప్పదండి, రాయకల్, ధర్మపురి, ఖానాపూర్ పట్టణాలు కొత్త మాస్టర్ ప్లాన్‌కు నోచుకోలేదు.



యువజన అభివృద్ధి, పర్యాటక, సంస్కృతి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న స్మితా సబర్వాల్

## మిషన్ భగీరథ తాగునీటిపై ప్రజలకు విశ్వాసం కలిగించాలి

- మిషన్ భగీరథ బోర్డు సమావేశంలో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిపై ప్రజలకు విశ్వాసం, అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వ్యవస్థను వేల కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసినా.. ప్రజలు ఇంకా ఆర్వో ప్లాంట్లు, బోరు నీళ్లపై ఆధారపడటం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం సచివాలయంలో జరిగిన మిషన్ భగీరథ బోర్డు సమావేశంలో సీతక్క మాట్లాడుతూ ఈ పథకం ద్వారా సరఫరా అవుతున్న శుద్ధమైన తాగునీటిపై ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్వో నీరు, బోరు నీటి ద్వారా దీర్ఘకాలంలో ఏవిధమైన సమస్యలు తలెత్తుతాయో ప్రజలకు వివరించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతను ప్రజలకు వివరించేలా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సదస్సులు నిర్వహించాలని సీతక్క ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఫిబ్రవరి, మార్చిలో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించి డిపార్ట్‌మెంట్ అధికారులను, పంచాయతీలను సన్నద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

## తొలి ఏడాదిలో రైతు 'సంక్షేమం'ఇలా..

- దేశంలోనే వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ మొదటి స్థానాన్ని నిలబెట్టుకుందని, ఖరీఫ్‌లో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.
- ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు ఒకే సారి రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ జరిగింది. కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.
- ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం నిరాటంకంగా కొనసాగిస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించింది.
- ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులను పంపిణీ చేసింది. యాసంగి సాగుకు పెట్టుబడి సాయంగా రైతుభరోసా నిధులను ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ చేసింది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.
- పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించి, రాష్ట్రంలోని రైతుల తరపున పంటల బీమా ప్రీమియం కోసం రూ.1,300 కోట్లు కేటాయించింది.
- రైతు బీమా పథకం కింద ప్రీమియంగా రూ.1,455 కోట్లు చెల్లించింది.
- రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు కేవలం మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వానాకాలం సీజన్ నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు అమ్మిన రైతులకు బోనస్ చెల్లించింది. దీంతో రాష్ట్రంలో సన్నరకాల వరిసాగు విస్తీర్ణం పెరిగిందని ప్రభుత్వం తెలిపింది.
- అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడేందుకు 'రైతు నేస్తం'పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. తొలి విడతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,601 రైతు వేదికల నుంచి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే ఏర్పాట్లు చేసింది.
- అన్ని మండలాల్లో 148 మంది వ్యవసాయ అధికారులను కొత్తగా నియమించారు. ఉద్యానవన శాఖలో 18 మంది హార్టికల్చర్ ఆఫీసర్లను నియమించింది.
- ఆయిల్ పామ్ కస్టమ్స్ సుంకానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించటం ద్వారా ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2,000 అదనపు లబ్ధి చేకూరే నిర్ణయం తీసుకుంది. అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్‌ప్లాంట్ ప్రారంభించారు.
- వ్యవసాయ రంగం అభివృద్ధి సలహాలు, సూచనల కోసం కోదండరెడ్డి సారథ్యంలో వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

## ఏడాది పాలనపై చర్చకు సిద్ధమా?

- ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజాక్షేత్రంలో చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డికి.. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సవాల్ విసిరారు. రాష్ట్ర పాలనా తీరులో కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒకే పంథాలో సాగుతున్నాయని మండిపడ్డారు. ప్రజలను నమ్మించేందుకు ఈ రెండు పార్టీలు పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయన్నారు. బుధవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ 6 నెలలు, 66 అబద్ధాలతో కాలం వెలిబుచ్చుదామనుకుంటే వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో కే–ట్యాక్స్ వసూళ్లకు పాల్పడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్–ట్యాక్స్ వసూళ్లు చేస్తోందని ఆరోపించారు. మియాపూర్ భూములు, మూసీ సుందరీకరణ, ప్రాజెక్టుల భూసేకరణ, పార్టీ ఫిరాయింపులు, డ్రగ్స్ కేసుల్లో విమర్శలకే ఈ రెండు పార్టీలు పరిమితమయ్యాయని ప్రభాకర్ ధ్వజమెత్తారు. బండారాన్ని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీ పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో బీఆర్ఎస్ వైఖరి దొంగే.. దొంగని అరిచినట్లు ఉందన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పీఎంకే డిస్టిలేషన్ కంపెనీకి అనుమతి ఇచ్చిందని, ఈ సంస్థకు గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని తనయుడు తలసాని సాయికిరణ్ డైరెక్టర్‌గా ఉన్నారని గుర్తు చేశారు. రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజలు తిరస్కరించిన పార్టీలు ప్రభుత్వంపై విమర్శలా?

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రజలు తిరస్కరించడంతో అధికారం కోల్పోయి అసహనంతో ఒక పార్టీ, మతతత్వ వాదంతో అడ్డదారిన అందలం ఎక్కేందుకు మరొక పార్టీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి ఆరోపించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతులు, ప్రజలు ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దని చిన్నారెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌లో జిల్లా కేంద్ర శివారులోని భూత్పూర్‌లో గురువారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. మహబూబ్‌నగర్ రైతుల కష్టాలు తీర్చాలని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో భీమా, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, రామనపాడు వంటి ప్రాజెక్టులకు రూ.7 వేల కోట్లు విడుదల చేశారని చిన్నారెడ్డి గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బందూలాల్, విశ్రాంత వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎట్టి రామకృష్ణ

## మోదుగు ఆకుపై అంబేడ్కర్

గార్ల: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన చిత్రకారుడు ఎట్టి రామకృష్ణ బుధవారం మోదుగు ఆకుపై అంబేడ్కర్ చిత్రాన్ని చిత్రీకరించారు. గార్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై డ్రాయింగ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ.. గతంలో కూడా సుద్దముక్కలతో చార్మినార్, కాకతీయ యూనివర్సిటీ కళాతోరణం, రావి ఆకులపై పలు చిత్రాలను చిత్రీకరించారు.

## విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

బీఆర్ఎస్ నేత డాక్టర్ శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థుల మరణాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హత్యలేనని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఆయన తెలంగాణ భవన్‌లో బుధవారం పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 49 మంది పిల్లలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. మాగనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు బయటి ఆహారం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేసిన ప్రకటనలపై మండిపడ్డారు. విద్యార్థులు బయటకు వెళ్లలేదంటున్నా.. ఘటనను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

# భూములిచ్చారు..భవనాలు కట్టారు

## అయినా అందుబాటులోకి రాని లెదర్ పార్కులు | నిరుపయోగంగా 50 ఎకరాలు... నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

జడ్చర్ల: లక్ష మందికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లెదర్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. చర్మ ఉత్పత్తుల పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) వీటిని ఏర్పాటు చేయాల్సిన ఉంది. ఇందుకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 50 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్ సమీపంలో 2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మినీ లెదర్ పార్కు నిర్మించాలన్న ఉద్దేశంతో లిడ్ క్యాప్‌కు 25 ఎకరాల అసైన్డ్ భూమిని, బల్మూర్ మండలం జినుకుంటలో 25 ఎకరాలను కేటాయించింది. ఇందులో భాగంగానే 2004లో అప్పటి ప్రభుత్వం చర్మకారుల అభివృద్ధి కోసం జినుకుంటతోపాటు పోలేపల్లి శివారులో లిడ్‌క్యాప్‌కు కేటాయించిన స్థలంలో నిధులు వెచ్చించి భవనాలు కూడా నిర్మించింది. పోలేపల్లి శివారులో గల భూమిలో దాదాపు రూ.10 లక్షల అంచనా వ్యయంతో ఓ భవనాన్ని నిర్మించి మలుపు పేరుతో ఓ పథకాన్ని కూడా ప్రారంభించారు. జినుకుంటలో రూ.25 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించి.. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో చర్మ ఉత్పత్తులకు సంబంధించిన యంత్ర సామగ్రిని కూడా సమకూర్చారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో పథక ఉద్దేశం నెరవేరడం లేదు. పోలేపల్లిలో కూడా ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో లిడ్‌క్యాప్‌కు కేటాయించిన 25 ఎకరాల భూమి నిరుపయోగంగా మారింది.



పోలేపల్లి శివారులో శిథిలావస్థకు చేరిన లెదర్‌పార్కు భవనం

### చెన్నైలో ప్రత్యేక శిక్షణ..

చర్మ ఉత్పత్తుల తయారీకి సంబంధించి అప్పట్లో పలువురు నిరుద్యోగ దళిత యువకులను గుర్తించి వారికి చెన్నైలో శిక్షణ ఇప్పించారు. వారి ద్వారా జడ్చర్ల ఇండస్ట్రియల్ పార్కులో 250 మందికి చర్మ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కాలంలో నెలకు రూ.1,500 స్టైఫండ్ చెల్లించి శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందించారు. లెదర్ పార్కులలో ఏర్పాటయ్యే పలు పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారులు అప్పట్లో హామీ ఇచ్చారు. జినుకుంటలో దాదాపు 400 మందికి శిక్షణ ఇచ్చారు. తర్వాత వారికి ఉపాధి అవకాశాలు కల్పించలేదు.

### శిథిలావస్థకు చేరిన భవనాలు

పోలేపల్లిలో చర్మకారుల వృత్తికి సంబంధించి పాదరక్షలు, పర్సులు, బూట్లు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన మలుపు పథకం భవనం కూడా క్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. భవనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో కిటికీలు, తలుపులు, షట్టర్ తదితర సామగ్రిని సైతం దొంగలు అపహరించుకెళ్లారు. జినుకుంటలో సైతం భవనం శిథిలావస్థకు చేరుకోగా యంత్రాలు తుప్పు బట్టాయి.

### రూ.కోట్లలో భూముల ధరలు

పోలేపల్లి శివారులో లెదర్ పార్కుకు కేటాయించిన భూముల విలువ రూ.కోట్లు పలుకుతోంది. ఒక వైపు సెజ్.. మరోవైపు 44వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉండటంతో భూమి విలువ రూ.కోట్లకు చేరింది. ఇక్కడ బహిరంగ మార్కెట్‌లో ఎకరా ధర రూ.3 కోట్లకు పైగా పలుకుతోంది. ఇంత విలువైన భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

### ఏపీఐఐసీకి అప్పగింత

పోలేపల్లి శివారులో జాతీయ రహదారితోపాటు సెజ్‌కు దగ్గరగా ఉన్న ఈ భూమిలో లెదర్ పార్కు ఏర్పాటు చేసేందుకు లిడ్‌క్యాప్ 2008లో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)కి అప్పగించింది. అయితే ఏపీఐఐసీ అధికారులు లెదర్ పార్కు ఏర్పాటుకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో 25 ఎకరాల భూమి నిరుపయోగంగానే మారింది. దీంతో 2013లో ప్రభుత్వం ఏపీఐఐసీ నుంచి సదరు భూమిని వెనక్కి తీసుకొని మళ్లీ లిడ్‌క్యాప్‌కి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూమిని స్వాధీనం చేసుకున్న లిడ్‌క్యాప్ ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో దళితుల ఉపాధికి సంబంధించి ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలోని దళితులకు ఉపయోగపడేలా లెదర్ పార్కులను అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

### రూ.60 లక్షలు కేటాయింపు

తెలంగాణ ప్రభుత్వం 2022లో లిడ్‌క్యాప్ శిక్షణ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు రూ.60 లక్షలు కేటాయించింది. తమిళనాడులోని సీఎల్ఆర్ఐ (సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)కు సంబంధించి ఈ నిధులు కేటాయించినట్టు అప్పట్లో అధికారులు తెలిపారు. కానీ, ఇప్పటి వరకు ఆ నిధులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు.

### ఎంతో మందికి ప్రయోజనం..

పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో లిడ్‌క్యాప్‌కు కేటాయించిన భూమిలో చర్మ ఉత్పత్తుల తయారీ సంబంధిత కార్యక్రమాలు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టిసారిస్తే ఎంతోమందికి ప్రయోజనం ఉంటుంది. సంబంధిత రంగాల్లో శిక్షణ పొందిన పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. లెదర్ ఉత్పత్తులకు మార్కెట్‌లో లభిస్తున్న డిమాండ్ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లెదర్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



### అవకాశాలు కల్పించాలి..

చర్మ ఉత్పత్తుల తయారీపై పొందిన శిక్షణ నిరుపయోగంగా మారింది. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించాం. లెదర్ పార్కులలో ఏర్పాటయ్యే పరిశ్రమలు తమ జీవితాలకు బాటలు వేస్తాయనుకున్నాం. కానీ, పాలకులు లెదర్ పార్కులపై దృష్టి సారించలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులకు న్యాయం చేయాలి.

- కృష్ణయ్య, చర్మకారుల సంఘం అధ్యక్షుడు, జడ్చర్ల







● శంఖాకార ఆలయం

# శ్రీ కుట్రాళ నాథుడు..!

తమిళనాడులోని సుప్రసిద్ధ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన శ్రీకుట్రాళనాథుని దేవాలయం శైవక్షేత్రాలలో ప్రముఖమైనది. కు... అంటే జన్మ జన్మల పాపం.. తాలమ్ అంటే తీర్చేది. కు తాలమ్ ..కుత్తాలమ్ అనే పేరు కాలక్రమేణా 'కుట్రాళం' గా మారింది. సమీపంలోని ఔషధ యుక్తమైన జలపాతాలతో ఆరోగ్యదాయకమైన పర్యాటక స్థలంగా పేరుపొందింది. ఈ ఆలయంలోని ఈశ్వరుని పేరు శ్రీ కుట్రాళ నాదర్. అమ్మ వారి పేరు 'కుళల్వాయ్ మొళి'ఇక్కడ ఉన్న తీర్థం 'శివ మధుగంగై' 'వడ ఆరువి' చిత్రానది అని పేరొందింది. ఉత్సవమూర్తి పేరు 'సోమస్కందర్'

తిరువనంతల్: ఉదయం 6.00, ఉదయమార్తాండమ్: 7.00, విల పూజ: 8.00, సిరుకల సంధి: 9.00, కళా సంధి: 10.00, ఉచ్చి కలాం: 12.00 మధ్యాహ్నం, సాయరట్చాయ్: 6.00 సాయంత్రం, అర్థసమమ్: 8.00 రాత్రి.

ఇచుమించుగా మాసానికో పండుగ చొప్పున ఈ క్షేత్రంలో మొత్తం పన్నెండు ఉత్సవాలు నిర్వహిస్తారు.

చిత్తై విషు తిరునాళ్, ఐప్పాసి విషు తిరునాల్, మార్గళి తిరువత్తిరై తిరునాళ్, నవరాత్రి తిరునాల్, ఆది అమ్మవాసై పత్తి తీప తిరునాళ్, అవని మూల తిరునాళ్, ఐప్పాసి తిరుకల్యాణ తిరునాళ్, కంద షష్ఠి తిరునాళ్, కార్తిగై తీప తిరునాళ్, థాయ్ మహా తెప్ప తిరునాల్. మాసి మాత శివరాత్రి, పంగుని ఉతిర తిరునాళ్, చిత్తై విషు తిరునాళ్, ఐప్పాసి విషు తిరునాళ్, మార్గళి తిరువత్తిరై తిరునాళ్ మరియు తెప్ప తిరునాళ్ ఈ ఆలయ ప్రత్యేక పండుగలు.







శంఖు ఆకారంలో నిర్మితమైన ఈ ఆలయం 2000 సంవత్సరాల కాలంనాటి ప్రాచీన ఆలయం. ఇక్కడ చిత్రసభ గోడలమీద బ్రహ్మదేవుడు చిత్రీకరించిన శివుని రూపాలను ఈనాటికి దర్శించవచ్చు. ఆలయ స్థల వృక్షం కురుంపలా' (పనస చెట్టు). నాలుగు వేదాలు ఒక వృక్షంగాను, వేళ్ళు ప్రణవంగాను, శ్రుతి కొమ్మలుగానూ ఉన్న ఈ వృక్షం కుళల్వాయ్ మొళి అమ్మవారి సన్నిధి ముందు ఉంది.

కుళల్వాయ్ మొళి అంటే వేణునాదం వంటి మృదుమధురమైన కంఠస్వరం కలదని అర్థం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల పేర్లతో మూడు శిఖరాలు కలిగిన ఈ కొండని 'త్రికూటమలై' అని పిలుస్తారు. ఆదిలో ఇదొక వైష్ణవాలయం. అప్పుడు ఈ క్షేత్రాన్ని 'తిరుముట్రం' అని పిలిచేవారు. కైలాసంలో జరిగిన శివ.. పార్వతుల కళ్యాణ మహోత్సవానికి వచ్చిన అతిథుల తాకిడికి, ఆ బరువుకు ఉత్తరదిశ కుంగిపోగా... దక్షిణదిశ తేలిపోయింది. రెండు దిక్కులవైపు సమతలంగా చేయడానికి పరమేశ్వరుడు అగస్త్యమహర్షిని దక్షిణ దిశకి పంపాడు. అప్పుడు అగస్త్యమహర్షి బరువుకు రెండువైపులా సమానం అయింది.

కుట్రాళం జలపాతధారలు మూలికా మహిమలు గలవి. కుట్రాలం పర్వతం నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న చంపక అడవిని సంరక్షించే దేవి చంపకదేవి, షణ్బక (చంపక) జలపాతం సమీపాన ఉంది. కుట్రాలనాదర్ ఉత్సవాలకు ఏ విధమైన అడ్డంకులు రాకుండా నిర్విఘ్నంగా జరగడానికి ప్రథమంగా ఈ చంపకదేవినే పూజిస్తారు. ఆ తరువాతే ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయి. చంపకదేవికి జరిపే ఉత్సవం చైత్రమాసంలో పదిరోజుల పాటు జరిపి పౌర్ణమి నాడు సంపూర్తి చేస్తారు.

ఆ రాత్రి అక్కడ పసుపు వర్షం పడుతుంది. ఆలయానికి పైన ఉన్న శివగంగై అనే తేనెరంగు జలపాత గంగ శివలింగాన్ని అభిషేకించగా దానినే పసుపువర్షం అంటారు. ఆలయ సమీపాన గల పెద్ద జలపాతం పడే రాతి బండలమీద అనేక శివ లింగాలు దర్శనమిస్తాయి.

కుట్రాళనాథర్ ఆలయ సమీపాన ఉత్తరంగా ధరణీ పీఠం అనే పరాశక్తి పీఠం అందమైన ఒక చిన్న ఆలయంగా దర్శనమిస్తుంది. ఇక్కడ పరాశక్తి ధ్యానంలో ఉన్నందున, ఈ పీఠాన్ని యోగ పీఠం అంటారు. ఇక్కడ వున్న కుట్రాళనాదర్‌కి, కుళల్వాయ్ అమ్మ వారికి నిత్యం శొంఠి, మిరియాలు చేర్చిన కషాయం నివేదిస్తారు. జలపాతం హోరువలన స్వామికి తలనొప్పి రాకుండా ఉండడానికే ఈ ఏర్పాటు.

**ఎక్కడ ఉంది?**

తమిళనాడు తిరునల్వేలి జిల్లాలో వున్న తెన్కాశి - శెంకోట్టై మార్గంలో తెన్ కాశీ నుండి దక్షిణ పడమటగా 5 కి.మీ దూరంలోను, శెంకోట్టై నుంచి7 కి.మీ దూరంలోనూ కుట్రాళం శివాలయం ఉంది.

● పరిహారం

# నిరాశా నిస్పృహలు వేధిస్తున్నాయా..?

ఎంత కష్టపడినా ఫలితం దక్కనప్పుడు, అనుకున్న పనులు అనుకున్నట్లుగా జరగనప్పుడు, కుటుంబ సభ్యుల మధ్య పొరపొచ్చాలు తలెత్తి ఇంట్లో అశాంతి నెలకొన్నప్పుడు, కొందరు నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతారు. మానవ యత్నంగా ఎన్ని చేసినా పరిస్థితులు కొలిక్కి రాకపోగా, కనీసమైన సుఖశాంతులు లోపించినప్పుడు దిగులు చెంది నిద్రలేమికి లోనవుతారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి కొన్ని పరిహారాలు...

- ప్రతి శుక్రవారం మేడిచెట్టు చుట్టూ ఇరవై ప్రదక్షిణలు చేయాలి. లక్ష్మీదేవిని తామరపూలతో అర్చించాలి. పాయసం వంటి తెల్లని తీపి పదార్థాలను నైవేద్యం పెట్టాలి.
- ఇరవై శుక్రవారాలు శివాలయంలో ఆవునేతిని, తెల్లని వస్త్రాలను, పత్తిని, పెరుగును దానం చేయాలి. నానబెట్టిన బొబ్బర్లను ఆవులకు తినిపించాలి. ఆలయం వద్ద ఉండే పేదలకు పొంగలి పెట్టాలి.
- వాననీటిని ఒక చిన్న పాత్రలో సేకరించి, నీటితో ఉన్న ఆ పాత్రను ఇంట్లో ఈశాన్య దిశగా ఉంచాలి. డబ్బు, ఇతర విలువైన వస్తువులను భద్రపరచుకునే బీరువాను నైరుతి దిశలో ఉంచాలి.
- ఇంటా బయటా ఎక్కడైనా స్త్రీలతో దురుసుగా ప్రవర్తించకుండా ఉండాలి. పొరపాటుగానైనా, అసంకల్పితంగానైనా స్త్రీలను బాధపెట్టినట్లయితే మనస్ఫూర్తిగా వారి క్షమాపణలు కోరండి.
- ఏదైనా శుక్రవారం రోజున కొత్త తాళాన్ని కొని, దానిని దిండు కింద పెట్టుకుని నిద్రించండి. మర్నాటి ఉదయమే... అంటే శనివారం ఉదయాన్నే ఇంటికి దగ్గర్లోని ఆలయానికి ఆ తాళాన్ని కానుకగా ఇవ్వండి.
- ప్రతి శనివారం సాయంత్రం వేళ రావి చెట్టు మొదట ఆవునేతి దీపాన్ని వెలిగించాలి. అనాథ బాలలకు పాలు దానంగా ఇవ్వాలి.



– సాంఖ్యాయన

● కథానీతి

# అక్కరలేని పోటీ

ఒక సర్కస్‌లో ఓమారు నాలుగు కుక్కలకూ, ఓ చిరుతపులికీ పరుగు పందెం నిర్వహించారు. పోటీ నిర్వాహకుడు గాల్లోకి తుపాకీ పేల్చగానే కుక్కలన్నీ పరుగెత్తాయి. చిరుతపులి మాత్రం ఎక్కడికీ పరుగెత్తకుండా ఉన్న చోటే కూర్చుంది.

'ఇదేంటీ చిరుత పరుగెడితే చూద్దామని వస్తే అసలది లేవకుండా ఉందేమిటీ' అని ప్రేక్షకులు తెల్లబోయి చూస్తున్నారు. దానివేగం గురించి తెలిసిన కొందరు ఆఖరి క్షణంలోనైనా అది లేచి ముందుకు దూసుకుపోతుందని అనుకున్నారు. కానీ అది లేస్తే ఒట్టు.

దాంతో నిరాశ చెందిన ప్రేక్షకులు నిర్వాహకుడిని కలిసి 'ఏమిటయ్యా ఈ పోటీ? చిరుత దౌడు చూడటానికొస్తే అది అసలు లేవకుండా కూర్చున్నదేమిటి?' అని అడిగారు.

అప్పుడు నిర్వాహకుడు 'చిరుత తనకు ఆకలి వేసి



వేటాడడానికి పరుగెడుతుంది. అప్పుడు దాన్నెవరూ ఆపలేరు. తాననుకున్న జంతువుని వేటాడి ఆకలి తీర్చుకుంటుంది. అంతేతప్ప తన దౌడు వేగాన్నీ సామర్థ్యాన్నీ తనకెక్కడా సరిలేని కుక్కలతో పోటీ పడి రుజువు చేసుకోవలసిన అవసరం చిరుతకు లేనేలేదు. మనుషుల్లోనూ శక్తిమంతులు తమకన్నా బలహీనులపై తమ శక్తియుక్తులను ప్రదర్శించుకోవలసిన అవసరమేమాత్రం ఉండదు. ఎక్కడ తమ శక్తియుక్తులు నిరూపించుకోవాలో వారికి బాగా తెలుసు. అంతేతప్ప తమ శక్తిని అనవసరమైన వాటి విషయంలో ప్రదర్శించి విలువైన సమయాన్ని వృథా చేసుకోరు' అన్నాడు.

ప్రేక్షకులకు అసలు విషయం అర్థమైంది.

– జగద్రేణు

● సువార్త

# పరీక్షలతో మరింత ఆశీర్వాదకరం

ఊజు దేశానికి చెందిన యోబు అనే భక్తుడు మహా సంపన్నుడు, నీతిపరుడు. ఆయనకు ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వారినెంతో అపురూపంగా పెంచాడు. ఆయన కుమార్తెలంత అపురూపమైన, సుందరమైన ముఖములు గల వారెవ్వరూ ఊజు దేశంలో లేరు.

ఒకరోజు ఆయన కుమారులు, కుమార్తెలు తమ పెద్దన్న యింట విందారగించుచుండగా గొప్ప సుడిగాలి అరణ్య మార్గంగా వచ్చి ఆ యింటి నాలుగు మూలలను కొట్టగా అది యౌవనస్థుల మీద పడగా వారు చనిపోయారని సేవకుడు యోబుకు చెప్పాడు.

అప్పుడు అతడు(యోబు) లేచి తన పై వస్త్రాన్ని చింపుకొని, తల వెంట్రుకలు తీయించుకొని నేలమీద సాష్టాంగ పడి, నేను తల్లి గర్భం నుండి దిగంబరునిగా జన్మించితిని, తిరిగి ఆ విధంగానే తిరిగి వెళ్లెదను, యెహోవా సర్వశక్తిగల దేవుడు/సర్వేశ్వరుడు (పాత తర్జుమా) ఇచ్చెను. ఆయనే తీసుకున్నాడన్న మాట తప్ప దేవుడు అన్యాయం చేసెనని అనలేదు. అతడు (యోబు) దేవునితో 75 ప్రశ్నలు సంధించగా, యెహోవా సుడిగాలిలో నుండి ఈ లాగున ప్రత్యుత్తరమిచ్చాడు. 'నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ వుంటివి. ఉదయ నక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు దేవదూతలందరూ ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు దాని మూలరాతిని వేసినవాడెవడు? (యోబు 38 : 4, 7; 38-41 వరకు యోబు గ్రంథం.

అప్పుడు యోబు యెహోవాతో ఈలాగు ప్రత్యుత్తరమిచ్చాడు. ''దయచేసి నా మాట ఆలకింపుము. వినికిడి చేత నిన్ను గూర్చి వార్త వింటిని, కానీ నేనిప్పుడు నిన్ను కన్నులారా చూస్తున్నానని నీవు సమస్త క్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినదేదియు నిష్ఫలం కానేరదని నేనిప్పుడు తెలుసుకొంటిని'' అన్నాడు. (యోబు 42:1-5)

యెహోవా యోబును మొదట ఆశీర్వదించిన దానికంటే మరి అధికంగా ఆశీర్వదించెను. మరియు ఏడుగురు కుమార్లు, ముగ్గురు కుమార్తెలను అనుగ్రహించాడు. ఈ గ్రంథం పద్యకావ్యంగా స్థానం పొందింది. ఇది వాస్తవిక చరిత్ర. క్రీ.పూ. సుమారు 5-4 శతాబ్దాలలో వ్రాయబడిందని పండితుల అభిప్రాయం.



మనకు భౌతికమైన ఈ లోకంలో జరిగేవాటి గురించి తెలుసుగాని, పరలోకంలో జరిగే విషయాలు తెలియవు. దేవుడు అపవాది ద్వారా భక్తుని పరీక్ష. (యెహెజ్కేలు 14 : 14-20).

కష్టాలలో, నిస్సహాయతలో దేవుని వైపు తిరగడం మానవ విజ్ఞతకు సంకేతం. సృష్టికర్త ఆయన స్వరూపంలో, నరుని ఎముక నుండి, మాంసం నుండి రూపింపబడిన వారే స్త్రీలు. అందుచేతనే నారీ అనబడింది స్త్రీ. (ఆది 1 : 27: 2:23). కావున మన గృహములలోను, సమాజంలోను, సంఘంలోనూ బాల బాలికలను కాపాడుకుందాం. గౌరవిద్దాం. వారి భవిష్యత్ కొరకు కృషి చేద్దాం.

– కోట బిపిన్ చంద్రపాల్

# ధర్మ సందేహాలు



**మరణించిన వ్యక్తికి 10వ రోజున 'ధర్మోదకాల' పేరిట నీటిని విడుస్తాం. దాని ద్వారా మన పుణ్యాన్ని ధారపోస్తామని అంటున్నారు కొందరు... నిజమా?**

మరణించిన వ్యక్తికి సంబంధించిన జీవుడు వెళ్తూంటే దాహశాంతి కల్గడానికి విడిచే జలం అది తప్ప పుణ్యాన్ని ధారపోయడం కాదు. ఈ విషయం ఆ జలాన్ని విడిచే సందర్భంలో చదివే మంత్రంలో ఉంటుంది.

**వృత్తిరీత్యా వైద్యురాలిని. పూజ సకాలంలో కావడం లేదు. పూజ కాకుండా వృత్తిధర్మాన్ని నిర్వర్తించడం ఇష్టం లేదు. సమస్యలొస్తున్నాయి ఈ కారణంగా. ఏం చేయాలి?**

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడ నిత్య ఆ పరబ్రహ్మని ఆరాధిస్తూనే ఉంటారు. అయితే సకాలంలోనే కంస రావణ హిరణ్యకశిపు బాణాసురాది శత్రువుల్ని సంహరించారు. సకాలంలో వృత్తిధర్మాన్ని నిర్వహించకుండా పూజ చేస్తూ కూచోవడం పాపాన్ని మూటగట్టిస్తుంది తప్ప పుణ్యాన్ని అందించదు. ఇలాటి పూజ సత్‌కాలక్షేపానికి పనిచేస్తుంది. అన్యథా అనుకోకండి.

● హదీసు పరిమళం

# దైవాన్ని ఎలా ప్రార్థించాలి?

దైవాన్ని ఎలా ప్రార్థించాలి, ఏమి ప్రార్థించాలనేది ఎవరి ఇష్టాయిష్టాలు, అవసరాలపైన ఆధారపడి ఉంటుంది. అయితే పెద్దలు దైవాన్ని ఎలా ప్రార్థించేవారో తెలుసుకోవడం వల్ల మనకు కూడా దైవాన్ని ఎలా ప్రార్థించాలో, ఏమి కోరుకోవాలో అర్థం అవుతుంది. ముఖ్యంగా ప్రవక్తలు ఎలా ప్రార్థించేవారో తెలుసుకుని, అందుకు తగ్గట్టు మనం కూడా దైవాన్ని ప్రార్థించడం వల్ల దైవానుగ్రహం, దైవప్రసన్నత తొందరగా లభిస్తాయి.

దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రార్థించేవారు:

ఓ అల్లాహ్! నా ధార్మిక స్థితిని చక్కదిద్దు. ఎందుకంటే నా యోగక్షేమాలన్నీ దానిపైననే ఆధారపడి ఉన్నాయి. నా ప్రాపంచిక స్థితిని మెరుగుపరచు. ఎందుకంటే నేనిక్కడ జీవించవలసి ఉంది. నా పరలోకాన్ని చక్కబరచు. ఎందుకంటే నేను అక్కడికే మరలవలసి ఉంది. అక్కడే శాశ్వతంగా ఉండవలసి ఉంది. నా జీవితాన్ని శుభాలు, మేళ్లను అభివృద్ధిపరిచే సాధనంగా చెయ్యి .నా మరణాన్ని అన్ని రకాల కీడుల నుండి రక్షణ పొందే, విముక్తి పొందే సాధనంగా చెయ్యి (హదీసు పరిమళం 5 భాగం)



**ఈ వేడుకోలులోని మొదటి వాక్యం..**

ఓ అల్లాహ్! నా ధార్మిక స్థితిని చక్కదిద్దు. నా యోగక్షేమాలన్నీ దీంతోనే ముడివడి ఉన్నాయి. వాస్తవానికి మనిషి ధార్మికంగా సరైన దిశలో ఉంటేనే అతను దైవాగ్రహం నుండి తప్పించుకోగలుగుతాడు. దైవ కారుణ్యానికి నోచుకోగలుగుతాడు. అతని ధన, మాన, ప్రాణాలకు భద్రత లభిస్తుంది. అందుకే మనిషి యోగక్షేమాలు అతని ధర్మావలంబనతో ముడివడి ఉన్నాయి. అతని ధార్మిక స్థితి ప్రవర్తన సజావుగా ఉంటే అతను సర్వవిధాలా సురక్షితంగా ఉంటాడు. దీనినే ప్రవక్త సల్లల్లాహు వసల్లం వారి ప్రార్థనలో పేర్కొనడం జరిగింది.

మనిషి ధార్మిక స్థితి చక్కబడాలంటే అతని విశ్వాసం నిష్కల్మషంగా ఉండాలి. అతని భావాలు, భావనలు సజావుగా ఉండాలి. అతని ఆచరణలు సరిగా ఉండాలి. అతను తన జీవితపు అన్ని విభాగాలలో మనోవాంఛలకు బదులు దైవాజ్ఞల ప్రకారం మసులుకునేవాడై ఉండాలి. ఇదంతా దేవుని సద్బుద్ధి పైననే ఆధారపడి ఉంది కదా! అందుకే విశ్వాసి అయిన ప్రతి మనిషి అన్నిటికన్నా ముందు దీనినే– అంటే ధార్మిక స్థితినిచక్కదిద్దు అనే కోరుకోవాలి.

**వేడుకోలులోని రెండవ వాక్యం**

నా ప్రాపంచిక స్థితిని సంస్కరించు. ఎందుకంటే నేను ఇక్కడే జీవితం గడపవలసి ఉంది.

ప్రాపంచిక స్థితిని సంస్కరించడం అంటే భావం మనిషి జీవనోపాధి ధర్మసమ్మతమైనది ఉండాలి. అంటే హలాల్ ఆహారంతో అతని కడుపునిండాలి. అధర్మమైన హరాం పోకడలకు అతను దూరంగా ఉండాలి. నిశ్చయంగా విశ్వాసి అయిన దాసుడు తన ప్రభువు సన్నిధిలో చేతులెత్తి అర్థించవలసిన విషయం ఇది.

**వేడుకోలు లోని మూడవ విషయం..**

నా పరలోకాన్ని చక్కదిద్దు నేను అక్కడికే మరలవలసి ఉంది. మనిషి ధార్మికంగా మంచి స్థితిలో ఉంటే అవశ్యంగా అతను పరలోక సాఫల్యం పొందుతాడు, ఇందులో సందేహానికి తావే లేదు. అయినప్పటికీ దైవ ప్రవక్త స పరలోకాన్ని చక్కదిద్దమని నిత్యం ప్రార్థిస్తూ ఉండేవారు .ఎందుకంటే పరలోక జీవితానికి ఉన్న ప్రాధాన్యత అసాధారణమైనది. అది గాక మనిషి ధార్మికంగా ఎంత ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ పరలోకం విషయంలో అతను నిశ్చింతగా, నిర్భయంగా ఉండకూడదు.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● అంతర్యానం

# సన్యాసి... సన్న్యాసి



మానవుని మనస్తత్వం ఎప్పుడు ఎలా ఉంటుందో, ఎలా మారుతుందో చెప్పలేం. సంసారం రథం లాగలేక సన్యాసి అయిన సందర్భాలు ఉన్నాయి. సన్యాసి అంటే కేవలం జీవితం నుంచి, బాధ్యతల నుంచి పారిపోవడం, సోమరితనంతో పొట్ట నింపుకోవడం కాదు అటువంటివారు సన్నాసులే కానీ, సన్న్యాసులు కారు. మరో కోణంలో బారెడుగడ్డం పెంచుకుని, నుదుట కుంకుమ బొట్టు పెట్టుకొని, కషాయ వస్త్రాలు ధరించి చేతిలో చిరుతలు, తంబుర పట్టుకుని శిష్యగణాన్ని వెంటబెట్టుకుని వీధి, వీధి తిరగడం కూడా కాదు. అసలు సిసలు సన్యాసం అంటే ఐహిక సుఖాలను వదులుకొని, సంసారాన్ని పూర్తిగా పరిత్యజించడం, మౌనంగా ఉండటం, సాధు ప్రవర్తన అవలంబించడం, హింసకు దూరంగా ఉండటం, దైవచింతన అలవర్చుకోవడం, తన చుట్టూ ఏమి జరుగుతుందో తెలియక పోవడం మొదలైన లక్షణాలు కలిగి ఉంటాడు. సన్యాసం తీసుకుంటే ఏ పనీ చేయనక్కర లేదని, అందరూ గౌరవించి మంచి భోజనం పెడతారని, హాయిగా తిరగవచ్చని అందరూ అనుకుంటారు. ఇది అపోహ మాత్రమే. నిజానికి అన్ని ఆశ్రమాలలోకి కష్టతరమైనది, బాధ్యతాయుతమైనది సన్యాస ఆశ్రమమే. బాహ్యప్రపంచానికి ఎంతో ఉన్నతంగా, ఉత్తమంగా కనపడుతూ సాధువుగా ఎంతో నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో పూజాపునస్కారాలతో అత్యుత్తమమైనవాడిగా కనపడే వ్యక్తి మనసులో భయంకరమైన, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉండొచ్చు. అటువంటి వ్యక్తిని మిథ్యాచారుడు అనవచ్చు. ఏ వ్యక్తి అయితే కర్మేంద్రియాలను మాత్రమే నిగ్రహించుకుని మనసుతో విషయాలను స్మరిస్తూ ఉంటాడో అటువంటి వాడు మిథ్యాచారుడు లేక అబద్ధ ప్రవర్తన కలవాడికిందే పరిగణించాల్సి ఉంటుంది.

కనుమ ఎల్లారెడ్డి,
పౌరశాస్త్ర అధ్యాపకులు

## మంచి మాటలు

- వెయ్యి గోవుల మంద ఒకే చోట ఉన్నా, దూడ ఖచ్చితంగా తన తల్లిని వెతుక్కుంటూ దగ్గరకు ఎలా వెళ్ళగలదో... మంచి-చెడు, పుణ్యం-పాపం మనం చేసే కర్మ ఫలాలు కూడా అలానే మనల్ని వెతుక్కుంటూ వస్తాయి.
- బదులు తెలియని ప్రశ్నలకు.. సమాధానం..కాలం చెప్పినంత తేలికగా.. ఏ మేధావి చెప్పలేడు..!!
- మన ఆనందానికి అందరూ అతిథుల్లా వస్తారు.... కానీ... మన కష్టానికి కొందరే బంధువుల్లా వస్తారు....!!



– స్వామి వివేకానంద

## బిజినెస్ రీల్

### కార్గో ఈ-త్రీవీలర్లకు రాయితీల పొడిగింపు



న్యూఢిల్లీ: కార్గో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల కొనుగోలుపై రాయితీలకు సంబంధించి పీఎం ఈ-డ్రైవ్ పథకం రెండవ దశను కేంద్రం ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 80,546 యూనిట్లకు రాయితీ మంజూరు చేయాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. అయితే నిర్దేశించిన లక్ష్యాన్ని గడువు కంటే ముందే నవంబర్ 7 నాటికే చేరుకుంది. దీంతో 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కావాల్సిన రెండవ దశను ముందుగానే ప్రారంభించాల్సి వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎల్5 విభాగంలో 1,24,846 యూనిట్ల ఎలక్ట్రిక్ కార్గో త్రిచక్ర వాహనాలకు రాయితీ ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. నవంబర్ 26న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2024 నవంబర్ 8 నుంచి 2026 మార్చి 31 మధ్య మొత్తం 1,24,846 యూనిట్ల ఎలక్ట్రిక్ కార్గో త్రీ-వీలర్లకు కిలోవాట్ అవర్‌కు రూ.2,500 సబ్సిడీ ఉంటుంది. రాయితీ కింద గరిష్ఠంగా ఒక్కో వాహనానికి రూ.25,000 అందిస్తారు. గతంలో ఈ మొత్తం కిలోవాట్ అవర్‌కు రూ.5,000 సబ్సిడీ ఇచ్చేవారు. గరిష్ఠంగా రూ.50,000 ఉండేది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.10,900 కోట్లు కేటాయించింది.

### గ్రీన్‌ఫ్యూయల్ కొనుగోలు పూర్తి: లుమాక్స్



ముంబై: గ్రీన్ ఫ్యూయల్ ఎనర్జీ సొల్యూషన్స్‌కు చెందిన ప్రత్యామ్నాయ ఇంధన బిజినెస్‌లో 60 శాతం వాటా కొనుగోలుని పూర్తి చేసినట్లు లుమాక్స్ రిసోర్స్ వెల్లడించింది. ఇందుకు రూ. 153 కోట్లకుపైగా వెచ్చించింది. నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమీకరించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆటోమోటివ్ సిస్టమ్స్, విడిభాగాల తయారీ దిగ్గజం లుమాక్స్ ఆటో టెక్నాలజీస్‌కు సొంత అనుబంధ కంపెనీ లుమాక్స్ రిసోర్స్. తాజా ఈ కొనుగోలు ద్వారా లుమాక్స్ ఆటో టెక్నాలజీస్ సీఎస్‌జీ, హైడ్రోజన్ తదితర గ్రీన్, ఆల్టర్నేట్ ఇంధన విభాగాలలోకి ప్రవేశించనుంది. వీటికి పటిష్ఠ డిమాండ్ కారణంగా రానున్న కాలంలో అత్యుత్తమ వృద్ధిని అందుకోనున్నట్లు కంపెనీ పేర్కొంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-11-2024

| | |
|---|---|
| విశాఖ | 585-00 |
| చిత్తూరు | 603-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 595-00 |
| విజయవాడ | 595-00 |
| రిటైల్ ధర (డజను) | 84.00 |
| హైదరాబాద్ | 590-00 |
| వరంగల్ | 592-00 |
| రిటైల్ ధర | 6.50 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ADANIENT | 2,399.00 | 11.56 |
| ADANIPORTS | 1,195.50 | 5.9 |
| BEL | 307.05 | 3.07 |
| TRENT | 6,856.00 | 2.8 |
| NTPC | 369.75 | 2.24 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| APOLLOHOSP | 6,982.00 | -1.34 |
| TITAN | 3,292.00 | -1.07 |
| WIPRO | 583.85 | -0.87 |
| SHRIRAMFIN | 3,021.00 | -0.83 |
| HINDALCO | 661.3 | -0.72 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,468 |
| ఎన్ఎస్ఈ | 1,07,332 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 3,87,243 |
| ఎఫ్ఐఐ | + 8 |
| డీఐఐ | + 1,302 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 68.23 | $ 68.77 |
| బ్రెంట్ | 71.75 | $ 72.32 |

# ఐటీలో నియామకాల జోరు..

- వచ్చే ఆరు నెలల్లో 12 శాతం వృద్ధి
- కొత్త టెక్నాలజీలతో 2030 నాటికి పది లక్షల పైగా కొలువులు
- క్వెస్ కార్ప్ నివేదిక



న్యూఢిల్లీ: టెక్నాలజీ వేగవంతంగా మారిపోతున్న నేపథ్యంలో దేశీయంగా ఐటీ సర్వీసుల విభాగంలో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి. వచ్చే ఆరు నెలల్లో నియామకాలు 10-12 శాతం వరకు పెరగనున్నాయి. జనరేటివ్ ఏఐ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ మొదలైన కొత్త టెక్నాలజీలతో 2030 నాటికి పది లక్షల పైగా ఉద్యోగాల కల్పన జరగనుంది. బిజినెస్ సర్వీసుల సంస్థ క్వెస్ కార్ప్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండు త్రైమాసికాల్లో క్వెస్ ఐటీ స్టాఫింగ్ విభాగం కార్యకలాపాల ఆధారంగా దీన్ని రూపొందించారు. టెక్ నియామకాలకు నెలకొన్న డిమాండ్, మార్కెట్‌లో పరిస్థితుల గురించి సంస్థలకు అవగాహన కల్పించే విధంగా గణాంకాలను ఇందులో విశ్లేషించారు. దీని ప్రకారం దేశవ్యాప్తంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), సైబర్‌సెక్యూరిటీ విభాగాల్లో రెండో త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) నిపుణులైన సిబ్బందికి డిమాండ్ గణనీయంగా పెరిగింది. సీక్వెన్షియల్ ప్రాతిపదికన క్రితం త్రైమాసికంతో పోలిస్తే జీసీసీలో 71 శాతం, సైబర్‌సెక్యూరిటీలో 58 శాతం మేర ఉద్యోగావకాశాలు పెరిగాయి. పుష్కలంగా టెక్ నిపుణుల లభ్యత, వినూత్నంగా ఆలోచించగలిగే సామర్థ్యాలతో డిజిటల్ విప్లవానికి సంబంధించి భారత్ ముందంజలో ఉంటున్న నేపథ్యంలో దేశీయంగా వచ్చే 6 నెలల్లో ఐటీ సర్వీసుల్లో హైరింగ్ 10-12 శాతం పెరగవచ్చని క్వెస్ ఐటీ స్టాఫింగ్ సీఈవో కపిల్ జోషి తెలిపారు.

**టాప్ 5 నైపుణ్యాలు..**

- నివేదిక ప్రకారం రెండో త్రైమాసికానికి సంబంధించి హైరింగ్ డిమాండ్‌లో 79 శాతం వాటా .. ఈఆర్‌పీ, టెస్టింగ్, నెట్‌వర్కింగ్, డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి అయిదు నైపుణ్యాలది ఉంది. వీటికి తోడు జావా (30 శాతం), సైబర్‌సెక్యూరిటీ (20 శాతం), డెవ్ ఆప్స్ (25 శాతం) వంటి ప్రత్యేక నైపుణ్యాలకు కూడా డిమాండ్ నెలకొంది.
- క్యూ2లో టెక్ హైరింగ్‌కి సంబంధించి జీసీసీలు ముందంజలో ఉన్నాయి. ఏఐ/ఎంఎల్, అనలిటిక్స్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్, డెవ్ఆప్స్ నిపుణులకు డిమాండ్ కనిపించింది.
- ప్రాంతాలవారీగా చూస్తే మొత్తం ఉద్యోగావకాశాలకు సంబంధించి 62 శాతం వాటాతో బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. 43.5 శాతంతో హైదరాబాద్ తర్వాత స్థానంలో ఉంది. దేశీయంగా జీసీసీలు విస్తరిస్తుండటంతో వివిధ నగరాల్లో ప్రతిభావంతులకు డిమాండ్ పెరిగింది. ఈ సంస్థలు ఇంజినీరింగ్, ఐటీ, ఫైనాన్స్, అనలిటిక్స్ వంటి విభాగాల్లో సుశిక్షితులైన నిపుణులపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచి కూడా ఉద్యోగులను తీసుకునే యోచనలో ఉన్నాయి.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే..

# ఆర్థిక సంస్థల స్థాయి, పరిమాణం పెరగాలి

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర రావు ఉద్ఘాటన



ముంబై: భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే ఆకాంక్షను సాధించాలంటే ఆర్థిక సంస్థల స్థాయి, పరిమాణం గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర రావు అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించిన 'గ్లోబల్ సౌత్‌లోని సెంట్రల్ బ్యాంకుల ఉన్నత-స్థాయి విధాన సదస్సు'లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలు...

- గతంలో ప్రారంభించిన నియంత్రణా విధానాలు, తీసుకున్న విధానపరమైన చర్యలు భారత్‌లో పటిష్ఠమైన, సవాళ్లను తట్టుకోగల ఆర్థిక వ్యవస్థ, ఆర్థికాభివృద్ధికి దారితీశాయి. అనేక సంక్షోభాలను ఎదుర్కొన్న భారత ఎకానమీని స్థిరపరచాయి.
- అయితే ఎకానమీ మరింత పురోభివృద్ధికి ఫైనాన్షియల్ సంస్థల పరిమాణం మరింత పెరగాలి. దృఢమైన పాలన వ్యవస్థ, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్ ఈ దిశలో పురోగతికి దారితీసే అంశాలు.
- బ్యాంకులతో పాటు సంస్థలుసైతం తమ పెరుగుతున్న నిధులు అవసరాలను నెరవేర్చుకోడానికి క్యాపిటల్ మార్కెట్‌లను వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.
- ఆర్‌బీఐకి ఉన్నంత విస్తృత ఆధారిత ప్రపంచంలో చాలా సెంట్రల్ బ్యాంకులు లేవు. ఎకానమీ పురోభివృద్ధి, ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా ఆర్‌బీఐ తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఈ విషయంలో కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తోంది.
- ఆర్‌బీఐ 75 సంవత్సరాల అనుభవం.. దేశ అభివృద్ధి ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు, ఎకానమీకి మద్దతు ఇవ్వగల బలమైన ఆర్థిక రంగానికి పునాదిని నిర్మించింది.

# పిల్లల కంటెంట్‌లో అసభ్య యాడ్స్..

- లోకల్‌సర్కిల్స్ సర్వేలో మెజారిటీ తల్లిదండ్రులు వెల్లడి
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానా విధించాలని అభిప్రాయం



న్యూఢిల్లీ: పిల్లలు సహా అన్ని వర్గాలకు అనువైనదిగా మార్క్ చేసిన కంటెంట్‌లో తరచుగా అసభ్య ప్రకటనలు వస్తున్నాయని ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం లోకల్‌సర్కిల్స్ సర్వే నివేదికలో వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో 60 శాతం మంది తల్లిదండ్రులు ఈ విషయం తెలిపారు. గత మూడేళ్లుగా గ్యాంబ్లింగ్/గేమింగ్, లోదుస్తులు, సెక్సువల్ వెల్‌నెస్‌కి సంబంధించిన ప్రకటనలు ఎక్కువగా కనిపిస్తున్నట్లు వివరించారు. పిల్లలకు అనువైనదిగా పేర్కొన్న కంటెంట్‌లో గ్యాంబ్లింగ్/గేమింగ్ (ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా) సంబంధ ప్రకటనలు ఎక్కువగా వస్తున్నాయని 41 శాతం మంది తెలిపారు. లోదుస్తుల ప్రకటనలు తరచుగా ఉంటున్నాయని 35 శాతం మంది, సెక్సువల్ వెల్‌నెస్ యాడ్స్ ఉంటున్నాయని 29 శాతం మంది, మద్యం .. పొగాకు సంబంధ ప్రకటనలు ఉంటున్నాయని 24 శాతం మంది పేర్కొన్నారు. వయస్సుకు తగని ప్రకటనలు ప్రసారం చేస్తే నిబంధనల ఉల్లంఘనకు గాను ప్రభుత్వం భారీగా జరిమానాలు విధించాలని 88 శాతం మంది పేరెంట్స్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో చాలా మంది పిల్లలు తమ తల్లిదండ్రుల డివైజ్‌నే ఉపయోగిస్తారు కాబట్టి .. డివైజ్ ఓనర్ ప్రొఫైల్‌ను బట్టి కాకుండా లైవ్‌లో ప్రసారమవుతున్న కంటెంట్ ప్రకారం ప్రకటనలు ఉండేలా ఆయా ప్లాట్‌ఫాంలు, ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని లోకల్‌సర్కిల్స్ వ్యవస్థాపకుడు సచిన్ తపారియా తెలిపారు. 10,698 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. వివిధ ప్రశ్నలకు దేశవ్యాప్తంగా 305 జిల్లాల నుంచి 30,000 పైచిలుకు సమాధానాలు వచ్చాయి.


# ఐఎఫ్‌బీఏలో గోద్రెజ్ ఉత్పత్తుల ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ఇండియా ఫుడ్ అండ్ బెవరేజ్ అవార్డ్స్ 2024లో (ఐఎఫ్‌బీఏ) గోద్రెజ్ సంస్థ తమ యమ్మీజ్, రియల్ గుడ్ చికెన్ తదితర బ్రాండ్లను ప్రదర్శించింది. గోద్రెజ్ విక్రోలీ క్యుసినా మరియు ఎఫ్‌బీఏఐ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 11 కేటగిరీలవ్యాప్తంగా 155 మంది విజేతలకు పురస్కారాలు అందజేశారు. వీరిలో ప్రముఖ షెఫ్ సంజ్యోత్ కీర్, కల్యాణ్ కర్మాకర్ తదితరులు ఉన్నారు. దేశీయంగా మారుతున్న చిరుతిళ్ల ధోరణులను విశ్లేషిస్తూ రూపొందించిన ఇండియా ఫ్రోజెన్ స్నాక్స్ రిపోర్టును ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# అంచనాలకన్నా తక్కువగా ద్రవ్యలోటు

- 2024-24లో 4.75 శాతంగా ఇండియా రేటింగ్స్ అంచనా
- బడ్జెట్ కట్టడి లక్ష్యం 4.9 శాతం




ముంబై: ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం- ద్రవ్యలోటు ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) బడ్జెట్ అంచనా 4.9 శాతంకన్నా తక్కువగా 4.75 శాతానికి పరిమితమవుతుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా)అంచనావేసింది. అయితే ద్రవ్యలోటు తగ్గడానికి అధిక వృద్ధిరేటు కాకుండా, వ్యయాలు అంచనాలకన్నా తగ్గే అవకాశం ఉండడం కారణమని ఇండియా రేటింగ్స్ పేర్కొంది. 2024-25లో మొత్తం ద్రవ్యలోటును రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో ఇది 4.9 శాతం. 2023-24లో జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేస్తున్నారు. ద్రవ్యలోటు ప్రభుత్వానికి రుణ సమీకరణ మొత్తం అవసరాలను సూచిస్తుంది.

**ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్‌దీ ఇదే మాట..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.11.11 లక్షల కోట్లుగా అంచనావేయగా, ఈ లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేకపోవచ్చని ఫిక్కీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఇటీవల ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అభిప్రాయపడ్డారు. అయితే 2023-24లో మూలధన వ్యయాల కన్నా (రూ.9.5 లక్షల కోట్లు) కొంత ఎక్కువగా నమోదయ్యే వీలుందన్నారు. 2024-25 తొలి ఆరు నెలల్లో మూలధన వ్యయం బడ్జెట్ అంచనాల్లో (రూ.11.11 లక్షల కోట్లు) 37.3 శాతంగా ఉంటే, 2023-24 ఇదే కాలంలో ఇది 49 శాతంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. గత ఏడాది కూడా మూలధన వ్యయాలు లక్ష్యంలో (రూ.10 లక్షల కోట్లు) 95 శాతంగా నమోదయిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**తగ్గనున్న వ్యయాల 'ఎఫెక్ట్'**

సబ్సిడీలను మినహాయించి రెవెన్యూ వ్యయం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 0.12 శాతంగా ఉంటుందని ఇండియా రేటింగ్స్ పేర్కొంది. బడ్జెట్ అంచనా కంటే ఇది తక్కువ కావడం గమనార్హం. ప్రభుత్వ మూలధన బడ్జెట్ వ్యయ అంచనా రూ.11.11 లక్షల కోట్లుకాగా, ఈ పరిమాణం రూ.62,000 కోట్లు తక్కువగా ఉంటుందని ఇండియా రేటింగ్స్ ఆర్థికవేత్త, పబ్లిక్ ఫైనాన్స్ చీఫ్ దేవేంద్ర కుమార్ పంత్ విశ్లేషించారు. ఈ ఏడాది మేలో జరిగిన సాధారణ ఎన్నికలు 2024-25 ఆర్థిక సంవత్సర మూలధన వ్యయాలపై ప్రభావం చూపినట్లు ఇండ్‌రా నివేదిక పేర్కొంది. వార్షికంగా చూస్తే మూలధన వ్యయం 2024-25 తొలి ఆరునెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 15.42 శాతం తగ్గిపోయిందని వివరించింది. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి, చివరి ఆరు నెలల్లో (అక్టోబర్-మార్చి 2024) మూలధన వ్యయాలు 52.04 శాతం పెరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది చాలా కష్టమైనదిగా కనిపిస్తోందని కూడా తెలిపారు. అయితే రైల్వేలు, రోడ్లు, రవాణా-హైవే విభాగాలు 2024-25లో తమకు కేటాయింపులను పూర్తిగా వినియోగించుకుని, లక్ష్యాలను అధిగమించే వీలుందని నివేదిక పేర్కొంది.

# ఇన్ఫీ ఉద్యోగులకు 90% బోనస్




న్యూఢిల్లీ: సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ అర్హులైన ఉద్యోగులకు సగటున 90 శాతం మేర పనితీరు ఆధారిత బోనస్‌లు అందించనుంది. మధ్య, జూనియర్ స్థాయి సిబ్బందికి నవంబర్ వేతనాలతో కలిపి దీన్ని చెల్లించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తొలి త్రైమాసికంలో ఈ బోనస్ సగటున 80 శాతంగా ఉంది. దేశీయంగా రెండో అతి పెద్ద ఐటీ సేవల సంస్థ అయిన ఇన్ఫోసిస్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 6,506 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ2తో పోలిస్తే ఇది 4.7 శాతం అధికం. మెగా డీల్స్ దన్నుతో పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయ గైడెన్స్‌ను ఇన్ఫీ 3.75-4.5 శాతం శ్రేణికి పెంచింది.

# భారత్‌లో ప్లాంట్లు పెట్టండి

ఫ్రాన్స్ ఏవియేషన్ సంస్థలకు కేంద్ర మంత్రి గోయల్ ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్‌లో తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని ఫ్రాన్స్ ఏవియేషన్ సంస్థలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ కోరారు. విమానాశ్రయాలు, అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేయదల్చుకునే సంస్థలకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రపంచ మార్కెట్ల కోసం ఉత్పత్తులను తయారు చేసేలా రక్షణ రంగంలో భారత్, ఫ్రాన్స్ కంపెనీలు కలిసి పని చేయొచ్చని మంత్రి తెలిపారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర విభాగాల్లో భారత సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవచ్చని గోయల్ వివరించారు. ఫ్రెంచ్ ఫారిన్ ట్రేడ్ అడ్వైజర్లకు సంబంధించిన ఆసియా-పసిఫిక్ ఫోరంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దేశీ విమానయాన సంస్థలు 1,500 పైచిలుకు విమానాలకు ఆర్డర్లివ్వగా అందులో సింహభాగం వాటా ఫ్రాన్స్ కంపెనీ ఎయిర్‌బస్‌కి లభించాయి. భారత్‌లో సుమారు 750 ఫ్రెంచ్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తుండగా, 75 భారతీయ కంపెనీలు ఫ్రాన్స్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య 2023-24లో 15 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం నమోదైంది. భారత్ ఎగుమతులు 7 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.




2024 ఆసియా-పసిఫిక్ ఫోరం సదస్సులో ఫ్రెంచ్ ఫారిన్ ట్రేడ్ అడ్వైజర్లు, ప్రతినిధులతో వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్

# మరింత పటిష్టంగా 'దివాలా' పరిష్కార వ్యవస్థ!

ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్‌పై కేంద్రం దృష్టి



న్యూఢిల్లీ: దివాలా పరిష్కార వ్యవస్థను మరింత పటిష్టవంతం చేయడంపై కేంద్రం దృష్టి సారిస్తోంది. ఈ ప్రక్రియలను వేగవంతం చేయడంలో సహాయపడేలా తగిన వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) జాయింట్ సెక్రటరీ అనితా షా అకెల్లా తెలిపాయి. ఎనిమిది సంవత్సరాల క్రితం-2016లో అమల్లోకి వచ్చిన దివాలా కోడ్ (ఐబీసీ) సంబంధిత ఆస్తులకు మార్కెట్-లింక్డ్ అలాగే టైమ్-బౌండ్ (మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, సకాలంలో సమస్య పరిష్కారం జరిగేలా చర్యలు) పరిష్కారాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పరిష్కార ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

**ఐబీసీ రికవరీ మెకానిజం కాదు: అనితా షా అకెల్లా**

అనితా షా అకెల్లా ఈ విషయంపై మాట్లాడుతూ, ఐబీసీ రికవరీ మెకానిజం కాదని, రెస్క్యూ మెకానిజం అని ఉద్ఘాటించారు. ఐసీఏఐకి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ ఎనిమిదో వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ రాజధానిలో జరిగిన ఒక సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఐబీసీ పరిష్కార యంత్రాంగాన్ని మరింత మెరుగుపరచడానికి తీసుకున్న వివిధ చర్యలను ప్రస్తావించారు. అయితే కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దివాలా పరిష్కార యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయడానికి ఒక సమగ్ర 'ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్' ఏర్పాటుకు కృషి చేస్తోందన్నారు.

**ప్లాట్‌ఫామ్ ఇలా...**

ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్.. ఒక ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్ అనీ, ఇది అవసరమైనప్పుడు తగిన డేటాను అందించగలుగుతుందని అనితా షా అకెల్లా తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ), నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్‌తో పాటు సంబంధిత అన్ని వర్గాలనూ ఒకే వేదికలాగా కలిపి ఉంచుతుందన్నారు. యాప్‌లో ఆలస్యం, హెచ్చరికల వంటి సందర్భాల్లో రెడ్ ఫ్లాగ్‌లు వంటి వివిధ ఫీచర్లు ఇందులో ఉంటాయని ఆమె తెలిపారు.

**ప్రస్తుత దివాలా కేసుల తీరిది...**

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల లోక్‌సభ తెలిపిన సమాచారం ప్రకారం, మొత్తం 1,963 సీఐఆర్‌పీ (కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్) కేసులు కొనసాగుతున్నాయి. వాటిలో 1,388 కేసులు నిర్దేశిత (కేసుల పరిష్కారానికి) 270 రోజుల కాల పరిమితిని మించిపోయాయి. ఈ ఏడాది సెప్టెంబరు వరకు దివాలా చట్టం కింద 1,068 కేసుల పరిష్కారం అయ్యాయి. తద్వారా బ్యాంకింగ్ సుమారు రూ. 3.55 లక్షల కోట్లను రికవరీ చేసింది.




# లీగ్ దశలోనే తెలంగాణ అవుట్

**జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ టోర్నీలో వరుసగా రెండో పరాజయం**

**సాక్షి, హైదరాబాద్:** సొంతగడ్డపై జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టు కథ లీగ్ దశలోనే ముగిసింది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 0–7 గోల్స్ తేడాతో ఛత్తీస్‌గఢ్ జట్టు చేతిలో ఓడిపోయింది. మూడు జట్లున్న గ్రూప్ 'బి'లో తెలంగాణ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 0–11 గోల్స్ తేడాతో జార్ఖండ్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. తెలంగాణతో జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ తరఫున దామిని ఖుస్రో, మధు సిదార్, శ్యామ్‌లీ రే 2 గోల్స్ చొప్పున చేయగా... అంజలి ఎక్కా 1 గోల్ సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్ 15–0తో బెంగాల్ జట్టుపై, ఉత్తర ప్రదేశ్ 5–0తో ఉత్తరాఖండ్‌పై, గుజరాత్ 1–0తో అస్సాంపై గెలుపొందాయి.

# సామదేవ్‌కు స్వర్ణం... వర్షిత్‌కు రజతం

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ స్కూల్‌గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్లు జోరు కొనసాగుతోంది. రాజ్‌కోట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్వర్ణం, తెలంగాణకు ఒక రజతం లభించాయి. అండర్–17 బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తీర్థు సామదేవ్ బంగారు పతకం సొంతం చేసుకోగా... తెలంగాణకు చెందిన వర్షిత్ రజత పతకం దక్కించుకున్నాడు. ప్రస్తుతం కేరళలో శిక్షణ తీసుకుంటున్న సామదేవ్ 4ని:42.62 సెకన్లలో... వర్షిత్ 4ని:47.78 సెకన్లలో గమ్యానికి చేరి వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో ఇప్పటి వరకు తెలంగాణ స్విమ్మర్లు ఎనిమిది పతకాలు సాధించారు.


వర్షిత్, సామదేవ్

# చదరంగంలో చిచ్చర పిడుగు

**ఎనిమిదేళ్లకే రెండు ప్రపంచ టైటిల్స్ సాధించిన తెలంగాణ చిన్నారి దివిత్ రెడ్డి**

మాటలు రాకముందే ఆటల వైపు ఆకర్షితుడైన ఆ చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు... మెదడుకు పదును పెంచేందుకు పజిల్స్‌ను పరిచయం చేశారు. సులభమైన పజిల్స్‌ను పక్కన పెట్టిన ఆ బుడ్డోడు... సంక్లిష్టత పెరుగుతున్నకొద్దీ వాటిని ఆస్వాదించడం ప్రారంభించాడు. కుమారుడి ఉత్సాహాన్ని గుర్తించిన తల్లిదండ్రులు అతడికి చదరంగాన్ని పరిచయం చేయగా... అందులో అంచెలంచెలుగా ఎదుగుతూ ముందుకు సాగాడు. ఆరేళ్ల వయసులోనే భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్‌లాంటి మేటి స్టార్స్‌ను తన ప్రతిభతో కట్టిపడేసిన ఆ బుడతడు... ఎనిమిదేళ్ల వయసులోనే క్యాడెట్ విభాగంలో అండర్–8 ప్రపంచ ర్యాపిడ్, క్లాసికల్ ఫార్మాట్ చెస్ చాంపియన్‌షిప్‌లలో విజేతగా నిలిచి అబ్బురపరిచాడు. చదరంగంలో సంచలనాలు సృష్టిస్తున్న తెలంగాణ కుర్రాడు ఆదుళ్ల దివిత్ రెడ్డి ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

సాక్షి క్రీడావిభాగం

- ర్యాపిడ్, క్లాసికల్ ఫార్మాట్‌లలో విశ్వవిజేతగా నిలిచిన ఘనత
- పిన్న వయసు గ్రాండ్‌మాస్టర్ హోదా దిశగా అడుగులు

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆదుళ్ల దివిత్ రెడ్డి... చిన్నప్పటి నుంచే చదరంగంలో చిచ్చర పిడుగులా చెలరేగుతున్నాడు. ఎనిమిదేళ్ల వయసులోనే ప్రపంచ క్యాడెట్స్ చెస్ చాంపియన్‌షిప్ అండర్–8 ఓపెన్ కేటగిరీలో విజేగా నిలిచిన దివిత్ రెడ్డి.. అంతకుముందు వరల్డ్ క్యాడెట్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో సత్తా చాటాడు. ఇప్పటికే 1784 ఎలో రేటింగ్ పాయింట్లు ఖాతాలో వేసుకున్న దివిత్ రెడ్డి... భవిష్యత్తుపై భరోసా కల్పిస్తున్నాడు. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశితో తలపడి తన ఎత్తులతో ఆకట్టుకున్న దివిత్ వారి నుంచి ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం డింగ్ లిరెన్ (చైనా)తో పోటీ పడుతున్న గుకేశ్... 'ఈ అబ్బాయి చాలా బాగా ఆడుతున్నాడు. ఇతడి ఎత్తులకు ఆశ్చర్యం కలుగుతోంది' అని కితాబు ఇచ్చాడంటే దివిత్ ప్రతిభ ఎలాంటిదో ఊహించుకోవచ్చు. తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ప్రత్యర్థులను కూడా అలవోకగా ఓడిస్తున్న దివిత్... భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లైన తల్లిదండ్రులు పసిప్రాయం నుంచి దివిత్‌ను ప్రోత్సహించగా... వారి కృషికి తగ్గ ఫలితం దక్కినట్టైంది. 'చిన్నప్పుడు దివిత్ పజిల్స్ నింపడాన్ని ఇష్టపడేవాడు. ఎంతో క్లిష్టమైన పజిల్స్ ఇచ్చినా సునాయాసంగా పూర్తి చేసేవాడు. దీంతో అతడిని స్థానికంగా ఒక పజిల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించాం. అక్కడ కూడా ప్రతిభ చాటుకున్నాడు. దీంతో ఆన్‌లైన్ చెస్ కోచింగ్ ప్రారంభించాం' అని దివిత్ తండ్రి మహేశ్ రెడ్డి వెల్లడించారు. విశాఖపట్నంకు చెందిన చెస్ కోచ్ పోలవరపు రామకృష్ణ శిక్షణలో మరింత రాటుదేలిన దివిత్... జాతీయ అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాడు. ఆరేళ్ల ప్రాయంలోనే దివిత్ అండర్–8 జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు. 'నేను అతడిలో ప్రపంచ చాంపియన్‌ను చూశాను. ప్రోత్సహిస్తే ఫలితం ఉంటుందని ఆలోచించి... చదువుతో




పాటు శిక్షణకు తగిన సమయం కేటాయించేలా చేశా. దీని కోసం నా భార్య ఉద్యోగాన్ని పక్కన పెట్టి పూర్తి స్థాయిలో దివిత్‌కు చేదోడుగా నిలిచింది. కోవిడ్–19 కారణంగా వచ్చిన లాక్‌డౌన్ ఒక విధంగా మాకు మేలు చేసింది. చిన్న వయసులోనే అతడి ఎత్తులు చాలా వ్యూహాత్మకంగా ఉండటం చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయే వాళ్లు. దాన్నే కొనసాగిస్తూ విజయాలు సాధిస్తున్నాడు. గ్యారీ కాస్పరోవ్ అంటే దివిత్‌కు చాలా ఇష్టం. కాస్పరోవ్ తరహాలోనే అటాకింగ్ ఆటను ఇష్టపడతాడు. దాదాపు ఓడిపోయే స్థితి నుంచి కూడా తిరిగి పుంజుకోవడం దివిత్‌కు బాగా అలవాటు' అని మహేశ్ రెడ్డి వివరించారు. ఈ ఏడాది 10 అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొన్న దివిత్ రెడ్డి సమీప భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదా దక్కించుకోవడం ఖాయమే అని మహేశ్ అన్నారు. అమెరికాకు చెందిన భారత సంతతి కుర్రాడు అభిమన్యు మిశ్రా 12 సంవత్సరాల 4 నెలల 25 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించి ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా నిలవగా... ఇప్పుడు ఆ రికార్డును దివిత్ బద్దలు కొడతాడని మహేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# భారత అండర్-19 'ఏ' జట్టు వైస్ కెప్టెన్‌గా త్రిష

**కావ్యశ్రీ, కేసరి ధృతికి కూడా చోటు**

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో జరిగే అండర్–19 మహిళల ముక్కోణపు టి20 సిరీస్‌లో పాల్గొనే భారత 'ఎ'... 'బి' జట్లను ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష భారత 'ఎ' జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. హైదరాబాద్‌కే చెందిన గుగులోత్ కావ్యశ్రీకి భారత 'ఎ' జట్టులో... కేసరి ధృతికి భారత 'బి' జట్టులో చోటు లభించింది. ఆంధ్ర బౌలర్ షబ్నమ్ భారత 'ఎ' జట్టులో ఎంపికైంది. దక్షిణాఫ్రికాతోపాటు భారత 'ఎ', 'బి' జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. పుణే ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ డిసెంబర్ 3 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుంది. 18 ఏళ్ల త్రిష గత ఏడాది జరిగిన అండర్–19 ప్రపంచ టి20 టోర్నీలో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.


త్రిష



కావ్యశ్రీ


కేసరి ధృతి

**భారత 'ఎ' జట్టు:** సనిక చాల్కె (కెప్టెన్), గొంగడి త్రిష (వైస్ కెప్టెన్), గుగులోత్ కావ్యశ్రీ, భవిక అహిరె, జోషిత, హర్లీ గాలా, సస్తీ మండల్, సిద్ధి శర్మ, సోనమ్ యాదవ్, గాయత్రి సుర్వసె, చాందిని శర్మ, హ్యాపీ కుమారి, షబ్నమ్, బిదిషా డే, ప్రాప్తి రావల్.

**భారత 'బి' జట్టు:** నికీ ప్రసాద్ (కెప్టెన్), కమలిని (వైస్ కెప్టెన్), మహంతి శ్రీ, ఇషావరి అవసారె, మిథిలా వినోద్, ఆయుశి శుక్లా, కేసరి ధృతి, పరుణిక సిసోడియా, వైష్ణవి శర్మ, పార్శవి చోప్రా, నందన, అనాది తాగ్డె, అనందిత, సుప్రియా అరెల, భారతి ఉపాధ్యాయ్.

## డిసెంబర్ 29న పుణేలో పీకేఎల్ ఫైనల్

**పుణే:** ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఫైనల్‌కు పుణే ఆతిథ్యమివ్వనుంది. ఈసారి లీగ్‌ను మూడు నగరాల్లో నిర్వహిస్తుండగా... హైదరాబాద్ వేదికగా మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ప్రస్తుతం నోయిడా వేదికగా పోటీలు జరుగుతున్నాయి. డిసెంబర్ 3 నుంచి మూడో అంచె మ్యాచ్‌లు పుణేలో జరుగుతాయి. ఆ తర్వాత ప్లే ఆఫ్స్, సెమీఫైనల్స్‌తో పాటు తుదిపోరును పుణేలోనే నిర్వహించనున్నారు. గ్రూప్ దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. 3 నుంచి 6 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌లో తలపడతాయి. డిసెంబర్ 26న రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌లు... డిసెంబర్ 27న రెండు సెమీఫైనల్స్ జరుగుతాయి. డిసెంబర్ 29న ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది.

# జాతీయ జట్టు కోసమే...


'క్రో-థోర్ప్ ట్రోఫీ'తో న్యూజిలాండ్ కెప్టెన్ లాథమ్, ఇంగ్లండ్ జట్టు సారథి బెన్ స్టోక్స్

- ఐపీఎల్ టోర్నీకి దూరంగా ఉన్నాను
- ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ స్టోక్స్ వెల్లడి

**క్రైస్ట్‌చర్చ్:** జాతీయ జట్టు తరఫున సాధ్యమైనంత ఎక్కువ కాలం ఆడాలని తాను కోరుకుంటున్నాని... ఈ క్రమంలోనే ఇండియన్‌ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లాంటి ఇతర టోర్నీలకు దూరంగా ఉంటున్నానని ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలం కోసం తన పేరును నమోదు చేసుకోకుండా స్టోక్స్ ముందే తప్పుకున్నాడు. గతంలో పుణే, చెన్నై, రాజస్తాన్ జట్ల తరఫున ఆడిన స్టోక్స్‌కు లీగ్‌లో మంచి విలువే పలికింది. అయితే ప్రస్తుత స్థితిలో ఇంగ్లండ్ జట్టు తరఫున కెరీర్‌ను పొడిగించుకోవడమే తన ప్రథమ ప్రాధాన్యత అని అతను స్పష్టం చేశాడు. ఐపీఎల్ తాజా నిబంధన ప్రకారం 2026 వరకు కూడా అతని లీగ్‌లో ఆడే అవకాశం లేదు. 'నా కెరీర్‌లో ఇప్పుడు చివరి దశకు చేరుకుంటున్నాననేది వాస్తవం. సాధ్యమైనంత ఎక్కువ కాలం ఆడేందుకు నేను ప్రయత్నిస్తా. నా ఫిట్‌నెస్‌ను చూసుకోవడం కూడా చాలా కీలకం. ఈ దశలో ఎప్పుడు ఆడాలనే అంశంపై నా ప్రాధాన్యతలు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. కెరీర్ పొడిగించుకోవాలంటే జాగ్రత్తలు తీసుకోవాలి. వేర్వేరు చోట్ల వరుసగా క్రికెట్ సాగుతున్న ప్రస్తుత దశలో ఇంగ్లండ్ తరఫున ఎక్కువ కాలం ఆడాలనేది నా కోరిక. అందుకే ఐపీఎల్ నుంచి తప్పుకున్నా' అని స్టోక్స్ వెల్లడించాడు. సుదీర్ఘ మోకాలి గాయం నుంచి ఇటీవలే కోలుకొని మళ్లీ బరిలోకి దిగిన స్టోక్స్‌కు అక్టోబర్ 2026 వరకు ఇంగ్లండ్ బోర్డు కాంట్రాక్ట్ ఉంది. నేటి నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో జట్టుకు సారథ్యం వహిస్తున్న స్టోక్స్‌కు వచ్చే ఏడాది స్వదేశంలో భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్, ఆపై యాషెస్ సిరీస్ కీలకం కానున్నాయి. గత ఏడాది వరల్డ్ కప్ తర్వాత వన్డేలకు దూరంగా ఉంటున్న స్టోక్స్ త్వరలో జరిగే చాంపియన్స్ ట్రోఫీలో మళ్లీ వన్డేలు ఆడే అవకాశం ఉంది.

# భరత్, భుయ్ మెరుపులు

**గోవాపై ఆంధ్ర ఘనవిజయం**

**సాక్షి, హైదరాబాద్:** కెప్టెన్ రికీ భుయ్ (38 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (38 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకాలతో మెరిశారు. ఫలితంగా సయ్యద్ ముస్తాక్ అలీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. గ్రూప్ 'ఈ'లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 8 వికెట్ల తేడాతో గోవాను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గోవా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ప్రభుదేశాయ్ (51 బంతుల్లో 71 నాటౌట్; 9 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో ఆకట్టుకోగా... అర్జున్ టెండూల్కర్ 9 బంతులు ఎదుర్కొని రెండు ఫోర్ల సాయంతో 12 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆంధ్ర బౌలర్లలో స్టీఫెన్, శశికాంత్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర జట్టు 15.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. రికీ భుయ్, శ్రీకర్ భరత్ ధనాధన్ షాట్లతో కట్టిపడేశారు. అశ్విన్ హెబర్ (13), షేక్ రషీద్ (8) విఫలం కాగా... భరత్, భుయ్ మూడో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఆంధ్ర జట్టు 8 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర ఆడుతుంది.


రికీ భుయ్



శ్రీకర్ భరత్

# హైదరాబాద్‌కు మరో ఓటమి

**రాజస్తాన్ చేతిలో పరాజయం ● ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ**

**రాజ్‌కోట్:** బ్యాటర్ల వైఫల్యంతో దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు వరుసగా రెండో పరాజయం మూటగట్టుకుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 24 పరుగుల తేడాతో రాజస్తాన్ చేతిలో ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. కార్తీక్ శర్మ (27 బంతుల్లో 58; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకోగా... దీపక్ హుడా (46; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 97 పరుగుల జోడించడంతో రాజస్తాన్ జట్టు మంచి స్కోరు చేయగలిగింది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ, అనికేత్ రెడ్డి చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 163 పరుగులకే పరిమితమైంది. ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో విజృంభించిన హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ (13) ఈసారి విఫలం కాగా... తన్మయ్ అగర్వాల్ (33; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), తనయ్ త్యాగరాజన్ (32 నాటౌట్; 3 ఫోర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. రాజస్తాన్ బౌలర్లలో మానవ్ సుతార్, అనికేత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. తాజా టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయం, రెండు పరాజయాలు ఖాతాలో వేసుకున్న హైదరాబాద్ జట్టు 4 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో రేపు బిహార్‌తో హైదరాబాద్ ఆడుతుంది.


తన్మయ్

# ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు మీరాబాయి దూరం

**న్యూఢిల్లీ:** భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను వచ్చే వారం జరగనున్న ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ నుంచి వైదొలిగింది. బహ్రెయిన్ వేదికగా జరగనున్న ఈ పోటీల్లో మీరాబాయి పాల్గొనడం లేదని జాతీయ కోచ్ విజయ్ శర్మ బుధవారం వెల్లడించాడు. టోక్యో (2020) ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన మీరాబాయి... ఈ ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో 49 కేజీల విభాగంలో నాలుగో స్థానంలో నిలిచింది. తుంటి గాయం నుంచి కోలుకుంటున్న 30 ఏళ్ల మీరా మరి కొంత కాలం పోటీలకు దూరంగా ఉండనుంది. 'పారిస్ ఒలింపిక్స్ గాయం నుంచి మీరా కోలుకుంటోంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొనడం లేదు' అని విజయ్ శర్మ పేర్కొన్నాడు. 2026 ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ కోసం మీరాబాయి సిద్ధమవుతున్నట్లు తెలిపాడు. డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో 49 కేజీల విభాగంలో భారత్ నుంచి జ్ఞానేశ్వరి యాదవ్ పాల్గొననుంది. కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన జ్ఞానేశ్వరి యాదవ్‌తో పాటు కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత బింద్యారాణి దేవి (55 కేజీలు), ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ లీగ్ స్వర్ణ విజేత దితిమోనీ సోనోవాల్ (64 కేజీలు) ఈ టోర్నీలో దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. యువ లిఫ్టర్లు తమ ప్రతిభ చాటుకునేందుకు ఇది చక్కటి అవకాశం అని... ప్రస్తుతం జాతీయ క్యాంప్‌లో ఉన్న ఈ ముగ్గురు లిఫ్టర్లు త్వరలో బహ్రెయిన్‌కు బయలుదేరుతారని విజయ్ శర్మ వెల్లడించాడు.



# హరియాణా 'టాప్' షో

**నోయిడా:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న స్టీలర్స్ బుధవారం జరిగిన పోరులో 38–28 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్‌పై విజయం సాధించింది. లీగ్‌లో హరియాణాకిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. మ్యాచ్ ఆరంభంలోనే ఐదు పాయింట్లు సాధించిన హరియాణా అదే జోరులో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి స్పష్టమైన ఆధిక్యం సాధించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 22–14తో నిలిచిన స్టీలర్స్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ద్వితీయార్ధంలోనూ చెలరేగి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. స్టీలర్స్ జట్టు అటు రెయిడింగ్‌తో పాటు ఇటు డిఫెన్స్‌లో ఆకట్టుకుంటే... కేవలం రెయిడింగ్‌నే నమ్ముకున్న పల్టన్‌కు పరాజయం తప్పలేదు. స్టీలర్స్ తరఫున శివమ్ 13 పాయింట్లు సాధించగా... పుణేరి పల్టన్ తరఫున పంకజ్ 11 పాయింట్లతో పోరాడాడు. లీగ్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన హరియాణా స్టీలర్స్ 11 విజయాలు, 3 పరాజయాలతో 56 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... పుణేరి పల్టన్ 14 మ్యాచ్‌లాడి 6 విజయాలు, 5 పరాజయాలు, 3 'టై'లతో 42 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 39–37 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది. గుజరాత్ తరఫున గుమన్ సింగ్ 12 పాయింట్లతో సత్తా చాటగా... వారియర్స్ తరఫున మణిందర్ 11 పాయింట్లతో రాణించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 8 గంటలకు), యు ముంబాతో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



# నేటి సిద్ధార్థుడు!

- బిలియన్ డాలర్ల సామ్రాజ్యాన్ని కాదనుకుని సన్యాసం
- 18 ఏళ్లప్పుడే బౌద్ధ భిక్షువైన మలేషియా కుబేరుడు




రాబిన్ శర్మ బెస్ట్ సెల్లర్ 'ది మాంక్ హూ సోల్డ్ హిజ్ ఫెరారీ'నవలలో కథా నాయకుడు జూలియన్ మాంటిల్ తిరుగులేని క్రిమినల్ లాయర్. తృప్తిలేని తన జీవన విధానంతో విసిగి అపారమైన ఆస్తులన్నింటినీ అమ్మేసి తనను తాను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు. మలేషియాకు చెందిన వెన్ అజాన్ సిరిపన్నోదీ అలాంటి కథే. ఏకంగా 500 కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యాన్ని తృణప్రాయంగా వదులుకుని మరీ బౌద్ధ భిక్షువుగా మారిపోయాడు. ఆయన తండ్రి ఆనంద కృష్ణన్ అలియాస్ ఏకే మలేషియాలో మూడో అత్యంత ధనవంతుడు. ఆయన ఆస్తి రూ.42,000 కోట్ల పైమాటే. టెలికాం, శాటిలైట్స్, మీడియా, ఆయిల్, గ్యాస్, రియల్ ఎస్టేట్ రంగాల్లో విస్తరించిన వ్యాపార సామ్రాజ్యం ఆయనది. అలాంటి ఏకేకు సిరిపన్నో ఏకైక కుమారుడు. అంతటి ఆస్తినీ వద్దనుకుని బుద్ధం శరణం గచ్ఛామి అన్నాడు. బౌద్ధ భిక్షువుగా మారిపోయాడు. బౌద్ధాన్ని నమ్మే తండ్రి కృష్ణన్ కూడా ఈ నిర్ణయాన్ని గౌరవించడం విశేషం. ఇదంతా జరిగి 20 ఏళ్లయింది. నాటినుంచీ సిరిపన్నో దాదాపుగా అడవుల్లోనే గడుపుతున్నారు. థాయ్‌లాండ్-మయన్మార్ సరిహద్దులో తావో దమ్ బౌద్ధారామంలో అబాట్ (ప్రధాన సన్యాసి)గా ఉన్నారు. పూర్తిగా భిక్ష మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడో ఓసారి తండ్రిని చూడటానికి వచ్చిపోతుంటారు.

**మార్చింది ఆ ప్రయాణమే**

సిరిపన్నో జీవితంలోనే భిన్న సంస్కృతులున్నాయి. ఆయన తల్లి మోమ్వాజరోంగ్సే సుప్రిందా చక్రబన్ థాయ్ రాజ కుటుంబీకురాలు. ఆయన తన ఇద్దరు సోదరీమణులతో కలిసి లండన్‌లో పెరిగారు. అక్కడే చదువు పూర్తి చేశారు. ఇంగ్లిష్‌తో పాటు ఏకంగా ఎనిమిది భాషలు మాట్లాడగలరు. 18 ఏళ్ల వయసులో తల్లితో కలిసి థాయ్‌లాండ్ వెళ్లారు. సరదాగా ఓ బౌద్ధారామానికి రిట్రీట్‌కు వెళ్లారు. అక్కడే ఆయనను బౌద్ధం ఆకర్షించింది. అది బలపడి, చూస్తుండగానే జీవన విధానంగా మారిపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



భిక్షాటన చేస్తున్న సిరిపన్నో

## లాటరీలో రూ.1,804 కోట్లు!

**బ్రిటన్‌లో ఓ వ్యక్తిని వరించిన అదృష్టం**

లండన్: బ్రిటన్‌లో ఓ వ్యక్తికి అదృష్టం మామూలుగా కలిసిరాలేదు! ఏకంగా 17.7 కోట్ల పౌండ్ల (రూ.1,804 కోట్ల) లాటరీ తగిలింది. ఆ దేశ చరిత్రలోనే మూడో అతి పెద్ద లాటరీ మొత్తంగా నిలిచింది. మంగళవారం జరిగిన యూరోమిలియన్స్ లాటరీ డ్రాలో మనవాడు ఈ జాక్‌పాట్ కొట్టాడు. సదరు అదృష్టవంతుని వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. 2022లో ఓ అజ్ఞాత వ్యక్తి గెలుచుకున్న 19.5 కోట్ల పౌండ్లు బ్రిటన్‌లో ఇప్పటిదాకా అత్యంత భారీ జాక్‌పాట్‌గా నిలిచింది. గత మేలో గ్లోసిస్టర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గెలిచిన 18.4 కోట్ల పౌండ్లకు రెండో స్థానం దక్కింది.

## కలిసి పనిచేస్తే బలపడతాం: బ్లింకెన్

వాషింగ్టన్: ''భారత్, అమెరికా మరింతగా కలిసి పని చేయాలి. అప్పుడే ద్వైపాక్షిక బంధం మరింత బలపడుతుంది''అని అమెరికా విదేశాంగ మంత్రి టోనీ బ్లింకెన్ అన్నారు. మంగళవారం ఇటలీలోని ఫిగ్గీలో జీ–7 సదస్సు సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో ఆయన భేటీ అయ్యారు. ప్రపంచ భద్రత తదితరాలపై ఆయనతో చర్చించినట్టు తెలిపారు. భారత్–అమెరికా భాగస్వామ్యం కొనసాగింపుపై బ్లింకెన్‌తో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. అంతర్జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్‌తో మరింతగా కలిసి పని చేయాలని అమెరికా కోరుకుంటోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు.

## చట్టబద్ధ పాలన కోసం పోరాడతా: హారిస్

వాషింగ్టన్: అమెరికాలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమన్యాయం, చట్టబద్ధ పాలన కోసం పోరాడుతూనే ఉంటానని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ చెప్పారు. ''అధ్యక్ష ఎన్నికల్లో ఓటమితో నా పోరాటం ముగియలేదు. ప్రతి ఒక్కరూ తమ కలలను సాకారం చేసుకునేలా మెరుగైన భవిష్యత్తు కోసం పోరాడాల్సింది ఇంకెంతో ఉంది''అని తెలిపారు. దేశవ్యాప్తంగా మద్దతుదారులు, ఫండ్ రైజర్లను ఉద్దేశించి హారిస్ మాట్లాడారు. మహిళలు తమ శరీరం గురించి స్వీయ నిర్ణయాలు తీసుకునే హక్కు కోసం కూడా పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు.

## మిథిలకు రాష్ట్ర హోదా ఇవ్వాలి: రబ్డీ దేవి

పట్నా: బిహార్ రాష్ట్రంలోని మిథిల ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని ఆర్‌జేడీ నేత, మాజీ ముఖ్యమంత్రి రబ్డీ దేవి డిమాండ్ చేశారు. శాసన మండలిలో బుధవారం ఈ విషయం ఆమె ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని మైథిలి భాషలోకి తర్జుమా చేయడం ద్వారా తగు గౌరవం ఇచ్చినందుకు అధికార కూటమి సభ్యులు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపిన సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మైథిలి భాషలోకి తర్జుమా చేయడమే కాదు, ఈ ప్రాంతం కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే, మాజీ సీఎం, ఆమె భర్త లాలు ప్రసాద్ యాదవ్ గతంలో బిహార్ విభజనను తీవ్రంగా వ్యతిరేకించడం విశేషం.

## రేషన్ డీలర్ల కమీషన్ పెంపు యోచనేదీ లేదు

న్యూఢిల్లీ: దేశంలోని ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ దుకాణ డీలర్లకిచ్చే కమీషన్ పెంపు ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి తమ వద్ద లేదని కేంద్రం తెలిపింది. కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్‌ను అవసరమైతే పెంచుకునే వెసులుబాటు రాష్ట్రాలకు ఉందని ఆయన వివరించారు. మార్చిన నిబంధనల ప్రకారం క్వింటాకు రూ.90 చొప్పున డీలర్లకు కమీషన్‌గా కేంద్రం నిర్ణయించింది. రాష్ట్రాలు క్వింటాకు అదనంగా రూ.21 కమీషన్ ఇచ్చేందుకు వీలుందని తెలిపారు. ప్రత్యేక కేటగిరీలకైతే కేంద్రం నిర్ణయించిన క్వింటా రూ.180కి అదనంగా రాష్ట్రాలు రూ.26 వరకు కమీషన్ ఇవ్వొచ్చన్నారు.

## అసభ్య కంటెంట్‌పై కఠిన చట్టాలు

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ వేదికల్లో అసభ్యంగా ఉండే కంటెంట్‌ను కట్టడి చేసేందుకు నిబంధనలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ విషయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేయాలని ఆయన బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు. ఇప్పటి వరకు తమ శాఖ అశ్లీల, అసభ్యకర కంటెంట్‌ను కలిగిన 18 ఓటీటీ వేదికలను గుర్తించి నిషేధం విధించిందని చెప్పారు. భావప్రకటన స్వేచ్ఛకు వేదికగా మారిన సోషల్ మీడియాపై సరైన నియంత్రణలు లేనందున, అభ్యంతరకర కంటెంట్ ఎక్కువగా వస్తోందని మంత్రి చెప్పారు.

## రైలు ప్రమాదాలతో రూ.313 కోట్ల నష్టం

న్యూఢిల్లీ: దేశంలో 2019–24 మధ్య ఐదేళ్లలో జరిగిన రైలు ప్రమాదాల కారణంగా రైల్వే శాఖకు చెందిన రూ.313 కోట్ల మేర ఆస్తులకు నష్టం వాటిల్లిందని ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ–టిక్కెట్ల ద్వారా లభించే బీమా కోసం 22 క్లెయిమ్‌లు అందాయన్నారు. ఇదే సమయంలో బీమా కంపెనీలకు డెత్‌క్లెయిమ్‌లు మాత్రం అందలేదని వివరించారు.

## హైస్పీడ్ రైలు వేగం 280 కిలోమీటర్లు

న్యూఢిల్లీ: చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారయ్యే హై స్పీడ్ రైలును గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేశారని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. వందే భారత్ రైళ్ల విజయవంతం కావడంతో హైస్పీడ్ రైళ్లపై దృష్టి పెట్టామన్నారు. ఒక్కో కోచ్ తయారీకి పన్నులు మినహాయిస్తే సుమారు రూ.28 కోట్లు ఖర్చవుతోందన్నారు.

## విమానాలకు 994 బెదిరింపు కాల్స్

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో నవంబర్ 13వ తేదీ వరకు దేశీయ విమానయాన సంస్థలకు 994 బెదిరింపు కాల్స్ వచ్చాయని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ రాజ్యసభలో చెప్పారు. 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు విమానాలకు 1,143 బెదిరింపు ఫోన్‌కాల్స్/మేసేజీలు అందాయని మంత్రి వివరించారు. ఇవన్నీ ఒట్టివేనని తేలినప్పటికీ విమానాల రాకపోకలతోపాటు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ఇటువంటి బెదిరింపులకు చెక్ పెట్టేందుకు నిబంధనలను మరింత కఠినం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు.

## ఆక్రమణల బారిన 58,929 వక్ఫ్ ఆస్తులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా 58,929 వక్ఫ్ ఆస్తులు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఒక్క కర్ణాటకలోనే ఇటువంటి 869 ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించిందని చెప్పింది. మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు లోక్‌సభలో ఈ విషయం తెలిపారు. వక్ఫ్ ఆస్తుల్లో ఇతరులు తిష్ట వేసిన ఘటనలు దృష్టికి వచ్చిన వెంటనే వాటిని సంబంధిత రాష్ట్రాల వక్ఫ్ బోర్డులకు పంపించి, తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆక్రమణలను తొలగించే అధికారం రాష్ట్రాల వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారులకు ఉంటుందని వివరించారు.

## గతేడాది 2 లక్షల బాల్య వివాహాల్ని ఆపాం

- ప్రతి ఐదుగురిలో ఒకరికి 18 ఏళ్లు రాకుండానే పెళ్లిళ్లు
- ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశంలో గతేడాది సుమారు రెండు లక్షల బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణా దేవి తెలిపారు. ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరు వివాహ చట్టబద్ధ వయస్సు 18 ఏళ్ల లోపే పెళ్లిళ్లు అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. దేశంలో ఈ దురాచారాన్ని పూర్తిగా రూపుమాపాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందులో భాగంగా ఆమె బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. 2029 నాటికి బాల్య వివాహాల రేటును 5 శాతానికి తగ్గించేందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కోరారు. ఈ దురాచారాన్ని చట్టాలతోనే రూపు మాపలేమని, ప్రజల్లో అవగాహన అవసరమని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్, రాజస్తాన్, త్రిపుర, అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 300 జిల్లాల్లో జాతీయ సరాసరిని మించి బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తించామని మంత్రి వివరించారు.

# రాజ్యాంగాన్ని మోసగించడమే

**మతం మారినా రిజర్వేషన్ లబ్ధి కోసం ఆ విషయాన్ని దాచిపెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీం**

న్యూఢిల్లీ: కేవలం రిజర్వేషన్ ఫలాలు దోచేయాలనే దుర్బుద్ధితో మతం మారిన విషయాన్ని దాచిపెట్టిన అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఇలాంటి చర్యలు రాజ్యాంగాన్ని మోసగించడంతో సమానమని అభివర్ణించింది. క్రైస్తవమతంలోకి మారిన తర్వాత కూడా ఒక మహిళ షెడ్యూల్ కులం సర్టిఫికేట్ కోసం తాను ఇంకా హిందువునేనని వాదించడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఈ అంశంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. హిందువు అయిన సి.సెల్వరాణి క్రైస్తవమతం పుచ్చుకుంది. అయితే రిజర్వేషన్ లబ్ధి పొందేందుకు, ఉద్యోగి సంబంధిత ప్రయోజనాలు పొందేందుకు తాను ఇంకా హిందువునేనని నమ్మించే ప్రయత్నంచేశారు. అయితే ఆమె నిజంగా క్రైస్తవ మతంలోకి మారిందని, తరచూ చర్చికి వెళ్తూ, క్రైస్తవ మత కార్యక్రమాల్లో పాల్గొంటూ, పూర్తి విశ్వాసంతో క్రైస్తవమతాన్ని ఆచరిస్తోందని సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. దీంతో రిజర్వేషన్ కోసం ఆ మహిళ తన మతాన్ని దాచిపెట్టడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ''బాప్టిజం పూర్తయ్యాక ఇంకా తాను హిందువును అని మహిళ చెప్పుకోవడంలో అర్థంలేదు. మతం మారాక కూడా రిజర్వేషన్ ప్రయోజనాలే పరమావధిగా ఇలా వ్యవహరించడం రిజర్వేషన్ లక్ష్యాలకే విఘాతం. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న రిజర్వేషన్ల విధానం ఇలాంటి వారితో ప్రమాదంలో పడుతుంది''అని కోర్టు వ్యాఖ్యానించింది. సెల్వరాణి తండ్రి హిందువుకాగా తల్లి క్రైస్తవురాలు. అయితే సెల్వరాణి చిన్నతనంలోనే బాప్టిజం తర్వాత క్రైస్తవురాలిగా మారారు. అయితే 2015లో పుదుచ్చేరిలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం పొందేందుకు ఆమె ఎస్సీ సర్టిఫికేట్ సంపాదించారు. సెల్వరాణి తండ్రి వల్లువాన్ కులానికి చెందిన వ్యక్తి. స్థానికంగా ఈ కులం వారికి ఎస్సీ సర్టిఫికేట్ ఇస్తారు. కానీ సెల్వరాణి తండ్రి సైతం దశాబ్దాలక్రితమే క్రైస్తవమతం స్వీకరించారు. దీంతో తల్లిదండ్రులు క్రైస్తవులుకాగా తాను మాత్రం హిందువును అని ఈమె చేసిన వాదనల్లో నిజం లేదని కోర్టు అభిప్రాయపడింది.

## ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

- ఐదుగురి దుర్మరణం.. మృతుల్లో ముగ్గురు వైద్యులు
- పీజీ వైద్య విద్యార్థికి తీవ్ర గాయాలు

కన్నౌజ్: ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం తెల్లవారుజామున ఓ స్కార్పియో డివైడర్‌ను ఢీకొని రోడ్డు దాటి ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వైద్యులు, ఇద్దరు వైద్య సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. జైవీర్‌సింగ్ అనే పీజీ వైద్య విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా సైఫైలోని యూపీ యూనివర్శిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పీజీ వైద్యులు. లక్నోలో పెళ్లికి హాజరై తిరిగి వస్తున్నారు. కన్నౌజ్ జిల్లా తిర్వా వద్ద ప్రమాదం జరిగింది. వారందరినీ హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా అప్పటికే ఐదుగురు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. వారిని డాక్టర్ అనిరుధ్ వర్మ (29), డాక్టర్ అరుణ్ కుమార్ (34), డాక్టర్ నరేంద్ర దేవ్ (35), సంతోష్ కుమార్ మౌర్య (46), రాకేశ్ కుమార్ (38)గా గుర్తించారు. అనిరుద్‌కు త్వరలో పెళ్లి జరగాల్సి ఉంది. అరుణ్‌కుమార్‌కు ఆరుగురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు సోదరులున్నారు.



రూ.5,900 కోట్ల విలువైన బిట్‌కాయిన్లు

# చెత్తకుప్ప పాలు!

**బ్రిటన్‌లో ఓ మహిళ నిర్వాకం**

లండన్: అనగనగా ఒక పాత హార్డ్‌డ్రైవ్. బ్రిటన్‌కు చెందిన 39 ఏళ్ల జేమ్స్ హావెల్స్ అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీ తొలినాళ్లలో అంటే 2009 ఏడాదిలో 8,000 బిట్‌కాయిన్లను మైనింగ్ చేశాడు. వాటికి సంబంధించిన డిజిటల్ కీని ఆ పాత హార్డ్‌డ్రైవ్‌లో దాచి ఉంచాడు. అయితే అది తర్వాత కనిపించకుండా పోయింది. తన ప్రియురాలు హాఫీనా ఎడీ ఎవాన్స్‌తో కలిసి ఈ హార్డ్‌డ్రైవ్ కోసం వేట మొదలెట్టాడు. అది కనిపించట్లేదని ఫిర్యాదు కూడా చేశాడు. అయితే అది 2013 ఏడాదిదాకా ఇంట్లోనే ఒక గదిలో సొరుగులో ఉండిపోయింది. అయితే 2013లో ఇంటిని ప్రియురాలు హాఫీనా శుభ్రం చేస్తుండగా పాత కంప్యూటర్ విడిభాగాలున్న ఒక పాత నల్ల సంచి కనిపించింది. దీనిని పడేయాలా? అని జేమ్స్‌ను హాఫీనా అడగ్గా అవసరం లేదు పడేసెయ్ అని చెప్పాడు. దీంతో బయటికెళ్తూ దారిలో ఉన్న చెత్తకుప్పలో దానిని పడేసి వెళ్లిపోయింది. తర్వాత ఇద్దరూ దాని కోసం వేట కొనసాగించారు. అయితే తాజా దర్యాప్తులో.. ఆమె గతంలో పడేసిన సంచిలోనే హార్డ్‌వేర్ ఉందని తాజాగా వెల్లడైంది. హార్డ్‌వేర్‌లోని డిజిటల్ కీ సాయంతో అందుబాటులోకి వచ్చే 8,000 బిట్‌కాయిన్ల ప్రస్తుత మార్కెట్ విలువ ఏకంగా రూ.5,900 కోట్లు కావడం గమనార్హం. విషయం తెల్సి హాఫీనా హతాశురాలైంది. ప్రస్తుతం వీళ్లిద్దరూ విడిపోయారు. ''జేమ్స్ సంపదను తెలీకుండా చెత్తపాలు చేశాను. దాని కోసం అతను పడుతున్న వేదనను చూడలేకపోతున్నా''అని తాజాగా హాఫీనా వాపోయారు. హాఫీనా పడేసిన చెత్తకుప్పలోని వ్యర్థాలు సాధారణంగా వేల్స్‌లోని న్యూపోర్ట్‌లో ఉన్న డాక్స్‌వే భారీ డంపింగ్ యార్డ్‌కు చేరుకుంటాయి. అక్కడ ఏకంగా 14,00,000 టన్నుల చెత్త కుప్ప కొండ ఉంది. అందులో ఎలాగైనా తన హార్డ్‌డ్రైవ్‌ను తిరిగి సంపాదిస్తానని జేమ్స్ బయల్దేరారు. అయితే అంత చెత్తను కింది నుంచి మొత్తం తిరగతోడితే కాలుష్యం పెరిగి చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యావరణ సమస్యలు వస్తాయని న్యూపోర్ట్ సిటీ కౌన్సిల్ ససేమిరా అంటోంది. యార్డ్‌లోకి అతనికి అనుమతి నిరాకరించింది. దీంతో జేమ్స్ కోర్టును ఆశ్రయించాడు. మొత్తం గాలించి హార్డ్‌డ్రైవ్ దొరికితే కుబేరుడినయ్యాక సంపదలో 10 శాతాన్ని న్యూపోర్ట్ అభివృద్ధికి కేటాయిస్తానని, నగరాన్ని దుబాయ్, లాస్ వెగాస్ సిటీలా తీర్చిదిద్దుతానని కోర్టుకు విన్నవించుకున్నాడు. ఈ అంశాన్ని డిసెంబర్‌లో విచారిస్తామంటూ ఈ కేసును కోర్టు వాయిదావేసింది.

# వెనక్కి తగ్గిన ఇమ్రాన్ ఖాన్ పార్టీ

- ఇస్లామాబాద్‌లో నిరసనలను నిలిపివేస్తూ పీటీఐ ప్రకటన
- డి–చౌక్‌లో చేరిన ఆందోళనకారులపై విరుచుకుపడ్డ సైన్యం
- ఘర్షణల్లో నలుగురు మృతి.. 50 మందికి గాయాలు
- ప్రభుత్వం అమాయకుల రక్తం కళ్లజూసిందన్న పీటీఐ

ఇస్లామాబాద్: పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలో పాకిస్తాన్ తెహ్రీక్ ఇ–ఇన్సాఫ్(పీటీఐ) రాజధాని ఇస్లామాబాద్‌లో చేపట్టిన నిరసనలపై వెనక్కి తగ్గింది. నిషేధాజ్ఞలను తోసి రాజని డి–చౌక్‌లో చేరిన పీటీఐ శ్రేణులపై మంగళవారం అర్ధరాత్రి దాటాక భద్రతా బలగాలు విరుచుకుపడటంతో నలుగురు చనిపోగా మరో 50 మంది వరకు గాయపడ్డారు. సుమారు 450 మందిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఈ పరిణామంతో ఆందోళనలను కొంతకాలంపాటు నిలిపివేస్తున్నట్లు పీటీఐ ప్రకటించింది. భద్రతా బలగాలతో జరిగిన ఘర్షణల్లో తమ కార్యకర్తలు వందల మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేసింది. నియంతలుగా మారిన పాలకులు ఇస్లామాబాద్‌ను నిరాయుధులైన పౌరుల వధశాలగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. డి–చౌక్ ధర్నాలో పాల్గొన్న ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ, ఖైబర్ ప్రావిన్స్ సీఎం తదితరులు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. పార్టీ రాజకీయ, కోర్ కమిటీలు అందజేసే నివేదిక ఆధారంగా ఇమ్రాన్ ఖాన్ తీసుకునే తదుపరి నిర్ణయం కోసం ఎదురు చూస్తామని పేర్కొంది. భద్రతా బలగాల హింసాకాండపై సుమోటోగా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేసింది. ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ, ఖైబర్ సీఎం గండాపూర్ తదితర ముఖ్య నేతలు ప్రస్తుతం ఖైబర్ ప్రావిన్స్‌లోని మన్సేహ్‌రాలో సురక్షితంగా ఉన్నారని పీటీఐ తెలిపింది. కాగా, డి–చౌక్‌లో తిష్టవేసిన పీటీఐ శ్రేణులు పార్లమెంట్‌తోపాటు కీలక ప్రభుత్వ కార్యాలయాలపై దాడికి పథకం వేశారని మంత్రి తరార్ చెప్పారు. పీటీఐ కార్యకర్తలు పరారవుతూ వదిలివేసిన పత్రాల్లో ఈ విషయం ఉందన్నారు. ఆందోళనకారుల్లో అఫ్గాన్లు కూడా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పీటీఐ లాంగ్ మార్చ్‌ని అడ్డుకునేందుకు రాజధాని ఇస్లామాబాద్‌కు దారి తీసే మార్గాల్లో అడ్డుగా పెట్టిన బారికేడ్లు, ఇతర అడ్డంకులను పోలీసులు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇస్లామాబాద్‌లో బుధవారం ఉదయం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. డి–చౌక్‌లో మంగళవారం సాయంత్రం పీటీఐ శ్రేణులతో జరిగిన ఘర్షణల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇస్లామాబాద్ దిశగా లాంగ్ మార్చ్ చేపట్టాలంటూ జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఈ నెల 13న పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం తెలిసిందే.

# పన్నుకు పన్ను



**ట్రంప్ ప్రతిపాదనలపై మెక్సికో!**

- తగ్గేదే లేదన్న అధ్యక్షురాలు షేన్‌బామ్

మెక్సికో: మెక్సికో నుంచి దిగుమతులపై 25 శాతం పన్ను విధిస్తామన్న అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికకు ఆ దేశం తీవ్రంగా స్పందించింది. అదే జరిగితే మెక్సికో కూడా సుంకాలతో బదులిస్తుందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ హెచ్చరించారు. అమెరికా సరిహద్దుల వెంబడి మాదకద్రవ్యాలు, వలసదారుల ప్రవాహాన్ని ఆపకపోతే మెక్సికో వస్తువులపై 25% దిగుమతి సుంకాలు తప్పవని ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను క్లాడియా తీవ్రంగా దుయ్యబట్టారు. అమెరికా నుంచి అక్రమంగా ప్రవాహంలా వచ్చిపడుతున్న ఆయుధాలతో మెక్సికో బాధపడుతోందన్నారు. ఇక మాదకద్రవ్యాలు అమెరికా సొంత సమస్యేనన్నారు. వలస సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. సమస్యలపై చర్చలకు సిద్ధమన్నారు. వలసదారుల కారవాన్లు ఇకపై సరిహద్దుకు చేరవని స్పష్టం చేశారు. ఆయుధాలపై పెట్టే ఖర్చును వలస సమస్యను పరిష్కారానికి వెచ్చిస్తే మంచిదని అమెరికాకు హితవు పలికారు. యుద్ధానికి ఖర్చు చేసే మొత్తంలో కొంత శాంతి, అభివృద్ధిపై కేటాయిస్తే సమస్యను సులువుగా పరిష్కరించవచ్చన్నారు. అమెరికా, మెక్సికో పలు అంశాల్లో పరస్పరం ఆధారపడతాయి. భారీ పన్నులు ఇరు దేశాల్లో ద్రవ్యోల్బణానికి, నిరుద్యోగానికి కారణమవుతాయి. ఇరు దేశాల మధ్య అవగాహన, శాంతి సాధనకు చర్చలే మార్గం''అన్నారు. అవి త్వరలోనే జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ట్రాన్స్‌జెండర్లూ మహిళలేనా?

- బ్రిటన్లో కలకలం రేపుతున్న అంశం
- సుప్రీంకోర్టుకు వివాదం, త్వరలో తీర్పు

**ట్రాన్స్‌జెండర్ల హక్కులకు విఘాతం: ఆమ్నెస్టీ**

సమానత్వ చట్టం ప్రకారం లైంగికత తల్లి గర్భంలోనే నిర్ణయమవుతుందని ఎఫ్‌డబ్ల్యూఎస్ తరఫు న్యాయవాది అంటున్నారు. పుట్టిన అనంతరం దాన్ని మార్చడం సాధ్యం కాదని వాదిస్తున్నారు. దీనితో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌తో సహా పలు మానవహక్కుల సంఘాలు విభేదిస్తున్నాయి. ''జెండర్ అనేది శారీరక వ్యక్తీకరణ. లింగ గుర్తింపు సర్టిఫికెటున్న ట్రాన్స్‌జెండర్లకు మహిళల హక్కులను నిషేధించడం మానవ హక్కుల సూత్రాలకు విరుద్ధం''అని అవి అంటున్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులకు విఘాతం కలగకుండా చూడాలని బ్రిటన్ సుప్రీంకోర్టును ఆమ్నెస్టీ లిఖితపూర్వకంగా కోరింది.

మహిళ అంటే ఎవరు? ఒక వ్యక్తి స్త్రీ అని నిర్ధారించేందుకు ప్రాతిపదిక ఏమిటి? జన్మతః సంక్రమించిన లైంగికత మాత్రమేనా? లింగ మార్పిడితో మహిళగా మారిన వాళ్లు కూడా 'స్త్రీ'అనే నిర్వచనం కిందకు వస్తారా? తద్వారా మహిళలకు వర్తించే హక్కులన్నీ వారికీ వర్తిస్తాయా? అత్యంత సంక్లిష్టమైన ఈ అంశాలను తేల్చాల్సిన బాధ్యత బ్రిటన్ సుప్రీంకోర్టుపై పడింది. అతి వివాదాస్పదమైన ఈ అంశంపై జోరుగా కోర్టులో వాద వివాదాలు జరుగుతున్నాయి. ఒకరకంగా 'మహిళ వర్సెస్ మహిళ'అని చెప్పదగ్గ న్యాయపోరాటం జరుగుతోంది. స్త్రీగా గుర్తింపు సర్టిఫికెట్ ఉన్న ట్రాన్స్‌జెండర్ వ్యక్తిని సమానత్వ చట్టాల ప్రకారం మహిళగా పరిగణించవచ్చా, లేదా అన్నది ఈ కేసు. బ్రిటన్ అత్యున్నత న్యాయస్థానంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు దీనిపై మంగళవారం లోతైన వాదనలు సాగాయి. అవి బుధవారమూ కొనసాగాయి. ఇక న్యాయమూర్తులు తీర్పు వెలువరించడమే మిగిలింది. అందుకు రెండు వారాలు పట్టవచ్చు. రాబోయే తీర్పు బ్రిటన్‌తో పాటు ప్రపంచమంతటా లింగమార్పిడి ద్వారా మహిళలుగా మారిన వారి గుర్తింపును, హక్కులు తదితరాలపై ఎంతగానో ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

**ఏమిటీ కేసు?**

నిజానికి మహిళా హక్కుల ఉద్యమకారులకు, స్కాట్లండ్ ప్రభుత్వానికి దీర్ఘకాలంగా సాగుతున్న వివాదమిది. స్కాట్లాండ్ ప్రభుత్వ రంగ సంస్థల బోర్డుల్లో 50 శాతం మహిళా ప్రాతినిధ్యం ఉండేలా 2018లో అక్కడి ట్లాండ్ పార్లమెంటు చట్టాన్ని ఆమోదించింది. లింగ మార్పిడి ద్వారా మహిళలుగా మారిన వారిని కూడా ఈ చట్టం ప్రకారం 'స్త్రీ'నిర్వచన పరిధిలో చేర్చారు. దీన్ని స్కాటిష్ మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇలా 'మహిళ'ను పునర్నిర్వచించే అధికారం పార్లమెంటుకు లేదన్నది వారి వాదన. ''ఈ చట్టం అమలైతే బోర్డుల్లో 50 శాతం మంది పురుషులతో పాటు మిగతా 50 శాతం కూడా మహిళలుగా మారిన పురుషులే ఉంటారు. అది మహిళా ప్రాతినిధ్య లక్ష్యాలకే గొడ్డలిపెట్టు''అని 'ఫర్ విమెన్ స్కాట్లాండ్'(ఎఫ్‌డబ్ల్యూఎస్) అనే మహిళ స్వచ్ఛంద సంస్థ అంటోంది. అంతిమంగా ఇది మహిళల రక్షణకూ విఘాతమేనన్ని వాదిస్తోంది. ఈ చట్టాన్ని స్కాట్లాండ్ కోర్టులో సవాలు చేయగా చుక్కెదురైంది. ఈ కేసును కోర్టు తిరస్కరించింది. అయితే దీనిపై సుప్రీంకోర్టుకు తీసుకెళ్లడానికి గతేడాది అనుమతించింది. అలా బంతి బ్రిటన్ సుప్రీంకోర్టు వద్దకు చేరింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, సక్సెస్ స్టోరీలు మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.



# విచక్షణా గ్రాంటులు అంటే ఏమిటి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



**కేంద్ర ప్రభుత్వం 2017 జూలై 1 నుంచి గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టింది. దీన్ని 101వ రాజ్యాంగ సవరణ చట్టం 2016 ద్వారా ఒక దేశం - ఒక పన్ను నినాదంతో అమలు చేసింది.**

## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

### పరిపాలనా సంబంధాలు..

కేంద్ర, రాష్ట్రాల మధ్య సాధారణ పరిస్థితుల్లో ఉండే పరిపాలనా సంబంధాల గురించి విస్తృతంగా IXవ భాగంలో 256 నుంచి 263 వరకు ప్రకరణల్లో పొందుపరిచారు. ఈ సంబంధాలనే మునిసిపల్ సంబంధాలు అని కూడా అంటారు. దైనందిన పరిపాలన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

ప్రకరణ 256 ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వహణాధికారాలను పార్లమెంటు చేసిన చట్టాలకు లోబడి వినియోగించాలి. దీని కోసం రాష్ట్రాలకు కొన్ని పరిపాలనా ఆదేశాలను కేంద్రం జారీ చేయొచ్చు.

ప్రకరణ 257 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహణ అధికారాలను కేంద్రం నియంత్రించవచ్చు. రాష్ట్రాలు వాటి అధికారాలను వినియోగించుకునే సందర్భంలో అవి కేంద్ర ప్రభుత్వ అధికారాలను ప్రశ్నించే విధంగా ఉండకూడదు. రైల్వేలు, టెలికమ్యూనికేషన్లు తదితర కేంద్ర ప్రభుత్వ ఆస్తులను రాష్ట్రాలు పరిరక్షించాలి. వాటి పరిరక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది.

ప్రకరణ 258 ప్రకారం సంబంధిత రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని పాలనా విధులను షరతులతో లేదా షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి బదలాయించవచ్చు.

ప్రకరణ 258ఎ ప్రకారం కేంద్ర ప్రభుత్వ సమ్మతితో (షరతులతో లేదా షరతులు లేకుండా) రాష్ట్ర ప్రభుత్వ పాలనా విధులను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్ బదలాయించవచ్చు. ప్రకరణ 258ఎ లోని అంశాలను 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 259ని 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 260 ప్రకారం భారత ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా భారత్ బయట ఉన్న భూభాగాల పరిపాలనను చేపట్టవచ్చు.

ప్రకరణ 261 ప్రకారం దేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు జారీ చేసిన ధ్రువపత్రాలు, పబ్లిక్ రికార్డులను న్యాయతీర్పులపై నమ్మకం ఉంచి గౌరవించాలి.

**నదీ జలాల వివాదాలు..**

ప్రకరణ 262(1) ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలు, నదీ లోయలకు చెందిన జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంటు ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 262(2) ప్రకారం నదీ జలాల వినియోగానికి సంబంధించి ఫిర్యాదులను లేదా వివాదాలను విచారించే అధికారం సుప్రీంకోర్టు లేదా మరేదైనా న్యాయస్థానం పరిధి నుంచి మినహాయిస్తూ చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. 1956లో పార్లమెంటు అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తారు.

**అంతర్రాష్ట్ర మండలి:**

ప్రకరణ 263 ప్రకారం భారత రాష్ట్రపతి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు. దీనికి హోదారీత్యా ప్రధానమంత్రి అధ్యక్షులుగా ఉంటారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు,కేంద్రపాలిత ప్రాంతాల పాలకులు ఇందులో సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించిన అంశాలను విచారణ చేసి సలహాలు ఇస్తారు. అంతర్రాష్ట్ర మండలిని మొదటిసారిగా 1990లో ఏర్పాటు చేశారు.

### ఆర్థిక సంబంధాలు

రాజ్యాంగంలోని 12వ భాగంలో 264 నుంచి 300 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక, ఆస్తుల ఒప్పందాలు మొదలైన అంశాల గురించి ప్రస్తావించారు.

**పన్నుల విభజన:**

కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల విధింపునకు సంబంధించి కచ్చితమైన విభజన చేశారు. **కేంద్ర పరిధిలోకి వచ్చే పన్నులు:**

- వ్యవసాయేతర ఆదాయంపై పన్ను
- ఎగుమతి, దిగుమతి సుంకాలు
- పొగాకుపై ఎక్సైజ్ సుంకం
- కార్పొరేషన్ పన్ను
- మూలధన విలువపై పన్ను
- వ్యవసాయేతర ఎస్టేట్‌లపై పన్ను
- వారసత్వ పన్ను
- అంతర్రాష్ట్ర రవాణా పన్ను
- స్టాక్ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజ్ పన్ను
- చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, ఇన్సూరెన్స్ పాలసీల బదిలీలపై పన్ను
- వార్తా పత్రికలపై అమ్మకం పన్ను, ప్రకటనలపై పన్ను
- అంతర్రాష్ట్ర వ్యాపారంలో విధించే అమ్మకం పన్ను
- అంతర్రాష్ట్ర వాణిజ్యంలో సరకులపై విధించే పన్ను
- సర్వీసులపై పన్ను
- వ్యవసాయేతర భూముల వారసత్వ బదలాయింపు పన్ను

రాష్ట్ర జాబితాలో 45 నుంచి 63 వరకు ఉన్న ఎంట్రీలు, 66వ అంశంతో కలిపి మొత్తం 20 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించవచ్చు. **అవి:**

- భూమి శిస్తు
- వ్యవసాయ భూములపై వారసత్వ పన్ను
- స్థిరాస్తులపై పన్ను (భూములు, భవనాలు)
- మద్యపానంపై పన్ను
- విద్యుత్ వినియోగం, అమ్మకంపై పన్ను
- ప్రకటనలపై పన్ను
- మోటారు వాహనాలపై పన్ను
- టోల్ టాక్స్ ◆ కస్టడీ పన్నులు
- కేంద్ర జాబితాలోని డాక్యుమెంట్లు మినహా మిగతా వాటిపై స్టాంపు డ్యూటీ
- వ్యవసాయ ఆదాయంపై పన్ను
- వ్యవసాయ భూములపై ఎస్టేట్ పన్ను
- ఖనిజాలపై పన్ను
- స్థానిక ప్రాంతాల్లోకి రవాణా అయ్యే వస్తువులపై పన్ను (ఆక్ట్రాయ్)
- వాణిజ్య పన్ను
- రోడ్డు, జల రవాణాలపై పన్ను
- పశువులపై పన్ను ◆ వృత్తి పన్ను
- వినోదపు పన్నులు
- రాష్ట్ర జాబితాలోని అంశాలకు సంబంధించిన ఫీ

ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ నంబర్లు 35, 44, 47లలో ఉన్న అంశాలపై పార్లమెంటు, రాష్ట్ర శాసన శాఖలు పన్నులు విధించవచ్చు. **అవి:**

- యాంత్రిక శక్తి ఆధారంగా పనిచేసే వాహనాలపై పన్ను
- స్టాంప్ డ్యూటీస్
- మూడో జాబితాలో పేర్కొన్న వాటిపై వసూలు చేసే ఫీ

**అవశిష్ట పన్నులు:** కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో పేర్కొనని అంశాలపై కేంద్రం పన్నులు విధించవచ్చు. **అవి:**

- బహుమతి పన్ను ◆ సంపద పన్ను
- వ్యయ పన్ను

ప్రకరణ 265 ప్రకారం చట్టబద్ధత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పన్నులు విధించరాదు. అయితే ఫీ వసూలు చేయవచ్చు.

ప్రకరణ 266 ప్రకారం కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ పద్దులు ఉంటాయి.

కేంద్ర సంఘటిత నిధిలోకి కేంద్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను, రుణాలను జమ చేస్తారు. అదేవిధంగా రాష్ట్ర సంఘటిత నిధిలోకి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను జమ చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పద్దుల్లోకి ప్రజల పొదుపు మొత్తాలను జమ చేస్తారు. **ఉదా:** ప్రావిడెంటు ఫండ్, పోస్టల్ సేవింగ్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పొదుపు పత్రాల ద్వారా వచ్చిన మొత్తం.

ప్రకరణ 267(1) ప్రకారం కేంద్ర ఆగంతుక నిధి, రాష్ట్ర ఆగంతుక నిధి ఉంటాయి. ఊహించని ఖర్చులను ముఖ్యంగా.. ప్రకృతి వైపరీత్యాల ద్వారా జరిగిన నష్టం, ఖర్చులను భరించడానికి రాష్ట్రపతి, గవర్నర్ పేరుతో ఆగంతుక నిధిని నిర్వహిస్తారు. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదానికి లోబడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిధులను నిర్వహిస్తాయి. కేంద్ర ఆగంతుక నిధిని 1957లో భారత ఆగంతుక నిధి చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

**ప్రకరణ 268: కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజన:** కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించి మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావించిన అంశాలకు భారీ మార్పులు చేశారు. 2000లో 80వ, 2003లో 88వ రాజ్యాంగ సవరణల ద్వారా ఈ మార్పులు చేశారు.

10వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 80వ రాజ్యాంగ సవరణ చేశారు. దీని ప్రకారం కేంద్రానికి వచ్చిన పన్నుల వాటాలో 29 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలి. ఈ పద్ధతినే 'ప్రత్యామ్నాయ నిధుల బదిలీ' అంటారు. ఇది 1996 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ద్వారా కేంద్ర పన్నులైన కార్పొరేషన్ టాక్స్, ఎక్సైజ్ సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా ఉంటుంది.

2004లో 88వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 266(ఎ)లో సర్వీస్ టాక్స్ అంశాన్ని చేర్చారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రాలు పంచుకుంటాయి.

ప్రకరణ 268 ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకుంటాయి.

**ఉదాహరణలు:**

- బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ ◆ చెక్కులు
- ప్రామిసరీ నోటు
- బీమా పాలసీ బదలాయింపు
- కంపెనీ షేర్ల బదలాయింపు
- ఆల్కహాల్ ఆధారంగా తయారు చేసిన ఔషధాలు
- టాయ్‌లెట్ సంబంధ వస్తువులపై ఎక్సైజ్ డ్యూటీలు, స్టాంపు డ్యూటీలు

ప్రకరణ 268ఎ ప్రకారం సర్వీస్ టాక్స్ కేంద్ర ప్రభుత్వమే విధిస్తుంది. దీన్ని కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

**ప్రకరణ 269 ప్రకారం కేంద్రం విధించి,కేంద్రమే వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయించే పన్నులు:** అంతర్రాష్ట్ర రవాణాలో జరిగే వస్తువుల అమ్మకం, కొనుగోలుపై విధించే పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయిస్తుంది.

ప్రకరణ 270 ప్రకారం కొన్ని పన్నులను కేంద్రమే విధించి, కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలు చేసిన మొత్తం కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజిస్తారు. **ఉదా:** వ్యవసాయేతర ఆదాయపన్ను,సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర జాబితాలో ప్రస్తావించని ఇతర పన్నులు.

**ప్రకరణ 271 ప్రకారం కొన్ని పన్నులపై సర్‌చార్జీలు:** పార్లమెంటు ఒక చట్టం ద్వారా ప్రకరణ 269, 270లలో ప్రస్తావించిన పన్నులపై సర్‌చార్జీలు విధించొచ్చు.

ప్రకరణ 272లో ఉన్న అంశాలను 2000లో 80వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 273 ప్రకారం అసోం, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జనుము, జనుము ఆధారిత ఎగుమతి సుంకాలకు సంబంధించి ప్రత్యామ్నాయ గ్రాంటులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

ప్రకరణ 274 ప్రకారం రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల విషయంలో పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి పూర్వానుమతి అవసరం.

**ప్రకరణ 275 (1) ప్రకారం సహాయ నిధులు (Grant-in-aid):** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రత్యేక అవసరాల అభివృద్ధి కోసం సహాయక నిధులను ఇస్తుంది. ఇవి రెండు రకాలు.. 1. చట్టబద్ధ గ్రాంటులు, 2. విచక్షణ గ్రాంటులు.

చట్టబద్ధ గ్రాంటులు అంటే ఆర్థిక సహాయం అవసరమైన రాష్ట్రాలకు మాత్రమే పార్లమెంటు ఒక చట్టం ద్వారా కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు సాధారణ అవసరాలు, ప్రత్యేక అవసరాలకు (**ఉదా:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం) నిధులు ఇస్తుంది.

ప్రకరణ 275(1)(ఎ) ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఉన్న గిరిజన ప్రాంతాల్లో సహాయక గ్రాంట్లు మొత్తం ఆ రాష్ట్రానికే చెల్లిస్తారు.

ప్రకరణ 275(2) ప్రకారం ఆర్థిక సంఘం సలహా మేరకు రాష్ట్రపతి సహాయక గ్రాంట్లను సంబంధిత అధికారులకు మంజూరు చేస్తారు. దీనికి సంబంధించి పార్లమెంటుకు శాసనం చేసే అధికారం కూడా ఉంది.

ప్రకరణ 276 ప్రకారం వ్యక్తి, వ్యాపారం, ఉపాధి అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వాలు వ్యక్తులపై రూ. 2500లకు మించకుండా వృత్తి పన్ను విధించవచ్చు.

ప్రకరణ 279 ప్రకారం పన్నుల ద్వారా వసూలైన ఆదాయాన్ని నికర ఆదాయంగా నిర్ణయిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దీనికి సంబంధించి నికర ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తారు.

ప్రకరణ 280 ప్రకారం ఆర్థిక సంఘం ఉంటుంది. భారత రాష్ట్రపతి ప్రతి అయిదేళ్లకు ఆర్థిక సంఘాన్ని ఏర్పరుస్తారు. ఇందులో ఒక చైర్మన్, నలుగురు సభ్యులుంటారు. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనపై సిఫారసులు చేస్తుంది.

ప్రకరణ 281 ప్రకారం ఆర్థిక సంఘం తన సిఫారసులను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ నివేదికను పార్లమెంటు ముందు ఉంచుతారు.

ప్రకరణ 282 ప్రకారం ప్రజా సౌకర్యార్థం ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రణాళికా సంఘం సిఫారసు మేరకు పార్లమెంటు నిధులు ఇస్తుంది. వీటిని 'విచక్షణా గ్రాంటులు' అంటారు.

ప్రకరణ 285 ప్రకారం కేంద్ర ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించరాదు.

ప్రకరణ 286 ప్రకారం సరకుల క్రయ విక్రయాలకు సంబంధించిన పన్ను విధింపుపై పరిమితులు ఉంటాయి. రాష్ట్రం వెలుపల జరిగే వస్తువుల క్రయ విక్రయాలు, భారతదేశంలో దిగుమతి, ఎగుమతి చేసే వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించకూడదు.

ప్రకరణ 287 ప్రకారం విద్యుత్‌పై పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 292 ప్రకారం దేశంలో లేదా విదేశాల్లో కేంద్రం రుణాలు తీసుకోవచ్చు.

ప్రకరణ 293 ప్రకారం రాష్ట్రాలకు దేశం లోపల మాత్రమే రుణాలను తీసుకునే అధికారం ఉంది.

# ఏ విధానంలో విద్య జీవితాంత ప్రక్రియ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - ఎస్ఏ/ఎస్‌జీటీ

## బోధన పద్ధతులు

డీఎస్సీ, టెట్+ టీఆర్‌టీ సహా అన్ని రకాల ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ తెలుగు అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని సేకరించుకొని చదవాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులు విధిగా బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. గత టెట్, డీఎస్సీ పరీక్షల్లో తెలుగు అకాడమీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. ఇక్కడ మనం డీఎడ్, బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాల్లోని 'బోధన ప్రక్రియలు-ఆధునిక బోధన పద్ధతులు' అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

### మాదిరి ప్రశ్నలు

1. పిల్లల్లో ఆధ్యాత్మిక దృక్పథాన్ని పెంపొందించి వారు మొక్కల నుంచి వచ్చే పుష్పాల సౌరభాన్ని ఆస్వాదించేటట్లు చేయాలని అభిలషించినవారు?
   1) ఫ్రోబెల్ 2) కిల్‌ప్యాట్రిక్
   3) మాంటిసోరి 4) కాల్డ్వెల్ కుక్
2. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తి యుక్తులకు మెరుగుపెట్టి పిల్లలను దైవ స్వరూపులుగా తీర్చిదిద్దాలని ఎవరు కోరుకున్నారు?
   1) మాంటిసోరి 2) స్టాన్లీహాల్
   3) కాల్డ్వెల్ కుక్ 4) ఫ్రోబెల్
3. 'పిల్లలు స్వభావరీత్యా మృదు స్వభావులైనందువల్ల వారిలో శీలనిర్మాణం సులభంగా చేయవచ్చని' విశ్వసించింది ఎవరు?
   1) కిల్‌ప్యాట్రిక్ 2) ఫ్రోబెల్
   3) మాంటిసోరి 4) కాల్డ్వెల్ కుక్
4. కిండర్‌గార్టెన్ విధానానికి ఏ సూత్రం ఆధారం?
   1) స్వయం అధ్యయనం
   2) కృత్యాలను స్వయంగా నిర్వహించడం
   3) గుణాత్మక విద్యా సాధన
   4) స్వయం వివర్తనం- స్వయంప్రకటన
5. ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్ విధానం భావనలను ఏ పుస్తకంలో పొందుపరిచారు?
   1) ది టెక్నాలజీ ఆఫ్ టీచింగ్
   2) టాక్సానమీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లాన్
   3) ది ఎడ్యుకేషన్ అండ్ ప్లాన్
   4) ది ఎడ్యుకేషన్ అండ్ ఫ్రీడమ్
6. 'మాంటిసోరి పద్ధతి ఒక బోధన పద్ధతి మాత్రమే కాదు, అది విద్యారంగంలో ఒక విప్లవాత్మక ఆలోచనా విధానం' అని ఎవరు అభిప్రాయపడ్డారు?
   1) ఫ్రోబెల్ 2) గిజూ భాయ్
   3) పెస్టాలజీ 4) జాన్‌డ్యూయి
7. ఏ విధానం 'శాస్త్రీయ ప్రపంచానికి సంబంధించిన నూతన సత్యాలను ప్రతిపాదించడంతోపాటు ఈనాటి సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాలను సూచిస్తుందని' గిజూభాయ్ అభిప్రాయం
   1) క్రీడా పద్ధతి
   2) కిండర్‌గార్టెన్ పద్ధతి
   3) మాంటిసోరి పద్ధతి
   4) ప్రాజెక్టు పద్ధతి
8. పిల్లల జ్ఞానేంద్రియ శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన పద్ధతి?
   1) ప్రాజెక్టు పద్ధతి 2) క్రీడా పద్ధతి
   3) కిండర్‌గార్టెన్ పద్ధతి
   4) మాంటిసోరి పద్ధతి
9. శాస్త్రీయ దృక్పథానికి పెద్దపీట వేసిన విధానం?
   1) డాల్టన్ పద్ధతి 2) మాంటిసోరి పద్ధతి
   3) కిండర్‌గార్టెన్ పద్ధతి
   4) ప్రాజెక్టు పద్ధతి
10. మాంటిసోరి విధానం ప్రకారం పాఠశాల?
    1) బాల గృహం 2) ప్రదర్శన శాల
    3) ఉద్యానవనం
    4) ఒక చిన్న ప్రపంచం
11. మాంటిసోరి విధానంలో బోధన కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఉపకరణాలను ఏమంటారు?
    1) ఫ్రోబెల్ కానుకలు
    2) విజ్ఞాన వాహకాలు
    3) ఉపదేశాత్మక పరికరాలు
    4) ఇంద్రియ శిక్షణ ప్రేరకాలు
12. ఏ విధానంలో బాలలు కాలనిర్ణయ పట్టికలతోపాటు పాఠ్యప్రణాళికలనే సంకెళ్లకు దూరంగా ఉంటారు?
    1) కిండర్‌గార్టెన్ పద్ధతి
    2) మాంటిసోరి పద్ధతి
    3) క్రీడా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
13. ఏ విధానంలో విద్య జీవితాంత ప్రక్రియ?
    1) క్రీడా పద్ధతి 2) డాల్టన్ పద్ధతి
    3) మాంటిసోరి పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
14. ఏ విధానాన్ని అనుసరించి పాఠశాలల్లో సామాజిక దృక్పథం, సామాజిక స్పృహ పెంపొందించడం జరుగుతుంది?
    1) మాంటిసోరి 2) డాల్టన్
    3) ప్రాజెక్టు 4) కిండర్‌గార్టెన్
15. ఏ విధానంలో పాఠశాలలోని విద్యార్థులందరూ (ధనిక, పేద తేడా లేదు) సమానులే?
    1) డాల్టన్ పద్ధతి 2) క్రీడా పద్ధతి
    3) మాంటిసోరి పద్ధతి
    4) ప్రాజెక్టు పద్ధతి
16. దేశకాలాలు, అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులకు వీలైన పద్ధతి?
    1) కిండర్‌గార్టెన్ 2) మాంటిసోరి
    3) డాల్టన్ 4) ప్రాజెక్టు
17. ఏ పద్ధతిలో ఉపకరణాలు ఇంద్రియ వికాసం, శబ్ద జ్ఞానం, భౌతిక వ్యాయామం, ప్రకృతి పరిచయం మొదలైన వాటిని విద్యార్థులకు సమకూరుస్తాయి?
    1) మాంటిసోరి 2) కిండర్‌గార్టెన్
    3) డాల్టన్ 4) ప్రాజెక్టు పద్ధతి
18. 'ప్రాథమిక స్థాయిలో కృత్యాధార పద్ధతి ద్వారా జరిపే బోధన మంచి సత్ఫలితాలనిచ్చి విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి తోడ్పడుతుందని' నొక్కి చెప్పిన విద్యా కమిషన్?
    1) కొఠారి విద్యా కమిషన్
    2) మొదలియార్ విద్యా కమిటీ
    3) ఈశ్వరీభాయ్ పటేల్ విద్యా కమిటీ
    4) జాతీయ విద్యా విధానం
19. ఏ విధానంలో విద్యార్థులకు అనుభవాల కల్పన చాలా ముఖ్యం?
    1) ప్రాజెక్టు పద్ధతి 2) కృత్యాధార పద్ధతి
    3) బేసిక్ విద్యావిధానం
    4) కార్యక్రమయుత అభ్యసనం
20. విద్యార్థుల శారీరక, మానసిక శక్తులను మేల్కొల్పి వారిని స్వయం అధ్యయనశీలురుగా మార్చడానికి తోడ్పడే పద్ధతి?
    1) మాంటిసోరి పద్ధతి
    2) కిండర్‌గార్టెన్ పద్ధతి
    3) కృత్యాధార పద్ధతి
    4) ప్రాతిపదిక విద్యావిధానం
21. ఏ విధానం ప్రాథమిక విద్యాక్షేత్రంలో గుణాత్మకతను సాధించడానికి ఎంతగానో తోడ్పడుతుందని విద్యావేత్తల అభిప్రాయం?
    1) కృత్యాధార బోధన
    2) కిండర్‌గార్టెన్
    3) ప్రాతిపదిక విద్యావిధానం
    4) క్రీడా పద్ధతి
22. ఒక ఉపాధ్యాయుడే పలు తరగతులకు బోధన చేయాల్సి వస్తే దాన్ని ఏమంటారు?
    1) బృంద బోధన
    2) నియంత్రిత అధ్యయనం
    3) బహుళ తరగతి బోధన
    4) సూక్ష్మ బోధన
23. నియోజన పద్ధతి అని దేనినంటారు?
    1) కృత్యాధార పద్ధతి
    2) కిండర్‌గార్టెన్ పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) డాల్టన్ పద్ధతి
24. డాల్టన్ పద్ధతిని మొదట అనుసరించిన విద్యావేత్త?
    1) మిస్‌గల్ 2) హెలెన్‌పార్క్ హర్స్ట్
    3) కిల్‌ప్యాట్రిక్ 4) బల్లార్డ్
25. విద్యార్థుల వైయక్తిక భేదాల కారణంగా వారు చదువులో వెనుకంజలో ఉండటం, ముందుండటం జరుగుతుందని విశ్వసించిన విద్యావేత్త?
    1) ఫ్రోబెల్ 2) మాంటిసోరి
    3) హెలెన్‌పార్క్ హర్స్ట్ 4) మిస్‌గల్
26. ఏ విధానంలో అన్ని పాఠ్యాంశాలపై నియోజనాలు సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తారు?
    1) కృత్యాధార పద్ధతి 2) డాల్టన్ పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) ప్రాతిపదిక విద్యావిధానం
27. ఏ పద్ధతిలో విద్యార్థులందరూ సక్రియాత్మక భాగస్వాములవుతారు?
    1) డాల్టన్ పద్ధతి 2) ప్రాజెక్టు పద్ధతి
    3) చర్చా పద్ధతి 4) కృత్యాధార పద్ధతి
28. సాధారణంగా ఉన్నత పాఠశాలల్లో ప్రతి రోజూ ఏ అధ్యయనానికి ఒక గంట సమయం కేటాయిస్తారు?
    1) సూక్ష్మ బోధన 2) బృంద బోధన
    3) పర్యవేక్షణాత్మక అధ్యయనం
    4) కార్యక్రమయుత అధ్యయనం
29. ఏ విధానం అమలు చేయడానికి తరగతి గదుల్లో మూల గ్రంథాలు, పరామర్శ గ్రంథాలు, నిఘంటువులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి?
    1) పర్యవేక్షణాత్మక అధ్యయనం
    2) డాల్టన్ విధానం 3) ప్రాజెక్టు పద్ధతి
    4) కృత్యాధార బోధన
30. పద్య బోధనకు ఉత్తమ పద్ధతి?
    1) పూర్ణ పద్ధతి 2) ఖండ పద్ధతి
    3) పఠన పద్ధతి 4) ప్రశంసా పద్ధతి
31. పద్యాన్ని మొత్తం తీసుకొని బోధించడాన్ని ఏమంటారు?
    1) పఠన పద్ధతి 2) పూర్ణ పద్ధతి
    3) ఖండ పద్ధతి 4) తాత్పర్య పద్ధతి
32. ఉపాధ్యాయుడు నూతన పదాలకు అర్థాలను ఏ పద్ధతిలో చెప్పాలి?
    1) ప్రశ్నోత్తర పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) వాక్యప్రయోగ పద్ధతి
    4) ఉదాహరణ పద్ధతి
33. ఉపాధ్యాయుడు సంధులు, సమాసాలను బోధించేటప్పుడు ఏ పద్ధతిని అనుసరించాలి?
    1) చర్చాపద్ధతి 2) వాక్యప్రయోగ పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) ఉదాహరణ పద్ధతి
34. పద్యంలోని కవితాశిల్పం, రసం, పాకం, అలంకారం, ధ్వని విశేషాలను బోధించ దానికి తోడ్పడే పద్ధతి?
    1) పూర్ణ పద్ధతి 2) ప్రతిపదార్థ పద్ధతి
    3) చర్చాపద్ధతి 4) ప్రశంసా పద్ధతి
35. బోధన సోపానాల్లో ప్రధాన సోపానం?
    1) ప్రవేశం 2) ప్రదర్శనం
    3) పునర్విమర్శ 4) గైహికం
36. విద్యార్థుల్లో అభ్యసన పునర్బలనానికి ఉపయోగపడే సోపానం?
    1) పూర్వజ్ఞాన పరిశీలన
    2) ఉన్ముఖీకరణం 3) పునర్విమర్శ
    4) గైహికం
37. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకం చదువుతూ వివరించే పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) పఠన పద్ధతి
    3) వివరణ పద్ధతి 4) ప్రవచన పద్ధతి
38. ఈ పద్ధతిలో గద్య బోధన విద్యార్థులకు అంతగా ఉపయోగకరం కాదు?
    1) ప్రవచన పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) ఉపన్యాస పద్ధతి 4) కథాకథన పద్ధతి
39. ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధనకు ఆశించిన లక్ష్యాలు ఏ మేరకు సాధించాడో తెలుసుకోవడానికి దేన్ని చేపట్టాలి?
    1) ఉన్ముఖీకరణం 2) పునర్విమర్శ
    3) గైహికం 4) ప్రదర్శనం
40. ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన భాష స్వరూప స్వభావాలను వర్ణించి, వివరించి తెలియజేసేది?
    1) వర్ణనాత్మక వ్యాకరణం
    2) చారిత్రక వ్యాకరణం
    3) తులనాత్మక వ్యాకరణం
    4) పైవన్నీ
41. భాష ఏర్పడినప్పటి నుంచి కాలక్రమంలో భాషలో ఏర్పడిన వివిధ మార్పులు, పరిణామాలు గుర్తించి, వివరించే వ్యాకరణం?
    1) వర్ణణాత్మక వ్యాకరణం
    2) చారిత్రక వ్యాకరణం
    3) తులనాత్మక వ్యాకరణం
    4) రూపాత్మక వ్యాకరణం

### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) 1; | 2) 4; | 3) 2; | 4) 2; | 5) 3; |
| 6) 2; | 7) 3; | 8) 4; | 9) 2; | 10) 1; |
| 11) 3; | 12) 2; | 13) 4; | 14) 1; | 15) 3; |
| 16) 2; | 17) 1; | 18) 4; | 19)2; | 20) 3; |
| 21) 1; | 22) 3; | 23) 4; | 24) 2; | 25) 3; |
| 26) 2; | 27) 3; | 28) 3; | 29) 1; | 30) 1; |
| 31) 2; | 32) 3; | 33) 4; | 34) 4; | 35) 2; |
| 36) 4; | 37) 4; | 38) 1; | 39) 2; | 40) 1; |
| 41) 2. | | | | |

## విద్య, ఉద్యోగ సమాచారం

### సీపీఆర్ఐ, బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ).. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. ఉద్యోగానుభవం కూడా ఉండాలి. » **వయసు:** 13.12.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పోస్ట్ బాక్స్ నెం.8066 ప్రొఫెసర్.సర్ సీవీ రామన్ రోడ్, సదాశివనగర్ పోస్ట్ ఆఫీస్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.12.2024.
» **వెబ్‌సైట్:** https://cpri.res.in

### డీఐఏటీ, పుణెలో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ(డీఐఏటీ).. సీనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఈ ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.42,000.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** brazilraj.a@diat.ac.in
» **వెబ్‌సైట్:** https://cpri.res.in/en

### డీఐఏటీ, పుణెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ.. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **విభాగాలు:** ఎయిరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ రోబోటిక్స్, క్వాంటమ్ టెక్నాలజీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2024
» **వెబ్‌సైట్:** https://diat.ac.in

# ‘అర్థశాస్త్రం అంతిమ లక్ష్యం సంక్షేమమే కావాలి’

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

## నిరుద్యోగిత

1. ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ గణాంకాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ తర్వాత అత్యధిక పేదరికం ఉన్న రాష్ట్రం ఏది?
ఎ) బీహార్ బి) ఒడిశా
సి) జార్ఖండ్ డి) ఉత్తరప్రదేశ్
2. ప్రణాళికా సంఘం పేదరికాన్ని గణించడానికి కింది వాటిలో దేన్ని ప్రామాణిక పద్ధతిగా గుర్తించింది?
ఎ) యూనిఫాం రిఫరెన్స్ పీరియడ్
బి) మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్
సి) మాడిఫైడ్ మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్
డి) పైవేవీకాదు
3. పేదరికాన్ని లెక్కించడానికి తలసరి వినియోగ వ్యయం రోజుకు 1.90 డాలర్లుగా ప్రపంచ బ్యాంకు దేని ఆధారంగా నిర్ణయించింది?
ఎ) కొనుగోలు శక్తిసామ్యం
బి) ప్రజల జీవన ప్రమాణం
సి) పేదరిక స్థాయి
డి) పేదరిక అంతరం
4. పేదరికాన్ని గణించడానికి ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ గణాంకాల్లో గ్రామీణ ప్రాంతాల్లో తలసరి వినియోగాన్ని నెలకు ఎంత మొత్తంగా పరిగణనలోకి తీసుకుంది?
ఎ) రూ. 750 బి) రూ. 790
సి) రూ. 805 డి) రూ. 816
5. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక రేఖ దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు నూతన ప్రాతిపదిక రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఎవరి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది?
ఎ) సురేష్ టెండూల్కర్
బి) ఎన్.సి. సక్సేనా సి) రంగరాజన్
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
6. 2011-12 గణాంకాల ప్రకారం ఏ మతానికి చెందిన వారిలో పేదరికం ఎక్కువ శాతం ఉంది?
ఎ) ముస్లింలు బి) క్రైస్తవులు
సి) జైనులు డి) బౌద్ధులు
7. 16 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి, పనిచేసే సామర్థ్యం, కోరిక ఉండి, మార్కెట్‌లో లభించే వేతనం వద్ద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారిని ఏమని పిలుస్తారు?
ఎ) ప్రధాన శ్రామికులు
బి) పనిలో పాలు పంచుకునే రేటు
సి) శ్రామిక శక్తి డి) నిరుద్యోగులు
8. ఒక సంవత్సర కాలంలో 183 రోజులు, అంతకంటే ఎక్కువ పనిదినాలు పొందుతున్న శ్రామిక శక్తిని ఏమంటారు?
ఎ) ప్రధాన శ్రామికులు
బి) ఉపాంత శ్రామికులు
సి) నిరుద్యోగం డి) పైవన్నీ
9. పట్టణ ప్రాంతాల్లో పేదరిక రేఖ దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు నూతన ప్రాతిపదిక రూపొందించడానికి ప్రభుత్వం 2010 మే 1న ఎవరి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసింది?
ఎ) ఎన్.సి. సక్సేనా బి) ఎస్.ఆర్. హాసీమ్
సి) రంగరాజన్ డి) వై.వి.రెడ్డి
10. ఒక దేశ ఆర్థిక ప్రగతి, ప్రజల వినియోగ స్థాయిని సూచించే కొలమానం ఏది?
ఎ) తలసరి ఆదాయం
బి) నామమాత్ర ఆదాయం
సి) ఆర్థిక అసమానతలు
డి) సంపద అసమానతలు
11. భారతదేశంలో అంత్యోదయ అన్నయోజన కార్యక్రమం ప్రారంభించడానికి అమర్త్యసేన్ ప్రతిపాదించిన ఏ భావన కారణమైంది?
ఎ) ఆర్థిక అసమానతలు
బి) పేదవారిలోనే అతి పేదవారు
సి) సంపద అసమానతలు
డి) సప్లయ్ వైపు అర్థశాస్త్రం
12. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం దేశంలో వ్యవసాయదారులు ఎంత శాతం ఉన్నారు?
ఎ) 25.1 బి) 27.1
సి) 30.1 డి) 31.3
13. ఒక వ్యక్తి పనిచేయడానికి ఇష్టపడి, పనికోసం ప్రయత్నించి ఏడాది కాలం ఖాళీగా ఉండే స్థితిని ఏ విధమైన నిరుద్యోగంగా పేర్కొంటారు?
ఎ) దైనందిన నిరుద్యోగిత
బి) వారం వారీ స్థితి నిరుద్యోగిత
సి) బాహ్య లేదా సాధారణ నిరుద్యోగిత
డి) అల్ప ఉద్యోగిత
14. భారతదేశంలోని నిరుద్యోగం ప్రాథమికంగా ఏ రకమైంది?
ఎ) ప్రచ్ఛన్న నిరుద్యోగిత
బి) పరిమాణాత్మక నిరుద్యోగిత
సి) చక్రీయ నిరుద్యోగిత
డి) ఘర్షిత నిరుద్యోగిత
15. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లక్ష్యం ఏమిటి?
ఎ) నీటిపారుదల వినియోగం
బి) గ్రామీణ ఉపాధి
సి) గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కల్పన
డి) గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ
16. ‘ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించడం’ ఏ పథకం లక్ష్యం?
ఎ) క్రాష్ స్కీం ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్
బి) దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమం
సి) సామాజిక అభివృద్ధి కార్యక్రమం
డి) 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
17. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి తక్కువ పరిమాణంలో రుణం, పొదుపు, విత్తపరమైన సేవలను కల్పించే విధానం?
ఎ) సూక్ష్మ విత్తం
బి) ప్రాధాన్య రంగ పరపతి
సి) రికరింగ్ డిపాజిట్ పథకం
డి) పైవేవీ కాదు
18. భారత్‌లో మొదటిసారిగా కులాల వారీగా జనగణన ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 1881 బి) 1891 సి) 1921 డి) 1931
19. గ్రీన్ జీడీపీ కొలమానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టిన దేశం ఏది?
ఎ) ఇండియా బి) చైనా
సి) బ్రిటన్ డి) కెనడా
20. అర్థశాస్త్రం అంతిమ లక్ష్యం సంక్షేమమే కావాలని ప్రకటించిన ఆర్థికవేత్త?
ఎ) పాల్‌క్రూగ్‌మన్ బి) రఘురామ్ రాజన్
సి) అమర్త్యసేన్ డి) డి.ఆర్. గాడ్గిల్
21. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం కుటుంబాల్లో వ్యవసాయ భూమి లేని కుటుంబాలు ఎంత శాతం?
ఎ) 56 బి) 57 సి) 58 డి) 59
22. వ్యాపార కార్యకలాపాలు మందగించడం వల్ల ఏర్పడే నిరుద్యోగాన్ని ఏమంటారు?
ఎ) ప్రచ్ఛన్న నిరుద్యోగం
బి) రుతుసంబంధ నిరుద్యోగం
సి) సాంకేతికపరమైన నిరుద్యోగం
డి) చక్రీయ నిరుద్యోగం
23. 1960-61లో సగటు తలసరి వినియోగం రోజుకు 2250 కేలరీలుగా పరిగణనలోకి తీసుకొని పేదరిక రేఖ దిగువన ఉన్న ప్రజల సంఖ్యను అంచనా వేసింది ఎవరు?
ఎ) మిన్హాస్ బి) పీడీ ఓజా
సి) అహ్లూవాలియా డి) బర్దన్
24. కింద పేర్కొన్న ఏ చర్య పేదరిక సమస్య పరిష్కారానికి దోహదపడుతుంది?
ఎ) సరళీకరణ, జీడీపీ వృద్ధికి బదులుగా పేదల అనుకూల వృద్ధి వ్యూహానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం
బి) వ్యవసాయ వృద్ధి రేటు పెంపు
సి) అసంఘటిత రంగంలో ఉత్పాదక, ఉపాధి నాణ్యత పెంపు
డి) పైవన్నీ
25. ఎన్డీఏ ప్రభుత్వం ‘పది మిలియన్ ఉపాధి అవకాశాల లక్ష్యం’ దిశగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రూప్ అధ్యక్షులు ఎవరు?
ఎ) ఎస్.పి. గుప్తా బి) రంగరాజన్
సి) డి. సుబ్బారావు డి) వై.వి. రెడ్డి
26. 1972-73లో ఉపాధి హామీ పథకాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టిన రాష్ట్రం?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) మహారాష్ట్ర డి) ఆంధ్రప్రదేశ్
27. 1989 ఏప్రిల్ 28న ‘జవహర్ రోజ్‌గార్ యోజన’ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించినవారు?
ఎ) ఇందిరాగాంధీ బి) రాజీవ్‌గాంధీ
సి) ప్రణబ్ ముఖర్జీ డి) వి.పి. సింగ్
28. పేదరికం అంటే ...?
ఎ) నిరుద్యోగిత బి) నిరక్షరాస్యత
సి) ఎంచుకునే స్వాతంత్ర్యం లేకపోవడం
డి) ప్రాథమిక అవసరాల అందుబాటు లోపించడం
29. కేంద్ర ప్రభుత్వం పేదరిక అంచనాల కోసం 1989లో నియమించిన కమిటీ ఏది?
ఎ) సురేష్ టెండూల్కర్ కమిటీ
బి) లక్డావాలా కమిటీ
సి) రంగరాజన్ కమిటీ
డి) హాసీమ్ కమిటీ
30. పేదరిక తీవ్రతను గణించడానికి ఉపకరించే సూచీ ఏది?
ఎ) పేదరిక అంతరం
బి) జీవన ప్రమాణం
సి) తలసరి ఆదాయం
డి) వ్యయార్హ ఆదాయం
31. 2004-05లో ఒడిశా తర్వాత అధిక పేదరికం నమోదైన రాష్ట్రం ఏది?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) మధ్యప్రదేశ్
సి) బీహార్ డి) హిమాచల్ ప్రదేశ్
32. సురేష్ టెండూల్కర్ పేదరిక కొలమాన పద్ధతిని సమీక్షించడానికి ప్రణాళికా సంఘం 2012 మే 23న ఎవరి అధ్యక్షతన నిపుణుల గ్రూపును ఏర్పాటు చేసింది?
ఎ) రంగరాజన్ బి) హాసీమ్
సి) రఘురామ్‌రాజన్ డి) సక్సేనా
33. 2011-12లో రంగరాజన్ పేదరిక కొలమాన పద్ధతి ప్రకారం అత్యల్ప పేదరికం ఉన్న రాష్ట్రాలు వరసగా?
ఎ) హిమాచల్ ప్రదేశ్, గోవా, లక్షదీవులు, అండమాన్ నికోబార్
బి) అండమాన్ నికోబార్, గోవా, లక్షదీవులు, హిమాచల్ ప్రదేశ్
సి) లక్షదీవులు, గోవా, అండమాన్ నికోబార్, హిమాచల్ ప్రదేశ్
డి) గోవా, లక్షదీవులు, హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్
34. ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ (2011-12) గణాంకాల ప్రకారం అత్యల్ప పేదరిక రేటు నమోదైన రాష్ట్రాలు వరస క్రమంలో?
ఎ) కేరళ, గోవా, అండమాన్ నికోబార్, లక్షదీవులు
బి) గోవా, లక్షదీవులు, అంమాన్ నికోబార్, కేరళ
సి) లక్షదీవులు, అండమాన్ నికోబార్, గోవా, కేరళ
డి) అండమాన్ నికోబార్, లక్షదీవులు, గోవా, కేరళ
35. భారత్‌లో పేదరికం, నిరుద్యోగం అంచనాలకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించేది? (గతంలో)
ఎ) జాతీయ అభివృద్ధి మండలి
బి) ప్రణాళికా సంఘం
సి) ఆర్థిక సంఘం డి) కేంద్ర ప్రభుత్వం
36. 1977లో నియమించిన ఏ కమిటీ పేదరిక అంచనాకు గ్రామీణ ప్రాంతాల్లో 2400 కేలరీలు, పట్టణాల్లో 2100 కేలరీల ఆహారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సిఫారసు చేసింది?
ఎ) వై.కె. అలఘ్ బి) హాసీమ్
సి) సక్సేనా డి) లక్డావాలా
37. ఐక్యరాజ్య సమితి 1997లో పేదరికాన్ని అంచనా వేయడానికి దేన్ని కొలమానంగా తీసుకుంది?
ఎ) మానవాభివృద్ధి సూచీ
బి) లింగ సంబంధిత అసమానతల సూచీ
సి) లింగ సంబంధిత అభివృద్ధి సూచీ
డి) మానవ పేదరిక సూచీ
38. పేదల సంఖ్యను కింది వాటిలో దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) తలసరి ఆదాయం బి) దారిద్ర్య రేఖ
సి) ఆదాయ అసమానతలు
డి) ప్రాంతీయ అసమానతలు
39. ప్రణాళికా వ్యూహాలు ఆశించిన స్థాయిలో పేదరికాన్ని తగ్గించడానికి సహకరించడం లేదని వివరించింది ఎవరు?
ఎ) మిన్హాస్ బి) దండేకర్
సి) ఓజా డి) బర్ధన్
40. ఆహార వ్యయం ఆధారంగా పేదరికాన్ని లెక్కించడానికి 1962లో ప్రణాళికా సంఘం ఎవరు సూచించిన కొలమాన పద్ధతిని ఆమోదించింది?
ఎ) బర్ధన్ బి) మిన్హాస్
సి) దండేకర్, రథ్
డి) జాతీయ అభివృద్ధి మండలి
41. భారతదేశంలో పేదరికాన్ని ఆహారం ప్రాతిపదికగా లెక్కించి గ్రామీణ ప్రాంతాల్లో అధిక పేదరికం ఉన్నట్లు అభిప్రాయపడింది?
ఎ) అలఘ్, దండేకర్, నౌరోజీ
బి) మిన్హాస్, బర్ధన్, మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా
సి) సురేష్ టెండూల్కర్, సక్సేనా, హాసీమ్
డి) పైవేవీ కాదు
42. ప్రణాళికా సంఘం పేదరిక అంచనాలకు నూతన కొలమాన పద్ధతి సూచించడానికి సురేష్ టెండూల్కర్ అధ్యక్షతన నిపుణుల గ్రూపును ఎప్పుడు ఏర్పాటు చేసింది?
ఎ) డిసెంబర్ 2005 బి) ఫిబ్రవరి 2006
సి) ఏప్రిల్ 2006 డి) డిసెంబర్ 2006
43. దారిద్ర్య రేఖ, సగటు పేదరిక రేఖ దిగువన ఉన్న జనాభా మధ్య ఉండే వ్యత్యాసం?
ఎ) అధిక జీవన ప్రమాణం
బి) అధిక తలసరి ఆదాయం
సి) పేదరిక అంతరం
డి) అధిక సహజ వనరుల వినియోగం
44. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం దేశంలోని మొత్తం గ్రామీణ కుటుంబాల సంఖ్య?
ఎ) 17.11 కోట్లు బి) 17.91 కోట్లు
సి) 18.11 కోట్లు డి) 18.91 కోట్లు
45. శ్రామిక శక్తిలో భాగంగా ఉండి, వాస్తవంగా ఉపాధి పొందే శ్రామిక శక్తిని ఏమంటారు?
ఎ) పనిలో పాలుపంచుకున్న శ్రామికులు
బి) ప్రధాన శ్రామికులు
సి) నిరుద్యోగులు
డి) ఉపాంత శ్రామికులు
46. ఏ కారణం వల్ల ‘వ్యాపార చక్రాల ప్రభావం భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థల్లో తక్కువ’ అని భావించవచ్చు?
ఎ) సేవల ఆధారిత వ్యవస్థ
బి) తయారీ రంగ ఆధారిత వ్యవస్థ
సి) వ్యవసాయాధారిత వ్యవస్థ
డి) అధిక పెట్టుబడులు
47. బ్రిటిష్ పాలనలో భారతదేశ ఆర్థిక దోపిడీని కింది ఏ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు?
ఎ) పావర్టీ ఆఫ్ ఇండియా
బి) డ్రెయిన్ ఆఫ్ వెల్త్
సి) పావర్టీ ఇన్ ఇండియా
డి) ఏదీకాదు
48. ఎన్.ఎస్.ఎస్.ఒ. సర్వే ప్రకారం 2011-12లో పెద్ద రాష్ట్రాల్లో నిరుద్యోగం తక్కువగా నమోదైన రాష్ట్రం ఏది?
ఎ) గుజరాత్ బి) కేరళ
సి) మధ్యప్రదేశ్ డి) ఉత్తరప్రదేశ్

### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) సి | 2) బి | 3) ఎ | 4) డి | 5) బి |
| 6) డి | 7) సి | 8) ఎ | 9) బి | 10) ఎ |
| 11) బి | 12) సి | 13) సి | 14) బి | 15) ఎ |
| 16) సి | 17) ఎ | 18) డి | 19) బి | 20) సి |
| 21) ఎ | 22) డి | 23) బి | 24) డి | 25) ఎ |
| 26) సి | 27) బి | 28) డి | 29) బి | 30) ఎ |
| 31) సి | 32) ఎ | 33) బి | 34) డి | 35) బి |
| 36) ఎ | 37) డి | 38) బి | 39) ఎ | 40) సి |
| 41) బి | 42) ఎ | 43) సి | 44) బి | 45) ఎ |
| 46) సి | 47) బి | 48) ఎ | | |

# Micro-programming introduced by?

BANK EXAMS
COMPUTER AWARENESS

## MODEL QUESTIONS

1. If you want to connect to your own computer through the Internet from a different location, you can use ______.
1) E-mail 2) FTP
3) Instant message
4) Telnet 5) None of these
2. The sharing of a medium and its path by two or more devices is called ______.
1) Modulation 2) Encoding
3) Line discipline
4) Multiplexing
5) None of these
3. The server on the internet is also identified as ______
1) Repeater 2) Host
3) Gateway 4) AND Gate
5) None of these
4. Personal computers can be connected together to form a______.
1) Server 2) Super computer
3) Network 4) Enterprise
5) None of these
5. DSL is an example of a (n) ______connection.
1) Network 2) Wireless
3) Slow 4) Broadband
5) None of these
6. What's considered the 'backbone' of the World Wide Web?
1) URL 2) HTML 3) HTTP
4) FTP 5) None of these
7. SMTP stands for ______.
1) Simple Mail Transfer Protocol
2) Serve Message Text Process
3) Short Messaging Text Process
4) Short Messaging Transfer Protocol
5) None of these
8. A Proxy server is used for which of the following?
1) To provide security against unauthorized users
2) To process client requests for web pages
3) To provide TCP/IP
4) To process client requests for database access
5) None of these
9. Which term identifies main page of the entire site?
1) URL 2) Web site address
3) Hyperlink 4) Domain name
5) None of these
10. Which of the following is not a network topology?
1) Star 2) Bus 3) Linear
4) Ring 5) None of these
11. A central computer that holds collections of data and programs for many PCs, work stations, and other computers is a(n)______.
1) Supercomputer
2) Minicomputer 3) Laptop
4) Server 5) None of these
12. When the pointer is positioned on a ______ is shaped like a hand.
1) Grammar error
2) Formatting error
3) Screen Tip
4) Spelling error
5) Hyperlink
13. TCP stands for ______.
1) Transfer control protocol
2) Transfer control process
3) Transmission control protocol
4) Transmission control process
5) None of these
14. Peer-to-peer is a description-
1) Of communications between two dissimilar devices
2) Of communications between two equal devices
3) Of communications between two different devices
4) All of the above
5) None of these
15. The technique where digital signals are converted to its analog form for transmission over an analog facility is called______.
1) Modulation 2) Digitization
3) Multiprocessing
4) All of the above
5) None of these
16. Narrowband channel is a communication channels ______.
1) That handles low volumes of data
2) Used mainly for telegraph lines and low speed terminals
3) Both a and b
4) All of the above
5) None of these
17. MIME is an acronym for______.
1) Multiprogramming Internet Mail Extension
2) Multicasting Internet Mail Extension
3) Multiple Internet Mail Extension
4) Multipurpose Internet Mail Extension
5) None of these
18. Which of the following is a network in which computers are located physically close together, often in the same building?
1) WAN 2) PAN 3) MAN
4) LAN 5) None of these
19. What is a modulator/demodulator that is connected to a circuit board or motherboard?
1) Fax modem
2) Network Interface Card (NIC)
3) Internal modem
4) External modem
5) None of these
20. What kind of server converts IP addresses to domain names?
1) File 2) DNS 3) E-mail
4) P2P 5) None of these
21. In the OSI model, the actual transmission of data is handled in the ______ layer.
1) Data link 2) Physical
3) Network 4) Transport
5) None of these
22. Which device cannot be shared in network?
1) Floppy 2) Keyword
3) Computer 4) Printer
5) None of these
23. A network of geographically distant computers and terminals is called a- ______.
1) Integrated Services Digital Network (ISDN)
2) Metropolitan Area Network (MAN)
3) Wide Area Network (WAN)
4) Local Area Network (LAN)
5) None of these
24. An example of a wireless medium that sends data through the air or space is:
1) Fiber-optic cable
2) Coaxial cable
3) Twisted pair
4) Microwaves
5) None of these
25. A ______ shares hardware, software, and data among authorized users.
1) Network 2) Protocol
3) Hyperlink 4) Transmitter
5) None of these
26. Granting an outside organization access to internet web pages is often implemented using a(n)?
1) Extranet 2) Intranet
3) Internet 4) Hacker
5) None of these
27. ______ is a process that permits multiple computers to use the same IP address and hide their actual IP addresses from the Internet.
1) Routing
2) Network Address Translation (NAT)
3) Signature referencing
4) Packet filtering
5) None of these
28. The topology where all the nodes are attached in a circular wiring arrangement is called a:
1) Star topology
2) Bus topology
3) Network topology
4) Ring topology
5) None of these
29. Difference engine is the machine introduced by______.
l) Blaze Pascal 2) Napier
3) Charles Babbage 4) Newman
5) None of these
30. Valves are invented in______ generation.
l) I generation
2) II generation
3) III generation
4) IV generation
5) None of these
31. Micro-programming introduced by______.
l) John Mauchley
2) Maurice Wilkies
3) William Shockley
4) Blaise pascal
5) None of these
32. (1024)3 is equivalent to______.
1) Approx I million
2) Approx 1 billion
3) Approx 10 thousand
4) 3096 5) None of these
33. Convert the (347)8 into binary number
1) 111000101 2) 011100111
3) 101110101 4) 100000111
5) None of these
34. Time required by a sector to reach below the head is known as ______.
1) Seek time 2) Latency time
3) Access time 4) Disk time
5) None of these
35. Function keys, control keys, arrow keys, modifier keys, toggle keys are known as ______.
1) Special keys 2) Alpha keys
3) Esc keys
4) Multimedia key
5) None of these
36. ______can be used with any CRT monitor but not with the LCD monitor.
1) Joystick 2) Light Pen
3) Trackball 4) Mouse
5) None of these
37. ______ Technologies is used by banks for faster processing of large volumes of cheques.
1) OCR 2) OMR
3) MICR 4) Bar code
5) None of these
38. The shortcut key for undo is ______.
1) Win button + E
2) Ctrl + X
3) Win button+ R
4) Ctrl +Z 5) None of these
39. Which of the following is not hardware of a computer?
1) Monitor 2) Windows
3) Processor 4) Printer 5) None of these
40. What is the main folder on a storage device called?
l) Platform 2) Interface
3) Root-Directory
4) Home-Page 5) None of these
41. Ctrl, Shift and Delete are known as______.
1) Modifier Keys
2) Control Keys 3) Toggle keys
4) Function keys
5) None of these
42. When you start your computer from the off position then it is known as ______.
1) Hard booting 2) Processing
3) Storage 4) Soft-booting
5) None of these
43. A repair for a known software bug, usually available at no change on the internet is called ______.
1) Version 2) Patch
3) Tutorial 4) FAQ
5) None of these
44. Small application programs that run on a web page and may ensure a form is completed properly or provide animation are known as ______
1) Flash 2) Spiders
3) Cookies 4) Applets
5) Sparks
45. Which is the slowest internet connection?
1) Digital subscriber line
2) TI
3) Cable modem
4) Leased line
5) Dial-up service
46. The transmission mode which allow both communicating devices to transmit and receive data simultaneously is______.
1) Simplex 2) Full-duplex
3) Half-duplex 4) Duplex
5) None of these
47. In IP addressing scheme, which class is used for multicasting?
1) Class A 2) Class B
3) Class C 4) Class D
5) None of these
48. Electronic junk mail is known as______.
1) Site 2) Spam 3) Worm
4) Virus 5) None of these
49. ______are used by companies for marketing purpose.
1) Spyware 2) Adware
3) Live ware 4) Freeware
5) None of these
50. HTML was introduced by____
l) Tim berners lee
2) Vinton Cerf
3) Bob willies 4) Steve jobs
5) None of these

### KEY

| | | | |
|---|---|---|---|
| 1) 4 | 2) 4 | 3) 2 | 4) 3 |
| 5) 4 | 6) 3 | 7) 1 | 8) 2 |
| 9) 1 | 10) 3 | 11) 4 | 12) 5 |
| 13) 3 | 14) 4 | 15) 1 | 16) 1 |
| 17) 4 | 18) 4 | 19) 3 | 20) 2 |
| 21) 2 | 22) 2 | 23) 3 | 24) 4 |
| 25) 1 | 26) 1 | 27) 2 | 28) 4 |
| 29) 3 | 30) 1 | 31) 2 | 32) 2 |
| 33) 2 | 34) 2 | 35) 1 | 36) 2 |
| 37) 3 | 38) 4 | 39) 2 | 40) 3 |
| 41) 1 | 42) 1 | 43) 2 | 44) 1 |
| 45) 5 | 46) 2 | 47) 4 | 48) 2 |
| 49) 2 | 50) 1 | | |